
# తెలంగాణ
# మిలియన్ మార్చ్



సంకలనం
## పిట్టల రవీందర్

ప్రచురణ
తెలంగాణ విద్యావంతుల వేదిక
తెలంగాణ జర్నలిస్టుల ఫోరం


POLICE
CPI

తెలంగాణ

# మిలియన్ మార్చ్

(ప్రత్యక్ష కథనాల సమాహారం)

సంకలనం
పిట్టల రవీందర్

ప్రచురణ
తెలంగాణ విద్యావంతుల వేదిక
తెలంగాణ జర్నలిస్టుల ఫోరం

తెలంగాణ

# మిలియన్ మార్చ్

(ప్రత్యక్ష కథనాల సమాహారం)


సంకలనం

**పిట్టల రవీందర్**

ప్రచురణ

**తెలంగాణ విద్యావంతుల వేదిక**
**తెలంగాణ జర్నలిస్టుల ఫోరం**

ప్రథమ ముద్రణ

**10 మార్చి 2012**

ప్రతులు: **1000**

వెల: **రూ.20/-**

ప్రతులకు

**అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలలో**

కవర్ పేజీ డిజైన్

**ఎం.వి. రమణారెడ్డి, హైదరాబాద్**

డిటిపి & ముద్రణ

**గోలి సమ్మిరెడ్డి,**
**విజేత గ్రాఫిక్స్ & ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
**సెల్: 9394322782, 7396397913.**

# ఒక్క మాట

*తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత కీలక ఉద్యమ రూపంగా భావించిన 'సహాయ నిరాకరణ' అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. తెలంగాణ రాజకీయ నాయకత్వం ప్రదర్శించిన నిష్క్రియాపరత్వం, సీమాంధ్ర ఆధిపత్య ప్రభుత్వ వివక్ష మరోమారు ఇందుకు కారణమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో దోబూచులాడుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలని, రాష్ట్ర ఏర్పాటును అడుగడుగునా అడ్డుకుంటున్న సీమాంధ్ర సంపన్నవర్గాలను ఆధిపత్య రాజకీయాలను పాలకవర్గాలను అడ్డుతొలగించుకోవాలని, వెన్నెముకలు విరిగి కట్టుబానిసల్లా కునారిల్లుతున్న తెలంగాణ రాజకీయ నాయకత్వానికి స్వేచ్ఛను ప్రసాదించి ఉద్యమ నాయకత్వంలోకి ఈడ్చుకురావాలనే... మూడు ప్రధాన లక్ష్యాలతో ... 'సహాయ నిరాకరణ' ఉద్యమ రూపం ప్రారంభమయ్యింది. కానీ ఆచరణలో 'సహాయ నిరాకరణ' ఉద్యోగుల సమ్మె స్థాయికి కుదించుకుపోయింది. అనేక ఒత్తిళ్ల నేపథ్యంలో 'సహాయ నిరాకరణ' అర్థాంతరంగా విరమించవలసివచ్చింది. తెలంగాణ ప్రజలు తమకున్న అవకాశాలమేరకు 'సహాయ నిరాకరణ' ఉద్యమంలో పాలుపంచుకున్నారు. కానీ తెలంగాణ రాజకీయ నాయకత్వం ఎప్పటిలాగానే వెన్నుచూపి ఉద్యమానికి వెన్నుపోటు పొడిచింది.*

*ఈ పరిస్థితుల నేపథ్యంలో 'మిలియన్‌మార్చ్' కార్యక్రమం ఒక తప్పనిసరి ఉద్యమ రూపంగా ముందుకువచ్చింది. అప్పటిదాకా సాంప్రదాయ ఉద్యమ రూపాల్లో తలమునకలైన తెలంగాణ ఉద్యమ సమాజం, 'మిలియన్‌మార్చ్' కార్యక్రమాన్ని ఎంతో ఉన్నతంగా ఊహించుకున్నది. అందుకు తగినట్లుగానే ప్రభుత్వమూ, ప్రచార సాధనాలు 'మిలియన్‌మార్చ్'కు వ్యతిరేకంగా తమపాత్రను పోషించాయి. తెలంగాణ వ్యాపితంగా నిర్బంధం పెరిగింది. పర్యవసానంగా 'మిలియన్‌మార్చ్'పై ప్రజల్లో పట్టుదల పెరిగింది. 'మిలియన్‌మార్చ్'లో పాల్గొనేందుకు మార్చి 10వతేదీన ఎట్లాగైనా ట్యాంకుబండ్‌పైకి చేరుకోవాలనే ఆలోచన విస్తరించింది. మూడు, నాలుగు రోజుల ముందునుండే రాజధానికి రావడానికి ఉద్యమకారులు సిద్ధపడ్డారు. ఎవరికి తోచినరీతిలో, ఎవరికి వీలున్న పద్ధతుల్లో వేలాదిమంది ఉద్యమకారులు పట్టణంలో మకాం వేసారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ట్యాంకుబండ్‌పైకి జనప్రవాహం పెల్లుబికింది. కానీ ఏకపక్ష సీమాంధ్ర మీడియా 'మిలియన్‌మార్చ్' కార్యక్రమాన్ని విగ్రహాల విధ్వంస కార్యక్రమంగా కుదించివేసింది. అందుకే ... ప్రత్యక్ష కథనాల సమాహారంగా ఈ పుస్తకాన్ని తేవాలని సంకల్పించాము. సహకరించిన ప్రతిఒక్కరికీ ఉద్యమాభివందనాలతో... 'మిలియన్‌మార్చ్'లో పాల్గొని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన ప్రతిఒక్కరికీ నమస్కరిస్తూ ...*

**– పిట్టల రవీందర్**

# తొవ్వ


| | | |
|---|---|---|
| 'మిలియన్ మార్చ్' నేపథ్యం | - పిట్టల రవీందర్ | 5 |
| నిర్భంధం ... ప్రతిఘటన | - శ్రీధర్‌రావు దేశ్‌పాండే | 22 |
| పెళ్ళి నాటకం ... మార్చ్ వాస్తవం | - మల్లెపల్లి లక్ష్మయ్య | 30 |
| విగ్రహ విధ్వంసం... గతం | - అల్లం నారాయణ | 34 |
| పురోగమిస్తున్న తెలంగాణ ఉద్యమం | - పి. సూర్యం | 41 |
| ఇలా ఎందుకు జరిగింది? | - చుక్కా రామయ్య | 49 |
| మహత్తరమైన 'మార్చ్' కావాలి! | - కె. ప్రభాకర్ | 53 |
| ఒక ఉద్యమం ... ఒక అనుభవం | - అత్తలూరి అరుణ | 57 |
| తెలంగాణ ఉద్యమ ప్రతీక | - కె. గోవర్ధన్ | 62 |
| మిలియన్ మార్చ్‌లో మేము సైతం... | - యం. బాలనర్సయ్య | 67 |
| కోల్పోయిన నిగ్రహాలు...కూలిన విగ్రహాలు | - జూలూరు గౌరీశంకర్ | 71 |
| సత్తా చూపిన తెలంగాణ మార్చ్ | - సుజాత సూరెపలి | 75 |
| ఆ రోజు ఏం జరిగింది? | - పల్లె రవికుమార్ | 80 |
| మిలియన్ మార్చ్‌లో గని కార్మికులు | - యం.డి. మునీర్ | 84 |
| మూడు రోజుల ప్రయాస | - రావుల శంకర్ | 86 |
| తెలంగాణ ఆకాంక్షల కవాతు | - హెచ్. రవీందర్ | 90 |
| నేను చూసిన మిలియన్ మార్చ్ | - పి. సూర్యనారాయణ | 94 |
| ప్రజా ఉద్యమ స్ఫూర్తి మిలియన్ మార్చ్ | - తిప్పర్తి యాదయ్య | 98 |
| **మిలియన్ మార్చ్ నాలో కసి పెంచింది** | - ఎ. విజయ కుమార్ | 103 |
| అది ఒక చారిత్రిక దినం | - తేజావత్ శేషురాం నాయక్ | 105 |
| మాగడ్డపై మా జ్ఞాపకాలు ఉండాలి... | - బోనకుర్తి సోమేశ్వర్ | 106 |
| బుద్ధుని సాక్షిగా తెలంగాణ చైతన్యం | - అద్దంకి దయాకర్ | 109 |
| **మిలియన్ మార్చ్‌లో తాండూరు** | - ఆర్. విజయ కుమార్ | 114 |
| మిలియన్ మార్చ్‌లో గ్రామీణ వైద్యులు | - శంకర్ ముదిరాజ్ | 118 |
| తెలంగాణ ఆకాంక్షకు అద్దంపట్టిన రోజు | - ఆవునూరి సమ్మయ్య | 120 |
| అద్భుత రూపం 'మిలియన్ మార్చ్' | - ఎం. కోదండరామ్ | 124 |
| The Bronze Poet | - Vimala Katikaneni | 128 |
| An eye witness account | - Jamuna Puskur | |
| మిలియన్ మార్చ్ కరపత్రం | | |

# తెలంగాణ ఉద్యమం...
# 'మిలియన్ మార్చ్' నేపథ్యం

**- పిట్టల రవీందర్**

డిసెంబర్ 9వతేదీనాటి ప్రకటన తర్వాత తెలంగాణలో రాజకీయ ఉద్యమ కార్యాచరణ తాత్కాలికంగా స్థంభించిపోయింది. 9వతేదీనాటి ప్రకటనను అమలు చేయించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏ ఒక్కరూ దృష్టినిలుపలేదు. కేంద్రం ప్రకటన నేపథ్యంలో విజయోత్సవాలను నిర్వహించుకున్న టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, తదితర పార్టీలు, తెలంగాణ రాజకీయనాయకత్వం, ఉద్యమ నాయకత్వం, ప్రజాసంఘాలు, ఉద్యోగసంఘాలు, మేధావులు, జర్నలిస్టులు, రచయితలు, కవులు, ఇట్లా ప్రతిఒక్కరూ చేష్టలుడిగిపోయారు. మరోవైపున సీమాంధ్ర రాజకీయ నాయకత్వం రాజీనామా డ్రామాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఉక్కిరిబిక్కిరి చేసాయి. స్పాన్సర్డ్ ఉద్యమాలను నిర్వహించాయి. పార్టీ విబేధాలను వదిలిపెట్టి సమైక్య నినాదంతో సీమాంధ్ర రాజకీయ నాయకత్వం తెలంగాణను వ్యతిరేకించడంలో ఐక్యమయ్యాయి. గల్లీ నుండి ఢిల్లీ దాకా తమకున్న రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడిని పెంచాయి. ఫలితంగా డిసెంబర్ 23నాడు కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా చిదంబరం మరో ప్రకటన జారీ చేసారు. ఈ పరిణామం తెలంగాణ ఉద్యమ శక్తులను నిరాశ, నిస్పృహలకు లోనుచేసింది. తెలంగాణ రాజకీయ నాయకత్వం తెలం గాణ జాయింట్ యాక్షన్ కమిటీ (తెలంగాణ జేఏసీ) పేరిట ఐక్య సంఘటనగా ఏర్పడింది. పార్టీల జెండాలు, అజెండాలు పక్కకుపెట్టి తెలంగాణ సాధన కోసం పోరాడాలని నిర్ణయించుకున్నాయి. జేఏసీకి ప్రత్యేకంగా ఉద్యమ జెండాను రూపొందించుకున్నాయి. జేయేసీ జెండాక్రిందనే తెలంగాణలోని అన్ని రాజకీయపార్టీలు పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. తమతమ పార్టీ జెండాలను, కండువాలను పక్కకుపెట్టాలనుకున్నాయి. తెలంగాణ ఉద్యమ భావవ్యాప్తిలో ఆరు సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తున్న 'తెలంగాణ విద్యావంతుల వేదిక' అధ్యక్షులు ప్రొఫెసర్ యం. కోదండరామ్‌ను కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, కులసంఘాలు, తదితర సంస్థలతో తెలంగాణ జేఏసీ మరింతగా విస్తృతమయ్యింది. ఉద్యమ ప్రజల విశ్వాసంతో మరింత పదునెక్కింది. సర్వశక్తులతో తెలంగాణ ఉద్యమం పదునెక్కింది.

మరోవైపున తెలంగాణ వ్యాపితంగా ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించారు. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలు ప్రత్యేకంగా జేఏసీలుగా ఐక్యమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రజాఉద్యమంగా మారిపోయింది. ఊరూరా వేలాదిగా టెంట్లు వెలిసాయి. దీక్షలు, ధర్నాలు, ప్రదర్శనలు, రాస్తారోకోలు, మానవహారాలు, వంటా-వార్పులతోపాటుగా తెలంగాణ సాంస్కృతిక రూపాలన్నీ ఉద్యమంలో భాగమయ్యాయి. ఉద్యమ కార్యక్రమాలతో తెలంగాణ దద్దరిల్లిపోయింది. ప్రజలు తమ సమస్యలన్నింటినీ పక్కకు పెట్టారు. ఉద్యమమే ఊపిరిగా మారింది. తెలంగాణ రాష్ట్రం కోసం తాము నిర్వహిస్తున్న ప్రజాఉద్య మానికి తెలంగాణ రాజకీయ నాయకత్వం ముందు నిలవాలని ప్రజలు ఆశించారు. సీమాంధ్ర నాయకుల మూకుమ్మడి రాజీనామాలతో 9వ తేదీనాటి ప్రకటనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్న నేపథ్యంలో ... తెలంగాణ ప్రజాప్రతినిధులు కూడా రాజీమాలతో కేంద్రంపై ఒత్తిడిని పెంచాలని ప్రజలు ఆశించారు. ప్రజల డిమాండు మేరకు భాగస్వామ్య పక్షాల నాయకులను రాజీనామా చేయాలని తెలంగాణ జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీలో ఉమ్మడి నిర్ణయం జరిగింది. రాజీనామాలకు తేదీలను నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత రాజీనామాలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కొంత సమయాన్ని కోరింది. ఇదే అదనుగా ... కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీనామాలు చేస్తేనే తాము కూడా రాజీనామాలు చేస్తామని తెలుగుదేశం పార్టీ తిరకాసుపెట్టింది. అందరూ మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తేనే రాజకీయ, రాజ్యాంగ సంక్షోభం వస్తుందని, తద్వారా మాత్రమే కేంద్రంపై ఒత్తిడి తీసుకురాగలమని ఆ పార్టీ వెనకడుగు వేసింది. గ్రామాల్లో ఈ రెండు పార్టీల నాయకులు తిరగలేని పరిస్థితి ఎదురుకావడంతో డమ్మీ రాజీనామాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేసారు. తరతరాలుగా రాజకీయ బానిసత్వాన్ని అనుభవిస్తున్న తెలంగాణ రాజకీయ నాయకత్వానికి, బానిస సంకెళ్లనుండి బంధవిముక్తం కావడానికి తెలంగాణ ఉద్యమం ఇచ్చిన అరుదైన అవకాశాన్ని కూడా ఇక్కడి రాజకీయ నాయకులు అందుకోలేకపోయారు. సీమాంధ్ర రాజకీయ ఆధిపత్యంక్రింద జీవితకాలపు బానిసత్వానికే తెలంగాణ రాజకీయ నాయకత్వం మరోమారు సిద్ధపడింది.

ఫిబ్రవరి 14వతేదీనాడు తెలంగాణ జేఏసీ కార్యాలయంలో తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నఎమ్మెల్యేలందరూ రాజీనామాలతో అసెంబ్లీకి

పాదయాత్రగా వెళ్లి స్పీకర్‌కు రాజీనామాలు సమర్పించాలని నిర్ణయం తీసుకున్నారు. చివరకు అదే రోజున ఒకవైపు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలవద్ద విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరుపుతున్న సమయంలలోనే 12మంది ఎమ్మెల్యేలు (ఒకరు టిడిపి, ఒకరు బిజెపి, 10మంది టిఆర్ఎస్) జేఏసీ కార్యాలయం నుండి పాదయాత్రగా వెళ్లి అమరవీరుల స్మారకస్థూపం (గన్‌పార్క్)వద్ద నివాళు లు అర్పించి, స్పీకర్‌కు రాజీనామాలను సమర్పించివచ్చారు. తెలంగాణ ప్రజా ఉద్యమంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల దొంగనాటకం దీనితో బట్ట బయలయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ జేఏసీ నుండి వెళ్లిపోయింది. తెలుగుదేశం పార్టీ బహిష్కరణకు గురయ్యింది. తెలంగాణ ప్రజా ఉద్యమానికి అండగా నిలుస్తారని ఆశించిన ప్రధాన పార్టీలు ద్రోహపూరితంగా వ్యవహరించడంతో ఉద్యమాన్ని బలహీన పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం లభించింది. కాలయాపన కోసం కేంద్రప్రభుత్వం శ్రీకృష్ణకమిటీని నియమించింది. ఏకకాలంలో సీమాంధ్ర, తెలంగాణ సమాజాలను పక్కదారి పట్టించేందుకు ఈ కమిటీని పావుగా ఉపయోగించింది. ఇందుకు సీమాంధ్ర ఆధిపత్యంలోని మీడియా లోపాయికారీగా సంపూర్ణ సహకారం అందించింది. శ్రీకృష్ణకమిటీ ఇచ్చే నివేదిక 'సర్వరోగ నివారిణి'గా ప్రచారం నిర్వహించింది. అన్నివర్గాల ప్రజలను ఆ మూసలోకి దారిమళ్లించింది. శ్రీకృష్ణకమిటీకి ఇచ్చిన ఏడాది గడువులోగా తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని, ఉద్య మంలో సంఘటితమవుతున్న తెలంగాణ ప్రజానీకాన్ని విడదీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీమాంధ్ర ఆధిపత్య మీడియా సహకారంతో అనేక ఎత్తుగడలను, వ్యూహాలను అమలు జరిపాయి. కానీ వారి ఆశలన్నీ నిరాశలయ్యాయి. తెలంగాణ ప్రజల ఉద్యమపటిమ ముందు, నిజాయితీముందు, కృతనిశ్చయం ముందు ప్రభుత్వాల ఎత్తుగడలు నిలువలేదు. రాజకీయ ద్రోహాలు ఫలించలేదు. ఏకపక్ష మీడియా నాటకాలు రక్తికట్టలేదు. సీమాంధ్ర సంపన్న వర్గాల ధన దురహంకారం ఫలించలేదు. పడిలేచే కెరటంలా తెలంగాణ ప్రజాఉద్యమం నిత్యనూతనంగా ... సజీవ సదృశ్యమయ్యింది.

ఈ పరిణామాల ప్రభావాలనుండి ఉద్యమాన్ని, ఉద్యమంలో మమేకమైన ప్రజానీకాన్ని, ఐక్యతను రక్షించుకునేందుకు తెలంగాణ జేఏసీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఎప్పటికప్పుడు వర్తమాన పరిస్థితులను సమీక్షించుకుని ఉద్యమ కార్యాచరణను రూపొందించింది. ఉద్యమంలో ఎదురవుతున్న లోటుపాట్లను సవరించుకుంటూ, ప్రజల సంఘటిత శక్తిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించింది. తెలంగాణ రాజకీయ నాయకత్వ పిరికితనం, సీమాంధ్ర రాజకీయ ఆధిపత్య

భావజాలం, మీడియా అమలు జరుపుతున్న ద్రోహపూరిత విషప్రచారం, తదితర ప్రభావాలకు లోనవుతున్న విద్యార్థి, యువతరాన్ని రక్షించుకునేందుకు, ఉద్యమ ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని కాపాడేందుకు నేరుగా ప్రజలముందుకే తెలంగాణ జేఏసీ వెళ్లింది. అందులోభాగంగా ఉద్యమ యాత్రలను నిర్వహించింది.

మార్చి 21వతేదీన అమరవీరుల స్మారక స్థూపం (గన్‌పార్క్) నుండి తెలంగాణ ఉద్యమ బస్సు యాత్ర ప్రారంభమయ్యింది. రాత్రి మణుగూరు చేరుకుని అక్కడ దీక్షాశిబిరంలో ప్రసంగించి మరునాడు ఉదయం 9గంటలకు యాత్రను ప్రారంభమయ్యింది. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లందులమీదుగా రాత్రి ఖమ్మంచేరుకుని రిక్కాబజార్ స్కూల్‌లో సమావేశం నిర్వహించాము. 23వతేదీ ఉదయం ఖమ్మంలో మీడియా కాన్ఫరెన్స్ ముగించుకుని డోర్నకల్, బయ్యారం, మహబూబాబాద్, గూడూరు,నర్సంపేట నుండి వరంగల్లు, హన్మకొండలో అర్థరాత్రి యాత్రను ముగించాము.

ఏప్రిల్ 9వతేదీన కొమురవెల్లిలో ప్రారంభమైన రెండవ విడత తెలంగాణ ఉద్యమ బస్సు యాత్ర మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మూడురోజులపాటు సాగింది. జిల్లాలలోని జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించుకుని, 100రోజులు పూర్తి చేసుకున్న దీక్షాశిబిరాలను సందర్శించుకున్నాము. అన్ని జిల్లాల్లోనూ భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన సమాలోచనలు జరిపాము. ఆర్టీసీ జేఏసీ, సింగరేణి జేఏసీ, తెలంగాణ సినిమా జేఏసీలను పటిష్టపరిచే దిశలో సమావేశాలు జరిగాయి. విద్యార్థి సంఘాల జేఏసీలతోనూ సమన్వయ సమావేశాలు జరిగాయి. ఈ రెండు యాత్రల్లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక, లెక్చరర్స్ ఫోరం, వివిధ ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఇతర జేఏసీలు ప్రముఖపాత్రను నిర్వహించాయి. ఈ యాత్రలు తెలంగాణ జేఏసీ నాయకత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల ఉద్యమ సంసిద్ధత తెలిసింది. భవిష్యత్తు ఉద్యమానికి దిశా, నిర్దేశం మరింతగా స్పష్టమయ్యింది. అయితే తెలంగాణ రాజకీయ నాయకత్వం ఉద్యమంలో వెనకబడిపోవడం, ప్రజా ఉద్యమంలో భాగంకాకపోవడం, ఉద్యమ నాయకత్వంలో వైవిధ్యాలు కనిపించడం, ఆత్మహత్యల పరంపర కొనసాగుతుండటంలాంటి పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఉద్యమం నివురుగప్పిన నిప్పులాగా, తుఫాను ముందటి ప్రశాంతంగా, విస్ఫోటానికి సిద్ధపడుతున్న అగ్నిపర్వతంలాగా … అంతుచిక్కని పరిస్థితిలో నిరీక్షణకు గురయ్యింది.

**మానుకోట బాటలో ...**

రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆకస్మిక దుర్మరణం తర్వాత రాష్ట్రంలో నాటకీయంగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు తెలంగాణ ఉద్యమక్రమానికి కొంతమేరకు ఉపయోగపడతాయనే భ్రమలు చాలా తక్కువ సమయంలోనే తేలిపోయాయి. తండ్రి స్థానంలో ముఖ్యమంత్రి పదవిని ఆశించిన వై .ఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారపార్టీకి కొంత మేరకు ఉక్కిరిబిక్కిరి చేసినా రాజకీయచిత్రపటాన్ని మార్చివేసేంతగా ప్రభావితం చేయలేకపోయారు. తెలుగుదేశం పార్టీ సభ్యులతో పార్లమెంటులో తెలంగాణకు వ్యతిరేకంగా 'ప్లకార్డు'ను పట్టుకున్న జగన్ దృశ్యమే తెలంగాణ ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. తెలంగాణ ఉద్యమంపట్ల రాజశేఖర్‌రెడ్డి అనుసరించిన వ్యతిరేకవైఖరి, అమలు జరిపిన కుట్రపూరిత విధానాలు, నిండు సభలో వ్యక్తీకరించిన వ్యంగాలు, ఛలోక్తులు, అవమానాలు ప్రజల మనసుల్లో గాయాలుగా సలుపు తున్నాయి. ఈ రెండు వ్యక్తిత్వాలు మూర్తీభవించుకున్న జగన్‌ను తరతరాల సీమాంధ్ర రాజకీయ ఆధిపత్యానికి ఆనవాలుగా, సీమాంధ్ర దోపిడీ సంపన్న వర్గాల ప్రతిరూపంగా, తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు అడ్డుగోడగా, సమైక్యవాదానికి నిలువుటద్దంగా ... తెలంగాణ ప్రజలు భావించుకున్నారు.

తెలంగాణ శత్రువర్గాల ప్రతినిధి 'జగన్' ఓదార్పుయాత్ర పేరుతో తెలంగాణ గడ్డమీద అడుగుపెట్టడానికి సిద్ధపడటం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేదిగా తెలంగాణ ప్రజలు భావించారు. తెలంగాణ ఉద్యమ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే జగన్ యాత్రను ఎట్టిపరి స్థితుల్లోనూ అడ్డుకోవాలని తెలంగాణలోని ప్రతి ఒక్కరూ కోరుకున్నారు. జగన్ ఓదార్పుయాత్రపై కాంగ్రెస్ అధిష్టానానికి, ఆయన మద్దతు దారులకు జరుగుతున్న ప్రచ్ఛన్నయుద్ధంపై మీడియా మరింతగా రెచ్చ గొట్టేధోరణితో వ్యవహరించింది. ఫలితంగా తెలంగాణ ప్రజల్లో అడ్డు కోవాలనే తలంపు మరింతగా బలపడింది. తెగింపుగా మారిపోయింది. జగన్ యాత్రను అడ్డుకోవడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా మారిపోయింది. జగన్ ఓదార్పుయాత్రను వ్యతిరేకిస్తూ ప్రజలు తమంతటతాముగానే నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. వరంగల్లుజిల్లా నుండి ప్రారంభమైన ఈ నిరసనలు తెలంగాణ అంతటా విస్తారంగా జరిగాయి. ఓదార్పుయాత్రపై మీడియా ప్రకటనలకు పరిమితమైన రాజకీయ పార్టీలు తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించలేక పోయాయి. ఉద్యమ భాగస్వామ్యంలో వెనకబడి నట్లుగానే ఈ విషయంలో కూడా ఉద్యమ ప్రజలకంటే పార్టీలు వెనకబడిపోయాయి. తెలంగాణ ప్రజలు తమ నిరసనల ద్వారా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలకు అనుగుణంగా

తగు నిర్ణయం తీసుకునే విషయంలో తెలంగాణ జేఏసీపై క్షేత్రస్థాయి జేఏసీలనుండి ఒత్తిడి పెరిగింది.

ముందుగా వరంగల్లు జిల్లా జేఏసీ జగన్ యాత్రను అడ్డుకోవాలని నిర్ణయం తీసుకున్నది. ఇందుకు అవసరమైన వారంరోజుల కార్యా చరణను రూపొందించుకున్నది. మే 19వతేదీనాడు నిర్వహించిన తెలంగాణ జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో వరంగల్లు జేఏసీ రూపొందించిన కార్యాచరణపై సుధీర్ఘంగా చర్చ జరిగింది. జగన్ ఓదార్పుయాత్ర పేరుతో తలపెట్టిన ఆధిపత్య దండయాత్రను అడ్డుకోవాలని రాష్ట్ర జేఏసీ స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. తెలంగాణ జేఏసీ మొట్టమొదటిసారిగా తీసుకున్న రాజకీయ కార్యాచరణకు విద్యార్థి సంఘాల మద్దతును కూడగట్టింది. మే 21నాడు తెలంగాణ జేఏసీ, విద్యార్థి సంఘాల జేఏసీల ఉమ్మడి సమావేశం నిర్వహించి ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకుని మీడియా ద్వారా ప్రకటించింది. వరంగల్ జిల్లా జేఏసీ జగన్ యాత్రను అడ్డుకునే క్రమంలో జిల్లా ప్రజానీకాన్ని సమాయాత్తం చేయడంకోసం వారంరోజుల వరుస కార్యక్రమాలను ప్రకటించింది. జిల్లా వ్యాపితంగా నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగసభను నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటుగా అంతటా అడ్వకేట్లు భారీగా కదిలారు. వరంగల్లు నుండి మహబూబాబాద్ వరకు యాత్ర నిర్వహించారు. పిడమర్తి రవి, రాజారాం యాదవ్, కోటా శ్రీనివాస్ గౌడ్‌ల నాయకత్వంలో విద్యార్థులు భారీ ఎత్తున మానుకోటకు కదిలారు. ప్రతిక్షణం వెంటాడుతున్న పోలీసులను తప్పించుకుంటూ సమీప గ్రామాలనుండి విద్యార్థులను సమీకరిం చేందుకు ప్రయత్నించారు.

జగన్ ఓదార్పుయాత్రకు నిరసనగా జిల్లా జేఏసీ పిలుపు మేరకు 25వనాడు నిర్వహించిన జిల్లా బంద్‌కు అనూహ్యమైన రీతిలో ప్రజలనుండి స్పందన లభించింది. జేఏసీలో భాగస్వామ్యపార్టీలుగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ, సిపిఐ-యం.యల్. న్యూడెమోక్రసీపార్టీలు ఈ బంద్‌కు పూర్తిస్థాయిలో సహకరించాయి. ఇదే రోజున జేఏసీ రాష్ట్ర నాయకత్వంకూడా వరంగల్లు, మహబూబాబాద్‌లలో పర్యటించి జగన్ పర్యటనను ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుని తీరుతామని స్పష్టంగా ప్రకటించింది. దీనితో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇతర జిల్లాలపై కూడా ఈ ప్రభావం కనిపించింది. అడ్డు కోవడం అప్రజాస్వామికమంటూ మీడియాలో మేధావులు చర్చోపచర్చలు నిర్వంచారు. అయితే ఇదే సందర్భంలో కెసిఆర్‌ను కత్తి పద్మారావు స్వయంగా కలిసి విజయవాడకు రావాలని ఆహ్వానించడం చర్చనీ యాంశమయ్యింది.

అప్పటివరకూ నివురుగప్పిన నిప్పులాగా ఉన్న మానుకోటలో పరిస్థితులు

వేగవంతంగా మారిపోయాయి. ఇతర జిల్లాలనుండి ఉద్యమకారులు అక్కడికి రావడం ప్రారంభమయ్యింది. జగన్ అనుచరులు ఖమ్మంలో భారీసంఖ్యలో మకాం వేసినట్లు వార్తలు వచ్చాయి. 26వ తేదీనాడు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో 'బాంబులున్నాయి జాగ్రత్త!!' అంటూ ఓ సంచి ప్రత్యక్షమయ్యింది. మూటవిప్పితే అందులో పాత చెప్పులు ప్రత్యక్షమయ్యాయి. ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా మానుకోటలో జగన్ పర్యటిస్తే చెప్పులతో సత్కరిస్తామని, యాత్రకు సహకరిస్తున్న వారికి అదే గతిపడుతుందని 'తెలంగాణ లిబరేషన్ ఆర్మీ' పేరిట మూటలో ఉన్నలేఖలో హెచ్చరిక ఉంది. ఇదే రోజు సాయంత్రం బస్టాండు సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుపై జగన్ యాత్రను నిరసిస్తూ ఓ విద్యార్థి ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. అక్కడ ఓ గంటపాటు హైడ్రామా నడిచింది. ఈ సంఘటనలన్నీ మీడియాలో ప్రధానవార్తలయ్యాయి. 27వతేదీనాడు బస్టాండులో 'బాంబు' కలకలం ఉదయం 11గంటలనుండి సాయంత్రం 8గంటలవరకు కొనసాగింది. బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యింది. భారీ పోలీసు బలగాలను మానుకోటలో మోహరించారు. పట్టణమంతా పోలీసులతో నిండిపోయింది. రాత్రి 8గంటలకు ప్లాస్టిక్ బకెట్‌ను పట్టణ శివారులోకి తీసుకువెళ్లి భారీ పోలీసు బందోబస్తు మధ్యన పేల్చివేసారు. చివరకు ఆ బకెట్‌లో ఆలుగడ్డతో తయారు చేసిన డమ్మీ బాంబులున్నట్లు తేల్చివేసారు. 'తెలంగాణ లిబరేషన్ ఆర్మీ' పేరిట దొరికిన లేఖలో జగన్ కాన్వాయిని బాంబులతో పేల్చివేస్తామని హెచ్చరించారు. అయితే ఈ సంఘటనతో రాష్ట్ర పోలీసు యంత్రాగం మొత్తం అప్రమత్తమయ్యింది. జనగ్ ప్రయాణించే మార్గంలో రైల్వేలైనును పేల్చివేస్తామని కూడా 'తెలంగాణ లిబరేషన్ ఆర్మీ' ఆ మరునాడు మీడియా ద్వారా హెచ్చ రించింది. ఇదే రోజున వరంగల్లు నుండి అనేకమంది అడ్వకేట్లు మాను కోటకు యాత్రగా చేరుకున్నారు. టిఆర్ఎస్, బిజెపి, న్యూడెమొక్రసీ నాయకులు సైతం మానుకోటలో మకాం వేసారు. సాయంత్రం నిర్వహించిన భారీ ర్యాలీతో పట్టణ ప్రజల్లోనూ ఉత్సాహం పెరిగింది. మే 27 రాత్రి సమయానికి మానుకోటలో ఒక ఉద్వోగపూరిత వాతావరణం నెలకొన్నది. తెలంగాణ సమాజం మొత్తం మానుకోటమీద మనసుపెట్టి ఉత్కంఠంగా కాలం గడిపింది. 28వతేదీనాడు నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి మానుకోట ఒక ప్రతీకగా నిలబడింది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచింది.

**అనూహ్యమైన గెలుపు ... అదొక మలుపు**

మానుకోట ప్రతిఘటన ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ జేఏసీ మరింత విస్తృతమైన కార్యాచరణను రూపొందించుకున్నది. తెలంగాణ ప్రజల డిమాండు

మేరకు రాజీనామాలు చేసిన 12మంది ఎమ్మెల్యేలను తిరిగి ఏకగ్రీవంగా గెలిపించుకోవాలనే లక్ష్యంతో సంప్రదింపులఅల ద్వారా మిగితా పార్టీల సమ్మతిని కూడగట్టాలనే ప్రయత్నం ఫలించలేదు. రాజీనామాల విషయంలో అనుసరించిన దాగుడుమూతల వ్యూహాన్నే తెలుగుదేశం పార్టీ ఉపఎన్నికల విషయంలోనూ అనుసరించింది. కాంగ్రెస్ పోటీలో లేకుంటే తాము కూడా ఆలోచిస్తామని స్పష్టం చేసింది. అయితే ఉప ఎన్నికల విషయంలో కాంగ్రెస్‌లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉబలాటపడుతున్న వాళ్లు ఒకరకంగానూ, ఎన్నికలకు దూరంగా ఉండాలనుకునేవాళ్లు మరోరకంగానూ విడిపోయారు. ఈ మొత్తం వ్యవహారంలో పి.సి.సి. అధ్యక్షుడు డి. శ్రీనివాస్ నిర్వహించిన పాత్ర తెలంగాణ ఉద్యమానికి ద్రోహపూరితమైనది. ఉపఎన్నికల్లో గెలిస్తే తాను ముఖ్యమంత్రినో, ఉప ముఖ్యమంత్రినో అయిపోతానని బహిరంగంగానే ప్రకటించుకుని, ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపడానికి ప్రధానంగా కారకుడయ్యాడు. ప్రజల డిమాండు మేరకు రాజీనామాలు చేయాలనే ఒత్తిడి తెలంగాణ జేఏసీ నుండి వచ్చిందికాబట్టి, రాజీనామాలు చేసిన వారిని తిరిగి గెలిపించే బాధ్యత కూడా తెలంగాణ జేఏసీనే తీసుకున్నది. మానుకోట ప్రతిఘటన తర్వాత ప్రజల్లో జేఏసీ పట్ల విశ్వాసం మరింతగా పెరిగింది. జూన్ 12వతేదీనాడు జరిగిన విస్తృతస్థాయి జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఉప ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాం. రాష్ట్ర జేఏసీ నుండి 12 నియోజకవర్గాలకు బాధ్యులను నియమించుకుని, స్థానిక, జిల్లా జేఏసీలను కలుపుకుని నియోజకవర్గాల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం నిర్వహించాము. రాజీనామాలు చేసిన చాలామంది ఎమ్మెల్యేల విషయంలో ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ, ప్రజల డిమాండు మేరకు రాజీనామాలు చేసారనే సానుభూతి కూడా కనిపించింది. ఇదే సమయంలో విద్యార్థి బృందాలు ఉపఎన్నికలు జరుగుతున్న 12 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికలచుట్టూ తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని సృష్టించడంలో కృతకృత్యులయ్యారు. ఉపఎన్నికల పూర్వరంగ ప్రచారంలో పర్యటించిన విద్యార్థి బృందాలకు ఉద్యమ ప్రజలనుండి అనూహ్యమైన స్పందన, ఆదరణ లభించాయి. ఈ ప్రచా రాన్ని ఓట్ల మళ్లింపునకు ఉపయోగించుకోవడంలో రాజీనామాలు చేసిన ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నించారు. మానుకోట ఘటన తర్వాత జూన్, జూలై రెండు నెలల పూర్తికాలం ఉప ఎన్నికల ప్రచారంతోనే ముగిసింది. జేఏసీ నాయకత్వం పూర్తికాలాన్ని ఈ ఎన్నికల కోసం వెచ్చించింది. రాజీనామాలు చేసిన అభ్యర్థులందరూ వారివారి పార్టీ అభ్యర్థులకంటే జేఏసీ అభ్యర్థులుగానే ప్రజలు అంగీకరించారు. పార్టీలు సైతం జేఏసీ జెండాక్రిందనే ఎన్నికల ప్రచారాన్ని

నిర్వహించాయి. అయితే ఈ పరిస్థితులు టిఆర్ఎస్ పార్టీకి ఇబ్బందికరంగా మారినట్లు ఆ పార్టీ నాయకత్వం, ఎన్నికలబరిలోకి దిగిన అభ్యర్థుల ప్రవర్తననుబట్టి అర్థమయ్యింది. ఈ ఉపఎన్నికల సమయంలో ఉద్యోగవర్గాలు సైతం తమతమ పద్ధతుల్లో విశేషంగా కృషిచేసాయి.

2009నవంబర్ నెలాఖరునుండి ఉద్యమంలో పాల్గొంటున్న తెలంగాణ సమాజం ఈ ఉపఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అప్పటికే ఆరుమాసాలుగా ఎడతెరపిలేకుండా కొనసాగుతున్న ఉద్యమం, తెలంగాణ విషయంలో మాటిమాటికీ రం గులు మారుతున్న రాజకీయాలు ఉపఎన్నికలకు సానుకూలమైన భౌతిక పునాదిని కల్పించాయి. ఉద్యమంలో పాల్గొన్న కులవృత్తులవాళ్లు, వృత్తికులాల ప్రజలు తమ పనిముట్లను ఉద్యమ ప్రతీకలుగా ప్రతిబింబించారు. ఉద్యమంలో భాగంగా అప్పటికే గ్రామగ్రామాన వెలిసిన టెంట్లలో తమకు జీవనాధారంగా ఉపయోగపడుతున్న పనిముట్లను ఉద్యమంలో భాగంచేసి ప్రదర్శించారు. నూలు వడికారు. వలలు పరిచారు. కుండలు చేసారు. మగ్గం నేసారు. ప్రపంచీకరణ ప్రభావంతో కనుమరుగవుతున్న గ్రామీణ జీవితాన్ని ఉద్యమంలో పునప్రతిష్టించారు. వలస దోపిడీతో తాము కోల్పోయిన జీవితాన్ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏరేపడితేనే, స్వయంపాలన, స్వయం నిర్ణయాధికారాన్ని సాధించుకుంటేనే తిరిగి పొందగలమని ఇక్కడి ప్రజలు గట్టిగా నమ్మారు. అందుకే ఏడాదికోసారి జరుపుకునే పండగ, పబ్బాలను కూడా ప్రతిరోజూ నడిరోడ్డుమీద, ఉద్యమ శిబిరాలవద్ద ఉద్యమంలో భాగంగా ప్రదర్శించారు. బతుకమ్మలను పేర్చుకున్నారు. బోనాలను ఎత్తుకున్నారు. వ్యక్తిగత సమస్యలను, కుటుంబ ఇబ్బందులను, సాంఘికమైన అంశాలను పక్కకుపెట్టి అన్ని సందర్భాలను ఉద్యమానికి జోడించారు. తెలంగాణ సాంస్కృతిక ప్రతీకలన్నింటినీ ఉద్యమంలో భాగం చేసారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్రపాలకులు అనుసరిస్తున్న పక్షపాతవిధానాల ఫలితంగానే తమ బ్రతుకుల్లో చీకట్లు కమ్ముకున్నాయని తెలంగాణ ప్రజలు సంపూర్ణంగా విశ్వసించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే సకల సమస్యలకు పరిష్కారం వెతుక్కునేందుకు అవకాశం దొరుకుతుందని పూర్తిగా నమ్మారు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ ప్రజలకు ఈ విషయంలో స్పష్టతను ఇవ్వగలిగింది. మరోవైపున ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్రను నిర్వహిస్తున్న యువకులు తమ జీవితాలకు, భవిష్యత్తుకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రమే ఏకైక మార్గంగా నమ్ముతున్నారు. ఉద్యమిస్తున్న సాధారణ ప్రజలకు వీరందరూ అండగా నిలిచారు. ఉద్యమ ఉధృతి సడలిపోకుండా, ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుంటూ ఉద్యమాన్ని సజీవంగా నిలపడంలో అత్యంత కీలకంగా నిలుస్తున్నారు. దాదాపు

ఏడు కేంద్రాలలో నిరహారదీక్షా శిబిరాలు 500రోజులు దాటి నడుస్తున్నాయంటే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఎంతబలమైనదో అర్థం చేసుకోవచ్చు.

ఉద్యమ ప్రజలను ఉపఎన్నికల దిశలో సమీకరించుకునేందుకు తెలంగాణ జేఏసీ ఎనమిదిరోజుల కార్యాచరణను ప్రకటించింది. ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన జూలై 2వతేదీనుండి నామినేషన్ల గడువు ముగిసే జూలై 9వతేదీ వరకు ఈ కార్యక్రమాలకు ప్రజలనుండి స్పందన అనూహ్యంగా లభించింది. జూలై 1వతేదీనాడు దండోరాతో ప్రారంభమై, తెలంగాణ జెండా ఆవిష్కరణ, అలాయి-బలాయి (సర్వమతప్రార్ధనలు- ప్రతిజ్ఞ), అమరవీరుల స్మృతి, తెలంగాణ దీక్షా కంకణం, విద్యార్థుల మానవహారం, తెలంగాణ జులూస్, తెలంగాణ గ్రామకట్టడిలాంటి వినూత్న కార్యక్రమాలను స్థానిక జేఏసీలు ఉత్సాహంగా నిర్వహించాయి. ఉపఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచార వాతావరణం కంటే ఉద్య మ వాతావరణమే ఎక్కువగా కనిపించింది. ఉపఎన్నికలు జరుగుతున్న చాలా గ్రామాల్లో పోటీలో నిలిచిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందిన అభ్యర్థులనుగానీ, వారి తరఫున పార్టీ నాయకులను గానీ అడుగుపెట్టనీయలేదు. రాజీనామాలు చేసిన వారిపై పోటీకి నిలిచిన వారిని తెలంగాణ ద్రోహులుగానే ప్రజలు భావించారు. పార్టీ అభ్యర్థులను ఉపఎన్నికల బరిలోకి బలవంతంగా దింపిన చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొనే సాహసం చేయలేకపోయాడు. దేవేందర్ గౌడ్‌లాంటి ఒకరిద్దరు పార్టీ నాయకులు పార్టీ తరఫున ప్రచారం చేసేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొని పరాభవం పొందారు. చివరకు చంద్రబాబు నాయుడు ఆడిన 'బాబ్లీ' డ్రామాను కూడా తెలంగాణ ఉద్యమ ప్రజలు సీమాంధ్ర కుట్రగానే అర్థం చేసుకుని పార్టీ అభ్యర్థులెవ్వరికీ కనీసం డిపాజిట్టు దక్కని రీతిలో గుణపాఠం చెప్పారు. అత్యంత బలహీనమైన ముఖ్యమంత్రిగా అధికారంలో కొనసాగుతున్న కొణిజేటి రోశయ్యకూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయారు. అధికారపీఠానికి మడుగు లొత్తడమే మహాభాగ్యంగా భావించే కొంతమంది తెలంగాణ మంత్రులు మాత్రమే ఎన్నికల ప్రచారంలో పాల్గొని తమ బానిస భావజాలాన్ని ప్రకటించుకున్నారు. ఈ ఉపఎన్నికల్లో నిజామాబాద్ (అర్బన్) స్థానానికి జరిగిన ఎన్నికలు అన్నివిధాలుగా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఉపఎన్నికలను ఏకగ్రీవంకాకుండా నిలువరించడంలో ప్రధాన దోషిగా నిలిచిన డి. శ్రీనివాస్ ఒక జాతీయ పార్టీకి రాష్ట్రస్థాయి అధ్యక్షునిగా కాకుండా, నిలువెల్లా స్వార్థం నింపుకున్న తెలంగాణ ద్రోహిగానే పనిచేసారు. పదవులపేరుతో, కులం పేరుతో, మతం పేరుతో నిజామాబాద్‌లో ఓట్లకోసం ఆయన చేయని అకృత్యాలు

లేవు. టివీ-9 లాంటి సీమాంధ్ర, పచ్చి తెలంగాణ వ్యతిరేక ఛానెల్ ఇట్లాంటివాళ్లకు లోపాయికారీగా సహకరించి ద్రోహానికి ఒడిగట్టింది. అయితే తెలంగాణ ఉద్యమ ప్రజలందరూ రాజీనామా చేసిన యెండల లక్ష్మీనారాయణపట్ల సానుభూతితోనే స్పందించారు. ఆయన బిజెపి అభ్యర్థిగాకంటే తెలంగాణ జేఏసీ అభ్యర్థిగానే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా జేఏసీతోపాటుగా న్యాయవాదులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, న్యూడెమొక్రసీ, టిఆర్ఎస్ శ్రేణులు, మరీ ముఖ్యంగా ముస్లీం మైనారిటీ నాయకులు ప్రజలను సానుకూలంగా సమీకరిం చడంలో ఎంతో కృషి చేసాయి.

మొత్తంగా ఉపఎన్నికల ఫలితాలు తెలంగాణ ఉద్యమ ఉధృతిని ప్రపంచానికి చాటిచెప్పాయి. సీమాంధ్ర రాజకీయ కుట్రలను భగ్నం చేసాయి. ఉద్యమంలో నిజాయితీలేని రాజకీయశక్తులకు కళ్లు తెరిపించాయి. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ఈ 12 నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి. అయితే ఏకపక్షంగా వెలువడిన ఈ ఉపఎన్నికల ఫలితాలు, తెలంగాణ భవిష్యత్తు రాజకీయాలలో పెనుమార్పులకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఉపఎన్నికల ఫలితాలు తమకు అనుకూలమనిగానీ, తమ విజయమనిగానీ టిఆర్ఎస్‌తోసహా ఏ పార్టీ ప్రకటించుకునేందుకు సాహసం చేయక పోవడంతో అది తెలంగాణ ప్రజల విజయమేననే వాస్తవాన్ని ఒప్పుకోక తప్పలేదు. ఎవ్వరూ ఊహించని మెజారిటీని అందించడం ద్వారా తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను కోరుకుంటున్నారనే సూచిక కనిపిస్తున్నది.

**ఉద్యమ విస్తరణ దిశలో మిలియన్ మార్చ్**

ఉపఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఊపుతో ఉద్యమం మరోమారు ఊపందుకున్నది. ఆ తర్వాత జరిగిన జాతీయ రహదారి-7, 9లపై నిర్వహించిన మానవహారాలకు ప్రజలనుండి అనూహ్య స్పందన లభించింది. రాజీవ్ రహదారిపై నిర్వహించిన 'వంటా-వార్పు' కార్య క్రమం వినూత్నంగా విజయవంతం అయ్యింది. ఇదే సమయంలో జేఏసీ తన సంస్థాగత నిర్మాణాలమీద దృష్టిని కేంద్రీకరించింది. అన్ని జిల్లాలలోనూ పూర్తిస్థాయి కమీటీలను ఏర్పాటు చేసుకున్నది. డివిజన్ స్థాయిలోనూ, నియోజకవర్గస్థాయిలోనూ, కొన్ని జిల్లాలలో మండల, గ్రామ స్థాయివరకూ తెలంగాణ జేఏసీ కమిటీలు ఏర్పడ్డాయి. ఉపఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఆత్మహత్యల పరంపర కొనసాగడంలో ఉద్యమంలో ఆందోళనకరమైన పరిణామంగా అందరూ గుర్తించారు. ఆత్మహత్యల నిరోధంపై ప్రత్యేక దృష్టిని సారించారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి చొరవతో ఆత్మహత్యల నిరోధానికి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటయ్యింది. జిల్లాలలో ప్రత్యేక సమావేశాలు, విద్యార్థులకు

కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు జరిగాయి. ఉద్యమంపట్ల సీమాంధ్ర మీడియా పనిగట్టుకుని చేస్తున్న దష్ప్రచారాలు, తెలంగాణ అంశంపై సీధీర్ఘంగా ఏకపక్షంగా నిర్వహిస్తున్న మీడియా చర్చలు, తెలంగాణ రాజకీయ నాయకత్వం పాటించిన వ్యూహాత్మక మౌనం, సీమాంధ్ర రాజకీయ నాయకులు తెలంగాణపై చేసిన అవమానకరమైన వాఖ్యా నాలు, ఉద్యమంలో ఎదురవుతున్న ఆటుపోట్లు, తదితర కారణాలవల్లనే తెలంగాణలో ఆత్మహత్యలు కొనసాగుతున్నట్లు ఈ కమిటీ అధ్యయనంలో వెల్లడించింది. ఆత్మహత్యల నిరోధానికి తెలంగాణ జేఏసీ, విద్యార్థి సంఘాలతో కలిసి ఆత్మహత్యల నిరోధక కమిటీ ఆగస్టు 18నాడు తెలంగాణ వ్యాపితంగా నిర్వహించిన 'ప్రతిజ్ఞ'లు కొంత ప్రభావితం చేసింది. అయితే తెలంగాణలో కొనసాగుతున్న ఆత్మహత్యలకు సీమాంధ్ర ఆధిపత్య మీడియాదే ప్రధాన బాధ్యతగా సర్వత్రా ఒక ధృఢమైన అభిప్రాయం నెలకొన్నది. ఈ అంశంపై బహిరంగ చర్చను నిర్వహిం చాలని తెలంగాణ జేఏసీ తరఫున ఏపియుడబ్ల్యుజె నాయకులకు లేఖ రాసినప్పటికీ ఎలాంటి స్పందన లభించలేదు. కానీ తెలంగాణ ఆకాంక్ష లపై కక్షగట్టి, తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్న సీమాంధ్ర మీడియామీద జేఏసీ ఖచ్చితమైన వైఖరిని ప్రకటించిన సందర్భాలలో మాత్రం సదరు ఏకపక్షమీడియా పక్షాన ఈ నాయకులే మధ్యవర్తులుగా పెద్దరికం ప్రదర్శించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయితే ఇదే అంశంపై తెలంగాణ జర్నలిస్టుల ఫోరంతో కలిసి తెలంగాణ విద్యావంతుల వేదిక జనవరి మాసంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మాత్రం సీమాంధ్ర ఛానల్ల ప్రతినిధులు ముఖం చాటేసుకున్నారు. టీవీ స్టూడియోల్లో నిర్వహించే అంతర్గత చర్చల్లో ఆవేశపడటానికి అలవాటు పడిన సీమాంధ్ర ఏకపక్ష జర్నలిస్టులు బహిరంగ చర్చల్లో పాల్గొనే సాహసం చేస్తారనుకోవడం ఒక భ్రమగానే మిగిలిపోయింది. మరికొన్ని సందర్భాలలో కూడా ఇది స్పష్టమయ్యింది.

హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17నాటి సంఘటనను ఎట్లా గుర్తించాలనే అంశంపై తెలంగాణ జేఏసీలో సుధీర్ఘమైన, భిన్నమైన చర్చలు జరిగాయి. విమోచన దినోత్సవంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జేఏసీ చర్చల్లో గట్టిగా పట్టుబట్టింది. దివంగత ఝాన్సీ ఈ చర్చల్లో ప్రముఖంగా పార్టీ వాదనలు వినిపించారు. విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర సమితి మొదట అభిప్రాయపడినా చివరకు జేఏసీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించింది. ఈ విషయంలో సిపిఐ యం.యల్. న్యూడెమొక్రసీ నాయకులు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. అయితే సుధీర్ఘ చర్చల తర్వాత సెప్టెంబర్ 17వతేదీనాడు విలీన దినంగా జరుపుకుంటూనే,

విమోచన కోసం పోరాడాలని జేఏసీ అభిప్రాయ పడింది. ఈ మేరకు విలీనదినం పేరిట తెలంగాణ వ్యాపితంగా జాతీయ జెండాలతోపాటు, తెలంగాణ జెండాలను ఏగురవేసారు.

మరొకవైపున తెలంగాణ అంతటా ధూం, ధాం లాంటి కార్య క్రమాలు విస్తృతంగా జరుగుతూనే ఉన్నాయి. ఉద్యమంలో భాగంగా ఎదిగిన తెలంగాణ కళాకారులు గజ్జెకట్టి గ్రామాగ్రామాన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉద్యమ ప్రజలను ఉత్తేజితులను చేస్తున్నారు. ఒకవైపున తెలంగాణ ఇతివృత్తంగా సినిమాలు జోరందుకున్నాయి. ఎన్. శంకర్ దర్శకత్వంలో నిర్మించిన 'జైబోలో తెలంగాణ' సినిమా నిర్మాణం దాదాపుగా తెలంగాణ ఉద్యమంలో భాగంగా మారిపోయింది. ఉద్య మంలో ముందున్న నాయకుల్లో అనేకమంది తెరమీద ప్రత్యక్షమయ్యారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రసమయి బాలకిషన్ దర్శకత్వంలో ప్రారంభమైన 'యమలోకంలో జై తెలంగాణ'తోపాటు మరికొన్ని సినిమాలు సైతం నిర్మాణంలోకి వచ్చాయి. తెలంగాణ సినిమా జేఏసీ కూడా ఏర్పాటయ్యింది. సినిమారంగంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే ప్రయత్నం చేసారు.

తెలంగాణ రచయితలు కూడా తమవంతు కర్తవ్యంగా తమ రచనలద్వారా ఉద్యమానికి ఉత్తేజాన్ని అందించారు. తెలంగాణ రచ యితల వేదిక, 'సింగిడి'లాంటి సంస్థలు అనేక సంకలనాలను వెలువరించాయి. 2004లో ప్రారంభమైననాటినుండి ఉద్యమ భావవ్యాప్తిలో ముందున్న 'తెలంగాణ విద్యావంతుల వేదిక' తెలంగాణ ఉద్యమానికి అనుసంధానంగా అనేక సదస్సులను, కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నది. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఉద్యమ క్రమంలో వేగం పుంజుకున్నది. తెలంగాణ ఉద్యమ శక్తులను ఐక్యం చేసేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహించింది. తెలంగాలోని జర్నలిస్టులదరినీ సంఘటిత పరుచడంలో విశేషంగా కృషి చేసింది. ఇందులో భాగంగా జనవరి 5వతేదీన ఆర్టీసీ కల్యాణమంటపంలో టిజెఎఫ్ నిర్వహించిన సభ అత్యంత కీలకమైనది. తెలంగాణ వర్తమాన ఉద్యమంలో న్యాయ వాదులు, విద్యార్థులు నిర్వహించిన పాత్ర అమోఘమైనది. రాజధాని తోపాటు జిల్లా కేంద్రాలలోనూ, స్థానికంగానూ న్యాయవాదులు సమర శీలమైన పోరాటాలను నిర్వహించారు. న్యాయవాదులు నిర్వహించిన 'ఛలోఢిల్లీ' కార్యక్రమం మొట్టమొదటిసాగిర దేశరాజధానిలో సంచలనం సృష్టించింది. ఉన్నత న్యాయస్థానంలో తెలంగాణ ప్రాంతానికి 42శాతం వాటా కోసం న్యాయవాదులు అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారు. ఉద్యమంలోని ప్రతి సందర్భంలోనూ న్యాయవాదులు తమవంతు కృషిని కొనసాగించారు. ఒకవైపున ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటూనే మరోవైపున ఉద్యమంలో పోలీసు కేసులను

ఎదుర్కొంటున్న బాధితుల పక్షాన ఉచితంగా న్యాయసహాయం అందించి మానవత్వాన్ని ప్రదర్శించారు. ఫ్రీజోన్ విషయంలోనూ, గ్రూప్-1 సర్వీసుల్లో తెలంగాణ ప్రత్యేక వాటా డిమాండుతోనూ, అసెంబ్లీ ముట్టడి సందర్భంగానూ విద్యార్థులు తమ శక్తియుక్తులను ప్రదర్శించి ఉద్యమ స్ఫూర్తిని చాటుకున్నారు. విద్యార్థులే తెలంగాణ వర్తమాన ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారు. ఆత్మత్యాగాలతో ఉద్యమ జ్వాలలను విస్తరించారు. తెలంగాణ ఉద్యమం ఆటుపోట్లకు గురైన ప్రతిసందర్భంలోనూ ఉద్యమవేడిని రగిలించడంలో విద్యార్థులు నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. అయితే సంఘటిత ఉద్యమంగా విద్యార్థి ఉద్యమాన్ని రూపుదిద్దడంలో ఇతర సంస్థలు ఎదుర్కొన్న పరిమితులు, అడ్డంకులనుండి వీరికి కూడా మినహాయింపు లభించకపోవడం ఉద్యమ వేగానికి అడ్డంకిగానే భావించాలి. తెలంగాణ డాక్టర్స్ జేఏసీకూడా తమ వృత్తి ఒత్తిళ్లను భరిస్తూనే ఉద్యమంలో క్రియాశీలకంగా భాగస్వాములయ్యారు. ఉద్యమ భావవ్యాప్తిలోనూ, ప్రచారంలోనూ తెలంగాణ వైద్యులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. పోలీసు కాల్పుల్లో, లాఠీఛార్జీ సంఘటనల్లో గాయపడిన ఉద్యమకారులకు ఉచితంగా వైద్యసహాయం అందించడంలో వైద్యులు పోషించినపాత్ర ప్రశంసనీయమైనది.

తెలంగాణ జేఏసీలోని సభ్య సంఘాలన్నీ అక్టోబర్, నవంబర్ మాసాలలో తమతమ సంస్థాగతమైన కార్యక్రమాలపై దృష్టిని కేంద్రీకరించాయి. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, తెలం గాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం లాంటి ఇంకా అనేక సంఘాలు ప్రత్యేకంగా తమ సంస్థల తరపున కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాయి. ముఖ్యంగా కొత్తగా రంగంమీదికి దూకిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ అతి తక్కువ సమయంలోనే అత్యంత సంఘటిత శక్తిగా ఉద్యమ తెరమీదికి వచ్చింది. తెలంగాణ జేఏసీ కార్యక్రమాలలో చురుకైన పాత్రను నిర్వహిస్తూనే సంస్థాగతంగా కూడా బలంపుంజుకునేందుకు శాయశక్తులా కృషి చేసింది. అక్టోబర్ 29వ తేదీనాడు సుమారు 20వేల మంది విద్యుత్ ఉద్యోగులతో హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగ సభతో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ తమ విశ్వరూపాన్ని ప్రదర్శించింది. తెలంగాణలోని వివిధ రంగాల ఉద్యో వర్గాలకు ఈ సమావేశం కొత్తఊపుని అందించింది. ఆర్టీసీ జేఏసీ, సింగరేణి జేఏసీలకు ఇది ప్రేరణగా నిలిచింది. అయితే అంతకుముందు సంవత్సరం తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల జేఏసీ 21 అక్టోబర్ 2009లో సిద్ధిపేటలో నిర్వహించిన 'ఉద్యో గ గర్జన' మొత్తం తెలంగాణ ఉద్యమానికే తలమానికంగా నిలిచింది. తెలంగాణ వర్తమాన ఉద్యమానికి 'ఉద్యోగ గర్జన' సభతోనే అంకురార్పణ జరిగిందనడంలో

ఎలాంటి అతిశ యోక్తిలేదు.

తెలంగాణ ఉద్యోగులు అనుభవిస్తున్న అణచివేత, అన్ని రంగా ల్లోనూ సీమాంధ్ర ఉద్యోగుల, అధికారుల ఆధిపత్యంపై ఆలోచన ప్రారంభమయ్యింది. తెలంగాణ ఉద్యోగులు తమలోఉన్న బేధా భిప్రాయలను పక్కకుపెట్టి ఉద్యమంలో సంఘటితం కావడం మొదల య్యింది. అనిశాఖల ఉద్యోగులు జేఏసీలుగా ఏకమయ్యారు. తమ స్వంత గడ్డమీద పరాయిలుగా ఎందుకు మారిపోయారో, అందుకుగల కారణాలు, నేపథ్యాన్ని అర్థంచేసుకున్నారు. సీమాంధ్ర ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధపడ్డారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటువల్లనే తమ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమ వుతుందని భావించారు. ఉద్యోగ నియామకాలలో చోటుచేసుకున్న రాజ్యాంగ ఉల్లంఘనలు, నిధుల కేటాయింపుల్లో పక్షపాతం, ప్రాంతీయ దురభిమానం మూలాలకు సంబంధించిన కారణాలను విశ్లేషిం చుకున్నారు. తరువాత జరిగిన ఉద్యమంలో ప్రజలతో మమేకమయ్యారు. తెలంగాణ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు చేపట్టిన 'సహాయ నిరాకరణ' ఉద్యమం చారిత్రాత్మకంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం దిమ్మదిరిగిపోయింది. సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యింది. ఉద్యోగుల సంఘటిత శక్తిముందు మోకరిల్లింది. 'సహాయ నిరాకరణ' ఉద్యమానికి అనుబంధంగా జేఏసీ చేపట్టిన 48గంటల బంద్ సంపూర్ణంగా విజయవంతమయ్యింది. ఈబంద్ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని తమ సత్తాను ప్రదర్శించారు. సింగరేణి గని కార్మికులు రెండురోజులు సమ్మెలో పాల్గొని బొగ్గు ఉత్పత్తిని స్థంభింప జేసారు. ఉపాధ్యాయులు విధులను బహిష్కరించారు. ప్రైవేటు సంస్థలు, బ్యాంకులు స్థంభించిపోయాయి. మొత్తంగా తెలంగాణ వ్యాపితంగా జనజీవనం స్థంభించింది. ఇదే సమయంలో 'పలెపల్లె పట్టాలమీదికి' నినాదంతో తెలంగాణ జేఏసీ నిర్వహించిన 'సంపూర్ణ రైల్‌రోకో' దేశవ్యాపితంగా ప్రభావం చూపింది. ఉత్తర, దక్షిణ భారత్‌లమధ్యన రెండు రోజులపాటు రైల్వే లింకు పూర్తిగా తెగిపోయింది. ఉద్య మం ఉన్నత స్థాయికి చేరుకున్నది. మరోవైపున రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలు గైరాజరు కావడంతో అది ఆంధ్రా అసెంబ్లీగా మారిపోయింది. ఎప్పటిలాగానే తెలంగాణనుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ద్రోహపూరితంగా ప్రభుత్వానికి సహకరించి ప్రజలు ప్రదర్శిస్తున్న ఉద్యమ స్ఫూర్తికి తూట్లు పొడిచే ప్రయత్నం చేసారు. లోకసభలో తెలంగాణ అంశం రెండు రోజులపాటు చర్చనీయాంశ మయ్యింది. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీలు క్రియాశీలకంగా తమవంతు ఆందోళనను నిర్వహించారు.

బిజెపి నాయకురాలు సుష్మాస్వరాజ్ తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా, 'సహాయ నిరాకరణ' ప్రభావాన్ని ఉటంకిస్తూ తీవ్రస్వరంతో కేంద్రాన్ని నిందించారు. తెలంగాణపై ప్రకటన చేయాలని డిమాండు చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ప్రభావం చూపిన 'సహాయ నిరాకరణ' ఉద్యమం మార్చి 10వతేదీనాడు తలపెట్టిన 'మిలియన్ మార్చ్' వరకు కొనసాగాలని అన్ని వర్గాల ప్రజలు ఆశించారు. కానీ అనుకోని రీతిలో, తీవ్రమైన ఒత్తిళ్లనడుమ 'సహాయ నిరాకరణ' విరమణ జరిగిపోయింది. ఈ హఠాత్పరిణామం అందరినీ నిరాశ పరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో 'మిలియన్ మార్చ్'కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాలని జేఏసీ నాయకత్వంపై ఒత్తిడి పెరిగింది. అయితే టిఆర్ఎస్ మినహా జేఏసీ భాగస్వామ్య పక్షాలు, ప్రజాఫ్రంట్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్,తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తదితర ఉద్యమ సంస్థలు, ప్రజాసంఘాలు 'మిలియన్ మార్చ్' కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించడం, ప్రజలనుండి వ్యక్తమైన పట్టుదల, ఉద్యమ అనివార్యతల ఫలితంగా 'మిలియన్ మార్చ్' నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణను జేఏసీ సిద్ధం చేసుకున్నది. వ్యూహాత్మకమైన ఎత్తుగడలను అమలు జరిపింది. 'మిలియన్ మార్చ్'విషయంలో జేఏసీ పట్టు సడలకుండా నిలబడటంతో అన్నివర్గాల ప్రజల్లోనూ 'మిలియన్ మార్చ్'లో పాల్గొనాలనే పట్టుదల పెరిగింది. ఉద్యమ ప్రజలు నడిచిన దారిలోనే తెలంగాణ రాజకీయ నాయకత్వం సైతం నడవాల్సిన అనివార్యత ఏర్పడింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో 'మలియన్ మార్చ్' మరొక మైలురాయిలా నిలిచింది. తెలంగాణ రాజకీయ నాయకత్వ వరుస వైఫల్యాలే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన అడ్డంకులనే వాస్తవాన్ని 'మిలియన్ మార్చ్' బహిర్గతం చేసింది.

పెద్దలు డాక్టర్ కె. జయశంకర్ పదేపదే ప్రస్తావించినట్లుగా తెలంగాణ వర్తమాన ఉద్యమంలో ఇమిడిఉన్న మూడు దశల్లో ... భావవ్యాప్తి నిరంతరం విరామంలేకుండా వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉన్నది. గడచిన సంవత్సరన్నర కాలంగా ఉద్యమం నిర్విరామంగా జరుగుతున్నది. ఈ రెండు దశల ఉద్యమానికి రాజకీయ ప్రక్రియ అనుసంధానం కావాల్సిఉన్నది. కానీ తెలంగాణ రాజకీయ నాయకత్వం సీమాంధ్ర రాజకీయ ఆధిపత్యంనుండి బయటపడేందుకు సిద్ధం కావడంలేదు. తెలంగాణ రాజకీయ నాయకత్వం ప్రదర్శిస్తున్న పిరికితనమే తెలంగాణ సాధనలో ప్రధాన అవరోధంగా పనిచేస్తున్నది. తెలంగాణ ప్రజాఉద్యమం ఉవ్వెత్తున లేచిన ప్రతి సందర్భంలోనూ తెలంగాణ రాజకీయనాయకత్వం దాగుడుమూతలు ఆడుతున్నది. ప్రజలను మోసం చేయడానికే సిద్ధపడుతున్నది. పార్టీ అధినాయకత్వానికి బానిసలుగా పడిఉండేందుకే ప్రయత్నిస్తున్నది.

మానుకోట ప్రతిఘటన ఇచ్చిన ఆత్మగౌరవాన్ని తెలంగాణ రాజకీయ నాయకత్వం అంది పుచ్చుకోవడంలేదు. మిలియన్ మార్చ్ ఇచ్చిన ధైర్య, సాహసాలను పుణికిపుచ్చుకోవడంలేదు. మొత్తంగా తెలంగాణ రాజకీయ నాయకత్వం ఉద్యమిస్తున్న ప్రజలకంటే ఎంతో వెనుకబడిఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్నివర్గాల ప్రజలు తరతమబేధాలను మరచి, కులమతాలకు అతీతంగా ... తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూనే, స్వంతరాష్ట్రాన్ని సాధించుకోవడంకోసం ఉద్యమిస్తున్నారు. కానీ తెలంగాణ రాజకీయ నాయకత్వమే సంఘటితం కావడంలేదు. ముఖ్యంగా కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలకు చెందిన తెలంగాణ ప్రాంత నాయకులు అనుసరిస్తున్న స్వార్థపూరిత వైఖరి కారణంగానే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరడంలేదు. తెలంగాణ రాజకీయ నాయకులు వేసుకుంటున్న ముసుగులన్నీ ఒక్కొక్కటిగా తొలగిపోయాయి. పార్టీల మీదా, ఆ పార్టీల ప్రతినిధులమీదా ప్రజలకు ఇప్పుడు పూర్తి స్పష్టత వచ్చింది. ఉద్యమ మిత్రులు ఎవ్వరో, అంతర్గత శత్రువులు ఎవ్వరో తేలిపోయింది. ఇది తెలంగాణ ఉద్యమం సాధించిన చారిత్రక విజయం.

అందువల్ల ... మానుకోట ప్రతిఘటన నిలబెట్టిన ఆత్మగౌరవాన్ని కొనసాగించుకుంటూ, 'మిలియన్ మార్చ్'అందించిన దిశానిర్దేశంతో ... తెలంగాణ రాజకీయ నాయకత్వాన్ని ఉద్యమదారిలోకి తీసుకు రావడమో లేక అడ్డు తొలగించుకుని ఉద్యమ ప్రజల నాయకత్వంలో లక్ష్య సాధనవైపు ముందుకు సాగడమో నిర్ణయించుకోవడమే తక్షణ ఉద్యమ కర్తవ్యం.

**(తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి)**

# నిర్బంధం ... ప్రతిఘటన

**–శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

తెలంగాణ మిలియన్ మార్చ్ జరిగి సంవత్సరం గడిచింది. ఈ సంవత్సర' కాలంలో తెలంగాణ ఉద్యయమం గణాత్మకంగా ముందడుగు వేసింది. దానికి పునాది వేసింది 10 మార్చి, 2011న హైదరాబాద్ టాంక్‌బండ్ మీద అపూర్వంగా సాగిన మిలియన్ మార్చ్. ఒక సంవత్సరం తర్వాతత మిలియన్ మార్చ్ నేపథ్యాన్ని, మిలియన్ మార్చ్ అనుభవాలను, మిలియన్ మార్చ్ పర్యావసానాలను మరొక్కసారి మధింపు చేసుకోవాల్సిన సమయం. గతంలోస మిలియన్ మార్చ్‌లో జరిగిన విగ్రహాల విధ్వంసంపై తెలంగాణ సమాజం అపూర్వంగా ప్రతిస్పందించింది. విగ్రహాల కూల్చివేతను సాంస్కృతిక విధ్వంసంగా, విధ్వంసకారులను తాలిబన్లుగా అభివర్ణించిన సీమాంధ్ర మేధావి8 వర్గం వారి శబ్బకాలుష్యాన్ని విస్త ృతంగా వ్యాప్తి చేసిన సీమాంధ్ర పత్రికలు, మీడియా ప్రచారాన్ని ఆత్మవిశ్వాసంతో నిలువరించ గల్గింద'ఇ తెలంగాణ సమాజం. తెలంగాణ రచయితల వేదిక వెలువరించిన 'వి రుగుడు' వ్యాసాల సంకలాన్ని, సింగిడి తెలంగాణ రచయితల సంఘం వెలువరించిన 'దిమ్మిస' కవితా సంకలనం తెలంగాణ ప్రతిఘటనా పోరాటానికి ప్రతీకలుగా నిచిచాయి. ఆ రెండు పుస్తకాలను బాజాప్తా ట్యాంకుబండు మీదనే. ఆవిష్కరించు కోవటం తెలంగాణ ఉద్యమం ఆవిష్కరించుకున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనం.

అంధ్రా పత్రికలు, మీడియా మొత్తం మిలియన్‌మార్చ్‌ని విగ్రహ కూల్చివేత ఘటనగా కుదించివేసినాయి. అప్పటికి తెలంగాణ సమాజం తనను తాను నైతికంగా నిలబెట్టుకోవడానికి అనివార్యంగా విగ్రహాల కూల్చివేతపైనే చర్చించుకోవాల్సి వచ్చింది. అయితే ఇపుడు మిలియన్ మార్చ్ ఉద్యమాన్ని సమగ్రంగా మధింపు చేసుకోవాల్సి ఉన్నది. మిలియన్ మార్చ్ కేవలం విగ్రహాల కూల్చివేత మాత్రమే కాదని, అంతకు మించిన విశ్వరూపం దానికి ఉందని, దాన్ని దృశ్యమానం చేయడానికి ఇవ్వాళ తెలంగాణ ఉద్యమం ప్రయత్నిస్తున్నది.

## మిలియన్ మార్చ్ నేపథ్యం

శ్రీకృష్ణకమిటి డిసెంబర్ 30, 2010న రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత, ప్రభుత్వం ఏదో నిర్ణయం తీసుకుంటుదన్న భ్రమలు పటాపంచయినాయి. రిపోర్టు తయారీనే ఒక కుట్ర, సీమాంధ్రుల ఆకాంక్షల మేరకే రిపోర్టు తయారయ్యిందని తెలంగాణ మేధావి వర్గం విస్తృతంగా విశ్లేషించి నిరూపించారు. కమిటి రిపోర్టును తప్పుల తడకగా, అబద్దాల పుట్టగా, వక్రీకరణలు నిండిన చెత్త రిపోర్టుగా తెలంగాణ వాదులు పెద్దగా కష్టపడకుండానే తేల్చిపడేసినారు. కమిటి సిఫారసుల్లో 6వ సిఫారసువైపే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతుదన్న వాస్తవాలను గమనించిన తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరాన్ని తెలంగాణ జెఎసి గుర్తించింది. దశలవారీ ఉద్యమ కార్యక్రమాలను ప్రకటించింది. మొదటి దశలో ఊరూరా దీక్షాశిబిరాలను ప్రారంభించాలని పిలుపునిచ్చింది. జనవరి 21, 2011 నుండి గ్రామగ్రామాలన, మండల కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో అన్ని ప్రధాన ఆఫీసులో దీక్షా శిభిరాలు ప్రారంభమైనాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో తెలంగాణ ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టాలన్న ఏకైక డిమాండ్‌తో ఉద్యమ శిభిరాలు వెలిసాయి. రెండో దశలో ఫిబ్రవరి 17 నుండి సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చింది. సహాయనిరాకరణ ఉద్యమంలో అనేక కారణాల వలన ప్రజలు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యం లేకపోవడంచేత అది అంతిమంగా ఉద్యోగుల సహాయనిరాకరణ ఉద్యమంగానే సాగింది. హైదరాబాద్ నగరంలో అన్ని కార్యలయాలలో సహాయనిరాకరణ సంపూర్ణంగా జరిగింది. అన్ని ఉద్యగ, ఉపాధ్యాయ సంఘాలు సహాయనిరాకణ ఉద్యమాలలో పాల్గొన్నారు. జిల్లాలలో కలెక్టరేట్లు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో శిభిరాలు వెలిసాయి. మండల తహసీల్దారు కార్యాలయాలలో శిభిరాలు వెలిసాయి. స్కూళ్లు, కాలేజీలు బందయినాయి. ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల కదలికలు మొత్తంగా బందయినాయి. పన్నుల వసూళ్లు దారుణంగా పడిపోయినాయి. జై తెలంగాణ నినాదాలతో, కళాకారుల ధూంధాంలతో, వంటావార్పులతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలయినాయి. ఈ దెబ్బతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని అందరూ భావించారు. సహాయ నిరాకరణ జరగుతున్నప్పుడే రాస్తారోకోలు జరిగాయి. మార్చి ఒకటిన పల్లె పల్లె పట్టాలపైకి కార్యక్రమమం అపూర్వంగా విజయవంతమైంది. గ్రామాలన్నీ పట్టాలపైకి ఎక్కి 12 గంటలపాటు తెలంగాణాలో రైళ్లను నిలిపివేసారు. ఫిబ్రవరి 17న ప్రారంభమైన సహాయనీరాకరణ ఉద్యమం అనూహ్యంగా ఉద్యోగుల సంసిద్దకు విరుద్ధంగా మార్చి 4నే ముగిసింది. ఆనాటికే మార్చి 10న మిలియన్ మార్చ్ జరిగితీరుతుందని జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించి ఉన్నారు. ఉద్యోగ సంఘాలన్నీ కూడా సహాయనిరాకణ

ఉద్యమాన్ని మిలియన్ మార్చ్ వరకైనా పొడిగించి ఆ తర్వాత ఉద్యమాన్ని కొనసాగించే బాధ్యతను జెఎసి భాగస్వామ్య పక్షాలపై మోపాలని మార్చి 3న జరిగిన ఉద్యోగుల సంఘాల జెఎసి సమావేశంలో అభిప్రాయపడినాయి. అయితే నాయకత్వం మార్చి 4నే ప్రభుత్వంతో చర్చలకు వెళ్ళి విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకొని సాయంత్రానికి విరమణ ప్రకటన చేశాం. ఉద్యమంలో అత్యద్భుతమైన చైతన్యంతో పాల్గొంటున్న ఉద్యోగులకు ఈ నిర్ణయం హతాశులను చేసింది. మార్చి 5న నాలుగైగు చోట్లల్లో నాయకుల దిష్టిబొమ్మలను తగులబెట్టినట్లు వార్తలు వచ్చినాయి. అది ఉద్యమాకారుల సహజమైన, అసంకల్పిత ప్రతిచర్యగా, తీవ్రమైన భావోద్వేగాల నుండి వెల్లుబడిన అగ్రహ ప్రకటనగా చూడాలి తప్ప వ్యక్తిగతంగా చూసే పరిస్థితికాదు.

సహాయనిరాకరణ విరమణకు ముందురోజే అంటే మార్చి 3నే మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావుగారు ముఖ్యమంత్రికి బహిరంగలేఖ రాసి మంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ చేస్తున్న తాత్సారానికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఉధృతంగా జరుగుతున్న సహాయ నిరాకరణ ప్రభావ ఫలితంగానే ఆయన రాజీనామాకు సిద్దపడినట్లు విశ్లేషకులు భావించారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా అధిష్టానానికి ఇటువంటి హెచ్చరికనే ఇచ్చినట్లు పత్రికల ద్వారా తెలుస్తూ ఉన్నది. జూపల్లి బాటలోనే మరో ఆరుగురు మంత్రులు రాజీనామాకు సిద్దపడినట్లు సమాచారం ఉన్నది. అయితే మార్చి 4 నే సహాయనిరాకరణ విరమణ కాగానే వారందరూ రాజీనామా యోచన విరమించుకుని జూపల్లిని ఒంటరిని చేశారు. అటు ఢిల్లీలో ఎంపీలు రాజీనామా చేసే యోచన విరమించు కున్నారు. ప్రభావశీలంగా నడిచిన సహాయనిరాకరణ అంతిమంగా ప్రభావ రహితంగా ముగిసిపోయింది.

అయినప్పటికీ ఉద్యోగులు చాలా చోట్లలో శిబిరాలను కొనసాగించారు. జలసౌధలోని ఇంజనీర్ల జెఎసి శిభిరం మార్చి 10వరకు కొనసాగింది. మార్చి 10న వందల సంఖ్యలో ఉద్యోగులు మిలియన్ మార్చ్ కోసం శ్రమించి అన్ని ఆటంకాలను ఛేధించుకొని ట్యాంకుబండు చేరుకున్నారు. వందలాది మంది ఉద్యోగులు అరెస్టయి గోషామహల్ స్టేడియంకు తరలించబడినారు. మిలియన్ మార్చలో పాల్గొంటామని ప్రకటించిన ఉద్యోగుల జెఎసి నాయకులు మాత్రం ఉద్యోగులను వారి మానాన వారిని వదిలేసి మార్చి 7వ తేదీనే ఢిల్లీకి పయనమైనారు. నాయకత్వం యొక్క దిశానిర్ధేశం లేని పరిస్థితుల్లో తమకు తోచిన పద్ధతుల్లో మిలియన్ మార్చ్‌లో భాగస్వామ్యులైనారు.

ఒకవైపు మిలియన్ మార్చ్‌ని జయప్రదం చేయడానికి ప్రజాసంఘాలు

సన్నాహాలు చేసుకుంటుంటే, ఆ కార్యక్రమాన్ని వాయిదా వేయించడానికి టిఆర్ఎస్ తరపునుండి ప్రొ॥ కోదండరాంపై ఒత్తిడి చేసినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. అనుకున్నట్లుగా మార్చి 10న మిలియన్ మార్చ జరుపకపోతే హుసేన్‌సాగర్‌లో దూకడం మేలని కోదండరాం గారు జెఎసిలో వ్యాఖ్యానించినట్లుగా కూడా పత్రికల్లో వార్తలు అచ్చయినాయి. సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమొక్రసీ జెఎసి మిలియన్ మార్చ్ జరపకపోయినా తాము తమ పార్టీ తరుపున కార్యక్రమాన్ని జరిపితీరుతామని ప్రకటించాయి. మొత్తంమీద జెఎసిలో మిలియన్ మార్చ్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా జెఎసి చైర్మన్ ప్రొ॥ కోదండరాం ధృడమైన వైఖరి వల్ల జెఎసిలోని అన్ని పక్షాలు మిలియన్ మార్చ్‌లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాయి. బిజెపి, టిఆర్ఎస్ పార్టీల కార్యవర్గ సమావేశాలు నిర్వహించుకొని మిలియన్ మార్చ్‌కు వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. మార్చి 5 నుండే జిల్లాల నుండి కార్యకర్తలను హైదరాబాద్‌కు తరలించాలని టిఆర్ఎస్ నిర్ణయించింది. నగరంలోని 150 డివిజన్లలో మూడువేల మందిని ఇంచార్జీలుగా నియమించారు. ప్రతీ ఇంటి నుండి కనీసం ఒక్కరైనా మార్చ్‌లో పాల్గొనేటట్టు చేయాలని దీనికోసం కళాబృందాలతో బస్తీలలో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలు ఎక్కడి వరకు రాగలిగితే అక్కడ్నే రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు నిర్ణయించారు.

మధ్య ఆసియాలో ట్యునీసియా, ఈజిప్టులో జరిగిన రాజధాని ముట్టడుల వల్ల దశాబ్దాలుగా ఆ దేశాలను పాలిస్తున్న నియంతలు దేశాలు విడిచి పలాయనం చిత్తగించారు. ఈజిప్టు రాజధాని కైరో నగరంలో తెహ్రీర్ చౌరస్తాను లక్షలాది మంది ముట్టడించి ఈజిప్టు పోలీసులను, మిలటరీని ఎదిరించి రోజుల తరబడి తమ కబ్జాలో ఉంచుకొన్న సంఘటనను తెలంగాణ ఉద్యమకారుల మెదళ్లలో సుడులు తిరుగుతున్నాయి. మనమూ అటువంటి ప్రదర్శన చేసి చూపించడానికి మిలియన్ మార్చ్ గొప్ప అవకాశంగా భావించారు. పోస్టర్లు, కరపత్రాలు విస్తృతంగా ప్రజల్లో పంపిణీ చేశారు. ఈజిప్టు తెహ్రీర్‌స్కేర్ ముట్టడికి ఆస్మా మహసౌజ్ అనే మహిళా కార్యకర్త ఫెస్‌బుక్ ద్వారా ఈజిప్టు ప్రజలకు పంపిన సందేశాన్ని తెలంగాణ ప్రజలకు కూడా గొప్ప స్ఫూర్తిని ఇచ్చింది. ఈ సందేశాన్ని సింగిడి తెలంగాణ రచయితల సంఘం కార్యకర్త స్కైబాబా తెలంగాణ అవ్వయిస్తూ ఒక కరపత్రం రాసి ఇంటర్‌నెట్‌లో పెట్టాడు. ఆ కరపత్రాన్ని తెలంగాణ ఉద్యోగుల సంఘం తరపున ప్రచురించి ఉద్యోగులలో పంచడం జర్గింది. మార్చి 5 నుండే జెఎసిలో ఉన్న సంఘాలు, లేని సంఘాలు ఎవరికి వారి సన్నాహాలు చేసుకున్నారు.

**మిలియన్ మార్చ్‌కు ముందు పరిస్థితి:**

పై నేపథ్యంలో గత ఉద్యమ అనుభవాల నుండి మిలియన్ మార్చ్ కూడా విజయవంతం అవుతుందని ప్రభుత్వం ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా పసిగట్టింది.

మిలియన్ మార్చ్‌ని నిర్బంధాల ద్వారా విఫలం చెయ్యొచ్చనని భావించింది. జెఎసి పిలుపు నందుకొని ప్రజలు హైదరాబాద్ రావడానికి సన్నాహాలు చేసుకోవడం మొదలయ్యింది. ప్రభుత్వం మార్చి 6 నుండి నిర్బంధాన్ని అమలు చేయడం ప్రారంభించింది. జిల్లా మండల జెఎసి నాయకులను అరెస్టు చేసింది. బైండోవర్ కేసులు పెట్టింది. వాహన యాజమానులకు, బస్సులున్న స్కూలు, కాలేజీల యాజమాన్యాలకు మిలియన్ మార్చ్ కోసం కెటాయించవద్దని ఆదేశాలు జారీ చేయించింది. జిల్లా సరిహద్దులు, పట్టణ సరిహద్దుల వద్ద బ్యారికేడ్లు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టింది. అనుమానమున్న ప్రతీవ్యక్తిని నిర్బందించింది. ఆర్టీసీ బస్సులో ప్రతీ ఒక్కరిని నిశితంగా పరిశీలించినాకనే బస్సులను బయలుదేడానికి అనుమతించింది. మార్చి 9 రాత్రి నుండి హైదరాబాద్ వచ్చే అన్ని ప్యాసింజర్ రైళ్లను రైల్వేశాఖ నిలిపివేసింది. నగరం అంతా 144 సెక్షన్ విధించారు. మార్చి 10న తెలంగాణ జిల్లాల నుండి వచ్చే అన్ని ప్యాసింజరు రైళ్లను, సబర్బన్ రైళ్లను, ఎంఎంటిసి రైళ్లను రైల్వేశాఖ నిలిపివేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎన్నడూ లేని విధంగా ముళ్లకంచె ఏర్పాటుచేసారు. ట్యాంక్‌బండుకు 5 కి.మీ. పరిధిలో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించారు. మిలియన్ మార్చ్‌ని కేవలం 3 గంటలు (మాధ్యాహ్నం 1 గంట నుండి 4 గంటల) మాత్రమే జరుపుతామని, శాంతికి ఏ విధంగా భంగం వాటిల్లకుండా చూసుకుంటామని జెఎసి ప్రకటించినా ప్రభుత్వం నిర్బంధానికే పాల్పడింది. ఆ రోజు ఇంటర్ పరీక్షని వాయిదా వేసుకోమని విజ్ఞప్తి చేసింది. జెఎసి ప్రతినిధి బృందం నగర పోలీసు కమిషనర్ శ్రీ ఎ.కె.ఖాన్ గార్ని కలిసి మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వమని కోరింది. భద్రతా కారణాల రీత్యా తాను మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేనని ఆయన ప్రకటించారు. జెఎసి ప్రతినిధి బృందం హోంమంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిని కల్సి అనుమతి కోసం విజ్ఞప్తి చేశారు. వారు పరిశీలిస్తామని చెప్పారే తప్ప అనుమతి ఇప్పించలేపోయారు. తెలంగాణ హోం మంత్రుల నెత్తిమీద టోపీలు ఉంటాయి లాఠీలు మాత్రం సీమాంధ్ర ముఖ్యమంత్రుల చేతుల్లో ఉంటాయి. కాబట్టి హోంమంత్రిగారి నిస్సహాయతను తప్పుపట్టవలసిన అవసరంలేదు. ప్రభుత్వం మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేదు. ఇంటర్ పరీక్షను వాయిదా వెయ్యలేదు. అందుకే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం మూడుగంటలే జరపాలని నిర్ణయించింది.

హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్శిటి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టింది ప్రభుత్వం. వారిని క్యాంపస్ బయటికు రాకుండా యూనివర్శిటికి వెళ్లే అన్ని దారులను మూసివేసి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. విద్యార్థి నాయకుల కోసం 6వ తేదీ నుండే వేట మొదలయ్యింది. ఈ ప్రమాదాన్ని ముందే

ఊహించిన విద్యార్థి నాయకులు క్యాంపస్ నుండి తప్పించుకొని సేఫ్ షెల్టర్స్‌లో తలదాచుకున్నారు. నగరంలోని అన్ని డివిజన్లల్లో టిఆర్ఎస్, బిజెపి నాయకులను టాస్క్‌ఫోర్స్ మార్చి 10 ఉదయం 3 గంటలకి ఇండ్ల మీద దాడిచేసి పోలీసులు అరెస్టుచేసి మిలియన్‌మార్చ్ ముగిసే వరకు పోలీసు స్టేషన్లలో పెట్టుకున్నారు.

నిర్బంధాలను ఎదిరించి మిలియన్ మార్చ్‌ను విజయవంతం చెయ్యమని అన్ని ప్రజాసంఘాలు, కుల సంఘాలు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు తమ సభ్యులకు పిలుపునిచ్చాయి.

## మార్చి 10న ఏం జర్గింది?

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు నిర్బంధ వాతావరణాన్ని అధిగమించి ఉద్యమం కార్యకర్తలు మార్చి 8 నుండే తమ వ్యూహాలను రచించుకొన్నారు. మార్చి 9నే జిల్లాల నుండి పోలీసుల కండ్లు గప్పి వేలాది మంది కార్యకర్తలు హైదరాబాద్ చేరుకున్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క అనుభవం. కొందరు కొన్ని అడ్డంకులే దాటగలిగి మధ్యలో ఆగిపోతే మరికొందరు మరింత వ్యూహచతురతో పోలీసు బ్యారికేడ్లను, ముళ్లకంచెల్ని ఛేదించి ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. పోలీసులు మార్చి 10 ఉదయానికల్లా మొజంజాహి మార్కెట్, పబ్లిక్ గార్డెన్స్, అసెంబ్లీ, లక్డీకాపూల్, రవీంద్రభారతి, మాసాబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, గ్రీన్‌ల్యాండ్స్, ప్యాట్నీ, ఆర్టీసీ చౌరస్తా, అశోక్‌నగర్, ఇందిరాపార్క్, సెక్రెటేరియట్, మింట్‌కాంపౌండ్ చౌరస్తాలలో పోలీసుల బందోబస్తు పూర్తయ్యింది. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు, పరీక్షకు వెళ్లే విద్యార్థులకు తిప్పలు తప్పలేదు. మధ్యాహ్నం 12 గంటలకల్లా నగరం అంతటా ట్యాంక్‌బండ్‌కు బయలుదేరిన ప్రజల ఊరేగింపులు, పోలీసులతో ఘర్షణ అరెస్టులు వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థుల రాళ్ల ఎదురుదాడి వార్తలు వస్తూనే ఉన్నాయి. అసెంబ్లీ నుండి బయటకు వచ్చి ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు బయలుదేరిన తెరాస, తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎల్బీస్టేడియం వద్ద అరెస్టు చేసి గోషామహల్ తరలించారు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుండి ట్యాంక్‌బండ్ బయలుదేరిన జెఏసి చైర్మన్ ప్రొ॥ కోదండరాంని అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిమ్స్ వద్ద విద్యుత్‌సౌధ వద్ద ఉద్యోగులను పోలీసులు అడుగు ముందుకు వేయకుండా నిలువరించారు. జలసౌధ గేటు వద్ద ముళ్లకంచెలు పోలీసు బందోబస్తును గమనించి ఇంజనీర్స్ జెఏసి సభ్యులు 50 మంది వెనుకవైపు నుండి ట్యాంకు బండుకు బయలుదేరారు. వెంకటరమణ కాలనీ, ఖైరతాబాద్ చౌరస్తా, మింట్‌కాంపౌండ్ దాకా పోలీసుల కండ్లు కప్పి సాగిన ప్రయాణం సెక్రెటేరియట్ వద్ద అరెస్టుతో ముగిసింది. బల్దియా హెడ్‌ఆఫీసులో వందలాది మంది మున్సిపల్ ఉద్యోగులు అదను చూసి ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. ఇంత మంది ట్యాంక్‌బండ్

మీదికి చేరుకోవడానికి మార్గం వేసినవి ముఖ్యంగా రెండు బృందాలు. న్యూడెమోక్రసీ వారు లోయర్‌టాంక్‌బండులో ఒక ఫంక్షన్‌హాల్లో ఉత్తుత్తి పెండ్లి ఏర్పాటు చేశారు. పెండ్లికి హాజరయిన 500 మంది ఒక్కసారిగా సరిగ్గా ఒంటి గంటకు వీరంతా ట్యాంక్‌బండ్‌పైకి ఉరికారు. పోలీసులు ఈ గుంపును నిరోధించలేక చేతులెత్తేసినారు. వీరు బ్యారికేడ్లను విరగగొట్టి ట్యాంక్‌బండ్‌పైకి రావడానికి మార్గాన్ని సాఫ్ చేయడంతో ప్రజలు వెల్లువలా ట్యాంక్‌బండ్ మీదికి సికింద్రాబాద్ వైపునుండి చేరుకున్నారు. ఇక రెండో బృందం జమాతే ఇస్లామే హింద్ వారు లోయర్‌ట్యాంక్ బండ్‌లో ఉన్న మసీదులో 200 మంది గుమిగూడి మధ్యాహ్నం ప్రార్థనలు పూర్తి చేసుకొని ఒక ఉదుటున అంబేద్కర్ విగ్రహం వైపునుండి బ్యారికేడ్లను తెంచుకొని టాంక్‌బండ్ చేరుకున్నారు. ఇటువైపు తొవ్వ సాఫ్ కావడంతో హైదరాబాద్ నుండి వెల్లువలాగా ప్రజల రాక మొదలయ్యింది. ప్రజల సంఖ్య ముందు పోలీసుల సంఖ్య ఏమీ చెయ్యలేక పోయింది. ఒక పోలీసుల దృష్టి అంతా అసెంబ్లీని, సచివాలయాన్ని రక్షించుకోవడంపైనే ఉండింది. ట్యాంక్‌బండ్‌పైన పోలీసులు ఉన్నా ప్రేక్షకపాత్ర వహించక తప్పని పరిస్థితి.

అప్పటికే ఉద్యమకారులు తీవ్రమైన భావోద్వేగాలకు లోనయిఉన్నారు. అష్టకష్టాలు పడి, పోలీసుల లాఠా దెబ్బలుతిని, ముళ్ల కంచెలు దాటిన క్రమంరలో గాయాలపాలై ట్యాంక్‌బండ్ చేరిన వేలాది మంది ఉద్యమకారులు తమ ఆగ్రహాన్ని సీమాంధ్రుల సాంస్కృతిక ఆధిపత్యానికి చిహ్నంగా ట్యాంక్‌బండ్ మీద నిలబడిన విగ్రహాల మీదకి మళ్లింది. ఒక్కొక్క విగ్రహాన్ని కూలుస్తూ పోయారు. కూల్చివేత లోనూ విచక్షణ చూపించారు. శ్రీశ్రీ, వేమన, అల్లూరి, జాషువా లాంటి వారి విగ్రహాలను వదిలేసినారు. ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న కెమెరాను ధ్వంసం చేశారు. ఈ టివీ దహనానికి నిప్పుపెట్టారు. అంతేకాదు టాంక్‌బండ్ మీదికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కెకె, మధుయాష్కీ కార్లపై కూడా దాడికి పాల్పడి తమ ఆగ్రహాన్ని ప్రకటించారు. మూడున్నరకు టాంక్‌బండ్ మీదకి వచ్చిన కెసిఆర్‌కు ఉద్యమకారుల నిరసన ఎదురయ్యిందని పత్రికలు వెల్లడించాయి. శాంతియుతంగా, ఆటాపాటలతో సాగవలసిన మిలియన్ మార్చ్‌ని హింసాత్మకంగా మార్చింది ప్రభుత్వం. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. తీవ్రమైన భావోద్వేగంలో ఉన్న ఉద్యమకారులను నిలువరించడానికి, సమన్వయ పరచడానికి, దిశానిర్దేశం చేయడానికి అక్కడ నాయకులు ఎవరూ లేరు. అందర్నీ అరెస్టు అయి పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఉద్యమకారులు అల్టిమేటంకు బయపడి చివర్లో కోదండరాంని విడిచిపెట్టడంతో ఆయన ఆఖరు క్షణాల్లో ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. అప్పటికే జరుగవలసింది జరిగిపోయింది.

మద్యాహ్నం ఒంటిగంట నుండి 4 గంటల వరకు ట్యాంక్‌బండ్ ఉద్య మకారులతో నిండిపోయింది. ఆ మూడు గంటలు అది వారి ఆధీనంలోనే ఉన్న ది. తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ఆటాపాటలతో కదం తొక్కారు. ఉద్యమకారులతో నిండిపోయిన ట్యాంక్‌బండ్ జనసముద్రాన్ని తలపిపంచింది. 4 గంటల తర్వాత కూడా ట్యాంక్‌బండ్ చుట్టూ ఒక ఉద్రిక్త వాతావరణం ఉండిం ది. నిర్భంధాలతో ప్రజలను నిలువరించలేరని మిలియన్ మార్చ్ మరొక్కసారి పాలకులకు నొక్కి చెప్పింది. పాలకుల వ్యూహాలను ఛేదించే వ్యూహాలు, ఎత్తుగడులో, చతురత అంతకు మించి త్యాగనిరతి ప్రజలకు ఉంటాయి కాబట్టి మిలియన్ మార్చ్‌ను ప్రభుత్వం నియమించిన 20వేల మంది పోలీసులు నిలువరించ లేకపోయినారు.

మిలియన్ మార్చ్‌ను ట్యాంక్‌బండ్‌పై ప్రత్యక్షంగా చూసే అదృష్టం నాకు పోలీసులు కల్పించలేదు. అయినా అక్కడికి చేరుకున్న మా ఇంజనీరు సహచరుడు ఎస్. శ్రీనివాసులు గోషామహల్‌లో ఉన్న నాకు సంజయుడు, ధృత రాష్ట్రునికి మహభారత యుద్ధాన్ని తన దివ్యదృష్టితో చూసి చెప్పినట్లు సెల్‌ఫోన్‌ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసినాడు. వాడితో పాటు నేనూ ఆ సమయంలో మిలియన్ మార్చ్‌లో ఉన్నాననే భావన కల్గింది.

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నుండి మార్చ్‌కి బయలుదేరి పోలీసుల కండ్లు కప్పి ట్యాంక్‌బండు చేరుకున్న మండల జెఎసి చైర్మన్ రావుల శంకర్ నాతో ఫోన్‌లో చెప్పిన మాట.

“సార్ ట్యాంక్‌బండ్ మీదున్న. ఇపుడు నాకు ఎవరెస్టు శిఖరం ఎక్కినంత ఆనందంగా ఉన్నది సార్” అన్నాడు. ట్యాంక్‌బండు మీద నిలబడి జై తెలంగాణ నినాదం ఇస్తూ పులకరించిపోయిండు. తన జన్మ దన్యమైందనుకున్నాడు. ఇదే అక్కడ గుమిగూడిన వేలాది మంది హృదయాలలో వెల్లుబుకిన అనుభూతి.

తెలంగాణ మిలియన్‌మార్చ్ ఒక అద్భుతమైన చరిత్ర. భవిష్యత్ ఉద్యమాలకు ఒక పునాది. సహాయ నిరాకరణ ఉద్యమ విరమణ నింపిన నిరాశానిస్పృహల్లోంచి ఉద్యమకారులను బయటకు తీసుకొచ్చి సకల జనుల సమ్మెకు సమాయత్తం చేసిన చరిత్ర. తెలంగాణ చరిత్రను మిలియన్ మార్చ్ ముందు మిలియన్ మార్చ్ తర్వాత అన్న వర్గీకరణతో రాయాల్సి ఉంటుందేమో!

**(తెలంగాణ విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షుడు)**

# పెళ్ళి నాటకం ... మార్చ్ వాస్తవం

**- మల్లెపల్లి లక్ష్మయ్య**

తెలంగాణ సాధన కోసం సహాయ నిరాకరణ ఉద్యమం సాగుతున్నది. ప్రభుత్వంలో చలనం లేదు. చాలా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నది. ప్రభుత్వం ఇదే పద్ధతిలో వ్యవహరిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) నిర్ణయానికి వచ్చింది. అనుకున్నట్లుగానే ప్రభుత్వం దిగి రాలేదు. ప్రభుత్వోద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో సహాయనిరాకరణ వైపు వెళ్ళాల్సి వచ్చింది. దీనితో అప్పటికే ప్రకటించిన 'మిలియన్ మార్చ్'ను నిర్వహించే బాధ్యత పెరిగింది. మార్చి 10వ తేదీన మిలియన్ మార్చ్ వుంటుందని జె.ఎ.సి.ప్రకటించింది.తెలంగాణఅంతటా ఉత్కంఠ పెరిగింది. దీనితోపాటు, ప్రభుత్వం, పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. అంతకు ముందుకు నిర్వహించిన కార్యక్రమాలన్నింటికన్నా దీనిని సీరియస్‌గా తీసుకున్నారు. ట్యాంక్‌బండ్ మీద దీనిని నిర్వహించడానికి లేదని తెగేసి చెప్పారు. అయితే జె.ఎ.సి. ప్రత్యామ్నాయాలను కూడా తెలిపింది. నెక్లెస్ రోడ్, ఇందిరాపార్క్, నిజాం కాలేజీ గ్రౌండ్స్ సూచించాం. కానీ అసెంబ్లీ సమావేశాలు అవుతున్నందున నిజాం కాలేజీ గ్రౌండ్ ఇవ్వలేమని, నెక్లెస్ రోడ్, ఇందిరా పార్క్ సెక్రటేరియట్‌కు దగ్గర అవుతాయని తోసి పుచ్చారు. పై నుంచి కింది దాకా అందరి అధికారులను కలిశాం. ప్రభుత్వంలో ఉన్న మంత్రులను, చివరకు హోం మంత్రిని కూడా అనుమతి కోసం అభ్యర్థించాం. కానీ ఫలితం శూన్యం. మార్చి పదవ తేది దగ్గర పడుతున్న కొద్దీ ప్రభుత్వం మరింతగా పట్టు బిగించడానికి ప్రయత్నించింది. పోలీసుల నిర్బంధాన్ని తీవ్రం చేసింది. జిల్లాల్లో వున్న జేఏసీ నాయకులు వందల సంఖ్యలో అరెస్టు చేసింది. రాజధానికి వచ్చే అన్ని రహదారులను మూసివేసింది. కొన్ని పదుల సంఖ్యలో చెక్‌పోస్టులు పెట్టి యుద్ధ భూమిని తలపింపజేసింది. మార్చి 9వ తేది ఉదయానికల్లా పోలీసులు దాదాపు కొన్ని వేల మందిని అరెస్టు చేశారు. తెలంగాణలోని అన్ని పోలీసు స్టేషన్లనిండా తెలంగాణ వాదులే

నిండిపోయారు. పోలీసులు ముఖ్యంగా అప్పటి డి.జి.పి. అరవిందరావు తెలంగాణవాదులపై విజయాన్ని ప్రకటించాలనుకున్నాము. ఒకే రోజు సమయముంది. అయితే అరెస్టు గాకుండా బయట వున్న జేఏసీ నాయకుల్లో మాత్రం ఆత్మవిశ్వాసం సడల లేదు. ఎట్లాగైనా ట్యాంక్ బండ్‌ను ముద్దాడాలనే పట్టుదలతో ఆలోచిస్తున్నారు. పోలీసులకు కనపడకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ట్యాంక్ బండ్ మీదికి వెళ్ళాలనే లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఒక అయిదు వందల మంది వెయ్యి మంది వరకు సమీకరించి అకస్మాత్తుగా ట్యాంక్ బండ్ మీదకే దూసుకెళ్ళాలనే ఆలోచన వచ్చింది. అయితే ఇంత మంది ట్యాంక్ బండ్ చుట్టు ప్రక్కల ఎక్కడైనా గుమిగూడినా పోలీసులు వదిలే ప్రసక్తే లేదు. అప్పటికే వేలాది మంది పోలీసులు నగరం నిండా, మరీ ప్రత్యేకించి ట్యాంక్ బండ్, నిజాం కాలేజి, ఇందిరాపార్క్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, నెక్లెస్ రోడ్, హిమాయత్‌నగర్, లక్డికాపూల్ ప్రాంతాలను పూర్తిగా కైవసం చేసుకున్నారు. కావున, ఏదైనా ఒక కార్యక్రమం పేరుతో సమీకరించాలనుకున్నాం. దాని పెళ్ళి అయితేనే సమంజసంగా, అనుమానం రాకుండా వుంటుందని భావించాం. అయితే ట్యాంక్ బండ్ చుట్టు ప్రక్కల వున్న ఫంక్షన్ హాళ్ళన్ని పోలీసుల చేతుల్లో వున్నాయి. అది కూడా చేయిజారినట్టనిపించింది. ఈ ప్రయత్నాలన్నీ ఫోన్‌ల్లో సాధ్యం కాదు. ఎందుకంటే, మా మొబైల్స్ అన్నీ పోలీసుల టాపింగ్‌లో వున్నాయి. అయితే ట్యాంక్ బండ్ సికింద్రాబాద్ వైపు ఆర్యసమాజ్ మందిర్ వున్నది. దానిని బుక్ చేయాలి. అయితే ఆర్యసమాజ్ నాయకుడైన విఠల్‌రావు ఆర్యను సంప్రదించి దానిని ఎట్లాగో అట్లా బుక్ చేశాం.

అయితే ఈ కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ తన భుజాలకెత్తుకున్నది. జిల్లాల నుంచి తమ కార్యకర్తలను పోలీసుల కంట పడకుండా నగరానికి తీసుకవచ్చే పనిని కూడా ఒప్పుకున్నది. ఇంకా ఇతరులెవ్వరికి ఇది తెలియకుండా వుండాలనే నిర్ణయానికి రావడం జరిగింది. మీడియాకు కూడా ఎక్కువ మందికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నాము. పత్రికా ఫోటో గ్రాఫర్లు ఒకరిద్దరు, హెచ్.ఎం.టి.వి. నుంచి సీనియర్ రిపోర్టర్ అరుణను పిలవాలని నిర్ణయించాము. అయితే వీళ్లందరికి కూడా తెల్లవారే తెలుపాలని, వాళ్ళు ఇతరులెవ్వరికి తెలియజేయవద్దని కోరాము. అయితే మళ్ళీ ఒక సమస్య వచ్చింది. రాత్రి వచ్చిన వాళ్ళకు వసతి కోసం కూడా చాలా సమస్యలు ఎదురైనాయి. అయితే కొందరి మిత్రుల ద్వారా దానిని అధిగమించాము. ఈ బాధ్యత అంతా ఒక న్యూడెమోక్రసీ తీసుకోవడం వల్ల వాళ్ళకు వున్న నిర్మాణపరమైన క్రమశిక్షణ వల్ల తెల్లవారి తొమ్మిది గంటల దాకా ఎక్కడా పొక్కలేదు. అయితే ఆ

స్థలానికి చేరుకోవడానికి నేను, కొందరు మిత్రులం చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. రోజు వెళ్ళే దారిలో కాకుండా చాలా దారులు మార్చి చేరుకున్నాం. ఈ ఆర్యసమాజ్ మందిరం ట్యాంకు బండ్‌కు పావు కిలోమీటరు దూరం మాత్రమే. ఏ క్షణంలోనైనా పోలీసులకు తెలిసి అరెస్టు చేస్తారేమో అనే ఆందోళన కలుగుతునే వుంది.

అయితే అటువంటిదేమి జరగలేదు. ఆర్యసమాజ్ మందిర్‌లో చాలా సాంప్రదాయంగా పెళ్ళి కార్యక్రమం మొదలైంది. అయితే పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు కొత్తగా భార్యాభర్తలైన వారే. అయితే ఒకటింటి వరకు వేచి వుండాలి. అంటే మధాహ్నం ఒకటి నుంచి నాలుగు గంటల వరకు మిలియన్ మార్చ్ వుంటుందని ప్రకటించారు. అప్పటివరకు ఈ తంతు నడుస్తుండాలి. ఒక గంట తర్వాత జేఏసీ ఛైర్మన్ కోదండరాం అరెస్టయినట్టు తెలిసింది. దీనితో ఇంకా ఆందోళన పెరిగింది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, వేరే వేరే వ్యక్తుల ద్వారా కొంత మంది అక్కడికి వచ్చారు. ఇది మరింత సందేహాన్ని పెంచింది.

ఇందులో ఇంకొక ముఖ్యమైన అంశం. నిజామాబాద్ నుంచి ఒక రోగిని అంబులెన్స్‌లో తీసుకొస్తున్నట్లు వచ్చిన డాక్టర్ల బృందం కూడా ఇక్కడికి చేరుకున్నది. పెళ్ళి నడుస్తున్నది. కొత్త కొత్త ముఖాలు కూడా కనపడుతున్నాయి. ఏ క్షణంలోనైనా అరెస్టులు జరగొచ్చుననే అనుమానం పెరుగుతున్నది. అయితే పెళ్ళి మొదలు కాగానే ఇక్కడి నుంచి బయటపడి ట్యాంక్ బండ్ ఎక్కాలంటే నేరుగా మెయిన్ రోడ్‌లో వెళ్ళి పోలీసులను తోసుకొని వెళ్ళాల్సి వుంటుందా? లేక ఇంకేమైనా దారులున్నాయా అని తెలుసుకోవడానికి కార్యకర్తల్ని పంపించాం. మెయిన్ రోడ్ గాకుండా, ట్యాంక్ బండ్ చేరుకోవడానికి మరొక దారి కూడా వుందని వాళ్ళు సమాచారం తీసుకొచ్చారు. దానితో ఇక్కడి నుంచి రెండు బృందాలుగా వెళ్ళాలనే నిర్ణయానికి వచ్చాం. సమయం దగ్గర పడుతున్న కొద్దీ పోలీసుల దాడి భయం పెరిగిపోతున్నది. జరుగుతున్నది పెళ్ళయినందువల్ల భోజనాలు తయారవుతున్నాయి. అయితే మాలో కొంత మంది భోజనాలు చేసి పోదామనే ఆలోచన వచ్చింది. దీనికి కారణం అంతకు ముందు రోజు నుండి తిండి లేక పోవటమే. అయితే వెంటనే దానిని విరమించుకొని పన్నెండు గంటల నలభై నిమిషాలకు బయలు దేరాం. అయితే అందరూ ఒకే ద్వారం నుంచి కిందికి దిగాలి. మెయిన్ రోడ్ మీద వెళ్ళే బృందంలో ఎక్కువ మంది నాయకులు, మరొక చిన్న దారిగుండా నేరుగా ట్యాంక్ బండ్ ఎక్కే మార్గంలో పీడీఎస్‌యూ నాయకులు నాతో మరికొంత మందిమి బయలుదేరాం. అయితే రెండు బృందాలుగా వెళ్ళాలని తీసుకున్న నిర్ణయం మంచిదైంది. మెయిన్‌రోడ్ మీద వున్న పోలీసుల బారికేడ్ మీదికి వందల మంది

వెళ్ళేసరికి ఒక్కసారి పోలీసులకు పాలుపోలేదు. అయితే వెంటనే తేరుకొని పోలీసులు కొంత మంది అరెస్టు చేయగలిగారు. కొంత మంది పోలీసుల వలయం నుంచి తప్పించుకొని రాగలిగారు. అయితే నేను, నాతోపాటు వచ్చిన పిడియస్‌యు నాయకులు నేరుగా ట్యాంక్ బండ్ మీదికి ఎక్కాం. అయితే కొంత మార్గం పోగానే ఏడెనిమిది పోలీసు వ్యాన్లు మాకు అడ్డంగా పెట్టారు. అయితే పోలీసులను తోసుకుంటూ, అవసరమైతే పరుగెత్తుతూ ట్యాంక్‌బండ్ మధ్యకు వచ్చాం. అదే సమయంలో సెక్రటేరియట్ వున్న పోలీసులు మావైపు రావడంతో అటునుంచి ట్యాంక్ బండ్ ఎక్కాలనుకున్న తెలంగాణవాదులు సఫలీకృతులయ్యారు. వాళ్ళ కూడా ట్యాంక్‌బండ్ ఎక్కారు. అయితే ఈ ప్రయత్నాలు తెలియని కొంత మంది నిచ్చెన్ల ద్వారా ట్యాంక్‌బండ్ మధ్యలో నుంచి మీదికి ఎక్కారు.

ఒక అరగంటలో ట్యాంక్‌బండ్ తెలంగాణవాదుల చేతుల్లోకి వచ్చింది. ఎటువంటి పరిస్థితుల్లో కూడా ట్యాంక్‌బండ్ ఎక్కనివ్వం, మిలియన్ మార్చ్ జరగనివ్వం అని ప్రకటనలు చేసిన పోలీసులు, వాళ్ళను నడుపుతున్న ప్రభుత్వం మీద తెలంగాణ ప్రజలు విజయం సాధించారు. సికింద్రాబాద్ వైపు నుంచి పోలీసుల బారికేడ్లను తోసేసి, మొత్తంగా ట్యాంక్‌బండ్‌ను చేరుకున్న ఉద్యమకారులు నూటికి తొంభైమంది న్యూడెమోక్రసీ కార్యకర్తలు, ఆ తర్వాత కొంత మంది డాక్టర్లు, న్యాయవాదులు, ఇతర కార్యకర్తలు వున్నారు. పోలీసులు అడుగడుగున పెట్టిన ఆంక్షలను, ప్రదర్శించిన అణచివేతను ఎదుర్కొని గమ్యాన్ని చేరిన ప్రతి ఒక్కరికి ఆ రోజు తెలంగాణ ప్రజలు నీరాజనాలు పట్టారు. మాలో కొంత మందిమి ఆనాటి భావావేశంలో ట్యాంక్‌బండ్‌ను ముద్దాడాం.

తెలంగాణ జేఏసీ నిర్ణయించిన విధంగా సరిగ్గా సాయంత్రం 4 గంటలకు ట్యాంక్‌బండ్ మీద వున్న వాళ్ళందరితో ప్రతిజ్ఞ చేయించాను. మిలియన్ మార్చ్ విజయవంతం కావడం అనేది తెలంగాణ ఉద్యమానికి ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. అటువంటి అరుదైన ఉద్యమ కార్యాచరణలో నేనూ ఒకడైనందుకు గర్వ కారణంగా వుంది.

**(తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు)**

# విగ్రహ విధ్వంసం... గతం

**- అల్లం నారాయణ**

ముట్నూరి కృష్ణారావు
మహా జర్నలిస్టు సరే...
మరి షోయబుల్లాఖాన్ మాటేది?
భావ ప్రకటనా స్వేచ్ఛకోసం కాని కాలంలో
కాని భూప్రపంచం మీద, రాచరికపు
కత్తివేట్లకు బలైన షోయబుల్లాఖాన్‌ను
ఎందుకు మరిచిపోతారు? ఎలా సాధ్యం?
అల్లూరి సీతారామరాజు
అసమాన వీరయోధుడు సరే...
మరి నైజాం సేనలను ఎదిరించి
గోండుల మీద నైజాం పెత్తనాన్ని ఎదిరించిన
మొనగాడు, గోండుల దేవుడు
కొమురంభీమును ఎందుకని విస్మరిస్తారు?
ఎందుకలా?
బ్రిటన్ ప్రభువులను ఎదిరించిన
రాంజీగోండు అసమాన సాహసం
ఆచూకీ ఏదీ? అడుగుజాడ ...
ఎలా మరచిపోతాం? ఎందుకు?
కోఠి మెడికల్ కాలేజీ పక్కన
తుర్రెబాజ్‌ఖాన్ జ్ఞాపక చిహ్నామా
పాడువడ్డదెందుకు
సీఆర్‌రెడ్డి గొప్ప విద్యావేత్తసరే...
కానీ
దేవులపల్లి రామానుజరావు... కాదా?

ఆయన విస్మృతిలో ఉన్నాడేమిటి?
కవిత్రయం కవితాశక్తులకు
జేజేలు పలుకుదాం... సరే...
మనం మల్లినాథ సూరన
మన పాల్కురికి సోమన ఎక్కడ?
గురజాడ తెలుగువారి
అడుగుజాడ సరే?
వట్టికోట, దాశరథిల ఆచూకీ ఎక్కడ?
వైతాళికులయిన వారొకరే ఎందుకు?
ఏ అవకాశాలూ లేని ప్రపంచం నుంచి
ఎదిగివచ్చిన వారూ విస్మృతిలోకి
ఎలా జారారు? ఎవరు సృష్టించారీ జారుడుబండ...
కందుకూరి సంఘ సంస్కరణలను వేసిన దారిసరే
మాడపాటి హన్మంతరావు ముచ్చటే లేదేమి?
గుర్రం జాషువాను గౌరవిద్దాం సరే...
భాగ్యరెడ్డి వర్మ భాగ్యరేఖ లెక్కడ?

మార్చి 10, మిలియన్ మార్చ్ కదం తొక్కుతున్నది. ఎండలు ముదరలేదు. ట్యాంక్‌బండ్ ఆకాశం మీద అప్పటికే పొగలు చిమ్ముకున్నవి. నినాదాలు, హోరుగాలి చిరపరిచితమైన ఆ పాత రెయిలింగ్స్ పైన మబ్బుల్లోకి వ్యాపిస్తున్నది. ఉత్తేజం ఒక ఉద్విగ్నత. ఉద్రేకం, చెమట కమ్మిట, శరీరాలు, గాల్లోలేస్తున్న పిడికిళ్లు, ఒకే ఒక్క నినాదం జై తెలంగాణ, సాహసం నిలువెల్లా వ్యాపించిన మనుషులు. అవును వాళ్ళు దేన్నో పడదోసుకొని, తోసుకుంరటూ తొక్కుకుంటూ వచ్చారు. పెద్ద వినాయకుని అడ్డా ఖైరతాబాద్ వచ్చేసరికే అక్కడొక బారికేడ్. ఇక కదల కూడదు, సరే! ఎవరో సలహా ఇచ్చారు. టూ వీలర్ మీద ఐమాక్స్ దగ్గర సందులు గొందుల్లో పడి తేలొచ్చు. అక్కడి నుంచి ట్యాంక్‌బండ్‌కు... సులభమా! ఖైరతాబాద్‌లోనే వందలాది మంది గుంపు. బ్యారికేడ్లు ఛేదించలేక, కదలక, మెదలక, అసహనంగా అటూ ఇటూ... చేస్తున్నది. కానీ, మాకే దిక్కుండేట్లు లేదు. మేమంతా పది మందిమి. వృత్తి జర్నలిస్టులం. ట్యాంక్‌బండ్ మీద మిలియన్ మార్చ్‌ను ప్రత్యక్షంగా చూసి, అనుభవించి పలవరిద్దామని... మా కోరిక తీరేట్టులేదు. ఐమాక్స్ మూలకు చేరేసరికి తలప్రాణం తోకకొచ్చింది. అక్కడ మళ్ళీ బారికేడ్. ఈసారి సీరియస్‌గా ఉంది పరిస్థితి. ఒక పోలీస్ కమీషనర్ రాక. మా కార్డులు ముందర ప్రదర్శిస్తూ మీడియా వాళ్ళం వెళ్ళాల్సిందే అంటాం. పోలీస్ హజం. నా

మీద చేయి పడింది. గొడవ... మా సారు మీద చెయ్యేస్తావా? ఎంత మంది జర్నలిస్టులు మూగారో! పోలీసులను ధిక్కరించారు. వెనక పెద్ద గుంపు. ఈ గొడవలో బారికేడ్లు దాటొచ్చని ఆశ. వురుకులు..పరుగులు..గొడవ..అరుపులు కేకలు ఉక్రోశం పెరుగుతున్నది. ఆక్రోశం పెరుగుతున్నది. ఎవరినన్నా కొట్టాని కూడా ఉన్నది. మర్యాదస్తులం కదా! పైగా జర్నలిస్టులం కదా! ఓపిక పట్టాలి. ఎందుకు వెళ్ళనివ్వరు. వెళ్లనివ్వం అంతే. షిండే యూనోమీ పర్సనల్లీ.. మధ్య మధ్య వాదనలు. మిమ్మల్ని పంపుతాం. ఆపండి. మళ్లీ అదే పద్ధతి తోసకుంటూ తొక్కుకుంటూ ట్యాంక్‌బండ్ మీద ఊరేగిన జనమందరిదీ అదే. బారికేడ్లు విరగొట్టాలనే సాహసం. మా ట్యాంక్‌బండ్ మీదకు మమ్మల్ని... మా హైదరాబాద్‌లో మమ్మల్ని కనీసం ఎందుకు కదలనియ్యరు. మిలియన్ మార్చ్ ప్రకటన నుంచీ అదే తంతు. తెలంగాణ చక్రబంధంలో ఉంది. హైదరాబాద్ పోలీసుల మార్చ్‌లో ఉంది. పదఘట్టనల్లో ఉంది. ఊరి నుంచీ రానివ్వరు, ఊళ్లో నుంచీ కదలనివ్వరు, ఇదేమి నిర్బంధం. ఇదెవరి ప్రభుత్వం. ఆగ్రహం కట్టలు తెంచుకొంటున్నది కోపం.. ఎన్టీఆర్ పార్కు నిశ్చలంగా ఉంది. మూతబడి ఉంది. అసలీ ఎన్టీఆర్ ఎవరు? ఈ ట్యాంక్‌బండ్ మీద నెక్లెస్‌రోడ్డు ఏమిటీ? అటు ఎన్టీఆర్ పార్క్. ఇటు ఐమాక్స్.. చిరాన్ పార్క్ దగ్గర మూడు వందలా డెబ్బయి మంది ప్రాణాలను బలిగొన్న కాసు బ్రహ్మానందరెడ్డి ఎవరి చిహ్నాం... కాస్త అటుగా వెళ్తే ఎల్వి ప్రసాద్ మార్గ్... ఏమిటీ చిహ్నాలు.. ఎవరివీ చిహ్నాలు..? ఏ ప్రతీకలివి...? కోల్పోయిన చిహ్నాలేమిటీ? కోల్పోయిన ప్రతీకలేమిటీ? హైదరాబాద్ ఎక్కడున్నది.. హైదరాబాద్ రాజధాని నగరం ఏమైంది. ఇదెవరి అడ్డా..? ఎవరి సంస్కృతి స్థాపన జరిగిందిక్కడ. ప్రశ్నలు కోకొల్లలు. పట్టరాని కోపం. పక్కన కాలిపోతున్న వ్యాన్. పొగలు ఆకాశం అంటుతున్న దృశ్యం. కదలబారుతున్న జనం. ట్యాంక్‌బండ్ నిండింది. ఈ ట్యాంక్‌బండ్ కట్టిచ్చినదెవరు?

హుసేన్‌సాగర్ నిండా జలాల్లో చేపలు నిండినట్టు, ఈ నగరం నిండా జనం నిండుకోవాలని కోరుకున్న మీర్ ఉస్మాన్ అలీఖాన్ ట్యాంక్‌బండ్ నిండా పక్కన, వెనకన, ముందున ఎటు చూస్తే అటు ఏ ఎన్టీఆరో నిండుతాడని ఊహించి ఉంటారా? విగ్రహాలు కూలుతున్నప్పుడు.. శ్రీశ్రీని ముట్టుకోవద్దు, అల్లూరిది వద్దు... శాలివాహనుడు మనోడే.. ఆగండాగండి.. ఇట్లా వద్దు.. అడ్డు పడాలని ఉన్నా చూస్తూ అనేకులు, ఉదాశీనతా కాదు. లోపల కోపమేదో రగులుతున్నది. ఇంత నిర్బంధంలో ఇంత అణచివేతలో, ఒక సాహసం ట్యాంక్‌బండెక్కింది. ఆ సాహసం లోపల సుడులు తిరుగుతున్నది. బహుశా అదే అందరిలోపల. జర్నలిస్టులమందరం ఒకే చోట గుమికూడి చూస్తూ ఉన్నాం.. ఆ విగ్రహాలు వద్దు అని చెబుతూనే

ఉన్నాం. ఎందుకో వద్దనిపిస్తున్నదా? నిజమా? కానీ.. లోపలొక సాహసం కెరలుతున్నది. ద్వైదీభావమేమీ లేదు. అవి విగ్రహాలా? మనుషులేనా? బహుశా ఆరు వందల మంది పిల్లలు కళ్లలో కదులుతున్నారా? ఆరు వందల మంది పిల్లల తల్లుల గర్భశోకాలు...

యాదయ్య! జీవితమంతా నాకొక పీడకల. వాడు నా మనుసు వీడడు. వాడికొక విగ్రహం. మాటల నాల్కల కొసలు చాపుతూ.. ఎగురుకుంటూ.. ఎగురుకుంటూ నిప్పులు చిమ్ముకుంటూ దుంకులాడిన యవ్వన సౌగంధపు త్యాగ పరిమళం. నా మనసున అది ఒక పొంచి ఉన్న మిసైల్. పేలడానికి సిద్ధంగా ఉన్న గ్రెనేడ్. నా మనసును వాడి విగ్రహం ఆక్రమించుకుని ఉన్నందువల్ల కావచ్చు. విగ్రహాల మీద ఎగురుతున్న జెండాలు రెండు పడిపోయినవి. మరో రెండు పడిపోనున్నవి!

కూల్చుతున్న వాళ్లకు ముఖాల్లేవు. అదొకటే ముఖం. ధిక్కారం మొఖం. తిరుగుబాటు, సాహసం, ఉక్రోశం, ఆక్రోశం కోపంలోనూ వివశతలోనూ... దగాపడ్డ ముఖం. తండ్లాడిన ముఖం. అది అచ్చ తెలంగాణ వాడి ముఖం. బహుముఖాఉ ఒక ముఖ్యమైన, అరుదైన జీవితంలో ఎన్నడూ చూడని సన్నివేశం. ఇంతకీ నాకేమీ కన్నీళ్లు రావడం లేదు. ఇంతకీ ఏదీ నాకు తప్పుగానో, విధ్వంసం గానే తోచడమూ లేదు. ప్రశ్నలు... ప్రశ్నలు... ఎవరిదీ ట్యాంక్‌బండ్, ఎందుకీ ఆగ్రహం... బహుశా నాకు అగ్రహకారణాలు తెలుస్తున్నాయి. అవగాహన అవుతున్నది. విధ్వంసం మూలాలు అవగతమవుతున్నది.

వర్తమానం. తెల్లవారింది. సంస్కృతి విధ్వంసం. చారిత్రక విషాదం. మండుతున్నది. ట్యాంక్‌బండ్‌ను చూశాను నేను. మిలియన్ మార్చ్‌ను చూశాను. నేను విధ్వంసమా? అది సంస్కృతీ విధ్వంసమేనా? అయితే ఎవరి సంస్కృతీ విధ్వంసం ఏప్పుడు ప్రారంభమైంది. 1956లో విలీనంతోనే ప్రారంభమయింది. తెలంగాణ సంస్కృతి ఎక్కడ? అది అయిదున్నర దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా సాగుతున్నవి. షోయబుల్లాఖాన్, అలీ యావర్‌జంగ్, తుర్రె బాజ్‌ఖాన్ ఈ ట్యాంక్‌బండ్ కట్టిచ్చినవాడు. ఈ హైదరాబాద్ పొందిచ్చినవాడు ఎక్కడ? సీరియస్ ప్రశ్నలు. తెలంగాణకు ఒక విశిష్ట సంస్కృతి ఉండింది. అది ధ్వంసమయింది. అదీ నాకు చారిత్రక విషాదం. రెండు అసమ సమాజాల కలయికలో ఏర్పడిన ఘర్షణల సారం. ఒకటి ఆధిపత్య సంస్కృతి మరో సంస్కృతిని మింగిన ఫలితంగా కోల్పోయిన వాడి ఆత్మఘోషల విధ్వంసంగా నాకు తోస్తున్నది. రెండు అసమ వ్యవస్థలు, రెండు భిన్న చారిత్రక అనుభవాలు కలిసిన ఆంధ్రప్రదేశ్ మానసికంగా విడిపోయింది. కానీ వలసాధిపత్యం తెలంగాణ సంస్కృతిని విధ్వంసం చేస్తూ,

ఈ విధ్వంసం పట్ల మౌనం వహిస్తూ... ఇల్లెక్కి కూస్తున్న పత్రికల లక్ష్యమేంటి? తమది మాత్రమే బాధ్యత మాదేనని బ్రిటన్ పాలన అవశేషాలను, అలవాట్లను, ధోరణులను ఆకలింపు చేసుకున్న పెత్తందారీ పెద్దన్నయ్య, ఇరుగు పొరుగు సీమాంధ్ర ఏలిక కాదా? ఎన్టీ రామారావు విగ్రహాలను కట్టించిందెన్నడు? ఆ విగ్రహాల్లో తెలుగు వెలుగులు కేవలం ఒక ప్రాంతానివే ఎందుకున్నాయి? మచ్చుకు కొందరు తప్ప అక్కడి సంస్కృతి, అభివృద్ధి నమూనా, జీవన విధానం, ఆర్థిక విధానం, వేరయినప్పుడు వచ్చిన వైతాళికులు మాత్రమే తెలంగాణకు వైతాళికులా? ఈ ప్రశ్నలకు సమాధానమేమి?

సాధారణంగా వలస వెళ్ళేవాళ్లు ఎక్కడికి వలస వెళ్తే అక్కడి సంస్కృతిని స్వీకరిస్తారు. కానీ బతుకుదెరువు కోసం, పెట్టుబడుల విస్తరణ కోసం విస్తరించినవాళ్లు అక్కడి సంస్కృతిని కబళించారంటే వారిది సామ్రాజ్యవాద విస్తరణకాంక్ష కాక మరేమిటి? తెలంగాణ అంటే ఒక విశిష్ట సంస్కృతి, సాంస్కృతిక దృకోణం, సుదీర్ఘ చరిత్ర. ఈ చరిత్ర అనువాళ్లెక్కడ? అవును ఇక్కడ రాచరిక పాలనలో కూడా దక్కన్ పీఠభూమి ఒంటరి సమాజం. ఇతర సమాజాల సంస్కృతి సంలీనం చేసుకున్నది. దేశానికి ఆదర్శప్రాయమైన సమభావనా సంస్కృతిలో జీవిస్తున్నది. వ్యవహారాల విజయాల కన్నా మానవ సంబంధాలే మిన్న అన్నది దేశంలోని పలు సమాజాలకు భిన్నంగా దేశానికి తలమానికమైన కాస్మోపాలిటన్ భావనల్లో మెప్పు పొందింది. జీవన సంస్కృతి, తీరిన సమయాలు, మర్యాదలు, మప్పితాలు, దర్బార్ సంస్కృతి, పారిశ్రామిక, వలస సమాజాలకు భిన్నంగా ఎదిగింది. హైదరాబాద్ అలాంటి హైదరాబాద్‌ను చాపచుట్టింది ఎవరు?

అవును నిజాంసాగర్ కట్టినప్పుడు 1920లో మొదట నిజాం వాళ్లను ఆహ్వానించారు. వలసలు... వాళ్లు ఇక్కడి వ్యవసాయాన్ని తూలనాడారు. మర్యాదగా, మప్పితంగా, మార్మికంగా ఇక్కడి పద్ధతులను మార్చారు. ఏమార్చారు. వెక్కిరించారు. లచ్చుమమ్మలను లక్ష్మమ్మలను చేశారు. అది ప్రారంభం. భాషను వెక్కిరించారు. బతుకుదెరువు కోసం వచ్చి బరువయ్యారు. 1940లో ఈ గడ్డమీదా తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది. ఆ చాలు పట్టుకుని వచ్చారు. నల్ల నల్ల రేగళ్ల పొంట వచ్చారు. నీటి వాలుతో వచ్చారు. అప్పటికే ఆధునిక వ్యవసాయం, రైలు, రోడ్డు మార్గం, ఇంగ్లీషు చదువు, కాలువలు కాళ్లతో మలుపుకున్న షోకు పిల్లకి పెట్టుబడులున్నయి. అది క్రమక్రమంగా ఇక్కడొక పెద్దన్న అయింది. 1969లో 370 మంది ప్రాణాలు త్యాగం చేసిన ఉద్యమం అప్పటికే వారికి విచ్ఛిన్నకుల వుద్యమంగా కనపడింది. ఆ తర్వాత వైఫల్యం. ఇక ఇక్కడ పాతుకపోయింది. కాసు బ్రహ్మానందరెడ్డిని కర్కోటకుడిగా భావించే ఊరి నడిబొడ్డున ఆక్రమించుకున్నది

విగ్రహం. తెలుగుదేశం అమూర్త భావనల మీద తెలుగు జాతి ఆత్మగౌరవం మీద నిలబడింది. ఇక ప్రారంభం. ఆ పద ఘట్టనల కింద హైదరాబాద్ లేదు. అది మిగలలేదు. ట్యాంక్‌బండ్ మీద ముప్పది విగ్రహాల కింద నలిగి నీలిగిన అలీయావర్‌జంగ్ ఆత్మ వనస్థలిపురం నుంచి కూకట్‌పల్లిదాకా ఏకుమేకయ్యింది. అది కంట్లో ముల్లై దిలగబడింది.

కాలం కడుపులో ఉంది. పద్నాలుగేళ్ల క్రితం, మలి తెలంగాణ పోరాటాన్ని కన్నది. ప్రశ్నల కొడవళ్లు, సంస్కృతి ఏది? ఎవరు మింగారు? ఎవరు కారణం. తెలుగు విభులు, వల్లభులు, వైతాళికులు సరే, మా వాళ్లేరి? ఎక్కడ మా జాడ. చరిత్ర వక్రీకరణల క్రింద ఎక్కడ కోల్పోయాం? ఏమి కోల్పోయాం? తప్పిపోయిన వాడి ఆత్మఘోష బహుశా తొమ్మిది దశాబ్దాల అగ్రహం బహుశా కోల్పోయిన వాడి వుక్రోశం.

నాకెందుకో కన్నీళ్లు రావడం లేదు. కృతకంగా తెచ్చిపెట్టుకున్నా రావడం లేదు. అట్లని బాధా లేదు. జరగాల్సిందేదో? జరుగుతున్నట్లు సంస్కృతిని విధ్వంసం చేసిన వారు సంస్క ృతి గురించి మాట్లాడున్నట్టు? చారిత్రక విషాదాలకు మూలపురుషులు గిల్లి ఏడుస్తున్నట్లు దొంగ ఏడ్పులు. జరగాల్సిందేదో జరుగుతున్నది.

జరగాల్సిందేదో జరిగింది. లెనిన్ విగ్రహం కూలుతున్నప్పుడు చూశాను. బాబ్రీ మసీదు కూలుతున్నప్పుడు చూశాను. కానీ కానీ... ఏడ్చాను కావచ్చు. ఇప్పుడు నాకు ఏడుపేలేదు. బహుశా నాలో ప్రతిష్టించి ఉన్న శ్రీకాంతాచారి విగ్రహం వల్ల కావచ్చు, నాలో ప్రతిష్టించి వున్న యాదయ్య మంటలు మండుతున్న విగ్రహం వల్ల కావచ్చు. ఏడవలేను. మర్యాదలేని వాణ్ణే కావచ్చు. ఫర్వాలేదు. తాలిబన్‌ను కూడా అయినా ఫర్వాలేదు. అవును శ్రీశ్రీతో ఊరేగాను. నక్సల్బరీని మోశాను. కమ్యూనిజాన్ని ఊరేగాను. కానీ... దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టు మీ ఈ భూమి నాది, ఇది నాకు చెందిన భూమి. తెలంగాణ ఇదొక మంత్ర జపం. దగా పడింది. తల్లడిల్లింది. తెగబడింది. ఒక ధిక్కారభూమి విడిపోవడం ఒక చారిత్రక అవసరం. కలిసి వుండటం ఇప్పుడొక అసహజ పరిణామం.

ఒక మేసేజ్: ఇప్పుడు విగ్రహాలు కూలాయి. ఇది మొదటి ప్రమాద హెచ్చరిక అవును ఇప్పుడు విగ్రహాలు కూలాయి. మనుషులు కూలక ముందు... విడిపోదాం. శ్రీశ్రీ మీద ప్రేమను కాపాడుకుందాం. అల్లూరిని అలుముకుందాం. మా కొమురం భీమును, షోయబుల్లాఖాన్‌ను, చాకలి ఐలమ్మను, బందగీని, దొడ్డికొమురయ్యను, మా భాగ్యరెడ్డి వర్మను, మా మాడపాటిని, మా పాల్కురికిని ప్రేమిద్దాం. ఈ నేలన వికసించిన వజ్రాలను విగ్రహాలుగా మలుద్దాం. కూల్చిన చోట కొత్త మొలకలై మొలుద్దాం. సమభావన సంస్కృతి అంటే ఆధిపత్యం కాదు. లొంగుబాటు

కాదు. బలహీనత కాదు. అదొక ఆత్మగౌరవ పతాక. నేను తెలంగాణ వాణ్ని. ఇంత జరిగినాక నాది తెలంగాణ. నా సంస్కృతి మూలాల ప్రతిష్ట కోసం అవసరమైతే విధ్వంసాన్ని చేతులు సాచి ఆహ్వానిస్తాను. విధ్వంసం జరిపిన వాళ్లకు, విషాదాలు సృష్టించిన వాళ్లకు, విడగొట్టాన వాళ్లకు, మనసులను కలపలేని వాళ్లకు, ఆధిపత్య అహంకారులకు అర్హతలేదు. మా కన్నీళ్లింకిపొయ్యాయి. ఇక మాటలు కరువయ్యాయి. ఇక మాటలు కరువయ్యాయి. నిగ్రహం విధ్వంసం గతం. భవిష్యత్ మాదే. తెలంగాణ ఒక ధిక్కార భూమి. అంతిమ విజయం తెలంగాణదే.

**(తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కన్వీనర్)**

# పురోగమిస్తున్న తెలంగాణ ఉద్యమం

**– పి. సూర్యం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకై గత నాలుగు దశాబ్దాలకి పైగా తెలంగాణ ప్రజలు పోరాడుతున్నారు. నేటికీ లక్ష్యాన్ని సాధించుకోలేదు. ఈ లక్ష్య సాధనకి నేడు తెలంగాణ ఉద్యమం కొన్ని సవాళ్ళని ఎదుర్కొంటున్నది. వాటిని ఎదుర్కోనకుండా, తొలగించుకోకుండా విజయం సాధించడం అసాధ్యం. తెలంగాణలో రాష్ట్ర ఏర్పాటుకి ప్రజల ఆకాంక్ష అమోఘమయింది. అత్యధిక మెజార్టీ ప్రజలు తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కై పోరాడుతున్నారు. ఇది గతంతో పోల్చుకొన్నప్పుడు రెట్టింపయినది. దీని ఫలితంగా అధికారంలోని కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంతో సహా రాజకీయ పార్టీలు తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కి పూనుకొన్నాయి. సీపీయం పార్టీ పూర్వ వైఖరినే కలిగివున్నది. కానీ ఇది తన గత సంపూర్ణ వైఖరి కాదు. ప్రజలవత్తిడితో ఎత్తుగడగా కొన్ని మార్పులు చేసుకొన్నది. రాజకీయ పార్టీలు తెలంగాణ కోసం సానుకూల నిర్ణయం తీసుకొన్నాక చట్టసభల్లో తెలంగాణ బిల్లు ఎందుకు ప్రవేశ పెట్టబడటం లేదో ఆలోచించాలి.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో వున్నది. ఇచ్చేది తెచ్చేది తనేనని ప్రకటించింది. యింకా బిల్లు ప్రవేశపెట్టక పోవడానికి కారణం తనకి స్పష్టతవున్నా ఉద్దేశ్యపూర్వకంగానే అస్పష్టతని సృష్టించదల్చుకున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత వున్నదా? లేదా?అనే ప్రశ్నలకి దీని నుండి సూటిగా సమాధానం వుండదు. కొన్ని సందర్భాల్లో వ్యక్తం చేసినా ఆచరణ తద్భిన్నంగా వుంటుంది. దీని నాయకులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తారు. ఇది తన స్వప్రయోజ నాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించే వైఖరి. తెలుగుదేశం పార్టీ మౌలికంగా కాంగ్రెస్ పార్టీ వైఖరినే కలిగివున్నది. ప్రజలనాడిని బట్టి ఓట్ బ్యాంకును దృష్టిలో పెట్టుకొని వ్యవహరించే వైఖరే వీటిది. శాస్త్రీ యమైన వైఖరిని ఏర్పర్చుకొని దాని ప్రకారం నిలబడే వుద్దేశ్యం ఈ రెండు పార్టీలకి లేదు. భారతీయ జనతా పార్టీ దేశంలో రాబోయే ఎన్నికల్లో తను ఎలాగైన అధికారం సాధించాలనే

లక్ష్యంతోనే తన పావు లను కదిలిస్తున్నది. ఇందులో భాగంగానే తెలంగాణ సమస్యపై తన వైఖరి వుంటుంది. గతంలో తను అధికారంలో వున్నప్పుడు తెలంగాణ అనుకూలనిర్ణయం చేయలేక పోయింది. తన మిత్రపక్షాలను యిబ్బంది పెట్టే నిర్ణయం చేయలేనని తప్పించుకున్నది. ఇతర ప్రత్యేక రాష్ట్రాలకి తెలంగాణకి మౌలికమైన తేడా వున్నదని బీజేపీ రథసారథి అద్వానీయే హైదరాబాద్‌లోనే స్పష్టమయిన ప్రకటన చేసాడు. అదేమంటే, రాష్ట్ర రాజధాని వేరుబడే రాష్ట్రంలో ఎక్కడా లేదు. అందుకు భిన్నంగా హైదరా బాద్ తెలంగాణలో వున్నది. దాని అభివృద్ధి తెలంగాణకి ఉపయోగపడు తున్నదన్నాడు. మొన్న పార్లమెంటులో కూడా సరిగ్గా లేని దాని మూలం గా తనుఏమి చేయలేక పోయానని కేసీఆర్ నిరాసక్తతని వెల్లడించాడు.

పాలకవర్గ పార్టీలన్నింటి స్వభావం ఒక్కటే. తాము అధికారంలో వుంటే నిలబెట్టుకోవడం, లేకపోతే దాన్ని ఎలా సాధించుకోవడం లక్ష్యంగానే ఇవి పావులను కదిలిస్తాయి. ఇదే తీరుని తెలంగాణ యెడల ఇవి వ్యక్తం చేస్తున్నాయి. అందుకే ప్రజలకి వీటిపై భ్రమలుండ రాదు. పాలకులమెడలు వంచి తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టించాలి. దీనికి అధికారంలోని పార్టీలప్రజా ప్రతినిధులపై తీవ్రమైన, నిలకడ కలిగిన వత్తిడి ఫలితంగానే తెలంగాణను సాధించుకోగల్గుతాం. కానీ తద్భిన్న వైఖరులు తెలంగాణ ఉద్యమంలో వ్యక్తం అవుతున్నవి. అధికార పార్టీతో లాలూచీ వైఖరి, అవకాశవాద వైఖరి ఉద్యమ నాయకుల్లో వ్యక్తం కావడం తెలంగాణ ఉద్యమానికి తీవ్ర నష్టం జరుగుతుంది. తెలంగాణకి బయటి దొంగలతోపాటు ఇంటి దొంగలు కూడా అడ్డంకిగా వున్నారు. తత్ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వాయిదా పడుతూ వస్తోంది.

ప్రజలు తెలంగాణపై ఆకాంక్షని వెలిబుచ్చినంత మాత్రాన, కొన్ని కొన్ని సందర్భాల్లో ఉప్పెనగా ఉద్యమాలు సాగినంత మాత్రాన, వస్తున్న రాజకీయ పరిణామాలమధ్య నిలకడగా, ఉధృతంగా ఉద్యమించడం సాధ్యం కాదు. అలాగే ప్రజలు తమ చైతన్యాన్ని ప్రదర్శిస్తే ఈ రాజకీయ పార్టీలన్నీ, వాటి నాయకులు మట్టి కరిచిపోతారు. ప్రజలఆలోచనకి తగిన విధంగా వారే నాయకులుగా అవతరిస్తే ఈ పరిస్థితి వుండేది కాదు. ఇది వారి వెనకబాటుతనాన్ని ఆసరాగా చేసుకొని పాలకులు, ఉద్యమ అవకాశవాద నాయకులు ఆడుకుంటున్న తీరుని స్పష్టం చేస్తోంది. తేనె పూసిన కత్తులతో తెలంగాణ గొంతును కోస్తున్నారు.

నిలకడ కలిగిన ప్రజా ఉద్యమం ఫలితంగానే తెలంగాణ సాధించు కోగల్గుతాం. దీని వైఫల్యం మూలంగానే నేటికి తెలంగాణ సాధించు కోలేక పోయాం. దీనికి తెలంగాణ ఉద్యమంలోని తప్పుడు ధోరణులే ప్రముఖ

కారణం.నేడు జరుగుతున్న తెలంగాణ పోరాటం ఆఖరి పోరా టం కాదు.ఇది ఆగని పోరాటం. తెలంగాణ సాధించుకొనే వరకు అహర్ని శలు దృఢసంకల్పంతో సాగే పోరాటం. కానీ దీనికి గండికొడ్తున్నారు.

మిలియన్ మార్చ్ తదనంతరం ఉద్యమం స్థబ్దతకి గురయిందని పాలకులు, సమైక్యవాదులు చంకలెగరేస్తున్నారు. తెలంగాణ వాదనే పలుచబడిందనే విపరీతార్థాలు తీస్తున్నారు. ఉద్యమం ఎప్పుడూ సాఫీగా ప్రయాణించదు. ఎగుడుదిగుడులకి గురవుతూనే వుంటుంది. ఉద్యమాన్ని మసకబార్చే చర్యలు, నిర్వీర్యం చేసే కుతంత్రాలు ఉద్యమం నుండి, ఉద్యమం వెలుపలి నుండి, కొన్ని సందర్భాల్లో ఉద్యమ నుండే కొనసాగు తూనే వుంటాయి. వీటిని అర్థం చేసుకొనే చైతన్యాన్ని ప్రజలకి అందించే శక్తి బలహీనంగా వున్నంత సేపు ఈ పరిస్థితి దాపురిస్తూనే వుంటుంది. నీతి నిజాయితీ కలిగిన నాయకత్వం, నిలకడ కలిగిన నాయకత్వం, నిస్వార్థ నాయకత్వం కొరవడిన ఫలితంగానే తెలంగాణ ఉద్యమానికి ఈ అగచాట్లు. తెలంగాణ కొంత మంది స్వార్థపరులకి నిలయమయింది. దీన్ని మార్కెటు చేసుకొంటున్నవారు కూడా లేకపోలేదు. బలయ్యే వారు బలవుతూనే వున్నారు. బాగు పడేవారు బాగు పడుతూనే వున్నారు.

ఉద్యోగస్తులసహాయ నిరాకరణోద్యమం 17 రోజులు గొప్పగా సాగింది. ఇది ఇతర శెక్షన్ల ప్రజలను కూడా ప్రభావితం చేసింది. ప్రభుత్వంపై వత్తిడి పెంచింది. యిప్పటి వరకు తమ డిమాండ్లకే పరిమితమయిన ఉద్యోగస్తులసమ్మె తెలంగాణ రాష్ట్ర రాజకీయ డిమాండ్ కోసం సహాయ నిరాకరణోద్యమాన్ని సాగించడం అత్యంత చైతన్య మయింది. తెలంగాణ వచ్చే వరకు నిరవధిక సహాయ నిరాకరణకి ఇచ్చిన పిలుపు ప్రజలలో ఎంతో ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని చింది. ప్రభుత్వాన్ని గజగజ వణికించింది. ఆ మేరకు ఆ సంస్థ గొప్ప ప్రతిష్టని సాధించింది. కానీ వీరి విరమణ పరిస్థితులను ప్రజలకి సరిగ్గా అర్థం చేయించలేక పోయింది. జేఏసీని తగు విధంగా భాగస్వామ్యం చేయిం చలేక పోయింది. తత్ఫలితంగా అనేక చర్చలకి, సందేహాలకు తావిచ్చిం ది. నిరవధిక సహాయ నిరాకరణ పిలుపుపైన్నే అనుమానా లకు అవకాశమిచ్చింది. విశ్వాసాన్ని దెబ్బతీసింది. విరమణ తీరు వ్యతిరేక ఫలితాన్నిచ్చింది. ఈ స్థితిలో నిరవధిక నిరాకరణ పిలుపులో ప్రజలకి కలిగిన, ఊహించుకొన్న ఆశపై సమ్మె విరమణ నిరుత్సాహ పర్చింది. ఆ తరువాత మిలియన్ మార్చ్ సందర్భంగా వ్యక్తమయిన కొన్ని తప్పుడు ధోరణులు సమ్మె విరమణ నేపథ్యంపై జరుగుతున్న చర్చలకి బలాన్ని చ్చాయి. విరమణకు వీరు చెప్పే కారణాలు సహేతుకంగా లేవు. వీటిని అవగాహన, అంచనాలపొరపాటుగా చూస్తున్నాం. అదే సమయంలో ఉద్యోగ

సంఘాలనాయకులు కోట్లు మింగారని అధారాలు లేకుండా చేసే ప్రచారం సరి అయింది కాదు.

మిలియన్ మార్చ్ పిలుపుని జేఏసీ ఏ స్పిరిట్‌తో, ఏ ఉద్దేశ్యంతో ఇచ్చిందో దాని అమలు వచ్చేటప్పటికి ఇవన్నీ పటాపంచలయి పోయినాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం ఉద్యమంపై వత్తిడే ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం ప్రత్యేకంగా టీఆర్ఎస్ నాయకులపై వత్తిడి తెచ్చింది. వీరు కేంద్రానికి లొంగి పోయారు. జేఏసీలో బలమైన టీఆర్ఎస్ మిలియన్ మార్చ్ పిలుపు నుండి ఆచరణలో సంపూర్ణంగా వెనక్కి పోయింది. అప్పుడే జరిగిన ఉద్యోగస్తులసహాయనిరాకరణ విరమణ కూడా దీనికి తోడయింది. మిలియన్ మార్చ్ వీగిపోయిందని ప్రభుత్వం భావించింది. మిగతా శక్తులకదలికలను మరింత సవాల్‌గా తీసుకొన్నది. ఉక్కుపాదంతో మిలియన్ మార్చ్‌ని అణచడానికి ఉత్సా హపడింది. కానీ తెలంగాణ ప్రజలు మిలియన్ మార్చ్ వైపు చూస్తున్నారు. ప్రభుత్వం మిలియన్ మార్చ్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. తెలంగాణని పోలీసు స్టేషన్‌గా, ట్యాంక్‌బండ్, ఆ పరిసర ప్రాంతాన్ని లాకప్ గదిగా మార్చింది. వేలమందిని నిర్బంధించింది. ప్రభుత్వం విజయం సాధించిందని విర్ర వీగుతున్నది. జేఏసీ ప్రకటించిన ఒంటి గంట నుండి నాలుగు గంటల వరకు మార్చ్ కోసం జనం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఒంటి గంట వచ్చేసింది. ఒకేసారి వందలమంది అరుణ పతాకాలతో బారి కేడ్లను అడ్డుకుంటూ ట్యాంక్‌బండ్ పైకి ప్రవేశించారు. తెలంగాణ సాధిస్తాం సాధిస్తాం! ప్రభుత్వ పాశవిక నిర్బంధాన్ని ఖండించండి! న్యూడె మోక్రసీ పార్టీ జిందాబాద్ నినాదాలతో ట్యాంక్‌బండ్ మార్మోగింది. ప్రభుత్వం నివ్వెరపోయింది. ప్రజలు కట్టలు తెంచుకొన్న ఉద్రేకాన్ని ప్రదర్శించారు. మిలియన్ మార్చ్‌పై దారుణమయిన ఆంక్షలను ప్రభుత్వం విధించింది. ఇది రాజ్యాంగ విరుద్ధం. అప్రజాస్వామికం. దాన్ని ప్రజలు తిరస్కరించడం అత్యంత న్యాయం. ఈ సందర్భంలో ప్రజలికి ధైర్యాన్ని, సరైన మార్గాన్నందిం చాలి. సరిగ్గా సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ప్రభుత్వ దుర్మార్గ అణచివేత పథకాన్ని ఓడించేందుకు, ప్రజాస్వామ్య విలువలను అందించేందుకు, ఎలాగయిన మిలియన్ మార్చ్‌ని విజయ వంతం చేయాలని వందలమంది తన శ్రేణులను ప్రభుత్వం దృష్టిలో పడకుండా నగర నడిబొడ్డులోకి దించింది. ఒక్కసారి ప్రకటిత సమయా నికే అంటే, ఒంటి గంటకి ట్యాంక్‌బండ్‌పై విరగబడింది. దీనితో ప్రజలం తా అత్యంత ఉత్సాహంతో ట్యాంక్‌బండ్‌పై ప్రవేశించారు. జేఏసీ ప్రతిష్టని నిలబెట్టడంలో న్యూడెమోక్రసీ తనదైన ప్రత్యేకతని, శైలిని ప్రదర్శించింది. ట్యాంక్‌బండ్‌పై మార్చ్ చేసింది. ఈ విధంగా మిలియన్ మార్చ్‌ని న్యూడెమోక్రసీ

పార్టీ విజయవంతం చేసింది. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. ప్రభుత్వం తన మిలియన్ మార్చ్ వైఫల్య కలకల్ల అయ్యేటప్పటికి దీనికి కారణమయిన న్యూడెమోక్రసీ పార్టీని టార్గెట్ చేసింది. సవాల్‌గా తీసుకొన్నది. పార్టీ ఆఫీసులపై దాడి చేసింది. పార్టీ నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. అరెస్టు చేసింది. మిలియన్ మార్చ్ తెలంగాణా ఉద్యమంలో ఒక నూతనర్థాన్నిచ్చింది. గొప్ప పోరాటానికి చిహ్నంగా నిలబడింది.

మిలియన్ మార్చ్ సందర్భంగా 3.30 సమయంలో ట్యాంక్‌బండ్‌పై వున్న విగ్రహాలకూల్చివేత ప్రారంభమయింది. ఇది న్యూడెమోక్రసీ పార్టీ ఊహించని విషయం. అప్పటికే న్యూడెమోక్రసీ కార్యకర్తలు 2 గంటలపాటు ఆట పాటలతో ప్రదర్శనలు సాగిస్తున్నారు. కానీ వేలమంది వున్న పోలీసులు విగ్రహాలవిధ్వంసాన్ని కనీసం అటకాయించేందుకు పూనుకోలేదు. కొంత మంది ఉద్దేశ్యంతోనే ఈ విగ్రహాలవిధ్వంసానికి ఒడిగట్టారు. ఆ తదుపరి అచేతనంగానే అందులో పాల్గొన్నారు. ఇది మిలియన్ మార్చ్ సాధించిన విజయాన్ని ప్రక్కదార్లు పట్టించింది. దాని స్థానంలో విగ్రహాలవిధ్వంసం చర్చకి తావిచ్చింది. తెలంగాణ ఉద్యమంలో విగ్రహాలవిధ్వంసం చర్చ ఎజండా అయిపోయింది. దీన్ని తెలంగాణను బలపరిచే వారిలో అత్యధికులు తమ తమ కోణాల్లో సమర్థిస్తున్నారు. న్యూడెమోక్రసీ పార్టీ స్పష్టంగా దీన్ని ఖండిస్తోంది.

మిలియన్ మార్చ్ తదనంతరం తెలంగాణ ఉద్యమానికి శెలవు అని, ఉద్యమ స్తబ్ధతలోకి పోయిందని ఏవేవో వ్యాఖ్యానాలు వ్యక్తమ వుతున్నాయి. ఉద్యమ ఎగుడు దిగుడులకి అనేకరకాల కారణా లుంటాయి. శతృవు పరిస్థితి, ప్రజలు పోరాటానికి సంసిద్దత, ప్రజలకే నాయకత్వం వహించే నిర్మాణ స్థితిని పరిశీలించాలి. దీన్నే రాజకీయ పరిస్థితులంటారు. పాలకులు సృష్టించే విధానాలు ఉద్యమాన్ని ప్రభావితం చేస్తాయి. ఉద్యమ నాయకులు అనుసరించే వివిధ రాజకీయ వైఖరులు కారణ మవుతాయి. ప్రజలకి ఆకాంక్ష వున్నంత మాత్రాన వాటికవే ఉద్యమా లుగా ముందుకు రాలేవు. కొన్ని సందర్భాలుగా ముందుకు వచ్చినా గానీ స్థిరమయిన, చైతన్యయుతంగా కొనసాగలేవు. నాయకత్వంలో లోపభూయిష్ట విధానాలుంటే ఉద్యమం ముందుకు పోదు. సరయిన, స్థిరమైన, శక్తివంతమైన నాయకత్వ కొరతలను తెలంగాణ ఉద్యమం నాలుగు దశాబ్దాలనుండి ఎదుర్కొంటుంది. ఉద్యమానికి సరయిన నాయకత్వాన్ని అందివ్వాలి అంటే సరైన విధానాలను అందివ్వాలి. అప్పుడు ఆకాంక్ష వున్న ప్రజలు నిలకడగా ఉద్యమిస్తారు.

ఉద్యమం ఒక స్థాయికి వచ్చేసరికి ప్రభుత్వం ప్రారంభం నుండి నేటి వరకు మూడు పద్ధతులను అమలు చేస్తోంది. దాన్నే భవిష్యత్‌లో కొనసాగిస్తది. ఏమిటివి?

1) ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి పథకాలు ప్రకటించడం, కమిటీలు వేయడం, భ్రమలకు గురిచేయడం, 2) ఉద్య మ నాయకులకు ప్రలోభాలు కల్పించడం, 3) ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం. ఇవి ఏకకాలంలో పాలకులు అమలు జరిపేవి. వీటిని చైతన్యయుతంగా ప్రతిఘటించడంలో తెలంగాణ ఉద్యమం వైఫల్యం చెందుతుంది. ఎందుకు? ఎవరికి వారికి ప్రత్యేక అంశాలున్నాయి. ఈ పరిస్థితి ఉద్యమ నాయకత్వం బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలచేతుల్లో వుండటం ముఖ్య కారణం. వీరికి వారి కోణంలో తెలంగాణ ఏర్పాటు కావాలని వున్నా పాలకులపాచికలకు బలవు తుంటారు. లొంగి పోతుంటారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుని తెలంగాణలోని బడా పెట్టుబడి దారులు, పాలకులు, శ్రమజీవులవరకు వారి వారి కోణాలనుండి కోరుకొంటున్నారు. ఇందులో ఉమ్మడి అంశాలున్నాయి. ఉద్యమ నాయకత్వం శాస్త్రీయ విధానాలు కలిగిన వారి చేతుల్లో లేదు. శ్రమజీవులచేతుల్లో అంతకంటే లేదు. సంపూర్ణంగా నీతి నిజాయితీ కలిగిన వారి చేతుల్లో కూడా లేదు.

తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ప్రజలమౌలిక సమస్యలతో పోల్చి నప్పుడు చాలా పరిమితమయిన డిమాండ్. ఆ మేరకు ప్రజలు, వారి పక్షం వుండే విప్లవ పార్టీలు సమర్థించాల్సిన ఆవశ్యకత వున్నది. తెలం గాణ రాష్ట్ర డిమాండ్‌కి తెలంగాణలోని అన్ని వర్గాలకి ప్రయోజ నాలున్నాయి కాబట్టి అందరూ ఐక్యంగా ఉద్యమించినప్పుడే రాష్ట్రం సాధించుకోవడం సాధ్యం. ఆ దృష్టితోనే జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం సాగుతోంది. దీనికి విధి విధానాలున్నా అన్ని సందర్భాల్లో వాటికి అందులోని పక్షాలు అమలుకి పూనుకోలేకపోతున్నాయి. ఉదా: మిలియన్ మార్చ్ కార్యక్రమంగానీ, ఆ తర్వాత ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలనే ఉద్దేశ్యంలో కానీ తేడాలున్నాయి. ఇలా అనేకం చెప్పుకోవచ్చు. విభేదాలతో ఎవరికి వారు చేసే పోరాటం లక్ష్యాన్ని చేరుకోలేదు.

ఉద్యమం ద్వారా సాధించే తెలంగాణలో ప్రజలకి, ప్రజాస్వామిక చైతన్యం మూర్తిభవిస్తుంది. యిప్పటికే ఈ పోరాటాలమూలంగా ప్రజలచైతన్యం పెంపొందుతుంది. పోరాటాలద్వారా పెంచుకొన్న చైతన్యం తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక నూతన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై చెకప్‌గా వుంటుంది. తమ న్యాయమయిన డిమాండ్ల అమలుకి పూనుకొనే చైతన్యాన్ని వారు తప్పక ప్రదర్శిస్తారు. తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలపెంపుదలకోసం డిమాండ్ చేస్తారు. వాటి సాధనకి ఉపక్రమిస్తారు. వీటిల్లో కూడా ముఖ్యంగా వర్గ, సామాజిక సమస్యలపై ముందుంటారు. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై వుంటుంది. అందుకు కూడా తెలంగాణ కోరే పాలకులు స్థిరమయిన

ఉద్యమాలను కోరుకోరు. మంతనాలతో విజయం సాధించడమే వీరికి ప్రధానంగా వుంటుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, వాటి నాయకత్వాలు, తెలంగాణ ఏర్పాటుకి విరుద్ధంగా వున్నాయి. అన్ని ప్రయత్నాలతోపాటు ఉద్యమంపై ఉక్కుపాదం మోపి తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ని లేకుండా చేయాలని పగటి కలలు కంటున్నాయి. అందుకే శ్రీకృష్ణ కమిటీ నివేదికలోని సీల్డ్‌కవర్. అదే 8వ చాప్టర్. ఇది చాలా కొత్తదిగా చర్చించబడుతున్నా ఇది కొత్త సీసాలో పాత సారానే. 1969 నుండి నేటి వరకు తెలంగాణ ఉద్యమంపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతూనే వున్నాయి. వీటికి పరాకాష్టనే 8వ చాప్టర్. ఇది తమ ఉక్కుపాదాన్ని న్యాయబద్ధం చేస్తోంది. ఇందులో తాము చెప్పుకొనే రాజ్యాంగ విరుద్ధ అంశాలెన్నింటినో ప్రతిపాదించి చట్ట రహిత కార్యక్రమాలకి చట్టం ముద్ర చూపించడానికి ప్రభుత్వం పడరాని పాట్లు పడుతున్నది. ఈ పేరిట చట్టాన్ని ఉల్లం ఘిస్తోంది. ఇది ఉల్లంఘన అన్న వారిపై తాము సృష్టించిన చట్ట వ్యతిరేక చట్టం (8వ చాప్టర్) పేరిట ఉద్యమాన్ని అణచచూస్తోంది.

ఇప్పటికే 8వ చాప్టర్‌పై తెలంగాణ ప్రజలు తమ నిరసన గళాన్ని విప్పారు. 8వ చాప్టర్‌ని బహిరంగ పర్చితే ప్రభుత్వానికి ప్రజలు ఏ విధంగా బుద్ది చెప్తుతారోనని గమనించే దాన్ని మెల్లమెల్లగా విప్పబోతున్నది. 8వ చాప్టర్‌ని తెలంగాణ ప్రజలు సహించరు. తిప్పి కొడతారు. దీనికి ఆంధ్ర ప్రజలమద్దతు, దేశ ప్రజలమద్దతు కూడా వున్నది. యిప్పటికే ఉద్యోగస్తులు సాగించిన అద్భుతమయిన సహాయ నిరాకరణోద్యమాన్ని సహించలేక ప్రభుత్వం 8వ చాప్టర్ మార్గదర్శకత్వ ంలోనే 177 జీవోని తీసుకవచ్చింది. దీని రద్దుకై ఆంధ్రప్రాంత ఉద్యోగస్తులతో సహా తెలంగాణా ఉద్యోగస్తులందరూ ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం 177 జీవోని నిలిపివేయక తప్పలేదు. నిలిపివేయడమే కాదూ, అది పూర్తిగా రద్దయ్యే వరకు ఆగదు మా పోరాటమని ఉద్యోగస్తులు ఉద్యమిస్తున్నారు.

తెలంగాణలో ప్రతి ఊరికి, కుటుంబానికి చరిత్ర వుంది. నిజాం, నెహ్రూ క్రూర పాలనకి వ్యతిరేకంగా వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడారు. అనేక విజయాలు సాధించారు. వీర తెలంగాణ కోసం పోరాడిన ప్రజలను నేడు వేరు తెలంగాణను సాధించడం కష్ట సాధ్యమేమి కాదు. వర్గ, లింగ, కుల, మత, జాతి వివక్షతలకి, అణచివేతలకి వ్యతిరేకంగా పోరాడటం అత్యంత న్యాయమయినది. అలాగే ప్రాంతీయ వివక్షకి, అణచివేతకి, వనరులకొల్లగొట్టడానికి, ఆత్మగౌరవం నిలబెట్టుకొనేందుకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం జరుగుతున్న

పోరాడటం సంపూర్ణంగా సమర్ధనీయమే. కాదు, అత్యంత న్యాయమైనది కూడా. అందుకే సీపీఐ (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్రం కోసం శాస్త్రీయ వైఖరితో అడుగులేస్తోంది. ఉద్యమంలోని తప్పుడు ధోరణులకి వ్యతిరేకంగా పోరాడుతుంది. నీతి, నిజాయితీ, నిస్వార్థంగా రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమిస్తోంది. తెలంగాణా జేఏసీలో భాగస్వామిగా వుంటూనే తన ప్రత్యేక విధానాలతో స్వతంత్రంగా రాజీలేని పోరాటాన్ని చేస్తోంది. ఐక్యకార్యాచరణలో తనవంతు కృషి నిజాయితీగా, సూత్రబద్ధంగా సల్పుతున్నది. "ఐక్యత–పోరాటం" పద్దతులను పాటిస్తోంది. ఆ విధంగా ఉద్యోమాల్లో తగు విధంగా తన చొరవని ప్రదర్శిస్తోంది.

**(సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు)**

# ఇలా ఎందుకు జరిగింది?

**–చుక్కా రామయ్య**

ఆ సంఘటన అందరి హృదయాల్ని తలచివేసింది. ఈ సంఘటనతో గుణపాఠాలు నేర్చుకోవల్సిన అవకాశాలు ప్రజలకంటే పాలకులకు ఎక్కువగా ఉన్నాయి. దాన్ని కూడా వదులుకుంటున్నారు. ఇలా జనం చీమల్లా ట్యాంక్‌బండ్ మీదకు కదలిరావటం ఇదేం మొదటి సంఘటనేం కాదు. ప్రతి బతుకమ్మ పండుగప్పుడు, వినాయక నిమజ్జనం సమయంలో ఆబాలగోపాలం వరకు కదలి ట్యాంక్‌బండ్ మీదకు కదిలించటం సహజంగా జరిగేది. ఆ సందర్భంలో ఆ జనం మొఖాలపై నవ్వులు, కేరింతలు, ఆనందాలు, ఉత్సాహాలు ఒక్కసారిగా జనంలో కనిపించటం చేసేవాళ్లం. పోలీసులు కూడా కనపడేవారు. కానీ వారు లాఠీలను చూసి మురిసిపోయిందానికన్నా ప్రజల మధ్యన ఉండి, ప్రజల సంతోషాలతో లీనమౌతూ అప్పుడప్పుడు మేం కూడా ఉన్నామని ప్రజలకు చెబుతూ ఉండేవారు. పోలీసులు ఉత్కంఠల సమయంలో కూడా ఎంతో అవలీలగా కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రజలకు ఈ 25 ఏళ్ల కాలంలో ట్యాంక్‌బండ్‌పై ఒక్క విగ్రహాన్ని కూడా ముట్టుకోలేదు. హైద్రాబాద్ ప్రజల సాంప్రదాయాన్ని సహనాన్ని, కాస్మోపాలిటిక్ అవుట్‌లుక్‌ను ప్రశంసించింది. అకస్మాత్తుగా మార్చి 10 మిలియన్ మార్చ్ నాడు ఎందుకు ఈ ప్రజల మనస్తత్వాన్ని ప్రజల ఆలోచనలను మార్చివేసింది. సంతోషాలకు బదులుగా ఆ సమయంలో కక్షలు ఎందుకు రేగాయి. ప్రజల మనోభావాల్లో ఎందుకు ఈ మార్పు వచ్చింది. ఈ చరిత్ర ఎందుకు ఇలా ఒక్కసారిగా తలకిందులై పోయిందోనన్న మనస్తాపం నాలాంటి వాళ్లకు కలగటం సహజం. కానీ దీని వెనుక ప్రభుత్వం, అదికార వైఖరి, రాజముద్రలు కనపడుతున్నాయి. ప్రజలను ట్యాంక్‌బండ్ మీదకు రానివ్వకూడదని, జెఏసీ ఇచ్చిన పిలుపును విచ్ఛిన్నం చేయాలని, తెలంగాణ ప్రజల మనోభావాలు కనపడకుండా చేయాలన్న ఎత్తుగడలు పాలకులకు ఉన్నాయి. కేంద్రం మన్ననలను పొందాలన్న తహతహ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. చిదంబరం అర్హతను సంపాదించి ఆశీస్సులు పొంది

అధికార పీఠంలో మరో మెట్టు పైకెక్కాలన్న తపన ప్రభుత్వంలో ఉన్నట్లుగా కనిపించింది.

మార్చి 10వ తేదీనాడు పిల్లల పరీక్షను తమ బలంతో రాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రజాబలం కన్నా అధికార బలం ఎక్కువని నిరూపించాలనుకున్నారు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు అధికారంతో నడవవు. పోలీసుల పహారాలో పాలన ఎంతకాలమో సాగదు. ప్రత్యక్ష ప్రజాసహకారంతో మాత్రమే అది నడుస్తుంది. నియంతృత్వ ధోరణికి బీజాలు వేస్తే దాని ఫలితాఉ వికృతంగా ఉంటాయి.

ఏ రాజకీయ పార్టీ అయినా కూడా ప్రజావాంఛను కాదనలేదు. ఈనాడు ప్రజలు తమ పిల్లలు చదువుకోవాలని తమ పిల్లలు మానవ సంపదగా తయారు కావాలని తమ ఆర్థిక ఎదుగుదలకు చేయూత నివ్వాలని ప్రజలు కాంక్షిస్తున్నారు. దాన్ని గమనించే బహుశా టిఆర్ఎస్, జెఎసీ తమ కార్యక్రమంలో మార్పులు చేసుకుని పిల్లల పరీక్షలకు అవకాశం కూడా కల్పించటం జరిగింది. మాలాంటి అశక్తుల వినతిని అంగీకరించటం, మిలియన్ మార్చ్ ప్రోగ్రాంలో మార్పులు చేర్పులు చేయటం జరిగింది. అదే ధోరణిని కొనసాగించండని సిఎంను కూడా కోరటం జరిగింది. పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని సంతోషపడ్డాను. మార్చి 10న మిలియన్ మార్చ్ కూడా అంతే ఆనందంతో కొనసాగుతుందని భావించాను.

ముఖ్యమంత్రి ఒప్పుకున్నారు. ఉద్యమం చేసే నిర్వాహకులు ఒప్పుకున్నారు. పిల్లల్లో టెన్షన్‌ను కూడా తగ్గిందని ఆనందించాను. ఇంటికొచ్చే సరికి టెలిఫోన్‌ల కాల్స్ వచ్చాయి. సిద్ధిపేట, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ నుంచి వచ్చిన వందల మందిని అరెస్టు చేశారని చెప్పారు. నన్ను ఎందుకు మాట్లాడాను. సహనం వహించండి అరెస్టులు చేయరని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

9వ తేదీ రాత్రి నేను కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాను. రాత్రి 12 గంటల సమయంలో అడుగడుగున తనిఖీలు చేయటం కళ్లారా చూశాను. ఇది ఒక్కచోటనే కాదు పదిచోట్ల ఆపి నా కారును ఇలువెల్లా సోదా చేయటం జరిగింది. నా కారునే కాదు మొత్తం తెలంగాణ అంతటా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

తెల్లవారంగానే మార్చి 10న ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వాకింగ్‌కు వెళ్లాను. పరీక్షల రోజున కూడా విశ్వవిద్యాలయం చుట్టూ అవే ముళ్లకంచెలున్నాయి. పరీక్షలు సాఫీగా జరగాలని పిల్లల్లో భయోత్పాతం పోవాలని ఎంత ప్రయత్నం

చేసినా ఈ భయంకర పరిస్థితి తప్పలేదు. ఇంటర్ పిల్లలు ఎంతో ఇబ్బందులు పడ్డారు. కొందరు ఇంటర్ పిల్లల్ని కూడా అరెస్టు చేశారు. కొందరు తల్లిదండ్రులను కూడా అనుమతించటం లేదని కొందరు ఫోన్లపై పోన్లు చేశారు. ఏది కాకూడదని తలచానో అదే జరిగింది. పిల్లలు పరీక్ష రాశారు. కానీ 10 వేల పై చిలుకు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. పరీక్షకు ఒత్తిళ్లమధ్య హాజరైన విద్యార్థి ఏం రాయగలుగుతారో నాకు తెలుసు. ఏదో పరీక్షలు జరిపామని ప్రభుత్వానికి సంతోషమా? జెఏసీ, టిఆర్ఎస్ ప్రోగ్రాంలను జరగనీయకుండా ఆపగలిగామని అహంభావమా? పరీక్షలు ఎవరికోసం? ప్రభుత్వ గౌరవం కోసమా? పిల్లల భవిష్యత్తుకా? పిల్లల పరీక్షలు రాసి వచ్చామన్న సంతోషాన్ని చూడాల్నా లేక పోలీసుల ప్రవర్తనతో వారి మొఖాల మీద కసిరేఖలను చాడాల్నా?

ఇంటర్ పరీక్ష అయిపోయింది. మధ్యాహ్నం 1 గంట నుంచి ట్యాంక్‌బండ్‌పై రెండవ అధ్యాయం మొదలయ్యింది. తెలంగాణ రాష్ట్ర సాధన పరీక్ష మొదలయ్యింది. ఆ సమయంలో నేనప్పుడు ఒక నవోదయ స్కూల్లో ఉన్నాను. పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలి. ఎంత ప్రశాంతంగా ఉండాలో వారికి చెబుతున్నాను. ఇంకో పక్క పిల్లలు పరుగెత్తుకుంటూ ట్యాంక్‌బండ్ వైపుకు వస్తున్నారు. హైద్రాబాద్ చుట్టూ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రదర్శనలు చూసి తల్లిదండ్రుల సాయంతో ట్యాంక్‌బండ్ ఎక్కారు. పిల్లలు జమగూడితే వారి వెంబడి నడిచాను. ఒక్కొక్కరూ తమ బాధలను చెప్పుకుంటున్నారు. అవి వినుకుంటూ వారిని సముదాయించు కుంటూ ట్యాంక్‌బండ్‌పై ఆ మూల నుంచి ఈ మూలకు తిరిగాను. ఒక విద్యార్థి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడని ఆ లేఖను చూపించి కొందరు భోళ్లున విలపించారు.

ఏమిటీ భయంకర పరిస్థితి? పరిస్థితులు ఇలా ఎందుకు తయారయ్యాయి? రాజకీయ సమస్యను రాజకీయంగా పరిష్కరించాలి. ప్రజానాయకుడు, ప్రజా సమస్యలను ప్రజల మధ్యన ఉండి వారి సమస్యలు వినాలి. చూడాలి. కాని ప్రజాసమస్యల పరిష్కారాన్ని పోలీసులకు వదిలిపెడితే, ఏం జరుగుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థ నియంతృం వైపుకు మరలిపోతుంది.

విద్యార్థులను ఏం అనకుండని పోలీసులను వేడుకున్నాను. దాని తర్వాత ఇంటికి వచ్చాను. ఇంటికొచ్చి టి.వి. చూశాక మనస్థాపం చెందాను. అందుకు కారణం చూశాను. ప్రజలకు, రాజకీయ పార్టీలకు మధ్య అగాధం ఏర్పడిందని కనిపించింది. రాజకీయపార్టీలు నిర్వహించాల్సిన పనులు చేయలేకపోయాయి. అవి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ సివిల్ లైఫ్‌ను కాపాడాలి. ఇలాంటి సంఘటనల నుంచి, ఇలాంటి క్షేత్రాల నుంచి రాజకీయ పార్టీలను దూరంగా ఉంచితే ఏం

జరుగుతుందో అది జరిగింది. ప్రభుత్వం డిజిపిలతో సంప్రదించిందానికన్నా రాజకీయ పార్టీలతో సంప్రదిస్తే బాగుండేదేమోననిపించింది. రాజకీయ పార్టీలు పౌరజీవనాన్ని కాపాడగలుగుతాయి. దానికి ప్రత్యామ్నాయం పోలీసులు కాదని ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఘటనలు మరొకసారి తేల్చి చెప్పాయి. ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకోవటం కోసమై భావితరానికి స్వేచ్ఛా వాతావరణం కల్పించటం కోసమై ట్యాంక్‌బండ్ సంఘటనపైన ఒక సమగ్ర విచారణ జరిపించడంని కోరుతున్నాను. ఇది దోషులను పట్టుకోవటం కోసం కాదు ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడటం కోసం ఆ పని చేయాలి. ఆ విగ్రహాలను పడగొట్టింది కొందరు వ్యక్తులు మాత్రమే. వారు కావాలని దాన్ని పడగొట్టలేదు.

ప్రజాస్వామిక భావాలను చెదరగొట్టింది ప్రభుత్వమే. చెదిరిపోయిన కల్లోలమైన ఆలోచనల నుంచి వచ్చే ఆగ్రహాన్ని ఎదురునిలబడి చూడలేరు. దాన్ని భరించటం కష్టం. సహనం బద్ధలైతే వచ్చేది ఉపద్రవాలే. సరిగ్గా అదే జరిగింది. ఇందుకు మలాలు ఇకనైనా ఆలోచిస్తారా? లేక ఇలాంటిసంఘటనలకు ప్రభుత్వమే గేట్లు తెరుస్తుందో చూడాలి.

**(ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ)**

# మహత్తరమైన 'మార్చ్' కావాలి!

**– కె. ప్రభాకర్**

ఎప్పుడూ హైదరాబాద్ నగరంలో అడుగు పెట్టినా, అనామకుడిలా, పరాయివాడిగా ట్యాంక్‌బండ్‌పై తచ్చాడటం తప్ప వేరే ఆలోచనలు వచ్చేది కావు. హుస్సేన్ సాగర్ బెంచీపై కూర్చొని సేదదీరుతూ, బుద్ధుడిని, లుంబినీపార్క్‌లోని కేరింతలను, ఐమాక్స్ థియేటర్ 'రంగుల కలల్ని', ఎన్టీఆర్ గార్డెన్ పచ్చిక బయళ్లు, ఆ అడుగున కూల్చబడిన 'విద్యుత్ కేంద్రం', జీవనదిలా పారే 'మూసీ' నది గుర్తొస్తూవుండేయి.

ఆ మహానగరపు దగదగల వెనుక చీకట్లను, ఆ మహాసౌదాల కింద నలిగి పోయిన బతుకులు జీవన దుస్థితికి 'ట్యాంక్‌బండ్'పై నిశ్చలంగా నిలిపిన విగ్రహాలకు సంబంధం వుందని కళ్ళారా చూసిన దినం మార్చ్, 2011.

'మిలియన్ మార్చ్' సందర్భంగా హైదరాబాద్ చేరుకోవడానికి చేసిన ప్రయత్నం, ఓ 'కూబింగ్'ను తలపించింది. నిత్యం తెలంగాణ పల్లెల్లో బూటకపు ఎన్‌కౌంటర్ల కోసం పట్టణాలు, గ్రామాల్ని జల్లెడ పట్టినట్లు, నేనుండే నల్లగొండ జిల్లాలోని ఓ పట్టణం అర్థరాత్రి నుండే 'మిలియన్ మార్చ్'కు పోతారనుకున్న వాళ్లందరిని కూబింగ్‌లా చుట్టుముట్టడం పరిస్థితి తీవ్రతను, ఆదిపత్య వర్గాల నియంతృత్వ పోకడలను తెలియజేసింది.

అర్థరాతిరి అయితే అరెస్టు చేయకపోవచ్చుని, ఐదుగురం వేర్వేరు ప్రాంతాల్లో కలిసి పరిస్థితిని బట్టి, లారీ, బస్సు, రైలు, ఏదైతే అది వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. రోడ్డు మీద నా కోసం వస్తున్న ముగ్గురులో ఇద్దరిని జిప్సిలో ఎత్తుకెళ్ళడం, మరొకరు పారిపోతే అతతన్ని వెంటబెట్టుకొని తెల్లవార్లు బస్టాండు, బైపాస్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో మోహరించిన 'పోలీసుల' వీట వల్ల విసిగి విఫలం చెందాం.

తెల్లవారుగట్ల మళ్ళీ ప్రయత్నం మొదలు పెట్టాం. సాధ్యం కాలేదు... బండికి అంటించిన 'జై తెలంగాణ' స్టిక్కర్ చూసి ఎత్తుకెళ్ళే ప్రయత్నం చేస్తే స్టిక్కర్

చించేసుకుని ఏదో ప్రయత్నం చేయడం కొంత మంది కానిస్టేబల్స్ పోనిచ్చినా (తెలంగాణ బిడ్డలు) ఆంధ్రా ఎస్ఐ స్థాయి 'సిఐ'లు నిలువరించే ప్రయత్నం, చివరికి మా డ్రెస్, వేషం మార్చుకొని పరిగెత్తే 'కొశ్చిన్'ను పట్టుకొని పట్నం చేరాము.

పట్నంలో దిగగానే, సికిందరాబాద్ స్టేషన్ నుండి అందరి చూపు స్టేషన్ పక్కల నుండి ట్యాంక్‌బండ్ వైపుకు పరుగెత్తడం. కాలినడక తప్ప మరొక వాహనాన్ని అనుమతించని నిర్బంధపు నీడలో రాత్రి 2 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చేసిన సకల ప్రయత్నం వల్ల, వెంటాడే వేటగాళ్ళను తప్పించుకొని సురక్షిత ప్రాంతానికి చేరినట్లు ట్యాంక్‌బండ్ మైసమ్మ గుడి కాడికి చేరాను.

పైకి ఎక్కడం, అంత ఎత్తుకు ఎగబాకడం నావల్ల అయ్యేపని కాదుకానీ నాతో పాటు 'ట్యాంక్‌బండ్'ను ఎక్కి తీరాల్సిందే, ఎన్ని ఆటంకాలెదురైనా ఒంట్లోకి తుపాకి తూటా దిగబడినా, కాళ్లు విరిగినా, చేతులు చీరుకు పోతున్నా శతృకోటల్ని చుట్టు ముడుతున్నట్లూ ఆడ, మగ, విద్యార్థి, సామాన్య ప్రజలతో పాటు నాకే తెలియకుండా పైకెక్కేశాను.

'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా' గద్దరన్న పాటతో ఉగ్రూ తలూగుతున్న 'ట్యాంక్‌బండ్, వేలాదిగా తరలివస్తున్న కోట్లాది గొంతుకల 'చైతన్యం' హుస్సేన్ సాగర్‌లో కెటటాల్లా ఎగిసి పడింది.

అలలుఅలలుగా సాగుతున్న సాహస యాత్రలా ఆ చివర నుండి ఈ చివరకు 'పిక్కటిల్లే నినాదాలు' 'హైదరాబాద్ మాదిరా ఫ్రీజోన్ కాదురా' అన్న నినాదం అందుకోకుండా ఉండలేకపోయాను.

ఎవరో మిత్రుడు రాసుకొచ్చిన 'ప్లకార్డ్' 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం పోలీసు రాజ్యం, ఆంధ్రా రాజ్యం, గుండా రాజ్యం' పట్టుక తిరుగుతుంటే ఒక్కొక్కరు తమదైన నినాదాలు, 'ఆంధ్రోడు తమ్ముడే అడ్డొస్తే తన్నుడే' 'తెలంగాణకు అడ్డొస్తే... మిలియన్ మార్చ్‌లై తిరగడతం', ఇంకొవరో మందు పాతర్లై పేలిపోతాం ఎవరికి తోచిన నినాదం వాళ్లు, ఎవరికి నచ్చిన పాట వాళ్లు, ఎవరి నృత్యం వాళ్లు చేసుకుంటూ సర్వం స్థంబింపచేయడం, నా మట్టుకు నాకు, సీమాంధ్ర కేంద్ర దురహంకారం, డిసెంబర్ 9 నాటి ద్రోహాన్ని తుత్తునీయలు చేయడానికి సన్నద్ధమై వచ్చిన సమరశీల తెలంగాణ పోరు బిడ్డలతో ట్యాంక్‌బండ్ అంతా కదం తొక్కడం ఉప్పొంగే చైతన్యాన్ని నింపింది. ఇప్పటికిప్పుడు తెలంగాణ రాకపోయినా, ఎత్తిన ఈ పిడికిళ్లు లక్ష్య సాధన కోసం బిగుసుకుంటాయనిపించింది.

అట్లా సాగుతున్న ఆట పాటలతో సాగుతున్న 'మిలియన్ మార్చ్' తన చేతుల్ని కట్టేసి, ఆత్మాభిమానాన్ని పాతరేసిన వలసాంధ్ర ఆధిపత్యం చిహ్నాలపై

విరుచుకుపడింది. వాడెవడో నూనూగు మీసాల పోరగాడే తెలంగాణ కసినంతా కడుపులో పెట్టుకుని, మూతికి గుడ్డ చుట్టుకొని చేతిలో అక్కడే విరగొట్టిన ఇనుపకమ్మీ కేబుల్ వైర్లతో ఒక్కొక్కటి పదే నిమిషాల్లో విగ్రహాల్ని, ఆ విగ్రహాల శిలాఫలకాల్ని నామరూపాల్లేకుండా చేస్తున్న ఆ పిల్లల సాహసాన్ని కాసేపు తరగతి గదిలో విద్యార్థి కోపంతో బెంచీ విరగ్గొట్టినట్లు, తనది కాని విగ్రహాల్ని కూల్చడాన్ని అడ్డుకోవాలని ఎంత మొత్తుకున్నా వినేడాడే లేడు.

జై తెలంగాణ నినాదాల హోరులో ఒక్కొక్కటే నేల రాలుతుంటే వేలాది మంది తెలంగాణ బిడ్డల ఆక్రోశం చల్లబడుతున్నట్లన్పించింది.

ఎందుకయ్యా అట్లా చేయడం బాగా లేదంటే, మీకేం తెలుసు సార్ అనుభవిస్తే తెలుస్తది. 'లం... కొడుకులు' ప్రశాంతంగా మిలియన్ మార్చ్ జరుపుకుంటమంటే అనుమతియ్యరా? హైదరాబాదేమన్నా వీడబ్బ జాగిరా? ఇక్కడ విగ్రహాలు పెట్టి ఆధిపత్యంతో బతుకుల్ని ఆగం చేసింది చాలక, ఎంత మంది మా అన్నా తమ్ముళు ళ్ మాడి మసైపోతున్నా స్పందిచరా? అందుకే మేం చేయాలనుకున్నది చేసే తీరుతాం. 'డిసెంబర్ 9 ప్రకటనను అడ్డుపడ్డోని ఆస్తులపై కూడా దాడులు చేస్తాం! అంటుండగానే, ఫటా ఫట్, పట పట మంటూ 'ఐస్‌వరల్డ్, ఆంధ్రా బ్యాంక్ అద్దాల మేడల మీద రాళ్ళ వర్షం కురుస్తూనే వుంది.

ఈ విగ్రహాలకు, తెలంగాణ అడ్డుకోవడానికి రాజకీయ ఆధిపత్యానికి చిహ్నంగా నిలిచిన ఓ హెూటల్‌పై దాడుల పరంపర కొనసాగుతూనే వుంది. విగ్రహాలను కూలుస్తున్న వాట్లో 'శ్రీశ్రీ' దగ్గర కొంచెం తీవ్రంగానే దాన్ని కూల్చోద్దు అని అక్కడ నిలబడే ప్రయత్నం నేను, పాశం యాదగిరి మరికొంత మంది మిత్రుల వల్ల నిలిచిపోయింది.

'జెఎసి'లు వున్నా కొన్ని రాజకీయ భావజాల వైరుధ్యాల వల్ల కూడా జాషువా, శ్రీశ్రీ మగ్దూంల వంటి వాళ్ళ విగ్రహాల పట్ల ఆవేశంలోనైనా విజ్ఞత ప్రదర్శించడం నాలాంటి వాణ్ణి శాంతింప చేసింది.

అయితే ఇంత విధ్వంసం జరగడానికి ప్రభుత్వం ప్రత్యక్ష కారణమని సాఫీగా మిలియన్ మార్చ్ జరగనిస్తే ఇంత విద్వేషం రగిలివుండేది కాదని అనుకోవడం వేలాది మంది పోలీసు బలగాల్ని, కేసులు వేటిని లెక్క చేయకుండా సాగిన ఆ సాహస యాత్ర చాలా స్పష్టంగానే తెలంగాణకు అడ్డుపడుతున్న శక్తుల్ని గుర్తించి అడ్డును ఎట్లా తొలగించుకోవాలో తెలుసుకుంది.

ఆ చైతన్యం అక్కడికొచ్చిన రాజకీయ పక్షాలు, ఉద్దేశ పూర్వకంగానే 'పిలుపు'ను నీరుగార్చే ప్రయత్నం చేసిన దివాళాకోరు నాయకులను నోటికొచ్చినట్లు తిట్టింది. ప్రజాకాంక్షను ఎత్తిపట్టిన ఉద్యమకారుల్ని 'కోదండరాం'లను నెత్తిన

పెట్టుకున్న 'బతుకమ్మ'లా ఎత్తిపట్టింది.

తెలంగాణ వచ్చేదాకా బలిదానాలు మాని ఆత్మస్థైర్యంతో పోరాడి సాధించుకుంటామన్న ప్రతిజ్ఞలను చేసింది. నాయకత్వాన్ని, రాజకీయ విద్రోహాన్ని హుసేన్‌సాగర్ నడిబొడ్డున ఎండగట్టింది. ఎగిరిన పిడికిళ్ళన్ని మళ్ళీ బక్కటై నినదించే పిలుపునిచ్చి కలపనందుకు కలత చెందినది. ఇప్పుడు కుమిలిపోతున్నవి. రాజకీయ విద్రోహాలకు, త్యాగధనులను గెలిపించే ఉప ఎన్నికల చుట్టూ తిరగటాన్ని జీర్ణించుకోలేక పోతున్నది.

మాట మార్చిన కేంద్ర, రాష్ట్ర, సీమాంధ్ర వలసాధిపత్యంపై తిరుగుబావుటాను ఎగరేసి తమ ఆధిపత్య దాస్య శృంకలాలను ఛేదించుకోవడానికి మధ్వంసం చేయాల్సిన దాన్ని ధ్వంసం చేసి మరొక మహత్తరమైన దాన్ని నిర్మించుకోవడం కోసం కలలు కంటున్నది. 'సకల జనుల స్వప్నం' కోసం మరో మహత్తరమైన పోరాట పిలుపు కోసం ఎదురు చూస్తున్నది. 'మార్చి పది' ఓ సజీవ దృశ్యం. ఓ సంచలన కావ్యం... తెలంగాణ బతుకు పోరాటానికి వేగుచుక్క.

**(తెలంగాణ టీచర్స్ ఫోరం కన్వీనర్)**

# ఒక ఉద్యమం ... ఒక అనుభవం

**–అత్తలూరి అరుణ**

వందలూ, వేలూ కాదు లక్షలాదిమంది అడుగులచప్పుడు ఆగిపోయిందా? కోట్ల మంది ప్రజల ఆకాంక్షను మోసుకొచ్చే కోటి గొంతుకల కవాతు మూగబోయిందా? మిన్నంటే ఆశలతో మిలియన్ మార్చ్ కోసం ఎదురు చూసిన తెలంగాణ ప్రజల హృదయాల్లో ఘనీభవించిన బాధ యిది. లక్షలాది మంది తెలంగాణ ప్రజలు ఎదురు చూసిన మిలియన్ మార్చ్‌ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయోగించిన ఆయుధం నిర్బంధం. ప్రజలను భయపెట్టి నిర్బంధమనే బూచితో లొంగదీసుకునే కుతంత్రం. మిలియన్ మార్చ్ పిలుపునందుకొని భాగ్యనగర వీధుల్లో తెలంగాణ కోసం దిక్కులు పిక్కటిల్లేలా నినదించాలని ట్యాంక్‌బండ్‌పై కవాతు చేసి తెలంగాణ నినాదంతో నిండిన కోటి గొంతుకల గర్జనని వినిపించాలని కలలుగన్న తెలంగాణ ప్రజల ఆశలను సర్కారు ఛిద్రం చేయాలని చూసింది. మిలియన్ మార్చ్ ఆలోచనని మట్టుబెట్టాలని సర్కారు నిర్బంధాన్ని ప్రయోగించింది. నివురుగప్పిన నిప్పు ఎప్పటికైనా తిరిగి దావానంలా మారుతుందని ఊహించలేదు నిన్నటి నెత్తుటి చరితని గుర్తుచేసుకొని కత్తులవంతెనపై కసిగా కవాతు చేయడం ప్రజలకు కొత్తకాదు.

ఆనాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని నేటి మలి తెలంగాణ పోరాటం వరకు ప్రజలు చేసే సాహసాలు ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించాయి. అయితే ఎప్పటికప్పుడు నిర్బంధం, హింసాకాండద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయగలమని రాజ్యం పదే పదే కలలుకంటుంది. యిక్కడా అదే జరిగింది. కాని సూర్యకాంతిని అడ్డుకోవడం ఎవరితరం?

'మిలియన్ మార్చ్' ఆ పదమే భయపెట్టిందో? లేక లాంగ్‌మార్చ్‌ని గుర్తుకు తెచ్చిందో తెలియదుకాని తెలంగాణ జెఎసి పిలుపునందుకొని మార్చి 10న ట్యాంక్‌బండ్‌పై జరగబోయే తెలంగాణ ప్రజల కవాతుని తలచుకుంటేనే ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టాయి. పోలీసుల గుండెల్లో వణుకు పుట్టింది. ప్రభుత్వ

యంత్రాంగానికి కంటి మీద కునుకు కరువైంది. సూర్యుడిపై ఉమ్మేసినట్టు కోట్లాది మంది ప్రజలను నిర్బంధించాలని భ్రమించింది. అరెస్టులను సాగించింది. కొత్త యాక్టులను పెట్టి చిరకాలం చెరసాలల్లో మగ్గాల్సి వస్తుందని భయపెట్టింది. ఊరేగింపులు, బంద్‌లు, రాస్తారోకోలు కాదు నలుగురు కలిసిన చోట లాఠీలు నాట్యం చేశాయి. అవసరమైతే ఎంతటి హింసనైనా ప్రయోగించి మిలియన్ మార్చ్‌ని అడ్డుకోవాలని పోలీస్ ఆర్డర్స్ జారీచేశారు. తెలంగాణ ప్రస్థావనకే మండిపడుతున్న ప్రభుత్వానికి మిలియన్ మార్చ్ పిలుపు పుండు మీద కారంచల్లినట్టు అయ్యింది. ఎలాగైనా తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయాలనుకుంటున్న సర్కారుని ఈ పిలుపు పరుగులు పెట్టించింది. అందుకే మిలియన్ మార్చ్‌ని విజయవంతం కాకుండా అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేసింది. ఎన్నెన్నో కుయుక్తులు పన్నింది. పల్లెలవాళ్ళను పల్లెల్లోనే కట్టడి చేసింది. హాస్టళ్ళను మూసివేసింది. విద్యార్థులను ఎక్కడపడితే అక్కడే అరెస్టులు చేసింది. ఉద్యమ కేంద్రాలయిన ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా ఇళ్ళ మీద దాడులు చేసి నాయకులను అరెస్టుచేసింది. ఊర్లకు ఊర్లే నగరానికి కదులుతాయోమోనని ఇనుపబూట్ల కవాతు కొనసాగించింది. పారా మిలిటరీ దళాలతో తెలంగాణ ప్రాంతం నిండిపోయింది. బస్ స్టేషన్లు, రైలు స్టేషన్లూ సైనిక పటాలాలతో నిండిపోయి పోలీసు క్యాంపులను తలపించాయి.

హైదరాబాద్‌లో అడుగడుగునా పోలీసు పహారాతో నగరవీధుల్లో అప్రకటిత కర్ఫ్యూని అమలు చేయించింది. దేశ భద్రతకు నియమించిన సైన్యం, పారామిలిటరీ దళాలు అసెంబ్లీ, సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్‌ని పోలీసులు చుట్టుముట్టారు. ఎక్కడ ఏమూల అడుగు కదిలినా ముసురుకుంటున్న పోలీసులు, ట్యాంక్‌బండ్‌కి మరోవైపు సికింద్రాబాద్ ముఖద్వారం దగ్గర మిలిటరీ దళాల వ్యాన్‌లు వరుసగా చేతిలో ఆయుధాలతో భయపెడుతున్న తీరు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది.

ప్రొద్దున ఫోన్‌లో విన్న అడ్రస్‌ని వెతుక్కుంటూ వ్యాన్‌లో నేనూ, కెమెరామెన్ అమర్, తెలంగాణ వస్తదారాదా మేడమ్ అంటు రోజూ నన్ను ప్రశ్నించే డ్రైవర్ మల్లికార్జున్ అనుకున్న ప్రకారం అడ్రస్‌ని చేరడానికి గంటన్నర పట్టింది మాకు. పోలీసు పహారాని హెచ్ఎంటివి వ్యాన్ దాటుకొని రావడం అంత మామూలు విషయం కాదు. పోలీసులు అడ్డుకుంటున్నారని రెండు నిముషాలు ముందుగానే వ్యాన్ దిగిపోయాం నేను, అమర్. హెచ్ఎంటివి లోగోని బ్యాగులో దాచేసి నడక ప్రారంభించాం. కెమెరాని కూడా పోలీసుల కంటపడకుండా దాచుకొని సికింద్రాబాద్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే రైల్వే బ్రిడ్జిని దాటుకుంటూ వచ్చేశాం. వెనక మా వెహికిల్‌ని ఆపి ప్రశ్నిస్తున్న పోలీసులు బండిలో ఎవరూలేరని చెప్పడంతో

వదిలేశారు. కాస్త ముందు కొచ్చాక మళ్ళీ వ్యాన్ ఎక్కాం నేనూ కెమెరామెన్. కొంచెం ముందుకెళ్ళాక ఎడమచేతివైపు ఓ పురాతన బిల్డింగ్‌పై ఎగురుతున్న కాషాయం జెండా, కాస్త పరికించి చూస్తే ఎదురుగా ఆర్యసమాజ్ అన్న అక్షరాలు కనిపించాయి. మా వ్యాన్ డ్రైవర్‌కి ముందుగానే ఆ భవనాన్ని దాటి పొమ్మని చెప్పి వ్యాన్‌ని మరో వీధిలో ఆపించాం. కెమెరామెన్‌తో పాటు వెనక్కి నడుస్తున్న నాలో ఎన్నో ఆలోచనలు. ఇంత నిర్భందాన్ని ఛేదించుకొని రాగలిగిన మిలిటెంట్ ఉద్యమానికి ప్రజలు సిద్ధమయ్యారంటే ఆ ప్రజల ఆకాంక్ష ఎంత బలీయమైందో మరోసారి రుజువయ్యింది. అంతలోనే ఇంకా అనుమానం. అసలు ఇక్కడ ఇద్దరు మనుషులు కనిపిస్తేనే అడ్డుకుంటున్న పోలీసులు యిక్కడ ప్రదర్శన జరిపితే అడ్డుకోకుండా ఉంటారా? అసలు ఊరేగింపు సాధ్యమేనా అని ఆలోచిస్తూ నడుస్తున్న నాకు ఎవరో విద్యార్థి సైగ చేశాడు రోడ్డుకి మరోపక్క నుంచి అక్కా అటు అంటూ భవనం వైపు చూపించాడు. అతడు చూపిన వైపు వెళ్తే గదిలోపలి నుంచి పైకిమొట్లు కనిపిస్తున్నాయి. ఆ గదిలో అంతా చీకటి, మెట్లవైపు వడివడిగా అడుగులు వేశాను. మెట్లన్ని చెప్పులతో నిండిపోయాయి. కాలుపెట్టే జాగకూడా లేకుండా చెప్పుల జతలు వాటి పక్కనే పై వరకు బారులు తీరిన మనుషులు వంకలు తిరిగిన మెట్లను ఎక్కుకుంటూ రెండో అంతస్తు గదిలోకి అడుగుపెట్టగానే అక్కడి వాతావరణం చూశాక నా ఆలోచనలకు సమాధానం లభించింది. అవును సామాన్యుడి సాహసాన్ని అడ్డుకునే శక్తి ఈ రాజ్యానికి లేదు. రెండవ అంతస్థులో ఓ చిన్నపాటి వేదికపై ఏదో పెళ్ళి జరుగుతోంది. అదీ ఆర్య సమాజం పద్ధతిలో జరుగుతోంది. ఎదురుగా కుర్చీల్లో ఆడవాళ్లు, మగవాళ్లు కనిపించారు. విషయం అర్థంగాక లోపలికి అడుగుపెడితే అప్పుడు కనిపించారు న్యూడెమొక్రసీ నాయకులు సూర్యం, గోవర్థన్, వారితో పాటుగా కూర్చొని సీరియస్‌గా చర్చిస్తున్న జెఏసీ కో–చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, వాళ్ళ చుట్టూ పిడియస్‌యు విద్యార్థులు, అందరి మొహాల్లో యుద్ధం ముందరి ప్రశాంతత. కళ్ళల్లో రేపటి విజయకాంక్ష. గెలుపు ఓటములు కాదు యుద్ధంలో పాల్గొనడమే ముఖ్యం. అదే వీరత్వం. ఆ తరువాత విజయమో వీర స్వర్గమో. యుద్ధమే చెయ్యడానికి భయపడుతూ గెలవాలని కలలుగనడం మనల్ని మనం మోసపుచ్చుకోవడమే. రాజ్యం నిర్భంధాన్ని ఊహించి కూడా యుద్ధభూమిలోకి ఉరకడానికి అక్కడున్న ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారు. ట్యాంక్‌బండ్‌పై అడుగు పెట్టాలన్న కృత నిశ్చయంతో ఉన్నవాళ్ళంతా న్యూడెమొక్రసీ కార్యకర్తలు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు, ప్రధానంగా నిజామాబాద్ జిల్లా మహిళా నాయకురాలు గోదావరి, ఝాన్సి, సంధ్య, ఎస్.ఎల్. పద్మ, సత్య, గౌతమి, ప్రసాద్ ఇంకా చాలా మంది నాయకులతో పాటు 500 మంది దాక

కార్యకర్తలున్నారు. తమ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ఎన్ని అడ్డంకులైనా ఎదుర్కొనేందుకు సిద్ధమైన చైతన్యం అక్కడి సామాన్య కార్యకర్తల్లో సైతం స్పష్టంగా కనిపిస్తోంది. అరెస్టులు, లాఠీలు రుచి ఎరిగినవారే వారంతా. అక్కడున్న వారంతా పెళ్ళికి హాజరైన వారిలా పెళ్ళి తంతుని చూడ్డంలో లీనమయినారు. అక్కడున్న మల్లేపల్లి లక్ష్మయ్య గారిని ఈ పెళ్ళి తంతు దేనికని అడిగాను. పోలీసు నిర్భందాన్ని ఛేదించుకొని తెలంగాణా ఆకాంక్షని ఎలుగెత్తి చాటేందుకు మిలియన్ మార్చ్‌ని సక్సెస్ చేయడానికి ఈ పెళ్ళి తంతు పథకాన్ని రచించాల్సి వచ్చిందన్నారు. అక్కడున్న వారి కళ్ళల్లో అంతులేని ఆత్మవిశ్వాసం ఎలాగైనా మిలియన్ మార్చ్‌ని విజయవంతం చేయాలన్న దృఢ సంకల్పం. క్రమ శిక్షణ కలిగిన సైనికుల్లా ఉన్నారొక్కక్కరు. ఓ పక్క పెళ్ళి తంతు కొనసాగుతోంది. ఆర్య సమాజ్ పూజారి పెళ్ళి జరిపిస్తున్నడు. అసలతనికి తెలుసోలేదో యిది అబద్ధపుపెళ్ళని. అక్కడున్న వారిని మూడు బ్యాచ్‌లుగా విభజించి ఏ బృందాన్ని ఎవరెవరు లీడ్ చేయాలో మాట్లాడుకుంటున్నారు ముఖ్యులు. వెనక నుంచి ఎవరో పదండి పదండి అన్నారు. ఆరు వందల మందికి వండిన అన్నం వృదా అవుతుంది తిని వెళదాం అన్నారెవరో. అన్నం అక్కేర్లేదు పదండి అన్న కేక విని ఒక్కసారే బిలబిల మంటూ కిందకు దిగారు అంతా. ఈలోపే కెమెరామెన్‌ను కిందకు పంపించేశాను నేను. జనం తోసుకుంటూ కిందకు ఉరికారు. దిగిన వారికి దిగినట్టు ఎవరో జెండాలందిస్తున్నారు. ఎర్ర జెండాలు పట్టుకొని మూడు దిక్కులకు మూడు బ్యాచ్‌లుగా విడిపోయారు జనం. అదే రోడ్డులో సిగ్నల్ వైపుకి చూస్తుండగానే వందల మంది ప్రదర్శన బయలుదేరింది. అప్పటి వరకు అక్కడున్న పోలీసులు ఎక్కడినించో బిలబిలమంటూ వచ్చారు. వాళ్ళు తేరుకునేలోగా మూడు జట్లుగా విడిపోయిన ఉద్యమకారులు ఒక బ్యాచ్ పోలీసులను, ముళ్ళకంచెలను దాటేందుకు ప్రయత్నించింది. మరోబ్యాచ్ ఆర్యసమాజ్ దాటుకొని ఉన్న దర్గా దగ్గర నుంచి ట్యాంక్‌బండ్ పైకి వేళ్లేందుకు ముందుకురికారు. మిగిలిన బ్యాచ్ మరోదారిలో ట్యాంక్‌బండ్‌వైపుకి వెళ్ళే ప్రయత్నంలో పోలీసులతో ఘర్షణకి దిగింద్రు. సిగ్నల్ దగ్గరికి వెళ్ళిన వారిని ప్రజలను పోలీసులు తరిమి తరిమి కొట్టారు. ఉద్యమ కారులను అరెస్టులు చేసేందుకు పోలీసులు గుంపులు గుంపులుగా వచ్చారు. దొరికిన వారిని దొరికినట్టు వ్యాన్‌లలోకి ఈడ్చుకెళ్ళారు. ముళ్ళ కంచెలోకి పోలీసులు నెట్టివేస్తే ఆ కంచెను తొక్కుకుంటూ రక్తమోడుతున్న గాయాలతో లోపలికి ఉరికేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ లోగా డాక్టర్స్ జెఏసి నాయకులు డాక్టర్ సురేష్ చంద్ర, డా॥ మధు శేఖర్, డా॥ కనకరాజుకు ఒళ్లంతా ఇనపకంచె గీసుకుపోయింది. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు సైతం ప్రాణాలకు తెగించి ట్యాంక్‌బండ్‌పైకి వెళ్ళేందుకు

ప్రయత్నించారు. వైద్యులు, అడ్వకేట్లు, విద్యార్థులు అన్న భేదంలేదక్కడ. అందరిదీ ఒకే ఆకాంక్ష తెలంగాణ రాష్ట్ర సాధనలో తామొక సమిధ అయినా చాలునని. ఒక్కొక్కరినీ లాక్కెళ్ళేందుకు విరుచుకుపడిన పోలీసులను తప్పించుకొని ఒక బృందం ట్యాంక్‌బండ్‌పై మొదటి అడుగుపెట్టింది. దూరంగా కనిపిస్తున్న వారు భూమిని ముద్దాడినప్పుడు వారి విజయానందం తెలంగాణ నినాదంగా గాలిలో తెరలు తెరలుగా వ్యాపించింది. మా అనుభవాన్ని తెరకెక్కించేందుకు మేం వ్యాన్‌లో వెనుదిరిగాం. ట్యాంక్‌బండ్‌పై మొదట అడుగిడిన వారిని తలచుకుంటూ...

**(ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు)**

# తెలంగాణ ఉద్యమ ప్రతీక

**– కె. గోవర్ధన్,**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో "మిలియన్ మార్చ్" విశేషమైన ప్రాముఖ్యతనే గాకుండా విలువైన గుణపాఠానిచ్చింది. మహెూద్ధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని క్రూర నిర్బంధంతో నలిపివేయాలనుకున్న కిరణ్‌కుమార్ సర్కార్‌కు చెంప పెట్టుగా మారింది. అణచివేతకు ప్రతిఘటన ఉండి తీరుతుందన్న చారిత్రక సత్యాన్ని మిలియన్ మార్చ్ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది. ఉద్యమ శక్తులకు, ప్రజానీకానికి అంతులేని విశ్వాసాన్నివ్వడమేగాకుండా తెగించి పోరాడందే తెలంగాణ రాదనే సందేశాన్ని మరోమారు ఎలుగెత్తి చాటింది. పోరాడే ప్రజల్ని ఎంతటి నిర్బంధమైనా ఆపజాలదని నిర్ద్వంద్వంగా మిలియన్ మార్చ్ నిరూపించింది. తెలంగాణను ప్రకటించిన కేంద్రం మాట తప్పి మోసగిస్తూ వస్తున్నందున మిలిటెంట్ పోరాటాలే కీలకమని మార్గమని నొక్కి చెప్పిన మిలియన్ మార్చ్ మార్గం నేటికీ అనుసరణీయమైనదే!

పోలీసు పహారాలో రాజధాని నగరం

"మిలియన్ మార్చ్‌కు అనుమతి లేదు. మార్చి 11వ తేదీ వరకు హైదరాబాద్ రాజధాని నగరంలో నిషేదాజ్ఞలున్నాయి. సభలు, సమావేశాలు నిషిద్ధం. ఎవరైనా ఆరోజు ఈ ఆంక్షల్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవు" అంటూ గతవారం రోజులుగా రాష్ట్ర డీజీపీ నుండి మొదలుకొని సాధారణ పోలీసు అధికారులదాకా అదే పనిగా ప్రచారం సాగించారు. రాజధాని హైదరాబాద్ మొదలుకొని మొత్తం 10 తెలంగాణా జిల్లాల్లో ఈ ప్రచారాన్ని ముమ్మరంగా సాగించారు. జిల్లా పోలీసు యంత్రాంగమంతా మండల, డివిజన్ స్థాయి మొదలుకొని గ్రామస్థాయి వరకు అధికారులు ప్రచారాన్ని నిర్వహించారు. మార్చి 5వ తేదీ నుండే హైదరాబాద్‌కు ఎవరూ వెళ్లవద్దంటూ హుకుం జారీ చేసారు. సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి నాలుగంటే నాలుగు నిముషాలకంటే ఎక్కువ మాట్లాడకుండా "రచ్చబండ"లో అడ్డుపడి తెలంగాణా పౌరుషానికి ప్రతీకగా నిలిచిన రాయినిగూడెం (వరంగల్ జిల్లా)

మహిళల్ని మార్చి 6నే కస్టడీలోకి తీసుకున్నారు. అన్ని జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మొత్తం పోలీస్ యంత్రాంగమంతా మిలియన్ మార్చ్‌కు తరలకుండా అన్ని రకాలహెచ్చరికల్ని జారీ చేసారు. చాలా చోట్ల తహశీల్దార్లు గ్రామస్థులను పిలిచి బైండోవర్ కేసులు పెట్టారు. మార్చి 10న హాజరుకావాలని ఆజ్ఞలు జారీ చేసారు. ఈ ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తే 10 వేలరూపాయలజరిమానా కట్టాలని బాండు పేపర్స్‌పై సంతకాలు చేయించుకున్నారు. తెలంగాణా జేఏసీ నాయకుల్ని, దానిలో భాగస్వామ్య పక్షమైన సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ మరియు ఇతర ప్రజా సంఘాలకార్యకర్తల్ని, నాయకుల్ని మార్చి 8 అర్ధరాత్రి నుంచే అరెస్టులు చేసారు. ఈ అరెస్టులు మార్చి 10 ఉదయం దాకా వేలసంఖ్యలో నిర్వహించారు. వేలాది మంది ప్రజల్ని, నాయకుల్ని, కార్యకర్తల్ని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే మాజీ శాసనసభ్యులు కామ్రేడ్స్ గుమ్మడి నర్సయ్యతోపాటు పార్టీ నాయకులు పి. రంగారావు, ఆర్. చంద్రశేఖర్ తదితర 2 వేలమందిని అరెస్టు చేశారు.

మార్చి 10న తెలంగాణ జిల్లాలనుండి హైదరాబాద్ వచ్చే రైళ్లను అన్నింటిని రద్దు చేసారు. హైదరాబాద్‌లోని స్థానిక ఎంఎంటీఎస్ రైళ్లతోపాటు మొత్తం 50 దాకా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసారు. ఏ లారీని గానీ, జీపును గానీ ఇతర రకాలవాహనాలను ఎక్కడా అనుమతించలేదు. ఎవరైనా మిలియన్ మార్చ్‌కు లారీలను, ఇతర వాహనాలను సమకూరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని వాటి యజమానులను బెదిరించారు. చాలా చోట్ల ఆర్సీ బుక్కులను లాగేసుకున్నారు. ఆఖరికి ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు తీసుకుని ప్రయాణిస్తున్న వారిని సైతం పోలీసులు విడిచి పెట్టలేదు. రకరకాలప్రశ్నలతో వేధించారు. కొన్ని చోట్ల ప్రయాణికులను కూడా దించి వేసారు.

ఇలా హైదరాబాద్ మహానగరానికి వచ్చే రహదారులలో అక్కడక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసారు. ప్రజల్ని భీతావాహనికి గురిచేసారు. హైదరాబాద్ మిలియన్ మార్చ్‌కు ప్రజలు రాకుండా అన్ని రకాలప్రయత్నాలను చేయడమేగాకుండా జంటనగరాలరోడ్లు అన్నిటినీ దిగ్బంధించారు. రాజధాని నగరంలోని ముఖ్యమైన రోడ్లన్నిటినీ మూసివేసి వేలాది పోలీసులతో పహరా సాగించారు. అటు జిల్లాల్లోని ప్రజలను, ఇటు మహానగరంలోని ప్రజలను ట్యాంక్ బండ్ వద్దకు చేరుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం తన పోలీసులతో అన్ని రకాల నిరంకుశ, నిర్బంధపూరిత చర్యలకు ఒడిగట్టింది. నగరంలోని అన్ని రోడ్లలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసి అష్టదిగ్బంధాన్ని సాగించి పూర్తి స్థాయి కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించింది.

ప్రభుత్వం అనుసరిస్తున్న క్రూరమైన అణచివేత విధానాన్ని ఎదుర్కొని ఎలాగైనా ట్యాంకుబండ్‌పై మిలియన్ మార్చ్‌ను జరిపి తీరాలనే దృఢ సంకల్పం నుండే ఆర్య సమాజ్‌లో పెళ్లి అనే ఆలోచన ముందుకొచ్చింది. దీనిని ప్రతిభావంతంగా, క్రమశిక్షణతో అమలు జరిపి క్యాడర్‌ను అక్కడికి జమ చేయడం జరిగింది. అలా ఆర్య సమాజ్‌లో, చుట్టుపక్కల్లో గుమిగూడిన ఎడెనిమిది వందల మంది సుశిక్షితులైన న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టియు, జేఏసీ శ్రేణులు సరిగ్గా మధ్యాహ్నం 1 గంట లోపే ట్యాంక్ బండ్‌కు చేరుకోగల్గాం. ట్యాంక్‌బండ్ ఒక చివరన గల ఆర్య సమాజ్ నుండి వందలసంఖ్యలో జై తెలంగాణ అంటూ రాకెట్‌లా దూసుకువచ్చారు. మూడంచెల పోలీసు వలయాన్ని, బారికేడ్లను, ముళ్ళ కంచెలను ఛేదించి ట్యాంకుబండ్‌పై మిలియన్ మార్చ్‌ను ప్రారంభించాం. టీజేఏసీ కో-ఛైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, న్యూడెమోక్రసీ నాయకులు సూర్యం, ప్రదీప్, జె.వి. చలపతిరావు, పీఓడబ్ల్యూ నాయకురాళ్లు సంధ్య, ఝాన్సీలతోపాటు నాలాంటి వందలాది మందిమి ట్యాంక్‌బండ్‌పైకి దూసుకెళ్ళాం. ముళ్ళ కంచెలను, బారికేడ్లను తప్పించుకుంటూ రెప్పపాటు కాలంలోనే ట్యాంక్‌బండ్‌పై ప్రత్యక్షమయ్యాం. పోరాట పతాకమైన ఎర్రజెండా నెగురవేసాం. దీంతో హతాశులైన పోలీసు బలగాలు ఉద్యమకారులపై విరుచుకపడ్డారు. దొరికిన వారిని దొరికినట్లుగా చితక బాదారు. ముళ్లకంచెలను, తుపాకులను, లాఠీలను ఎదురొడ్డిన వందలాది ఉద్యమకారులు సమరోత్సాహంతో రాష్ట్ర ప్రభుత్వ - పోలీస్ అష్ట దిగ్బంధాన్ని వీరుల్లా పోరాడి చిత్తు చేసారు. మూడు వైపులనుండి ఒకేసారి విజృంభించిన ఉద్యమకారులు ఎర్రెర్రని జెండాలతో, పిస్టూన్లతో, బ్యానర్లతో ట్యాంక్‌బండ్‌ను అరుణారుణం చేసారు. నిముషాల్లోనే దావానంలా వ్యాపించిన ఈ వార్తతో అప్పటికే వివిధ ప్రాంతాల్లో పోలీసులవలయంతో నిరోధించబడిన ట్యాంక్‌బండ్‌కు చేరుకోలేని వేలాది ప్రజలు మూకుమ్మడిగా బారికేడ్లను, ముళ్లకంచెలను దాటుకుంటూ ట్యాంక్ బండ్‌పై ఉత్సాహంగా చీమలదండుల్లా పరుచుకు పోయారు.

ట్యాంక్‌బండ్‌పైకి న్యూడెమోక్రసీ, ఇతర ఉద్యమకారులు చేరుకున్నారన్న విజయవార్తను టీవీలద్వారా, ఫోన్ల ద్వారా తెలుసుకొన్న నగర ప్రజలు ట్యాంక్ బండ్‌కు బారులుగా కదిలారు. అడ్డం వచ్చిన బారికేడ్లను, ముళ్లకంచెల్ని విరగ్గొట్టారు. పోలీసు లాఠీలను, తుపాకులను లెక్కచేయకుండా వేలాదిగా ట్యాంక్ బండ్‌పైకి విజయోత్సాహంతో ప్రజానీకం చేరుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన అష్టదిగ్బంధనాన్ని పటాపంచలు చేస్తూ వేలసంఖ్యలో వివిధ వర్గాలకు చెందిన ప్రజానీకం ట్యాంక్ బండ్‌పై ఒంటి గంట నుండి 4 గంటలదాకా ప్రశాంతంగా, ఉత్సాహపూరితంగా మార్చ్ నిర్వహించారు.

ఆమూలనుండి ఈ మూలకు, ఈ మూలనుండి ఆ మూలకు బృందాలు బృందాలుగా, సముహాలుగా, ఊరేగింపులుగా పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ మిలియన్ మార్చ్‌ను విజయవంతంగా నిర్వహించారు.

సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ శ్రేణులతోపాటుగా బీజేపీ, సీపీఐ, టీఆర్ఎస్, జేఏసీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు ఉస్మానియా, కాకతీయ తదితర యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు., లాయర్లు, డాక్టర్లు, ఉద్యోగులు ఒక్కరేమిటీ అన్ని సెక్షన్లకు చెందిన ప్రజలంతా మిలియన్ మార్చ్‌లో పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక కార్యకర్తలతోపాటు వివిధ రంగాలకు చెందిన కార్యకర్తలు ఆటలాడుతూ, పాటలు పాడుతూ ట్యాంక్‌బండ్ ప్రాంతమంతా కలియ తిరిగారు. ఈ మార్చ్‌లో కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. మహిళలు సైతం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సరిగ్గా నాలుగు గంటలసమయానికి తెలంగాణ జేఏసీ కో-ఛైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య ట్యాంక్ బండ్ పైగలప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అమరుల త్యాగాలసాక్షిగా తెలంగాణ వచ్చే వరకు వీరోచితంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేసారు.

రాష్ట్ర ప్రభుత్వ అణచివేత, నిరంకుశ, కుట్రపూరిత విధానాలపై ధ్వజమెత్తుతూ సాగిన మిలియన్ మార్చ్‌ను కొంత మంది పనిగట్టుకుని విగ్రహాల విధ్వంసంగా ప్రచారం గావించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన మిలియన్ మార్చ్ ప్రశాంతంగా ముగుస్తున్న సమయంలో మూడు-మూడున్నర గంటల ప్రాంతంలో కొంత మంది విగ్రహాల విధ్వంసానికి పూనుకున్నారు. బ్రహ్మనాయుడు, శ్రీశ్రీల విగ్రహాలపై దాడి జరుగుతున్నప్పుడు నాలాంటి వాళ్ళనేక మందిమి ఇది సరికాదని వారించాం. వ్యతిరేకించాం. ప్రతిఘటించాం. ప్రభుత్వ అణచివేతపై కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహానికి ప్రతీకగానే మిలియన్ మార్చ్‌ను చూడాల్సి వుంటుంది.

మిలియన్ మార్చ్ ప్రశాంతంగా ముగుస్తుందనే సమయానికి కొంత మంది మీడియాపై పనిగట్టుకుని పథకం ప్రకారం దాడి చేసారు. మీడియాకు చెందిన ఓబి వ్యాన్లను, కెమెరాలను ధ్వంసం చేసారు. ప్రతినిధులపై చేయిచేసుకున్నారు. మహిళా రిపోర్టర్‌పై అమానుషంగా ప్రవర్తించారు. మీడియాపై జరిగిన ఈ దాడిని మఫ్టీ పోలీసులు, తెలంగాణా వ్యతిరేకులు చేసిన చర్యగానే భావించాల్సి వున్నది. ఈ అప్రజాస్వామిక దాడులను ప్రజాస్వామిక వాదులు ఖండించారు!

**డీజీపీ ప్రకటన అవాస్తవం**

మిలియన్ మార్చ్ సందర్భంగా జరిగిన విగ్రహాలవిధ్వంసానికి, మీడియాపై

దాడిని జేఏసీలోని భాగస్వామ్య పక్షమైన సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీకి ఆపాదించాలనే విధంగా డీజీపీ అరవిందరావు, ఇతర పోలీసు అధికారులు కుట్ర పూరితంగా ప్రకటించారు. మిలియన్ మార్చ్ విజయం కోసం న్యూడెమోక్రసీ, దాని అనుబంధ సంస్థ అయిన ఐ.ఎఫ్.టి.యూ శక్తి వంచన లేకుండా కృషి చేయడాన్ని సహించలేకనే ఈ రకమైన దుష్ప్రచారానికి దిగడాన్ని న్యూడెమోక్రసీ, ఐ.ఎఫ్.టి.యు తీవ్రంగా ఖండించాయి.

శాంతియుతంగా జరుపతలపెట్టిన మిలియన్ మార్చ్‌కు ముందుగానే పోలీసులను, ప్రభుత్వాన్ని తెలంగాణ జేఏసీ పలుమార్లు అనుమతిని కోరింది. అయినా పోలీసులు అనుమతికి నిరాకరించడమేగాకుండా అడ్డుకొంటామని సైతం బహిరంగంగా ప్రకటించారు. అడుగడుగునా అడ్డంకుల్ని కల్పించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం - పోలీసుల నిర్బంధ విధానాన్ని తిప్పికొడుతూ తెలంగాణ ప్రజలు మిలియన్ మార్చ్‌ను పట్టుదలగా సాహసోపేతంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వపు రకరకాల కుట్రల్ని, నిర్బంధాన్ని ఎదుర్కొంటూ సాగిన ఈ మిలియన్ మార్చ్ విజయవంతమైంది. సంఖ్యలో అంతమందిని అక్కడికి చేరలేకుండా చేసినా, వీరోచితంగా వేలాది మందికి చేరి తెలంగాణా నినాదాన్ని దేశానికంతటికీ వినిపించడంలో పూర్తిగా కృతకృత్యులయ్యారు. తెగించి కొట్లాడితే తప్ప తెలంగాణ రాదనే సందేశాన్ని ఆనాడే కాదు నేటికీ మిలియన్ మార్చ్ గుర్తు చేస్తున్నది. అందుకే తెలంగాణ ఉద్యమానికి మిలియన్ మార్చ్ ప్రతీక.

**(సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు)**

# మిలియన్ మార్చ్‌లో మేము సైతం...

**-యం. బాలనర్సయ్య**

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఒక ఉద్యమ రూపంగా భావించి రాజధాని నగరంలో తెలంగాణ వాదులతో మిలియన్ మార్చ్ నిర్వహించాలని తెలంగాణ జేఏసీ ప్రజలందరినీ కార్యోన్ముఖులను చేయడం జరిగింది. ఉద్యోగుల జేఏసీలో భాగస్వామ్యమైన తెలంగాణ ఇంజనీర్ల జేఏసీ కూడా తమ పరిధిఇలోని పది ఇంజనీరింగ్ శాఖల్లో తీవ్రంగా ప్రచారం చేయడం జరిగింది.

మిలియన్ మార్చ్ చేసే రోజు రానే వచ్చింది. కాని అంతకు ముందు రాత్రి రాష్ట్రమంతా పోలీసు, మిలిటరీ రాజ్యమైంది. ఎక్కడ చూసిన పోలీసుల బూట్ల చప్పుడు, గ్రామాలపై పోలీసుల దాడి, యువకుల కనిపిస్తే అరెస్టులు, చిత్రహింసలు, లాఠీచార్జీలు. తిరిగి కాలేజీ రోజులలో ఉన్న కసి, ద్రోహులపై తిరుగుబాటు అన్యాయంపై పోరాటం, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సాగించిన పోరాటం, వీపులపై పడిన లాఠీ దెబ్బలు, రమీజాబీపై అత్యచారానికి నిరసనగా సాగించిన పోరాటం మరియొక్కసారి మెదళ్ళకు పదును పెట్టడానికి నెమరు వేసుకొనే పరిస్థితి వచ్చింది. ఖచ్చితంగా ఎన్ని అడ్డంకులనైన ఎదిరించి మార్చ్ చేయాలి అనే దృఢ నిర్ణయానికి రావడానికి ఎంతో సమయం పట్టలేదు.

ఇంజనీర్లమంతా "జలసౌధ" వద్ద గుమిగుడాలని నిర్ణయించుకున్నాం. ఉదయం బయల్దేరగానే అడుగడుగునా పోలీసుల వేధింపులు, చెకింగ్‌లు, బారికేడ్లు, హైదరాబాద్‌లో ఉన్నామా? నగరంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజలంతా నిరసిస్తున్నారు. కాని సామాన్య ప్రజలుగా పోలీసులకు భయపడి మనసులోనే తిట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య ఎట్టకేలకు మా కేంద్రమైన జలసౌధకు చేరుకున్నాం. తెలంగాణ ఇంజనీర్స్ జేఏసీలోని ముఖ్యమైన నాయకులమందరం సమావేశమయ్యాం. ఏది ఏమైనా భవిష్యత్తు ఉద్యమానికి కేంద్రంగా మారబోతున్న "ట్యాంక్ బండ్" ను చేరుకోవాలని నిర్ణయించుకున్నాం. కాని ఆఫీస్ ముందు వందలాది మంది పోలీసులు, బారికేడ్లు వాటిని ఛేదించుకొని పోవడమెట్లా? ఆఫీస్ పరిసరాలన్ని కలియతిరిగాం. ఎక్కడ నుంచైనా మనం ట్యాంక్‌బండ్ చేరుకోవాలనే కసి మాలో

ప్రతి ఒక్కరిలో నిండిపోయింది. తెలంగాణ తల్లి విముక్తికై మనం ఏమైన ఫరవాలేదు అనే నిర్ణయానికొచ్చాం. అక్కడున్న అందరం కూడా 25 సంవత్సరాలు వెనక్కి వెళ్లాం. పోరాటాల ఖిల్లా ఉస్మానియా యూనివర్శిటిలో మా విద్యార్థి జీవితాన్ని గుర్తుకు తెచ్చుకున్నంక 50 సంవత్సరాల వయస్సులో కూడా అందరం 25 సంవత్సరాల యువకులుగా మారిపోయాం.

వందమందిమి బయలుదేరాం. రూటు మార్చాం. జలసౌధ వెనకాల ఒక్కొక్కరు మాత్రమే వెళ్ళే దారుంది. దానిని అనుసరించాం. ఒకప్పుడు చైనాలో లాంగ్ మార్చ్ జరిగిందని పుస్తకాలలో చదివాం. కాని మేము బయలు దేరి వెళ్తుంటే అనిపించింది ఓహో లాంగ్ మార్చ్ కూడా ఇలాగే ఉండేదేమో అనే భావన. మనస్సు నిండా ఉత్సాహం, కసి. పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్నాం అనే తృప్తి. ఒక్కొక్కరిగా ఒబేరాయ్ వెళ్లే దారిని దాడుకుంటూ వెంకట్రామకాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ మీదుగా ఖైరతాబాద్‌ప్లై ఓవర్‌వైపు చూశాం. అంతా మిలిటరీ పోలీసు బారికేడ్లు తప్ప ఇంకేమి కనిపిస్తలేవు. అటువైపు వెళ్తే అరెస్టవుతం. కాని మనం గమ్యం చేరాలి. తిరిగి రూటు మార్చాం. ఒక్కొక్కరుగా అక్కడున్న ఒక హెూటల్ సందులోంచి కదిలాం. మా ఇంజనీర్లకందరికి ఆదర్శనీయుడైన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని చూశాం. ఆనాడు హైదరాబాద్ నగరాన్ని వరదల బారినుంచి కాపాడడానికి విశ్వేశ్వరయ్య చేసిన కృషి గుర్తుకు వచ్చింది. అతని మేధాశక్తి నుండి ఇంత మంది హూదరాబాద్ వాసులను కాపాడాడే మరి 100 మందిమైనా మనమంతా మన తల్లి తెలంగాణ విముక్తికై ఏదైనా చేస్తాం తెలంగాణ సాధిస్తాం అనే స్ఫూర్తి అందరిలో నిండిపోయింది. ఒక్కొక్కరుగా ఎంతో ప్రయాసకోర్చి పోలీసుల కళ్ళు కప్పి మెల్ళగా ఖైరతాబాద్ రైల్వేగేటు గుండా ముందుకు కదిలాం. ముందుకు వెళ్తే పోలీసు బారికేడ్లు, ఒక డిసిఎం వ్యాన్. అందరిని అరెస్టుచేసి తీసుకెళ్లడానికి రెడీగా ఉన్నారు. మేమంతా ఏదో దేశద్రోహులమైనట్లు అరెస్టు చేయాలని చూస్తున్నారు. రూటు మార్చి ఒక్కరికి ఒక్కరం సంబంధం లేని వారముగా ఆ బస్తీలోని యువకుల మాదిరిగా మారిపోయాం. బస్తీలోనికి ప్రవేశించాం. బస్తీలోని ప్రజలంతా మమ్మల్ని గుర్తించారు. మమ్మల్ని ఒక వీర సైనికులలాగ భావిస్తున్నారు. అడగక ముందే మంచినీళ్ళిచ్చి విజయంగా తిరిగిరండి బిడ్డా అని దీవిస్తున్నారు. మాకు ఎంతో గర్వంగా అనిపించింది. గత తెలంగాణ పోరాటాల గురించి చదివినవి గుర్తుకు వస్తున్నవి. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కూడా గ్రామీణ ప్రజలు ఎంతో చైతన్యంతో నాయకత్వాన్ని కాపాడుకున్న తీరు ఈ విధంగా ఉండేదా అనే భావన కలిగింది. ముందు ఒక ప్రహరీ గోడ దాన్ని దాటాలి. ఒక్కొక్కరుగా నిచ్చెన మాదిరిగా మారాం. గోడదూకాం. ఏదో సాధించినట్లుగా గర్వం. ఉద్య మ కేంద్రంగా బాసిల్లిన మింట్ కాంపౌండ్ తెలంగాణ చౌరస్తాకు చేరుకున్నాం. అప్పటికీ అక్కడున్న అందరిని అరెస్టుచేశారేమో ఇక ఎవ్వరు లేరు గదా అని

పోలీసు ముఖాలు కొంత సేదదీరడానికి వెళ్లారో లేక మన ప్రాంతంలో (అంటే దాన్ని వారి ఆధీనంలోకి తీసుకున్నారు గనుక) ఇంకెవ్వరు అడుగు పేట్టె ధైర్యమా? అనుకున్నారేమో మాకైతే ఎవరూ ఎదురుగాలె. కాని పోరాటంలో ఒక విచిత్రమైన కలయిక. వీరనారీమణులు ఇద్దరు చెల్లెండ్లు ఒక్కరు గృహిణి, మరొకరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని. ఏ అన్నలు తోడొస్తరా మేము వారితో కలిసి ముందుకెళ్తాం అని ఆలోచనతో అక్కడ ఎదురుచూస్తున్నారు. కాస్త ప్రశాంత వాతావరణ మనిపించి సేదదీరినట్లుగా భావించి చెల్లెండ్లను పలకరించాము. నిజంగా వారు అక్కడకు చేరుకున్న తీరు చెప్తుతుంటే చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలమ్మలుగా అనిపించింది. గృహిణి సనత్‌నగర్ నివాసి. నీవు ఒక్కదానివి ఏ తోడు లేకుండా ఇక్కడికి ఎందుకొచ్చావ్? ఎట్లా చేరుకున్నావమ్మా అని అడిగితే ఆమె చెప్పిన తీరుకు నిజంగా కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి. అంతే కాకుండా మరింత కసి పెరిగింది. ఆమెకు ఎవరు ఉద్యమానికి రమ్మని చెప్పలేదు. చదువు రాదు. తెలంగాణ ఉద్యమాన్ని టి.వి. చూస్తూ 'తెలంగాణ తల్లి విముక్తికై నేను కూడా ఏదైనా చేయాలి' అనే తపన మాత్రమే ఆమెను అన్ని నిర్బంధాలను ఎదుర్కొని తెలంగాణ చౌరస్తాకు చేర్చింది. అక్కడి నుండి ట్యాంక్‌బండ్‌ను చూస్తూ దానిపైకి ఎలా చేరుకోవాలి. అక్కడకు చేరుకుంటే ఇక మన తెలంగాణ మనకు వచ్చినట్లే అనే భావన ఆమెలో కనిపించింది. తన పిల్లల బ్రతుకు మారిపోతుందనే ఆలోచన. ఇక ఇంజనీరింగ్ చెల్లె. ఆమెను పలకరిస్తే అదో పెద్ద కథ. ఎందుకుంటే ఈనాడున్న ప్రపంచీకరణ వాస్తవ పరిస్థితులల్లో ఏ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు కూడా ఉద్య మంలో కలిసిరావడం లేదు. ఎంతసేపు కోర్సు ఎప్పుడు పూర్తిచేయాలి, ఏ అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో సెటిల్ కావాలని, లేదా ఏ సాఫ్ట్‌వేర్ రంగంలో నో స్థిరపడావనే ఆలోచన తప్ప తెలంగాణ ఉద్యమం వైపు చూడడం లేదు అనే భావన మా ఆలోచనలో ఉండేది. కాని ఆ బిడ్డను చూసినంక తెలిసింది. తెలంగాణ బిడ్డలు ఎక్కడ ఉన్న ఏం మాకు సంబంధంలేదు అన్నట్లుగా కనిపిస్తరు తప్ప అది నిజంకాదు అని తేలిపోయింది. ఆమె ఎక్కడో నగరం వెలుపల చదువుకున్నది. ఎన్ని బారికేడ్లు దాటితే సచివాలయం దగ్గరకు చేరుకుంటుంది. వీరిద్దరిని చూసినంక తెలిసి వచ్చింది. మేము వంద మందిమి పడ్డ ప్రయాస అంతా కూడా వీరి ముందు బోసిపోయింది. అంతేకాదు తెలంగాణ ప్రజల ఆకాంక్ష కూడా ఏ విధంగా ఉందో వీరు ఒక ఉదాహరణ మాత్రమే.

తిరిగి ఆలోచించాం. ఏ రకంగానైనా అతి సమీపంలోని టాంక్‌బండ్ చేరుకోవాలి. విజయ చిహ్నంగా దానిని ముద్దాడాలి. ఒకటే తపన. ముందుకు కదిలాం. తెలుగు జాతి ఆత్మ గౌరవం పేరు మీద తెలంగాణపైన అతి క్రూరమైన దోపిడికి కారణమైన ఎన్‌టిఆర్ ఘాట్ చూడగానే తెలంగాణ వనరులను పీల్చిపిప్పి చేసి డిసెంబర్ 9 ప్రకటనను తన రెండు కళ్ళ సిద్ధాంతంతో తెలంగాణ రాకుండా అడ్డుకొని ఇంకా నేను తెలంగాణాకు వ్యతిరేకం కాదని తెలంగాణ అమాయకపు

ప్రజలను మోసగిస్తున్న ద్రోహి మీద, అతనికి సహకరిస్తున్న తెలంగాణ ద్రోహుల మీద మాకు తెలియకుండానే కోపం కట్టలు తెంచుకున్న సమయం. బారికేడ్లు, తెలంగాణ పోలీసులున్నట్లున్నారు సార్ మీరు ఇక్కడకు రావద్దని బ్రతిమిలాట. మేము కూడా అదే తీరులో స్పదించి మెల్లగా మచ్చికచేసుకొని మేమంతా ఇంజనీర్లం, దేశద్రోహులం కాదు. ఈ సమాజం పట్ల మాకు ఎంతో బాధ్యత ఉంది. మేం విధ్వంసకారులమో, ఇంకెవరమో కాదు అని చెప్పుకొని ఆ ఒక్క బారికేడ్‌ను మాత్రం ఛేదించాం. ఇగ మాకు తెలిసి టాంక్‌బండ్‌ను ముద్దాడడానికి కేవలం రెండు బారికేడ్లు దూరం. ఒకటి సచివాలయం దగ్గర, మరొకటి దళిత జనోద్ధారకుడు, చిన్న రాష్ట్రాల ఏర్పాటును లిఖిత రూపం కల్పించిన మా ఆదర్శ దైవం డా॥ బి.ఆర్. అంబేద్కర్ దగ్గర. సచివాలయం బారికేడ్లు చేరుకున్నాం. పోలీసు, మిలిటరీ మమ్ములను చుట్టిముట్టాయి. తెలంగాణ నినాదాలతో సచివాలయ ప్రాంగణమంతా దద్దరిల్లింది. హుస్సేన్‌సాగర్ తన నినాదాలను విని పరవశించింది. అంతేకాకుండా తను తరంగాలను తెచ్చుకొని ఈ ఒడ్డు నినాదాలను ఆ ఒడ్డుకు అంటే సికింద్రాబాద్ తెలంగాణ ఉజ్జయిని మహంకాళి చెవులకు తాకే విధంగా చేయగలిగింది. (తర్వాత విన్నాం అక్కడనుండే బారికేడ్లను ఛేదించుకొని ట్యాంక్‌బండ్‌కు మన సైనికులు చేరుకున్నారని) అందరం ఇద్దరు చెల్లెండ్లతో సహా అరెస్టు అయ్యాం.

అరెస్టయ్యాక తెలిసింది మమ్మల్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్నారు. మా తెలంగాణ బిడ్డలయిన తెలంగాణ పోలీసులని. వారు వారికున్న నిబంధనల కనుగుణంగా ఏమి చేయలేకపోతున్నాము. కాని లేకుంటే వేరే విధంగా ఉండేది. తెలంగాణ తల్లి విముక్తికై అమరుడైన పోలీస్ కిష్టన్న గుర్తుకు వచ్చాడేమో కాని మమ్మల్ని తమ సోదరులకన్న ఎక్కువగా చూసుకుంటున్నారు. అంతేకాదు వారిలో కూడా తెలంగాణ రావాలి, మా ఉద్యోగాలు మాగ్గావాలి, మా ప్రమోషన్లు మాగ్గావాలి అనే కసి ఉంది. కాబట్టి మేమంతా ట్యాంక్‌బండ్ చేరుకోవాలి అనే ఆలోచన వారికి వచ్చినట్లుంది. కాబట్టి ప్రతి బారికేడ్ ఆగిన దగ్గరల్లా కొంత మందిమి దిగిపోవాలి ట్యాంక్‌బండ్ చేరుకోవాలి అని మరియొకసారి ఆలోచించాం. వీలయితే కొంతమందిమి డిసిఎం దిగిపోయే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాం. దిగిన వారందరూ ఏదో రీతిలో ట్యాంక్‌బండ్ చేరుకోవాలి. ముందుగా చెల్లెండ్లతోనే మొదలు పెట్టాము. మమ్ములను తీసుకు వెళ్తున్న గమ్యస్థానం గోషామహల్ స్టేడియం చేరుకునేసరికి కేవలం ఇద్దరమే ఇద్దరం నేను మరియు మా చైర్మన్. అక్కడకు వెళ్ళేసరికే ఉద్యమకారుల అరెస్టుతో స్టేడియం నిండిపోయింది.

చివరగా మేము గర్వంగా ఫీలయ్యిందేమంటే మా డిసిఎం లో నుండి ప్రతి ఒక్కరు ట్యాంక్ బండ్ చేరుకున్నారు. మేము ముందు అనుకున్న మాదిరిగానే నేలను ముద్దాడారు అనే వార్తలు... ఆ సంబరం ఎన్నాల్లుంది... తిరిగి షరా మామూలైంది.

**(తెలంగాణ ఇంజనీర్స్ జెఏసి సెక్రెటరీ జనరల్)**

# కోల్పోయిన నిగ్రహాలు...కూలిన విగ్రహాలు

**-జూలూరు గౌరీశంకర్**

మా అమ్మ పేరు మాణిక్యం/నేనొక్కణ్ణే ఉన్నప్పుడు/చుట్టూ మరెవరూ లేనప్పుడు చాలా దగ్గరికొచ్చి/తరచూ నన్నొక/మాట అడుగుతూ ఉంటుంది/తెలంగాణ వస్తదా అయ్యా అంటుంది/నా మొఖంలోకి దిగులుగా చూస్తుంది/ఆ/రెండు కళ్లలోనూ/ ఇంకా వికసించని శుక్లాల వెనుక/తనకు కనిపించని తెలంగాణ ఉంటుంది/ ఎందుకా ప్రశ్న అడుగుతుందో తెల్వదు/బహుశా శ్రీకాంతాచారి గుర్తొచ్చి ఉం టాడు/ లేదా వేణుగోపాల్‌రెడ్డి మదిలో మెదిలుంటాడు.

కాదంటే యాదయ్యను తలచుకుని ఉంటుంది/నా గురించి కూడా/ఏదో ఒక రుచించని కబురో, వార్తో/వినాల్సి వస్తుందని భయమేమో/మా అమ్మకు ఏం చెప్పాలో తెల్వదు/ఎవరినడిగితే రాష్ట్రమిస్తారో తెల్వదు/మా అమ్మేకాదు/చాలా మంది వొట్టి మనుషులు, మట్టి మనుషులు/గట్టి ప్రశ్నే అడుగుతుంటారు/తెలంగాణ వస్తదా అయ్యా/తెలంగాణ ఇస్తరా అయ్యా అని... మా సీతారాం కవిత్వం రాశాడు.

సీతారాం అమ్మ 86 ఏళ్ల మాణిక్యమ్మ నన్ను కూడా తెలంగాణ ఎప్పుడొస్తది నాయనా అని అడుగుతుటుంది. నన్నేకాదు ఇంకా ఆ యింటికొచ్చే అనేకమంది మాలాంటి పిల్లల్ని అడుగుతునే వుంటుంది. మాణిక్యమ్మేకాదు ఇలా ఎందరో తెలంగాణ తల్లులు ఇదే ప్రశ్న వేస్తున్నారు. ఆ తల్లుల ప్రశ్నలకు సమాధానాలుగా ఉద్యమాలు ఎగిసిపడుతునే వున్నాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు నిదర్శనంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని వెంటనే ప్రకటించాలన్న డిమాండ్‌తో మార్చి 10 తేదీన తలపెట్టిన మిలియన్ మార్చ్ నిర్భంధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగింది. మాణిక్యాల్లాంటి తల్లులు తమ ప్రశ్నలకు సమాధానం కోసం కొడుకుల్ని హైదరాబాద్ నగరానికి పంపించారు. మిలియన్ మార్చ్ విజయవంతమైంది. నిర్భంధాలు, ముళ్ళకంచెలు, లాఠీచార్జీలు, భాష్పవాయువులు, రాజ్యం బెదిరింపులు తుపాకుల పహారాలు, ప్రత్యేక మిలటరీ సైన్యాలు, నిప్పులుగక్కే ఎర్రటెండల్ని దాటుకుంటూ పోలీసు బ్యారీకాడ్లను తొలగించుకుంటూ వేలాది మంది ట్యాంక్‌బండ్ పైకి చేరుకొని తెలంగాణ ఆకాంక్షల జెండాలను ఎగరేశారు.

మిలియన్ మార్చ్‌కు మూడు రోజుల ముందుగానే తెలంగాణ పటమంతా పోలీసు ముళ్ళకంచెతో కట్టేయబడింది. వేల సంఖ్యలో అరెస్టులు సాగాయి. రెండు రోజులుగా హైదరాబాద్‌కు వస్తున్న బస్సులన్నింటినీ, ఇతర వాహనాలను పెద్ద ఎత్తున తనిఖీలు చేసారు. ఎమర్జెన్సీని తలపించే విధంగా పోలీసులు ప్రవర్తించారు. మధ్యాహ్నం 12.30 ని॥ల వరకు ట్యాంకుబండ్ మీద ఒక్క పురుగు కూడా లేదు. అసెంబ్లీ, లిబర్టీ, అటు రాణిగంజ్, ఇటు ఆర్‌పి రోడ్ దాదాపుగా నిర్మాన్యుషంగా వుంది. ఎటు చూసినా పోలీసు వాహనాలు పోలీసు బలగాలతో బందోబస్తు వుంది. ఎవరూ వూహించని విధంగా ఒంటి గంటకల్లా వేలాది మంది ఒక్కసారిగా ట్యాంక్‌బండ్‌పైకి చేరుతున్నారు. పోలీసు ముళ్ళ కంచెలపైనుంచి తమ వీపులపై విరుగుతున్న లాఠీ దెబ్బలను లెక్కసేయకుండా ట్యాంక్‌బండ్‌పైకి కదలిరావడం సాధారణమైన విషయం కాదు. ఈ సందర్భంలోనే అసాధారణ విషయాలు కూడా చోటు చేసుకున్నాయి. కె.కె., మధుయాస్కీలపై విరుచుకుపడ్డారు. దాడికి దిగారు. కొందరు పట్టరాని ఆవేశాన్ని ట్యాంక్‌బండ్‌పైనున్న విగ్రహాల పైకి మళ్లించారు. ఎవరూ వూహించని విధంగా 16 విగ్రహాలు నేలరాలినయి. ఒక పక్క ఎమర్జెన్సీలాంటి నిర్బంధాన్ని ఎదిరించి మిలియన్ మార్చ్ విజయవంతమైంది. ఇదే సమయంలో అణిచివేతల వల్ల, పోలీసుల ఒత్తిడిని తట్టుకోలేని కొందరు విగ్రహ విధ్వంసానికి పూనుకోవటం విజయవంతమైన మిలియన్ మార్చ్‌కు అగ్రహ మంటలు కూడా అంటుకుని భగ్గుమంది.

అసలే మసలే మండుటెండల్లోంచి, పోలీసుల లాఠీదెబ్బలను చవిచూసి తొలుచుకొచ్చిన అగ్రహంలోంచి ట్యాంకుబండ్‌పై విగ్రహాలను కూల్చడం జరిగింది. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు కూలడం కంటే తెలంగాణ ప్రజల నిగ్రహాలు కూలినట్లుగా కనిపించింది. కైరో పట్టణంలోని తెహ్రీర్ స్క్వేర్ దగ్గర లాగా ట్యాంక్‌బండ్‌మీద తెలంగాణ తహరీక్ స్క్వేర్ లేదు. ఇక్కడ ఉద్యమ రూపం మారింది. ఈ సమయంలో వీరిని కంట్రోల్ చేసే నాయకత్వం లేదు. అందుకు కారణాలు అనేకం, ఉద్యమం నాయకత్వం చేతుల్లోంచి బయటపడిందా? ఉద్యమం కింది స్థాయి ప్రజల చేతుల్లోకి వచ్చిందా? ఉద్యమం ఎటువైపుకు మళ్లుతుందో వూహించని దశ ఏర్పడింది. ఈ సందర్భంలో జరిగిన ఘటనే ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల కూల్చివేతకు దారితీసింది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అనేక మలుపులు తిరుగుతూ ముందుకు సాగుతూ వచ్చింది. తెలంగాణ కోసం కొంతమంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించారు. కాంగ్రెస్‌లో హేమాహేమీలు వోడిపాయారు. అయినా పరిస్థితులకు కారణాలు కేంద్రం తెలుసుకోలేకపోయింది. వూరూరా జెఎసీలు పెట్టి, సభలు ఏర్పాటు చేసి ఢిల్లీ వరకు తమ నిరసన స్వరాలు

వినిపించే ప్రయత్నం చేశారు. ఆ కంఠస్వరాలు వినపడనివ్వకుండా, ఆ గళ గర్జనల ఉరుముల మెరుపులు వినిపించనివ్వకుండా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలంగా అదేపని చేస్తూ వచ్చింది. మంత్రుల ఇళ్లకు పోయి మొరపెట్టుకున్నారు. నిరసనలు తెలిపారు. తెలంగాణ మంత్రులంతా ఢిల్లీకి పోతే అక్కడేమో వినేనాధుడే లేడాయె! చివరకు ట్యాంక్‌బండ్ మీద "మిలియన్ మార్చ్" చేయండని జెఏసి పిలుపు మేరకు మార్చ్ చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా కళ్లు తెరుస్తారని తెలంగాణ ప్రజలు భావిచారు. మిలియన్ మార్చ్ సందర్భంగా తెలంగాణ 10 జిల్లాల్లో అడుగడుగునా ప్రజలను హింసలకు గురిచేస్తూ, పలు పార్టీల నేతలను, యువతను అరెస్టులతో వేధించారు. చివరకు 7 సంవత్సరాల వయస్సుగల తెలంగాణ పాటలు పాడే బాలికను కూడా అరెస్టు చేసి వదిలిపెట్టలేదు. అడుగు ముందుకు వేయకుండా చేశారు. వందల కొద్ది కార్యకర్తలను పోలీస్ స్టేషన్లలో పెట్టారు. చివరకు తల్లిదండ్రులను పరీక్షల పేరుతో ఉసిగొల్పారు. పరీక్షల నాడు ఈ మార్చ్ బాధ్యతారాహిత్యం అంటే సమయాన్ని వేళలను కూడా మార్చుకోవటం జరిగింది. కేవలం పౌరసమాజాన్ని డిస్టర్బ్ చేయవద్దని, పరీక్షలు ప్రశాతంగా జరగాలన్న ఆశతో సమయాల వేళలను మార్చుకుంటే, ఇది బలహీనత అనుకుని ఈ సమయంలోనే ఉద్యమాన్ని చావుదెబ్బ కొడతామని ప్రభుత్వం చూసింది. పరీక్షను కూడా మిలట్రీ క్యాంపులా మార్చి నడిపిస్తున్నారని, అది అన్యాయమని ఈ సంఘటనలను స్వయంగా ఐఐటి రామయ్యే ముఖ్యమంత్రి, హోంమంత్రి, కాంగ్రెస్ నాయకులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెడతామని పెద్ద మనిషి రామయ్యకు మాత్రం హామీ యిచ్చారు. చివరకు పరిస్థితులు సరిదిద్దండని ప్రాధేయపడిన చుక్కా రామయ్యను కూడా ప్రభుత్వం పోలీసు అద్దాల నుంచే చూసినట్లుగా వుంది. తెలంగాణ ప్రజల అవమానాలకు పోలీసు ఆంక్షలకు, బాధలకు గురౌతూ కూడా ట్యాంక్‌బండ్‌పైకి జనం తరలి రావడం విశేషం. ఎంత బాధ్యతాయుతమైన మనుషులైనాగాని గదిలో బంధించి నాలుగువైపుల నుంచి అదిమివేస్తుంటే గొంతు పెకలించకమానదు. పెనుగులాటకు సిద్ధంకాకపోరు. అణిచివేతల్లోంచి, ఆగ్రహ ఆవేశాల నుంచి, ఒత్తిళ్ల నుంచి ఎగిస్తే ఏమౌతుందో అదే "మిలియన్ మార్చ్" అయ్యింది. ప్రజాసమస్యలను పోలీసులతోనే పరిష్కరిస్తామనుకోవటం పెద్ద భ్రమ. ప్రపంచ చరిత్ర చదివిన ప్రతివారికి ఇది అర్థమౌతుంది.

నిర్భందాలు పెరిగిన కొద్ది ఉద్యమాలు ఎగిసి పడుతుంటాయి. ప్రజాస్వామిక ప్రభుత్వాలు రాజకీయ సమస్యలను రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ అడ్మినిస్ట్రేషన్‌తో ఎదుర్కుంటే ఇలా ఊహించని పరిణామాలు వస్తాయి. ఈ పరిణామాలకు ఎవరు కారకులు? ఈ సమస్యకు మూలాలెక్కడున్నాయో వెతకండి.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సమస్యకు పరిష్కారాలు వెతకాలి. సమస్యను పరిష్కరించాలి. ఒకరిపై ఒకరు నిందలు వేసుకోకుండా, ఆరోపణల అస్త్రాలు ప్రయోగించుకోకుండా, ప్రజాస్వామిక వ్యవస్థలో నియంతృత్వ ధోరణులు రావటమే దీనికి కారణం. పాలకులు అధికారంరతో ఎంత విర్రవీగుతారో, పాలితుడు కూడా తిన్న దెబ్బల నుంచి అంతగా ఎదురుతిరుగుతాడు. పొద్దు తిరుగుడు పువ్వులా ఉద్యమం వైపుకు తిరిగి ఉద్యమించి పొడుస్తారు. ఏ లాఠీ ఏ దెబ్బ తీస్తదో, ఈ తూటా ఎవరి కడుపును తాకుతుందో, ఏ రాయి ఏ విగ్రహాన్ని తాకుతుందో తెలియదు. అదొక సామాజికమైన ఆందోళన, గుణపాఠాలు చేర్చుకోవాలి.

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్‌లో ఎగిసిన ఆగ్రహ మంటలు అటు అసెంబ్లీని, ఇటు పార్లమెంటును కుదిపి వేశాయి. విగ్రహాలు కూలిపోయిన తర్వాత వాటిని చేసేందుకు వెళ్లిన నాయకులపై కూడా కొందరు తెలంగాణ వాదులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ నిరసలను తెలియజేశారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల విషయంలో ఏ రకంగా ఆధిపత్యాన్ని చలాయిస్తున్నారో అలాగే సాహిత్య, సాంస్క ృతిక రంగలో కూడా ఆధిపత్య ధోరణులు కొనసాగడం వల్లే అనేక పరిణామాలకు దారితీయటం జరిగిందని తెలంగాణ సాహిత్య సాంస్కృతిక రంగం గత దశాబ్ద కాలంగా మొత్తుకుంటూనే వుంది. ఐనా ఈ ఆధిపత్య పాలకులు పట్టించుకోలేదు.

మహోజ్వల తెలంగాణకు నిలువెత్తు రూపాలైన మా కొమరంభీం, బందగి, చాకలి ఐలమ్మ, సుద్దాల హన్మంతు, చించు ఎల్లమ్మ, మిద్దె రాములు, సోయబుల్లాఖాన్, వట్టికోట అళ్వారుస్వామి, దాశరథి, కాళోజీ, భీమిరెడ్డి నర్సింహారెడ్డి తదితరుల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ఎందుకు లేవని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో ఈ అంశంపై ఎంతో కాలం నుంచి ప్రశ్నిస్తున్నప్పటికిని ఆధిపత్య పాలకులు పట్టించుకోలేరు. ట్యాంక్‌బండ్‌పై తెలుగు తేజోమూర్తుల పక్కన మా తెలంగాణ మహనీయుల విగ్రహాలు ప్రతిష్టించలేక పోవటానికి కారణం ఆధిపత్య పాలకుల దురహంకారానికి నిదర్శనమేనని తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగం ధ్వజమెత్తుతూనే ఉంది.

తెలంగాణ ఉద్యమంపై రాజ్యం అణిచివేతల నుంచి ఆకస్మికంగా పెల్లుబికిన నిరసనగా, ఆగ్రహంగా ట్యాంకుబండ్‌పై విగ్రహాల దాడి ఘటనను చూడాలి తప్ప ఇది తెలుగు ప్రజలకు, భాషాభిమానులకు ఆపకీర్తి జరిగిందని గుండెలు బాదుకోనవసరంలేదు. ఆధిపత్య పాలకుల వివక్ష ధోరణి ఇలాంటి ఘటనలకు కారణంగా ఇకనైనా గుర్తించాలి. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ తేజోమూర్తులు విగ్రహాలు నెలకొల్పకపోతే మళ్లీకాలం ఎప్పుడైనా తన నిగ్రహాన్ని కోల్పోవచ్చును.

**(తెలంగాణ రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి)**

# సత్తా చూపిన తెలంగాణ మార్చ్

**-సుజాత సూరెపల్లి**

వాడెవడు వీడెవడు తెలంగాణకు అడ్డెవడు! తెలంగాణ ఆపే దమ్ము ఎవడికుంది? బరికేడ్లకా, పోలీసులకా, దిమాక్ లేని కిరణ్ కుమార్‌కా. అరవీర భయంకరుడు, రక్త పిపాసి అని చెప్పబడే అరవిందరావుకా! చెంచాగిరిచేసే సీమాంధ్ర నాయకులా! తెలంగాణ పేరుచెప్పుకుని పబ్బంగడిపే సత్తాలేని మన నాయకులకా! అట్లాంటి అపోహలన్నిటికి ఇవాళ తెరతీసి నట్టయింది. ఏమనుకుంటున్రు తెలంగాణోలంటే... దటీజ్ తెలంగాణ! నేను లేకపోతె తెలంగాణాల ఉద్యమం నడువది అనుకున్న పెద్ద పెద్దోల్లందరికి లాగి చెంప మీద చెళ్ళున కొట్టినట్టయింది. రాజకీయ నాయకులకి దిక్కు దివాణం లేదన్న నన్ను నమ్మున్రి. ఇవాళ తెలంగాణా మార్చ్ చూడడం అంటే జీవితంలో ఎంత పెద్ద గొప్ప అనుభవమో చెప్పటానికి ఒక్క మాట ఒస్తలే. ఏమి సంబరాలు, సక్కని గుంపులు, డప్పులు, దరువులు, మైకులు లేకపాయె అని ఎం బాధ లేదు. ఒక్కో గొంతు అందుకుందంటే ఇన సొంపైన పాటలు.

నిన్నటి నుంచి పోలీసుల ఓవర్ యాక్షన్ చూస్తుంటే ఒకటి గుబులు, ఎక్కడ పడితే అక్కడ చెక్‌పోస్టులు. అరెస్టులు, దాదాపు అన్ని యూనివర్శిటి విద్యార్థులు, విద్యార్థి నాయకులు అరెస్టు అయినరు. ఉద్యమ కారులు అనుకున్నోల్లు దొంగల లెక్క దాసుకుని దాసుకుని వస్తున్నారు. నిన్నటి నుంచి దాదాపు కర్ఫ్యూ వాతావరణం. ఎవడికి ఇబ్బంది పెట్టకూడదని అనుమతి ఇవ్వలేదని ముఖ్యమంత్రి గారు చెప్పడం చూస్తె చానా జాలేసింది. వీడు మంత్రి ఎట్లా అయిండో దయచేసి ఎవరికన్నా అర్థం అయితే జర చెప్పండ్రి. ఎక్కడ లేని ట్రాఫిక్ ఆంక్షలు పెట్టి పట్నంల ఒక్కడిని సక్కగా తిరగనీయలె. రాత్రి అంత సరిగ్గా నిద్రనే లేదు. పొద్దున్న లేవగానే అన్ని ఊర్ల కేంచి ఫోన్లు. ఏడ కలుసుకుందాం అని. తోచిన కాడ కలుసుకుందాంలే అనుకున్నాం. డిపి రెడ్డి గారికి ఫోన్ చేసిన. అందరం ఆడనే కలుద్దామనుకున్న గాని, మధ్యలో ఆగి ఇంకొద్ది మంది మిత్రులని చేసి పోదామని హిమాయత్‌నగర్‌ల

ఉన్నా జమున పుష్కర్ కూడా వచ్చిందని తెలుసుకొని మాట్లాడిన. విమల దేవకీదేవి వాళ్లు జర అటు పొయిన్రు. గమ్మతి ఏందంటే ఎవరికీ తెలవదు ఏడికి పోవాలనో, ఎట్లా పోవాలనో. మొత్తానికి అందరం అరెస్టుకు సిద్దమయ్యే బయలు దేరినాము. నాకైతే నిన్నటి నుంచే ఇంటలిజెన్స్ వాడు తలకాయ తింటనే ఉన్నాడు. నువ్వు ఏడికి పోతున్నవ్, ఎంత మందిని తీస్క పోతున్నవ్. సంవత్సరం నుంచి అలవాటు అయింది కాబట్టి పెద్ద కష్టం కాలె వాడిని హాండిల్ చేయటం.

హిమాయత్‌నగర్ రావడానికి ఒక్క కష్టాలు కావు. అన్ని చోట్ల పోలీసులు దార్లు మలుపుతున్నారు. చెప్పలేనంత బాధ అయింది తమ్మి! నా హైదరాబాదుకు నట్ట నడుమ ఉన్న నా ట్యాంక్‌బండ్‌కు రానీకి ఇన్ని తిప్పలు. ఇన్ని బాధలని ఒక్కసారి దు:ఖం వచ్చింది. ఎక్కడి బతుకులు, ఏడికి వచ్చినయి. వాని బొందపెట్ట. ఇరాని చాయిలు పాయె. రోడ్డు మీద చాట్ బండీలు పాయె. సక్కని పుట్‌పాత్‌లు బోయి అమెరిక కంపనీలకు బజార్లన్నీ అమ్ముడు పాయె. ఒక్క షాపు చూడానికి కూడా మనసైత లేదు. ఇయాల రేపు ఎట్లనో మహేష్ కార్ల తీసుకపోత అన్నడు. నేను భరత్, మహేష్ ఎన్నో గల్లీలు తిరిగి మొత్తానికి టాంక్ బండ్ చేరుకున్నాము. చిన్న ఇరుకు ఇరుకు మొట్లనుంచి ఒక్కసారి పైకి ఎక్కంగనే ఒకటే సంతోషం ఎవరెస్ట్ ఎక్కినంత. హుస్సేన్‌సాగర్ చల్లగాలి పేయికి తగలంగనే ఒక్కసారి 'స్వేచ్ఛ' గాలి చుట్టుకున్నట్లు అయింది. ఆంధ్రా కంపు వాసనలు, అరువు తెచ్చుకున్న మొహాలు, ప్రేమలు ఏవి కనపడ్త లేవు. సంకెళ్ళను తెంచుకున్న సంతోషం. గెలుపు మాదే అన్న ధీమా చేవుల్లో మార్మోగుతున్న నినాదాలు. ఎవడబ్బా సొమ్మురా తెలంగాణా మాదిరా! కదిలిందిర తెలంగాణా ఖబర్ధార్, ఖబర్ధార్, ఔర్‌ఏక్ ధక్కా, తెలంగాణ ఫక్కా గొంతులు చించుకుని అరుస్తున్నారు. స్వేచ్ఛా వాణి టాంక్‌బండ్ అంతా మార్మోగుతున్నది. అది ఒక సెమినార్ కాదు, మీటింగ్ కాదు, ఒక నాయకుడు లేడు, ఎవరు ఏమైనా చెయొచ్చు. ఎక్కడికి అయిన పోవచ్చు... అంతా నావోల్లే... అంత నా జాగనే... మొట్ట మొదటనే మా భూమి సంధ్యక్క గ్రూప్ కలిసింది. అక్క పాడుతుంటే అందరు డాన్స్ చేసినం. సంధ్యక్క పాట గురించి చెప్పేదేముంది. రేపు చస్తానసెటోడు కూడా లేచి డాన్స్ చేస్తాడు.

మీ అందరి మీద ఒట్టేసి చెపుతున్నా. ఒక్క అంధ్రోడు మొఖం కానరాలె అంత మందిల. రేపు గిట్ల నా తెలంగాణాల ఆంధ్రోల్లు లేకపోతె ఇంత బాటుంటదా ఏంది అనిపించింది. తీరొక్క జెండాలు, పార్టీలు అక్కడక్కడ ఉన్నా యి. లాయర్లు, విద్యార్థులు, సింగరేణి, టీచర్లు, వర్కర్లు ఒకటి కాదు రెండు కాదు చూడటానికి రెండు కండ్లు చాల్తలేవు. మరోవైపు మహిళ జాక్ జలజ పాట జోరుగా అందుకున్నది. మధ్యల ఏర్నాల కిషోర్, రామక్క బృందం బతుకమ్మ

పాట పాడి మస్తు ఆడిపిస్చిన్రు. మస్తు ఎండల కూడా ఎవరు అలిసి పోతలేరు. దాదాపుగా అన్ని ఊర్ల నుంచి జనం వచ్చిన్రు. లొల్లి లొల్లి. నాకు తెలిసిన ప్రతి ఉద్యమ కార్యకర్త కనపడ్డారు. ఈ మధ్యల అందరిని కలుసుడు అంటే తెలంగాణ మీటింగులె. ఇవే పెండ్లి పేరంటాలు ముచ్చట్లు, వీర గాథలు ఒక్కొక్కరం ఎన్ని కష్టాలు పడి వచ్చినమో చెప్పుకొని మురిసి పోవుడు. ఇంతలనే రేవతి అక్క ఫోన్ చేసింది. ఏడికి రావాలె అని, చెప్పినం. తిరిగి తిరిగి ఏడినించి రానీయట్లేదని ఒక్కతే ఇంటికి పోయిందట. మస్తు బాధ అయింది. రేవతి ఒక ప్రొఫెసర్. తెలంగాణాల ఏదో ఒక పని చేస్తనే ఉంటది. సైలెంట్‌గా రాసానే ఉంటది. మాట్లాడతనే ఉంటది. ఇంత పెద్ద ఎత్తున మంది కదిలొస్తె చూడానికి దార్లు బందు బెట్టిన్రు. అట్లా ఎంత మంది ఎనక్కి పోయిన్రో బిడ్లఉ. ఎంత చిన్న బుచ్చుకున్నారో... ఎవడబ్బ సొమ్మురా ఈ హైదరాబాద్? మా ఇంట్లకొచ్చి మా హైదరాబాద్ చుట్టు ముళ్ళ కంచెలు కడతార... ఖబర్దార్ ఒక్కొక్కటికి గోరీలు కట్టి రోజులొచ్చినవి. మంచిగా పోతే మంచిది. లేకపోతె ఎట్లా తోలాల్నో మావోళ్లకి బాగా తెలుసు.

తెల్లని పాల పిట్టవోలె గద్దరన్న తెల్లలాల్చి ఏసుకొని 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా' అని అందరితోని పాడిపిస్తుండు. ఆయన చుట్టూ జనం మస్తుగున్నారు. ప్రతిజ్ఞ చేసిన్రు. ఒక్క మీడియా కూడా రాలె నాకు తెలిసి. అవును ఆయన పాడిపిపంచి, ఆడిపిపంచి తెలంగాణాని రగిలిన్చోడే కాని మాటలు నేర్చిన రాజకీయ నాయకుడు కాదు కదా. అయినా టివిని లెక్కబెట్టినోడెవడు ఎవ్వని ఖుసి వానిదే. ఆడొల్లు ఒక తాన ఆడుతానే ఉన్నారు. ఎవరికి వారు పాడతనే ఉన్నారు. ఇంతలో కాంగ్రెస్ నాయకులకి బుద్ధి చెప్పి పంపిన్రని ఇంకింత సంబురం. కష్టపడి ఓట్లేసి నాయకులను చేసి గెలిపిస్తే కనీసం ఒక్క పర్మిషన్ కూడా ఇప్పించలేరు. పరీక్ష వాయిదా వేయించలేరు. డిజిపితో మాట్లాడ లేరు. ఇంక సోనియా దాక ఎందుకులే ముచ్చట. ఇంతకి వీళ్ళ ధైర్యాన్ని మెచ్చుకోవాలి. అయినా అందరి నాయకులకి ఇదే గతి పడతాదని భయపడ్డాం. కాని ఏం కాలె. దొంగలు బడ్డంక పోలీసొల్లు ఒచ్చినట్టు మా నాయకులు లేట్ ఎంట్రి ఇచ్చిండ్రు. ఎప్పటి లెక్కనే జర మంది కూదిన్రు. కాని అప్పటికే అందరికి తెలిసిపోయింది. ఇంక ఎక్కువ రోజులు నాటకాలు ఆడవని ఇంకో వైపు చూస్తె హరీష్‌రావు, ఈటెల బోట్ల వస్తున్నారని విని మస్తు మజా వచ్చింది. నయం ఇంక పైనుంచి రాలేదు. అయిన ఎక్కడి కష్టాలు మా నాయకులకి. ఎంత చెప్పిన తక్కువే వాళ్ళ గురించి. నౌ ఐ డోంట్ వాంట్ టు వేస్ట్ మై టైం ఆన్ ధెం. ఇది ఏ రాజకీయ పార్టీ కష్టమూ కాదు. కేవలం ప్రజా విజయం. పార్టీలు స్వార్థపూరిత ఆలోచనలతో

వెనక అడుగేస్తే మేమున్నాం అనుకుంటూ ముందడుగు వేసేది ఎపుడు ప్రజలే.

అంత అయిపోయింది అనకుంటే కొంత మంది విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారని వార్త. కడుపు మండుతుంటే ఏం చేస్తారు. అయినా ఇది కూడా సీమాంధ్ర ప్రభుత్వం ఆడిపిస్తున్న నాటకం ఎందుకు కాకూడదు? అవును నాలుగు విగ్రహాలు ధ్వంసం అయితే ఆంధ్రోల్లు గాంధి తాతకి పాలు అభిషేకం చేస్తున్నారు. కొవ్వొత్తుల ప్రదర్శన అంతా టీవీలకు ఇంత పండగ. ఒక్క విగ్రహం పోతె ఇంత బాద పడితే మా భాష, యాస, బతుకులు పోయినందుకు మేము ఎన్ని పాల సముద్రాలు అప్పుతెచ్చుకోవాలి? ఒక టీవీ వాడు "మార్చిచ్చు" అంటడు. ఇంకోడు "రణ మార్చ్" అంటడు. మరోడు "ఉద్యమమా, విధ్వంసమా" "డెమాలిష్ మార్చ్" అన్ని ఛానళ్లల్ల చర్చలే చర్చలు. పొద్దున్నుంచి ప్రజలు ఎంత కష్టపడి తమ ఇంట్లకి తాము వచ్చి పోలీసొల్లని ఏడ బెట్టాల్నో ఆడ పెడితే ఒక్కడు వేయడు. ఊర్లకి పోతున్న వాళ్ళని అరెస్టు చేసి చిత్ర పెడితే పట్టించుకోరు. తెలంగాణా అంటే మావోయిస్టులు అని పర్యాయ పదాలు వెతుకొంటే ఎట్లా. నేను ఎప్పుడో చెప్పిన. ప్రశ్నించే వాడే అన్యాయాన్ని ఎదిరించే వాడే నక్షలైట్ అయితే మేము నాలుగు కోట్ల మందిమి నక్షలైట్లే. అసాంఘీక శక్తులు ఉన్నాయి అంటడు. మా డిజిపి మా భూములు గుంజుకొని, ఉద్యోగాలు గుంజుకొని, మమ్మల్ని దూర దేశాలకు పనికి పోయేటట్టు చేసిన మీరా, మేమా అసాంఘీక శక్తులు? అమ్మ, అయ్యలకే దూరమై అందమైన నా పహర్, శాహర్కి దూరమయి బతుకుతున్నాం. మీరు దొంగలా మేమా? మా నాయకుల బొమ్మలు పెట్టలేదని బాధ ఎక్కువైంది. ఏమ్చేస్తారు అన్న కెమెరాలు పోయినాయ్ ఓకే, ఉంటే కూడా ఏం లాభం చెప్పు. ఒక్కటన్నా మా ఉద్యమం సక్కగుందని ఏసేటోల్లా? అయినా మీరు ఏది ఎయ్యాలనుకున్నారో అదే ఏసిన్రు. మా వోల్లని బోనులో నిలబెట్టి గుచ్చి గుచ్చి ప్రశ్నలు అడుగుతున్రు. ఒక వేల ఇది మా వోల్లే చేసుంటే ఇదే ఈ ఆంధ్రా మీడియాకి గుణపాఠం.

ఎవడు ఏమి కూసినా, ఈ గడ్డ మాది. అన్ని అధికారాలు మావి. తెలంగాణా రోజు రోజుకి ముందుకి పోతున్నది. అడ్డం వస్తే మరి ఏం చేస్తాడో ఇవ్వాల చూడనే చూసిన్రు. సోనియమ్మ కళ్ళు తెరిచి నపుడే తెలంగాణా ఇచ్చేతట్లయితే మాకు ఏ రాజకీయ పార్టీలు అవసరం లేదు. రోజుకో పానం పోతుంది మా పిలగాల్లది. ఏం చేస్తావు కాపాడానికి? మీరందరినీ హంతకులుగా నిలబెడతాము. మీరు సక్కగా ఉంటే మాకు ఈ గతి ఎందుకు పడతది?

ప్రజలు ఒక్కటిగా ఉన్నారు. కొందరు నాయకులు ఉన్నారేమో అని ఆపోహాలు పడుతున్నారు. అంత లేదు. నిస్వార్థంగా ప్రజలు ముందుకొచ్చి పోరాడుతున్నారు. కుల మతాలకిఅతీతంగా అందరిని కలుపుకుంటాం. రాజకీయ పార్టీలను పక్కన

పెడదాం. ప్రజా పోరాటాలని నిర్మిద్దాం. కేంద్రం ఇయాల కదుల్తది. నేషనల్ మీడియా వచ్చింది కదా. ఇంక ఎవడి రాజకీయ ఎత్తుగడలు ఇపుడు అవసరం లేదు. ఆరంభ శేరత్వం ఏమి లేదు.

'భయాన్ని జయిస్తే అతి ప్రమాద కరమైన శత్రువుని జయించి నట్లే అని ఎవరో అన్నట్లు మేం జయించాం. మాకు పోలీసులంటే భయం లేదు. రాజకీయ నాయకులు అంటే ప్రేమ లేదు. మా ప్రాణాల్ని పణంగా పెట్టకుండా నువ్వు కూడా తెలంగాణా తెచ్చేటందుకు లాడాయికి సిద్ధంకా తమ్ముడు.

ప్రాణం ఖరీదు చెప్పగలరా? ఎస్, ఒక ప్రాణం ఖరీదు తెలంగాణా! ఒక ప్రాణం ఖరీదు ఒక రాజకీయ నాయకుడి హత్య/బహిష్కరణ, కొత్త తరం కోసం అన్వేషణ లేకపోతే పైన ఉన్న తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, అన్నలు మనల్ని క్షమించారు.

జోర్ సె బోలో, ప్యార్ సే బోలో జై తెలంగాణా!

ఢిల్లీ మే బోలో గల్లి మే బోలో జై తెలంగాణా!

**(శాతవాహన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్)**

# ఆ రోజు ఏం జరిగింది?

**- పల్లె రవికుమార్**

మార్చి 10... మిలియన్ మార్చ్ సమయంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై వున్న పలువురు తెలుగు ప్రముఖుల విగ్రహాల కూల్చివేతపై చాలా మంది వారికి తోచినట్లుగా మాట్లాడుతున్నారు. కొందరైతే ఇదే అదనుగా ఇష్టానుసారంగా... ఆ రోజు అక్కడ ఏం జరిగిందో తెలియకుండా బాధ్యతారాహిత్య విమర్శలతో తెలంగాణవాదులను మరింత రెచ్చగొట్టె విధంగా వ్యవహరిస్తున్నారు. ఆ సంఘటనకు పురిగొల్పి చారిత్రక, రాజకీయ పరిస్థితుల (ప్రత్యేకించి మిలియన్ మార్చ్ వల్ల ప్రభుత్వం అనుసరించిన నిర్భంద విధానం) పట్ల ఏ మాత్రం పట్టింపు లేకుండా తెలుగుజాతి చారిత్రిక, సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని ధ్వంసం చేయడం కోసమే మిలియన్ మార్చ్ నిర్వహించినట్లుగా విషం గక్కడం చేస్తుంటే వారిలో తెలంగాణ పట్ల జీవితాల పట్ల బాధ్యత కంటే తమ వాణిజ్య, వ్యాపార లావాదేవీలే పరమావధిగా పనిచేసే అక్కడి సీమాంధ్ర (సోకాల్డ్ సమైక్యాంధ్రులు) ప్రజాప్రతినిధులు ఈ విధంగా మాట్లాడటం విడ్డూరం కాదు. కానీ... విజ్ఞులైన ఆ ప్రాంత విద్యావంతులు, మేధావులు కూడా అదే విధంగా మాట్లాడం ఇక్కడి గమనించాల్సిన విషయం మీరు (తెలంగాణవారు) మేం (సీమాంధ్రులు) అన్న వేరుకోణంలో చేసినట్లుగానే ఉంది తప్ప తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఆరు దశాబ్దాలుగా అన్ని రంగాల్లో అనుభవించిన వివక్ష, దోపిడి, నిర్భంధం, అణచివేతలతో రగులుతున్న గుండెల ఆర్థ్రతను చేసుకున్న విజ్ఞతను వారు ప్రదర్శించలేదు. ఐదున్నర దశాబ్దాలుగా తెలంగాణ పట్ల రాజకీయ, సాహితీ, సాంస్కృతిక, చారిత్రక కుట్రల నేపథ్యంలో గూడు కట్టుకుని ఉన్న ఆవేదన, ఆక్రందన, ఉక్రోశం, ఆవేశం ఆ రూపంలో వ్యక్తమైందే. అంతేతప్ప రాజతకీయ పండితులు, సోకాల్డ్ సమైక్యాంధ్రవాదులు విశ్లేషణలు చేస్తున్నట్లుగా విగ్రహాలు కూల్చివేతకు ఎలాంటి వ్యూహాలు, ప్రణాళికలు లేవన్నది ముమ్మాటికీ అంగీకరించాల్సిన వాస్తవం. అది అర్థం చేసుకోవడానికి ఆ రోజు ఏం జరిగిందన్నది

నిస్పాక్షికంగా ఆలోచించగలిగే మనసుండాలి మరి.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులం మేం ఆ రోజు ట్యాంక్‌బండ్ సమీపంలోని భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవడానికి దాదాపు రెండు గంటలు పైగానే పట్టింది. ఎన్నో అవాంతారాలు, చెకింగ్‌ల మధ్య ఏదో ఒక విధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు అక్కడికి చేరుకోగలిగాం. అప్పటికే అక్కడకు చేరకుంటున్న తెలంగాణవాదులు, ఉద్యమకారులను యుద్ధప్రాతిపదికన అరెస్టులు చేస్తూ పోలీసు స్టేషన్లకు తరలిచండం నిరంతరంగా జరుగుతూనే ఉన్నది. ఒక్కసారిగా ఎక్కువ సంఖ్యలో జర్నలిస్టులు అక్కడికి రావడాన్ని గమనించిన డిఐజీ శ్రీనివాస్‌రెడ్డి అక్కడి నుంచి మమ్ములను కూడా వెళ్లిపోవాలని, లేని పక్షంలో జర్నలిస్టులను కూడా అదుపులోకి తీసుకుంటామని మైక్‌లో పదే పదే హెచ్చరికలు చేస్తున్నాడు. అది సరైంది కాదని జర్నలిస్టు మిత్రులు ఆయనతో వాదనకు దిగినప్పటికీ ఫలితం లేదు. దాంతో ఆగ్రహించిన జర్నలిస్టు మిత్రులు ట్యాంక్‌బండ్ పైవైపునకు దూసుకుపోయాం. అదే సమయంలో అప్పటికే ఆగ్రహంతో రగిలిపోతున్న తెలంగాణ ఉద్యమకారులు జిహెచ్‌ఎంసీ మేయిన్ గేట్ సమీపంలో ఏర్పాటుచేసిన బారికేడ్లను ఇరగ్గొట్టుకుని వందలాదిగా దూసుకువచ్చారు. దాంతో ట్యాంక్‌బండ్ చుట్టూ ప్రభుత్వం వేసిన ఇనుపముళ్ల కంచె, ఇనుప గోడలను బద్ధలుకొట్టి సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట (నిర్దేశిత సమయం)కు ఐదు నిమిషాల ముందే ట్యాంక్ బండ్‌పైకి వందలాదిగా చేరుకున్నాం. ఆ క్షణాల్లో ప్రతి ఒక్కరి ముఖాల్లో కనిపించిన ఉత్సాహం, ఆనందం (2009 డిసెంబర్ 9వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలు పెడుతున్నట్లు కేంద్ర హెం సి. చిదంబరం ప్రకటన చేసినపుడు వెల్లడైనట్లుగా) తెలంగాణ రాష్ట్రమే సాధించు కున్నట్లుగా ఉంది. అంటే ప్రజాస్వామ్యయుతంగా ఒక నిరసనను తెలియజేయడానికి ఉద్దేశించిన మిలియన్ మార్చ్ పట్ల ప్రభుత్వం ప్రదర్శించిన నిర్భందం, అణచివేత ఒక కల్లోలిత, యుద్ధప్రాంతాన్ని మించిపోయింది. అప్పటికే గడచిన దశాబ్దానికి పైగా శాంతియుతంగా సాగుతున్న మలిదశ తెలంగాణ పోరాటంలో ఎన్నడూ హింసాత్మక సంఘటనలు జరగలేదు. 1969 ఉద్యమ అనుభవంతో తెలంగాణ ఉద్యమకారులెవరూ ఆ విధంగా జరగొద్దని భావిస్తున్నారు. ప్రభుత్వం ముసుగులో ఉన్న సీమాంధ్ర పెట్టుబడిదారులు, వారి తాబేదార్లే హింస జరగాలని కోరుకుంటున్నారన్నది నిష్ఠురసత్యం. ఎప్పటి మాదిరిగానే తెలంగాణ ఆకాంక్షను రాజకీయాలకు అతీతంగా మరోసారి శక్తివంతంగా తెలియజేయడానికి ఎంచుకున్న రూపమే 'మిలియన్ మార్చ్' కారణాలేమైనా రాజకీయ పక్షాలు పాల్గొనడానికి

ముందుకు వచ్చారు. కానీ పాలకులు దాన్ని ఒక యుద్ధ నివారణ చర్యగా భావించి, ఎన్ని రూపాల్లో అడ్డుకోవచ్చో అన్ని ప్రయత్నాలు చేసింది. వేటికీ ప్రజలు జంకలేదు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకత్వాన్ని రెండు మూడు రోజుల ముందే అరెస్టులు, బైండోవర్లు చేసింది. తెలంగాణ అంతటా వేలాది సంఖ్యలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. అయినా ప్రజలు అన్నింటిని ఛేదించుకుని ట్యాంక్‌బండ్‌కు చేరుకోగలిగారు. ప్రభుత్వం రక్షణవలయాలను చేధించుకుని ఏ మాత్రం చిన్న ద్వారం దొరికనా దాంట్లో నుంచి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చారు. నిచ్చెనలు, తాళ్లతో ట్యాంక్‌బండ్‌పైకి ఎగబాకారు. కొద్ది నిమిషాల్లోనే అక్కడికి వేలాది సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు చేరుకోగలిగారు.

ఒక ప్రజాస్వామ్య దేశంలో, సొంత ప్రాంతంలో శాంతియుతంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేయడానికి ఇంత నిర్బంధమేంటి? తెలంగాణ పట్ల ఎందుకింత అణచివేత? ఈ పరిస్థితి ఇంకెంతకాలం? అన్న కసి, అవేశం, ఉక్రోశం, ఆవేదనతో అక్కడికి చేకున్నవారు ఊగిపోతవడం కనిపించింది. దీన్ని ఎదో ఒక విధంగా వ్యక్తం చేయలన్న మొదలైంది. అది అప్పటికే తెలుగువెలుగుల పేరుతో ట్యాంక్‌బండ్‌పై ఉన్న సాహితీ, సాంస్కృతిక, రాజకీయ ప్రముఖుల్లో తమవారికి సముచితస్థానం లేకపోగా సంబంధంలేని వారిని తమపై రుద్దారన్న భావన తెలంగాణ ప్రజల్లో బలంగా ఉన్నమాట వాస్తవం అనేక సందర్భాల్లో ఆ విషయాన్ని బహిర్గత పరిచినప్పటికీ నిర్లక్ష్యం చేసింది నిజం కాదా? తెలంగాణ ప్రాంత సాహితీ, సాంస్కృతిక, చారిత్రిక విశిష్టతను అణచివేసి సీమాంధ్ర వైభవాన్ని ఈ ప్రాంతంపై రుద్దే ప్రయత్నం ఐదున్నర దశాబ్దాలుగా జరుగుతున్నదన్నది తెలిసిందే కదా. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వాల లక్షణమా? ఈ విషయంలో తెలంగాణేతర ప్రముఖులెవరూ ఎపుడూ ఎందుకు ప్రశ్నించలేదు?... అన్న భావన బలంగా ఉన్న నేపథ్యంలో మిలియన్ మార్చ్ పట్ల సీమాంధ్ర పాలకుల అనుసరించిన వైఖరి అక్కడికి చేరుకున్న తెలంగాణవాదుల ఆగ్రహానిని తోడయింది. మనది కాని చరిత్ర, మనది కాని సంస్కృతి మనకు అక్కర్లేదన్న ఉద్దేశంతో వారి దృష్టి విగ్రహాలపై పడింది. ఈ విషయాన్ని మాతో ప్రస్తావిస్తే వద్దని నివారించాం. ఊరుకున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం మూడుగంటల కల్లా ట్యాంక్‌బండ్ జనప్రవాహమైంది. అప్పటికే చాలా మందిలో ఏ ప్రతిమలనైతే అడ్డం పెట్టుకుని అన్ని రంగాల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారో వాటిని కూల్చివేయడం ద్వారా సీమాంధ్ర పాలకులను హెచ్చరికలు చేయాలన్న ఉద్ధేశంతో మొదలైంది. అది ఎవరు మొదలు పెట్టారన్నది చెప్పలే కానీ... జరిగిన దాని పట్ల అక్కడకు వచ్చిన మెజారిటీవారిలో వ్యతిరేకత మాత్రం వ్యక్తం కాలేదు. ఆ విధంగా విగ్రహాల కూల్చివేత అప్పటికపుడు మొదలైందే

తప్ప దాని బయటి నుంచి తెచ్చిన పారలు, గడ్డపారలు కావు. పైగా కూల్చని కొందరి పేర్లనూ కూడా కూల్చినట్లుగా చెబుతూ ఆ వర్గాల్లో తెలంగాణ ఉద్యమం పట్ల వ్యతిరేకత భావన కల్పించాలన్న కుట్ర మాత్రం స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత మాట్లాడిన వారు తాలిబన్లు, విధ్వంసకారులు… ఇలా ఇష్టమచ్చినట్లుగా మాట్లాడుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.

తన విముక్తికోసం, స్వేచ్ఛావాయువుల కోసం, స్వయంపాలన కోసం తెలంగాణ ప్రలజు తరతరాలుగా అనే రూపాల్లో పోరాటాలు చేశారు. చేస్తూనే వున్నారు. ఆ మహత్తర పోరాటంలో ఈ అనేక రూపాల్లో ఇక్కడ రక్తతర్పణ, ప్రాణత్యాగాలు, ఆత్మార్పణలు జరుగుతూనే ఉన్నాయి. ఆ త్యాగాల లక్ష్యం నెరవేర్చకపోగా వాటిని తక్కువచేసి మాట్లాడటం తెలంగాణ సగటు ప్రజల్లో కసిని రేకెత్తిస్తున్నది. నిరంతరం విశ్వాస ఘాతుకానికి గువుతున్నామన్న ఆగ్రహంతో ఉన్నారు తెలంగాణ ప్రజలు. దానికి ముగింపు పలకాలన్న కార్యదీక్షతతో ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న ఆధునిక రాజరిక వ్యవస్థను, దాన్ని నడిపే దారాజులను కదిలించేందుకు ఇలాంటిదొక శక్తివంతమైన ఉద్యమరూపంగా అప్పటికపుడు ప్రదర్శించిన ధార్మాగ్రహమే తెలంగాణకు మందుపాతరలు పేల్చడమూ వచ్చు. తమ ఆత్మగౌరవం కోసం మందుపాతరై పేలే తెగింపూ ఉ ంది. పోరాటం, త్యాగం, తెగువ ఈ మట్టి సహజ లక్షణం. తెలంగాణ ప్రజల ధర్మాగ్రహంలోని ధర్మసూక్ష్మాన్ని గ్రహించకపోతే వారు నెలివిచ్చినట్లుగా ఏ పరిణామమైనా జరగొచ్చు. దానికి వారిదే బాధ్యత. తెలంగాణ ప్రజల న్యాయమైన, ధర్మమైన పోరాటం ఎప్పటికైనా జయించి తీరుతుంది. అది ఒక వాస్తమం… ఒక చరిత్ర…

**(తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నాయకుడు)**

# మిలియన్ మార్చ్‌లో గని కార్మికులు

**-యం.డి. మునీర్**

మిలియన్ మార్చ్ ఒక అపూర్వ ఘట్టం... ఆకాంక్ష పెల్లుబికిన రోజు... ఇందులో సింగరేణి కార్మికులు పాల్గొనడం అనేది ఒక ప్రత్యేక పరిణామంగా పేర్కొనవచ్చు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అరవై ఏండ్లుగా సింగరేణి కార్మికులు పోరాడుతున్నారు. సకల జనుల సమ్మెలో ముప్పై అయిదు రోజులు పాల్గొని దేశం లోని పారిశ్రామిక రంగాన్ని మొత్తంగా ప్రభావితం చేసిన ఘనత సింగరేణి బొగ్గుగని కార్మికులది. ఇందులో భాగంగానే 2011 మార్చ్ 10న జేఏసీ పిలుపు మేరకు రెండువేల మంది బొగ్గుగని కార్మికులు కొందరు తెలంగాణ అధికారులు మిలియన్ మార్చ్‌లో పాల్గొనడానికి ట్యాంక్‌బండ్ ఎక్కారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్లు, భూపాలపల్లి, ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, గోదావరిఖనిల నుండి వేలాదిమంది కార్మికులు కదిలారు. సింగరేణి జేఏసీ నేతృత్వంలో ఎవరికి వారే ఎవరికి తోచిన విధంగా వారు లభించిన సౌకర్యాల మేరకు వేలాది మంది కదలినప్పటికీ పోలీసుల నిర్బంధం కారణంగా అన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని, పోలీసుల కండ్లుగప్పి ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నది మాత్రం రెండు వేల మంది. ఎక్కడ కన్పిస్తే అక్కడ బస్సుల నుండి, ట్రైన్‌ల నుండి, ఇతర వాహనాల నుండి సుమారు మూడు వేల మంది కార్మికులను పోలీసులు హైదరాబాద్‌కు వెళ్ళకుండా దింపేసి అదుపులోకి తీసుకున్నారు. అడ్డుకున్నారు. హైదరాబాద్‌కు చేరి ట్యాంక్‌బండ్ వద్ద పోలీసు వలయాన్ని ఛేదించుకుని వస్తున్న ఇఫ్టూ నాయకులు బీ సంపత్ కుమార్‌ను అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. అలాగే ఇఫ్టూ సింగరేణి విభాగం అధ్యక్షుడు టీ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి గాంధీనగర్ పీఎస్‌లో పెట్టారు. వీరి వెంట 50 మంది కార్మికులను అరెస్టు చేశారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లును ముందస్తుగా కొత్తగూడెంలోని పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు చేసి ఉంచారు. విగ్రహాల విధ్వంసంతో ఎస్వీకి సంబంధం లేకున్నా ఆ తర్వాత ఆయనను అరెస్టు చేసి కేసు పెట్టారు. సింగరేణి కార్మికుల పాత్ర తెలంగాణ ఉద్యమంలో కీలకమైనది. నేను, టీబీజీకేఎస్ అధ్యక్షులు కెంగర్ల మల్లయ్య, జేఏసీ కో ఆర్డినేటర్ మాదాసు రామ్మూర్తి, శ్రీరాంపూర్ జేఏసీ కన్వీనర్

మల్లేష్, టీబీజీకేఎస్ నాయకులు బంటు సారయ్య, పెద్దపల్లి కోటిలింగం, సంపత్, రవీందర్, డాక్టర్ శంకర్ నాయక్, అధికారుల సంఘం నేత కృష్ణారెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, రహీం, ఇఫ్టూ నాయకులు మేకల దాస్, చాంద్ పాషా, జేఏసీ నాయకులు హెచ్ రవీందర్, కానుగంటి చంద్రయ్య, నీలం సది ఇలా చాలా మంది సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి జేఏసీ నాయకులు ట్యాంక్ బండ్ ఎక్కారు.

మేము ఉదయం మంచిర్యాల నుండి ఆరు గంటలకు బయలు దేరాము. దారి పొడవునా హైదరాబాద్ వరకు 12 చెక్ పోస్టులు (పోలీసులవి) దాటి మా కారును ఒక చోట ఉంచి మూడు పోలీసులు పెట్టిన ముండ్ల కంచెలు దాటి ఇందిరాపార్కు గుండా తొమ్మిది నుండి పది కిలోమీటర్ల కాలినడక వెళ్ళి అన్ని రకాల అడ్డంకులను ఛేదించుకుని ట్యాంక్‌బండ్ ఎక్కాము. మా వెంట మంచిర్యాల ఎమ్మెల్యే జీ అరవిందరెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కూడా వచ్చారు. పదుల సంఖ్యలో కళాకారులు వచ్చారు. ట్యాంక్‌బండ్ మీద ర్యాలీలు, ప్రదర్శనలు, ఆటాపాటలు, స్థానిక, రాష్ట్ర, జాతీయ మీడియాతో మాట్లాడాము. సింగరేణి కార్మికవర్గం ఆకాంక్షను తెలియజేస్తూ ఫ్లకార్డ్స్, బ్యానర్లు ప్రదర్శించాము. తెలంగాణ సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. బొగ్గుబావుల్లోనూ మార్చ్ పదిన కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. ట్యాంక్‌బండ్‌కు చేరుకోలేని వారు పోలీసుల అదుపులో ఉన్న వారు అందరూ ప్రతిజ్ఞ చేశారు.

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్‌లో పాల్గొనడం ఒక అపురూపమైన అనుభవం టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కాంగ్రెస్ నాయకులు కేశవరావ్, ప్రజా యుద్దనౌక గద్దర్, జాగృతి అధ్యక్షురాలు కవిత, ఐదేయూ సెక్రటరీ జనరల్ శ్రీనివాసరెడ్డి, నమస్తే తెలంగాణ ఎడిటర్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ, ఇలా ఎందరో ప్రముఖులు అంతకుముందు జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, జేఏసీ కో చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య, కో ఆర్డినేటర్ పిట్టల రవీందర్ తదితరులు సింగరేణి నుండి మమ్మల్ని కలిసి అభినందించారు.

మిలియన్ మార్చ్ అనేది ఒక అపూర్వమైన సంఘటనల సమ్మేళనం. జీవితాంతం మరువలేని ఒక అనుభవం. ఉద్యమం తీవ్రతకు ప్రతీక. తెలంగాణ ఉద్యమానికి ఒక మైలురాయిగా పేర్కొనవచ్చు. అనంతరం ఇదే స్ఫూర్తితో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కలుపుతూ అటు గోదావరిఖని, ఇటు ఇందారం వద్ద గల అతిపెద్ద గోదావరి బ్రిడ్జిపైన సింగరేణి జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని దిగ్బంధన కార్యక్రమం చేశాము. వేలాది మంది కార్మికులు పాల్గొనగా జేఏసీ నుండి మల్లేపల్లి లక్ష్మయ్య కూడా హాజరయ్యారు.

**(సింగరేణి జేఏసి చైర్మెన్)**

# మూడు రోజుల ప్రయాస

**-రావుల శంకర్**

మిలియన్ మార్చ్ సాహసోపేత నిర్ణయానికి, తెలంగాణ పట్ల ఉన్న గౌరవాన్ని నిరూపించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర జెఏసీ చైర్మెన్ కోదండరాం ఇచ్చిన పిలుపును విజయవంతం చేసేందుకు ఒక కఠిన పరీక్షే అని చెప్పవచ్చు. 9-12-2009న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు గురించి ప్రకటన వెలుబడిన తరువాత నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలు రెండు విడతలుగా కనివినీ ఎరుగని రీతిలో ఉద్యమాలు చేపట్టినప్పటికీ తెలంగాణ తేదేపా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తెలంగాణ గూర్చి తమ స్పష్టమైన వైఖరి ప్రదర్శించక పోవడంతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. మిలియన్ మార్చ్‌లో పాల్గొనాలని నా తపన అంతో ఇంతో కాదు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల జెఏసీ చైర్మన్‌గా పనిచేస్తున్న తరుణంలో ఉద్యమం ఊపందుకోవడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. రిలే నిరాహార దీక్షలు, ధూంధాం కార్యక్రమాలు, కుల సంఘాలు, అన్ని గ్రామాల జెఏసీలు తెలంగాణ వాదులంతా ప్రోత్సాహం ఇవ్వడంతో ఉద్య మాన్ని మరింత ముందుకు నడిపించాలనే తపనను పెంచింది. దీంతో తెలంగాణ రాష్ట్ర జెఏసీ పిలుపుకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు చురుకుగా చేపట్టాను. ఫలితంగా పోలీసుల దృష్టిలో ముఖ్యనేతగా మారాను. రాష్ట్ర జెఏసీ ఇచ్చిన బందు పిలుపులు, రాస్తారోకోల పిలుపులకు, రచ్చబండ కార్యక్రమాలకు అధికార పార్టీనేతలు, ప్రతిపక్ష నేతల పర్యటనల సందర్భంగా ముందస్తు అదుపులు తప్పడం లేదు. దీంతో మిలియన్ మార్చ్‌కు హాజరు కాలేకపోనేమోనని బాధ నన్ను మరింత పట్టుదలను ఇచ్చింది. నావంతు బాధ్యతను నిర్వర్తించడానికి మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేసే నేపథ్యంలో హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్ వద్ద నిర్వహిస్తున్న ఉద్యమంలో పాల్గొనడానికి మరియు సీమాంధ్ర పాలకుల కుటిల ప్రయత్నాలను వమ్ము చేయడానికి పూనుకున్నాను. తెలంగాణ 10 జిల్లాల్లో ఉన్న జెఏసీ, తెరాస, భాజాపా, అగ్రనేతలను అదుపులోకి తీసుకువాలని పోలీసు శాఖకు ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో నేను ముందస్తు ఆలోచనలతో మార్చి 8వ తేది నాడు పొరుగు గ్రామాలకు బయలుదేరాను. వెంటనే మా ఇంటికి నా కోసం

పోలసులు వచ్చినట్లు నా బార్య సమాచారం ఇవ్వడంతో పరుగు పరుగున కుంటాల మండల కేంద్రంలో నివాసం ఉంటున్న మా చెల్లెలి ఇంటికి వెళ్ళాను. అక్కడ ఒక రోజు గడిచిందో లేదో బోథ్ ఎస్.ఐ. జయరాం, సి.ఐ. ఎస్.హెచ్. అహ్మద్ ఫోన్ కాల్ చేసి శంకర్ ఎక్కడున్నావంటూ అడిగారు. నేను పెళ్లి నిమిత్తము కుంటాలకు వచ్చానని బదులు ఇవ్వగా వెంటనే కుంటాల ఎస్.ఐ. తో మాట్లాడించమన్నారు. ఎలాగో నన్ను అదుపులోకి తీసుకుంటారని అనుకొని పరుగు పరుగున నిర్మల్ వెళ్లాను. మిలియన్ మార్చ్‌కు ముందు ఆదివారం అడెల్లి పోచమ్మ వద్ద మా బావమరిది పండగ చేయడంతో నును అక్కడికి వెళ్ళాను. అక్కడ ఆయన మరదలి పెళ్లి మిలియన్ మార్చ్ రోజే హైదరాబాద్‌లో ఉందని ఆహ్వానపత్రిక ఇచ్చాడు. మిలియన్ మార్చ్‌కు హాజరుకావాలని నా తపనకు ఆ ఆహ్వానపత్రిక గుర్తింపు కార్డుగా మిగిలింది. నిర్మల్ నుండి మార్చి 9న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ బస్సు ఎక్కాను. హైదరాబాద్ వరకు దాదాపు 20 నుండి 25 చోట్ల రోడ్డు ప్రక్కన పోలీసు క్యాంపులు పెట్టారు. అయితే నేను ఎక్కిన బస్సులో 18 సార్లు పోలీసులు తనికీలు చేశారు. అన్ని చోట్లా సమాధానం పెళ్ళి ప్రయాణం అయింది. కాగా హైదరాబాద్ చేరుకోగానే లాడ్జిలో దిగుదామంటె మళ్ళీ ఇబ్బందిగా మారుతుందని ఆలోచించి గత 3 రోజుల క్రితం నా మిత్రుడు తెరాస నిర్మల్ పట్టణపాధ్యక్షుడు భూపతిరెడ్డి కారు రిపేరు నిమిత్తము హైదరాబాద్‌లో ఉండడంతో ఆయనకు ఫోన్ చేసి ఆయనున్న రూమ్‌కి వెళ్ళాను. మార్చి 9 రాత్రి 11 గంటలకు మళ్ళీ సి.ఐ. ఎక్కడున్నావంటూ కాల్ చేయగా హైదరాబాద్‌లో ఉన్నానని అన్నాను. ఇంకేముందు సి.ఐ.కి కోపం చిర్రెత్తుకొచ్చింది. ఫోన్‌లోనే కోసం చేశాడు. డిఎస్‌పి నుంచి 3 రోజుల మొదలే నిన్ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలున్నప్పటికీ నీ మీద నమ్మకంతో ఒక రోజు ఆలస్యం చేయడంతో నిమ్మకాన్ని వమ్ము చేవావన్నాడు. అయినా నీవు మిలియన్ మార్చ్‌కు వెళ్ళకుండా అక్కడే రూమ్‌లో ఉండాలని ఆదేశించడంతో నేను ఫోన్ కట్ చేశాను. నాకు అన్ని విషయాలలో అండగా ఉన్న సి.ఐ. ఒక వైపు అయితే మిలియన్ మార్చ్ విజయవంతం చేయడం మరోవైపు దీంతో నా ఉద్యమస్ఫూర్తి మిలియన్ మార్చ్ వైపే మొగ్గు చూపడంతో నేను మార్చ్‌కు సిద్ధమయ్యాను. మిలియన్ మార్చ్ రోజు ఉదయం నుండే పోలీసులు ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహిస్తూ తెలంగాణ వాదులను అదుపులోకి తీసుకుంటున్నారు. వెంటనే మా గ్రామ ముద్దు బిడ్డ రాష్ట్ర విద్యావంతులవేదిక ఉపాధ్యక్షులు శ్రీధర్‌దేశ్‌పాండే కు ఫోన్ చేసి నేనెక్కడికి రావాలని అడగగా జెఏసీ కార్యాలయంలో కలుసుకుందాం రా అని అన్నారు. నేను ఒంటరి వాన్ని కావడంతో ఎలా వెళ్ళాలో అర్థం కాక నా మిత్రుడు టిఆర్‌టియు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడగగా సికింద్రాబాద్ బస్ స్టేషన్‌లో ఉన్నానని అక్కడికి రమ్మనగా నేను హుటా హుటిన వెళ్ళాను. అక్కడ ఆయనతో కలిసి వారు వచ్చిన

కారులోనే ఆయన మిత్రుని ఇంటికి వెళ్ళి కారు అక్కడే ఉంచాము. ఆ తర్వాత ఒక ఆటోలో కూర్చొని ఆదిలాబాద్ పశ్చిమ జిల్లా తెరాస అధ్యక్షుడు శ్రీహరిరావు గృమానికి చేరుకున్నాము. ఆయన గృహము లోనే అల్పాహార, తేనీరు తీసుకున్నాము. అక్కడి నుంచి పోలసుల దృష్టి మరల్చి మరింత మంది తెలంగాణ వాదులము కలిసి ఇద్దరేసి చొప్పున ఆటోల్లో మంచిర్యాల ఎమ్మెల్యే అరవిందరెడ్డి క్వార్టరుకు దొంగతోవలతో చేరుకున్నాము. అప్పటికి అక్కడ పోగైన తెరాస నేతలు, కార్యకర్తలు ప్రణాళికా బద్ధంగా ట్యాంకుబండ్ వైపు వెళ్ళేందుకు ప్రణాళికా రూపొందిస్తున్నారు. మిత్రుడు నేను ప్రభుత్వ ఉద్యోగులము కావడంతో తెరాస కండువాలు కప్పుకోవడం బాగుండదని తెలిసి రాష్ట్ర జెఏసీ కార్యాలయానికి వెళ్ళాము. అప్పటికే జెఏసీ చైర్మన్ కోదండరాం గారి అరెస్టు పర్వం కొనసాగుతుంది. వెంటనే బోథ్ వాస్తవ్యుడైన తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్ దేశ్‌పాండేను ఫోన్‌లో సంప్రదిస్తే ఇక సమయం లేదు మార్చ్ కోసం ఎవరిదారి వారిదేనని అన్నారు. ఆ సందర్భంలో మేమిద్దరం ట్యాంకుబండ్‌వైపు పరుగులు వేశాము. ఇంకేముంది ట్యాంకుబండుకు దగ్గరలోనే పోలీసులు లాఠీలు జులిపించారు. నాపై కూడా ఓ కోరడా దెబ్బ పడింది. కొత్తగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. మా కాళ్ళు లోయర్ ట్యాంక్‌బందు వైపు మళ్లాయి. ఇది గమనించిన పోలీసులు మమ్ములను పట్టుకునేందుకు రాగా పరుగులందుకున్నాము. ఫలితంగా లోయర్ ట్యాంకుబండ్ వైపు నుండి ట్యాంకుబండ్ పైకి చేరుకున్నాము. అప్పటికే అక్కడికి చేరుకుంటున్న తెలంగాణవాదులతో ట్యాంకుబండ్ పులకరిస్తుంది. మేము చేరుకొని ట్యాంకు బండును ముద్దాడడంతో మా ఆనందం అంతా ఇంతా కాదు. మా ఆనందానికి అక్కడ తెలంగాణలో సాంప్రదాయ వాయిద్యమైన డప్పు చప్పుడు తోడయింది. డప్పు చప్పుడుతో పులకరించిన నా తనివి అదుపు తప్పింది. నాకు తెలయకుండానే నా కాళ్ళు నాట్యం అందుకున్నాయి. మా ఆనందం పంచుకునేందుకు అక్కడే వేచి ఉన్న టీ న్యూస్ మిత్రుడు మా వైపు కెమెరాను తిప్పాడు. మా జిల్లా వాసులు మిత్రులు పదే పదే ఫోన్ చేస్తుంటే విసుగుతూనే ఒక కాల్ అటెండ్ చేశాను. కంగ్రాట్స్ అంటూ ఓ మిత్రుడు న్ను టీ న్యూస్‌లో చేసి ఆనందంతో చేసిన కాల్ అది. అప్పుడు తెలిసింది మా ఆనందాన్ని టి న్యూస్ మిత్రుడు జిల్లా వాసులు, తెలంగాణ వాదులతో రిలే కార్యక్రమం ద్వారా పాలుపంచుకుంటున్నాడని. ఇంకే ముంది తెలంగాణ సాధించినంత ఆనందం. ఇంతలోనే కొందరు సీమాంధ్ర దుండగులు ట్యాంకుబండ్‌పై ఉన్న విగ్రహాలను ధ్వంసం చేసి ఏమి ఎరుగనట్లు జీపులో వచ్చి కూర్చున్నారు. అది గమనించిన తెలంగాణ వాదులు వారిని బయటికి వెళ్ళాంటూ కోరటంతో అంతలోనే పోలీసులు వచ్చి ఆ జీపును అందులోని వ్యక్తులను మటుమాయం చేయడం నా కల్లార చూశాను. దీన్ని బట్టి నాకు అర్థమైంది ఏమంటే కేవలం కోపంతో ఉన్న తెలంగాణ

వాదులను రెచ్చగొట్టేందుకే సీమాంధ్ర గుండాలు పోలీసులు పన్ని కుట్రగా అర్థమైంది. ఈ సంఘటనతో అమాయకులైన తెలంగాణ వాదులు ఎంతగా మోసపోతున్నారో మరోసారి రుజువైంది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మరింత వేగవంతం చేయకపోతే మరెంతో నష్టపోవాల్సి ఉం టుందని నా ఆవేదన. ఇప్పటికైనా ప్రతి తెలంగాణ బిడ్డ ఉద్యమ స్ఫూర్తితో ప్రాణాలను పణంగా పెట్టైనా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరుగులు తీస్తారని ఆశిస్తూ....

జై తెలంగాణ జైజై తెలంగాణ

**(ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల జెఏసీ చైర్మెన్)**

# తెలంగాణ ఆకాంక్షల కవాతు

**–హెచ్. రవీందర్**

" గోడ పగుల గొట్టు – సరికొత్త మేడ కట్టు "

నా చిన్న తనంలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారమయ్యే బృందగానం ఇది. నాకు నచ్చిన గీతం. నా వయసు పెరుగుతున్న కొద్దీ, నా ప్రాపంచిక జ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ ఆ పాట మీద మమకారం మరింత పెరిగింది.

మార్చి 8,2011 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. సింగరేణి జెఏసి సభ్యులము, మందమర్రిలో గనుల మీదకు వెళ్ళి హైదారాబాద్ లో మార్చి 10న జరిగే మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసాం. ఆ తర్వాత మందమర్రి జెఏసి, సింగరేణి సభ్యులం అంతా కల్సి అనుకున్నాం. అందరం కల్సి 'ఛలో' గా వెళ్తే పోలీసులు అడ్డగించడం ఖాయం. 9వ తేదిన మనలను పోలీసులు అరెస్టులు కూడా చేస్తారు. కా బట్టి ఎవరికి వారుగా వీలైన మార్గాల్లో హైదారాబాద్ చేరుకోవాలని నిర్ణయించుకున్నాం. నేను 8వ తేది మధ్యాహ్నం " తెలంగాణ ఎక్స్‌ప్రెస్ " కు హైదరాబాద్ వెళ్ళాను. 9వ తేదిన పోలీసులు మందమర్రిలో జె.ఎ.సి. నేతల ఇండ్లల్లకు వెళ్ళి వాకబు చేసారు. అప్పటికే ఎవరి జాగ్రత్తలో వాళ్ళు ఉన్నారు. 9వ తేదిన మందమర్రి జె.ఎ.సి. నేతలు శోభన్‌రావు, ఈశ్వర్, సూరిబాబులు వచ్చి సికింద్రాబాద్‌లో లాడ్జిలో దిగారు. ఆరోజు రాత్రి పోలీసుల వచ్చి లాడ్జిపై రెయిడ్ చేసారు. మా పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. రేపు పరీక్షలు రాయబోతున్నారు. వారిని కలిసేందుకు వచ్చామని చెప్పడంతో వదిలివేసారు.

ఇక తెల్లవారింది, మార్చి10 ట్యాంక్‌బండ్ పోలీస్ వలయంలో వుంది. దుర్భేద్యంగా వుందని, మూడు, నాలుగంచెల రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసారని సీమాంధ్ర మీడియా ఉదరగొడ్తోంది. టివి చూస్తున్నా నాకు ఎక్కడలేని టెన్షన్ పెరుగుతోంది. మందమర్రి జెఏసి మిత్రులను లాడ్జిలో కల్సుకున్నా. ట్యాంక్‌బండ్ చుట్టూ తిరుగుదాం. లెంకుదాం. ఏదో ఒక మార్గం దొరుకకపోదు అనుకున్నాం.

మా మిత్రులు ఆటోలో బయలు దేరారు. నేను మా తమ్ముడు సదానందం మోటర్ సైకిల్ పై బయలు దేరాను. ట్యాంక్ బండ్ చూట్టా సుమారు 10 చెక్కర్లు కొట్టాం. కోదండరామ్,పిట్టల రవిందర్, గద్దర్, మా నియోజక వర్గ ఎం.ఎల్.ఎ. నల్లాల ఓదెలు సహా టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలు అంత అరెస్టు అయినట్లు తెలిసింది. అంతటా పోలిసులే. బారికేడ్లె . నిరాశ, నిస్సత్తువ, ఆవహించింది. దు:ఖం వస్తోంది. ఓడిపోవాల్సిందేనా..... గూడుకట్టుకున్న ఆవేదన. మిలియన్ మార్చ్‌కు మద్దతు పలికిన కాంగ్రేస్ ఎమ్మెల్యేలు,ఎంపిలు ఏం చేస్తున్నట్టు. వారిపై గుస్సా. మెల్లగా లిబర్టీ వద్ద నుండి ట్యాంక్ బండి ముఖద్వారం వద్దకు చేరుకున్నాం. తెలంగాణ జర్నలిస్టు ఫోరం కు చెందిన సభ్యులు, విలేకర్లు బారికేడ్లను తోసివేస్తున్న సంఘటన కనిపించింది. మేమూ వేగంగా వెళ్ళి ఆ గుంపులో చేరాం. బారికేడ్లు విరిగాయి. పోలీసు అధికారి ఒకరు విలేకర్లతో గొడవ పెట్టుకుంటున్నాడు. ఐ.డి. కార్డులు ఇవ్వమని అడుగుతున్నాడు. మా వెనుకు ప్రజా సమూహం వెల్లువలా, సునామి అలల్లా ట్యాంక్ బండ్ పైకి వస్తోంది. ఆదో అద్భుత సన్నివేశం. పోలీసులు అడ్డుకోలేక చేష్టలుడిగి రిట్రీట్ అవుతున్నారు. నేను ట్యాంక్ బండి పై కాలుమోపాను. అదో గొప్ప అనుభూతి. విజయగర్వం. ఒకరినొకరం అభినందించుకున్నాం. అలైయి బలైయి తీసుకున్నాము. అందరిలో ఒక ఉద్వేగం. ఉత్సాహం. సీమాంధ్ర ప్రభుత్వ కుట్రలను, వ్యూహాలను ఛేధించి తెలంగాణ పౌరుషం ట్యాంక్ బండ్‌నెక్కింది. మీడియా కెమారాలు ప్రజా అలలకు ఎదురొచ్చి రకరకాలుగా ప్రశ్నిస్తున్నాయి. ప్రజలు అంతా ఒకే మాట “ మేం గెలిచినం. ట్యాంకు బండ్ ఎక్కినం. ముఖ్యమంత్రి, పోలీస్ బాస్ తలలు ఎక్కడ పెట్టుకుంటారు ” అని.

సింగరేణి జెఎసి. యం.డి. మునీర్, కెంగర్ల మల్లయ్య, మాదాసు రాంమూర్తి, మల్లేష్‌లు, కలిసారు. మరొక్క దారిలో పోలీసులను ఛేదించుకొని యం.ఎల్.ఎ. ఆరవింద రెడ్డి తో మా ప్రాంత తెబొగకాసం నేతలు జె. రవిందర్, సంపత్‌లు కలిసారు, జనంతో ట్యాంక్ బండ్ నిండిపోయింది. ఇంతలో ఒక మారుతీ వ్యాన్ జనం మధ్యకు వచ్చింది. పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లతో పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్నా కాలమా “ పాట. జనం కేరింతలు, నృత్యాలు నా పక్కనే ఉన్న సురా “ రవి.... ఈ విగ్రహాలను చూడలేక పోతున్నా ” అన్నాడు. ఇంతలో మందమర్రి కి చెందిన టి ఆర్ ఎస్ కార్యకర్త సది కనపడ్డడు. సదిని పిలిచిన, మనం కనీసం ఒక విగ్రహం ముక్కైన ఊడగొట్టాలి. అని చెప్పిన. సది బక్కగా ఉంటడు. వెంటనే ఒక చిన్న రాయి పట్టుకుని ఎఱ్ఱాప్రగడ విగ్రహం ఉన్న పెడస్టల్ ఎక్కిండు. రాయి పగిలింది కాని ముక్కు విరగలే, ఇంతలో ఒకరు. ఇప్పుడే ఎందుకు తొందర కొంచెం ఆగండి అన్నారు. ఇంతలో కొందరు యవకులు విరిగిన బారికేడ్ల పైపులను

తీసుకువస్తున్నారు. వాటిని విగ్రహల కూల్చివేతకు ఉపయోగిస్తే.... బ్రహ్మాండమైన ఆలోచన. ఆ యువకులను అడిగాం పైపులెక్కడికి అని. చిత్రం... మా మనసులో వున్న సమాధానమే వారు చెప్పారు. అప్పుడు అర్థం అయింది. ఇక్కడ కు వచ్చిన ప్రతి ఒక్కరి కన్ను విగ్రహాలపై పడింది అని. తరతరాల సాంస్కృతిక ఆధిపత్యం పై కసి అందరిలో రగులుతుంది.

జనం ఒక్కసారిగా విగ్రహాలపై పడ్డారు. బొగ్గు బాయి మీద కార్మికులను ఓవర్‌మెన్ డిస్ట్రిబ్యూట్ చేసినట్లు ఎవరికి వారు గుంపులుగా విడిపోయి ఒక్కొక్క విగ్రహాన్ని అక్కు పై చేసుకుంటున్నారు.పీఠం పై పలకలు ఛటేల్, ఛటేల్ మని పగులుతున్నాయి. గనుల్లో పెద్దపెద్దయంత్రాలను చిన్నచిన్న గడ్డపారలతో కదిలించ గల అనుభవమున్న మిత్రుడు బి. మాధవ రెడ్డి బ్రహ్మనాయుడి విగ్రహం దగ్గర యవకులకు పైపులతో ఎట్లా పడగొట్టాలో చెప్తున్నారు. కాళ్ళ కింద పైపు చివరను పెట్టి, పైపు కింద బండరాయిని పెట్టి, పైపును కిందకు ఒత్తారు. పీఠం నుండి విగ్రహం పైకి లేచింది. పీఠం పై సలాకలు వంగిపోయాయి. విగ్రహం కిందపడింది. ఇది చూసి జనం పెద్ద పెట్టున అరుస్తు కేరింతలు కొట్టారు. శ్రీశ్రీ విగ్రహ విధ్వంసం మొదలైంది. ఇది శ్రీశ్రీ విగ్రహం. వద్దు. ఆయన ప్రజాకవి. మహాకవి. అని ఒక తెలంగాణ వాది ఆడ్డుకుంటున్నాడు. " శ్రీశ్రీ మనవాడా ? ఆంధ్రానా ? గది చెప్పు అని మరోకరు ఆగ్రహంగా అడుగుతున్నాడు. మరికొందరు కలిసి నచ్చ చెప్పడం తో విగ్రహ ధ్వంసం ఆపారు. మరొక్క చోట ఒకరు ఆ మహత్కార్యాన్ని, కెమరాలో బంధిస్తున్నాడు. ఒక యువకుడు పోయి కెమరా గుంజుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వారి మధ్య పెనుగులాట జరుగుతుంది. గుంపుల్లో నుండి మా మిత్రుడు ఈశ్వర్ కెమరా గుంజుకుకే వ్యక్తిని ఆకర్షించి " సైగ" చేసాడు. అంతే కెమరా ఎగిరి హూస్సేన్ సాగర్ లో పడింది. నిత్య నిర్భంధంలో తరతరాల పోరాట వారసత్వాన్ని కాపాడుకుంటున్న తెలంగాణకు " ఇషారా " కాఫీ. కూలుతున్న విగ్రహల మధ్య, జనచేతనం మధ్య ట్యాంక్ బండ్ మీద అటూ, ఇటూ ఎన్నిసార్లు తిరిగామో. ఆకలి లేదు. కాళ్ళ నొప్పులు లేవు. ఉచితంగా నీళ్ళు, అన్నం, పులిహోర, పోట్లాలు లాయర్ల, విధ్యుత్, మున్సిపల్ జె.ఎ.సి వాళ్ళు పంపిణి చేసారు. సాయంత్రం అవుతోంది. సూర్యుడు అస్తమించబోతున్నాడు. తనవితీరా ట్యాంక్ బండ్ పై మరొక్క (టిప్పువేసి, రేపటి నూతన నిర్మాణ కొసం జరిగిన విధ్వంసాన్ని (ఖాండవ దహనాన్ని) మనసు కెమారా లో బంధించుకుని విడువలేక, విడవలేక ట్యాంక్ బండ్‌ని వదిలాం, మరుసటి రోజు రాత్రి హైదారాబాద్ నుండి మందమర్రి కి బస్సులో బయల్దేరాను. ట్యాంక్ బండ్ పై ధ్వంస రచన మరోసారి తనవి తీరా చూసాను. తెలంగాణ

వైతాళికులయిన కోమురంభీం, చాకలి ఐలమ్మ, రావి నారాయణ రెడ్డి, సర్వాయి పాపయ్య, మొదలకుని, కాళోజి, శ్యాం, మహేష్, సింగరేణి రమాకాంత్, బెల్లి లలిత, తెలంగాణ ఉద్యమ మలిదశలో బలిదానం చేసుకున్న శ్రీకాంత్ చారి, యాదయ్య,శ్వేత ల విగ్రహాలను ఉహించుకున్నాను, ఇది విధ్వంసం అని, సాంస్కృతిక పతనం అని సీమాంధ్ర మీడియా మొదలు తెలుగు పలుకడం రాని రాజకీయ నాయకులు, ఇన్నాళ్ళ మేం మెచ్చిన కొందరు పత్రికా సంపాదకులు వ్యాఖ్యానించినా జానేదేవ్. నిజానికి ఇదివిధ్వంసమే. తెలంగాణ సమాజం పై రుద్దబడిన సాంస్కృతిక భావజాల విధ్వంసం. ఈ విధ్వంసంలో నుంచి యావత్ తెలంగాణ ప్రజలను జాగృతం చేసిన, ప్రతీకగా నిలిచిన వీరులను ట్యాంకు బండ్ పై నిలుపుకోవాలి. ముసురుకున్న అలోచనలను దూరం చేస్తూ నిద్రలోకి జారుకున్నాను. తూర్పు తెలతెల వారుతుండగా మార్చి 12 ఉదయం మిలియన్ మార్చ్ విజయగాధను మోసుకుంటూ నల్ల నేలపై అడుగు పెట్టాను.

**(తెలంగాణ విద్యావంతుల వేదిక మందమర్రి డివిజన్ అధ్యక్షుడు)**

# నేను చూసిన మిలియన్ మార్చ్

**పి. సూర్యనారాయణ**

ప్రజలను ఎక్కడికక్కడ నిర్బంధం చేస్తున్నరు. మరి మిలియన్ మార్చ్ అయితదా అన్న సంశయం. ఏమన్నా కానియ్, చూసైతే వద్దాము అనుకున్న. రిటైర అయినోన్ని. ఈ వయసుల నాకెందుకులే అని ఊకుండబోతె ఊకుండబుద్ధికాలె. 1969 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలె అని ఆశించెటోన్ని. పోలీసోల్లు పోనియ్యకుంటె వాపసొద్దామనుకుని హైదర్‌గూడ (అత్తాపూర్) నుండి మోటారు సైకిల్‌పై ఒంటిగంట ప్రాంతంలో బయలుదేరిన. అత్తాపూర్ దాటినంక రింగురోడ్డు దగ్గర పోలీసోల్ల గుంపున్నది. వీళ్లు గత రెండు రోజుల నుండి వచ్చి పోయెటోళ్లను తనికీలు చేస్తుంటె గమనించిన. బస్సులు లేవు. ఆటోలు కూడ తక్కువగనే నడుస్తున్నయ్. మోటారు సైకిల్ల మీద, కార్లల్ల పోయెటోల్లె అటు, ఇటు పోతున్నరు. మాసాబు టాంక్ బ్రిడ్జి దగ్గరి కొస్తె బారికేడ్లతో అది మూసున్నది. కిందికెల్లి పక్క నుండి సర్వీస్ రోడ్డెంబడి పోయి లక్డీకపూల్ చేరుకున్న. ద్వారక హెూటల్ దగ్గర అసెంబ్లి వైపు ఎవరు పోకుండ బారికేడ్లు పెట్టి ఉన్నయ్. అట్ల, ఇట్లపడి మీరాటాకీసు సందులో నుండి టెలిఫోన్ భవన్‌చేరుకొని దగ్గరలోనే ఉన్న సామ్రాట్ కాంప్లెక్స్ లోపలికి పోయి మోటార్ సైకిల్ పార్కింగు చేసుకున్న. సెక్రెటేరియట్ రోడ్డు ఖాలీగున్నది. అక్కడక్కడ బారికేడ్లు, పోలీసోల్లు, రాపిడ్ ఆక్షన్ గుంపులున్నయ్. అన్‌మోల్ హెూటల్ మీదుగా షాపూర్ వాడి చేరుకున్న. ఆ రోడ్డెంబడి అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి టాంక్‌బండ్ చేరుకుందామనుకుంటె, షాపూర్‌వాడి దగ్గర పోలీసొల్లు ఆపిండ్లు. చిక్కడపల్లిలోని పాత మిత్రులు కొంతమంది ఈ జంక్షన్‌లో కలిసిండ్లు. మేమందరం కలిసి పక్కనుండి బూర్గుల రామక్రిష్ణారావు బిల్డింగ్ మీదుగా పోయెరోడ్డెంబడి బయలుదేరినం. లిబర్టీ కూడలి చేరుకోగానే మల్లీ పోలీసుల ఆటంకం. అంతలోనే పోలీసు వ్యాను వచ్చి అక్కడికి చేరుకున్న వారిని బలవంతంగా 'జై తెలంగాణ' నినాదాల మద్యన వ్యానులో ఎక్కిస్తుంటె నేను, మాత్రం రిటైర్డ్ ఎంప్లాయినని బయటపడ్డ. ఇంత దూరం అన్ని ఆవరోధాలను

చేదించుకుంటు వచ్చిన. ఎలాగైన టాంక్‌బండ్ చేరుకోవాలనే పట్టుదలతోఉండి పి.జె.ఆర్ పాత ఇంటి సందులో నుండి బయలుదేరి అంబేద్కర్ విగ్రహ కూడలి చేరుకున్నాను. ప్రజలు నలు మూలల నుండి అక్కడికి మెల్ల మెల్లగా చేరుకుంటున్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో పోలీసుల ఆడ్డగింపు కనబడకుండా పోయింది. అక్కడి నుండి నిరాటంకంగా టాంక్‌బండ్ చేరుకున్నాను. ఇన్ని ఆటంకాలను చేదించుకొని ఇక్కడికి రావడాన్ని సాదించి ఈ ప్రభుత్వాన్ని జయించాము అన్న ఆనందము కలిగింది. రాజకీయ జెఏసి మిలియన్ మార్చ్ పోరాట రూపాన్ని ప్రకటించినప్పటి నుండి జిల్లాల్లో మొదలయిన పోలీసుల దమనకాండ, విద్యార్థులపై చట్ట వ్యతిరేక నిర్భందాన్ని చూస్తుంటె అదుపులో పెట్టలేని ఆక్రోషం. మిలియన్ మార్చ్‌కి టాంక్‌బండ్ చేరుకోవడానికి పది జిల్లాల్లో ఉపక్రమించిన పాదయాత్రలను, సైకిల్ ర్యాలీలను, విద్యార్థుల జె.ఏ.సి. కదలికలను బస్సులలో, రైళ్ళలో ప్రైవేటు వాహనాల తనికీల ద్వార అడ్డుకొని అక్రమ అరెస్టులకు పాల్పడ్డరు. ఏమిటి పోలీసుల ఈ అప్రజాస్వామిక నడవడి. ఒక ప్రజాస్వామిక మరియు న్యాయబద్ధమైన ఆకాంక్ష సాధనకై చేపట్టిన శాంతియుత కార్యక్రమంపై ఇంత నిర్భందమా. ప్రజాస్వామ్యం ఈ సీమాంధ్ర పాలకులకు ఒక ముసుగు మాత్రమే. ఆ ముసుగు లోపల అంతా చీకటి పాలననే కనిపిస్తున్నది.

విద్యార్థుల పరీక్షల కారణంగా ఈ మిలియన్ మార్చ్‌ని మధ్యాహ్నం నిర్వహించడమయినది. మొదలు మొదలు తెలంగాణ జాగృతిఅధ్యక్షురాలు కవితగారు టాంక్‌బండ్ రావడానికి ప్రయత్నిస్తే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నేను టాంక్‌బండ్ పైన అడుగు పెట్టేసరికి దాదాపు మధ్యాహ్నం రెండుగంటలు దాటింది. ప్రజలు గుంపులు గుంపులుగా చేరుకోవడం మొదలయింది. ప్రజా సంఘాలు బ్యానర్లు పట్టుకొని జై తెలంగాణ నినాధాలతో రావడం కనబడింది. ఇలా ఎన్నో ప్రజా సంఘాలు వస్తూనే ఉన్నవి. ఒకప్పుడు మానవ హారాలుగా ఏర్పడుతూ నినాధాలు చేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఇంతలో మల్లేపల్లి లక్ష్మయ్య గారి బృందం ఇందిరాపార్కు వైపునుండి రావడం చూసి వారితో కలిసినాను. అప్పుడే లక్ష్మయ్యగారు టాంక్ బండ్ రోడ్డు మద్యకు వచ్చి ఈ ప్రభుత్వం పైన మనం విజయం సాధించాము, అనుకుంటూ మోకాళ్ళపై వంగి టాంక్‌బండ్‌ను ముద్దుపెట్టుకున్న సంఘటన మరువలేనిది. అప్పటికి మధ్యాన్నం 3 గం॥లు దాటింది. జిల్లాల నుండి విద్యార్థులు, ప్రజాసంఘాల వాండ్లు రావడం అధికమయింది. అటు ఇందిరాపార్కు నుండి, ఇటు బోట్స్ క్లబ్ నుండి తండోప తండాలుగా రావడం మొదలయింది. మధ్యలో లాయర్స్ జే.ఏ.సి. బృందం కనపడింది. అందులో మహిళా లాయర్లు చాలామంది

ఎంతో ఉత్సాహంగా ముందుండడం గమనించిన. గాంధీ మెడికల్ కాలేజీలో నిర్బంధాన్ని ఛేదించిన జూనియర్ డాక్టర్స్ బృందం పరుగు పరుగున వస్తుంటె చూసిన. తరువాత ఆలిండియా ముస్లిం బ్రుందం వారు బ్యానర్‌తో ఎదురైనారు. మధ్యాహ్నం మూడున్నర గం॥లకు దాదాపు టాంక్‌బండ్ పూర్తిగా నిండి పోయింది. ఇంత నిర్బందాన్ని, దమన కాండను అధిగమించి లక్షలాది మంది జనం టాంక్‌బండ్ చేరుకున్నారు. బలమైన ఆకాంక్షల, ఆశయాల ముందు లక్ష్యం మాత్రమే గోచరిస్తుందనడానికి టాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ ఒక నిదర్శనం.

దమనకాండ, నిర్బంధాల మధ్య ఇక్కడ చేరుకున్న ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. వీరు కేశవరావు, మధుయాస్కిగౌడ్, ఎం.పి.ల బ్రుందాన్ని టాంక్‌బండ్ పైకి రాకుండా అడ్డుకున్నారన్న సమాచారం మాకు అందింది. ఎండ తీవ్రతను తట్టుకోలేక ఒక విగ్రహం ప్రక్క చెట్టు దగ్గరలో ఒకళ్ళిద్దరు ఉంటే వాళ్ళ దగ్గరకు పోయి అక్కడ కూర్చున్నాను. మా ప్రక్కన ఒక కళా బ్రుందం, బహుశా అది నేర్నాల కిశోర్ బ్రుందం అయి ఉంటది, ఆటా పాటలతో తెలంగాణను ఆలపిస్తుంటె వాళ్ళతో మేము కూడ గొంతు కలిపినం. (కాని ఆ రాత్రి నేర్నాల కిషోర్‌ని పోలీసులు అరెస్టు చేసి, టాంక్‌బండ్ పోయి ఆట పాటలు చేస్తవా అని చిత్రహింస చేసినట్టు పేపర్‌లో చదివినం). ఇంతలో ఇద్దరు ముగ్గురు విద్యార్థులుమా దగ్గర మంచినీళ్ళు అడుక్కొనితాగింద్రు. మా పక్కనే కొంచెంసేపు కూర్చున్నరు. వాళ్ళు కూడ అక్కడ ఆలాపించే పాటలు పాడి కొద్ది సమయం తరువాత మా దగ్గర నుండి లేచి పోయిండ్లు. మా చుట్టు పక్కల కూర్చున్న బృందాలు లంచ్ ప్యాకెట్లు తెచ్చుకొని లంచ్‌కి ఉపక్రమించినయ్. వాళ్లు మాకు కూడ కొన్ని పాకెట్లు అందజేస్తె మేము కూడ లంచ్ ముగించుకున్నం.

తెలంగాణ ప్రతీక, తెలంగాణ భాషా అస్తిత్వం అయిన బమ్మెర పోతనామాత్యుడి విగ్రహం దగ్గర నుండి వివిద సంఘాల నాయకులు, రాజకీయ జె.ఏ.సి.ల నాయకులు ఉపన్యాసాలిస్తుండటం ఎండలో నిలబడి చూడలేక ఒక చెట్టునీడలో ఉండి చూస్తున్న. టి.వి కెమెరా వ్యక్తులు, వచ్చిన బృందాలతో వచ్చినట్లు మాట్లాడిస్తున్నారు. ఇది లైవ్ టెలికాస్ట్ అవుతుంది. టాంక్ బండ్‌పై గోపురం ఆకారంలోఉన్న బౌద్ధ స్తూపం పైకి ఏరియల్ వీవ్ కొరకు ఎక్కి కెమెరామెన్ టాంక్‌బండ్ పైన తెలంగాణ కావాలని నినదిస్తు, తెలంగాణ వస్తేనే మా బతుకులు బాగుపడతాయి అంటు నిండిపోయిన పది జిల్లాల ప్రజానీకాన్ని వాళ్ళ కెమెరాలలో వివిధ కోణాల నుండి బందించే ఆరాటం అమోఘంగా కనబడింది. తెలంగాణ సోయి ఉన్న వాళ్లు ఈ మిలియన్ మార్చ్‌లో భాగస్వాములయినారు. తెలంగాణ బిడ్డగా జె.ఏ.సి. పిలుపు మేరకు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించినారు.

ఇక ముందు కూడ జె.ఏ.సి. ఇచ్చే పోరాటాల పిలుపులను భుజాలకెత్తుకోవాలనే తపన వాళ్ళలో కనపడింది. తెలంగాణపై చర్చల సందర్భంగా నేనెప్పుడు అంటుంటాను. ఇప్పటి జనరేషన్‌కు "గతించిన పోరాటాలల్లో పాల్గొనే అదృష్టం ఎటూ లేక పోయింది. ఇప్పుడైనా జరుగుచున్న శాంతియుత ఉద్యమాలల్లో భాగస్వాములు కాకుంటే దండుగ, ముందు తరాలు క్షమించవు". 1969లో ఉవ్వెత్తున ఎగసిపడిన తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా అప్పుడు హంగర్ స్ట్రైక్‌లు, రాస్తారోకోలు మానవ హారాలు నిర్వహించినం, గ్రామాలకు వెళ్ళి ప్రజలను చైతన్య పర్చినం.

పోతనామాత్యుని విగ్రహం దగ్గరకు కె.సి.ఆర్. గారు చేరుకున్నారు. వారి స్పీచ్ మొదలయింది. అర్ధగంట కొనసాగింది. ఎండ తీవ్రత తగ్గటం మూలాన చెట్టు నీడలకెల్లి బయటికొచ్చి రోడ్డు మధ్యల నిలబడి వింటున్నాము. చాలా మంది జనం అక్కడికి చేరుకున్నారు. మధ్య మధ్యన తెలంగాణ కావాలి అన్న నినాదాలుమార్మోగుతున్నాయి. 4 గం॥ ప్రాంతంలో ప్రొ॥ కోదండరాం, గోవర్ధన్, మరియు కొంతమంది జె.ఏ.సి. సభ్యులు కూడ అక్కడకు చేరుకోవడమయింది. వెంటనే అక్కడికి చేరుకున్న వారందరితో కోదండరాంగారు ప్రతిజ్ఞ చేయించిన తరువాత దాదాపుగా నాయకులందరు టాంక్‌బండ్ పై నుండి వెళ్లిపోయినారు. నేను టాంక్‌బండ్ పై నుండి వెళ్ళిపోతూ ఒక విగ్రహం కిందపడి ఉండటం కూడా చూసిన.

టాంక్‌బండ్‌పై ఉన్నంతసైపు ఈ పోరాటం చైనా లాంగ్ మార్చ్‌గా మొదలయి ఈజిప్టులో కయిరో దిగ్భందంగా మారితేనే తెలంగాణ వస్తుందేమో అన్న ఆలోచనలు ఒకవైపు నా మెదడును తొలుస్తూనే ఉన్నవి.

**(1969 ఉద్యమకారుడు)**

# ప్రజా ఉద్యమ స్ఫూర్తి మిలియన్ మార్చ్

**–తిప్పర్తి యాదయ్య**

"డజన్లకొద్దీ విమానాలు మామీద బాంబులు కురిపించాయి. నేలమీద మమ్ములను చుట్టుముట్టారు. అడ్డుపడ్డారు. లక్షలాదిమంది సైనిక బలగాలు మమ్మల్ని ఆపడానికి ప్రయత్నించాయి. దారిలో మేము చెప్పడానికి వీల్లేనన్ని కష్టాలు, కడగండ్లు ఎదర్కొన్నాము. కేవలం రెడు కాళ్ళమీద మేం పదకొండు రాష్ట్రాల్లో ఇరువై ఐదు కోట్ల ప్రజలను విముక్తి చేసినాము. నిజంగా లాంగ్ మార్చ్‌తో పోల్చదగిందిగాని, సాటిరాగలదిగాని ఏదైన చరిత్రలో ఉందా?"

అని 1935లో లాంగ్‌మార్చ్ విజయవంతం అయిన తర్వాత మహానాయకుడు మావో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిండు.

కొంచెము అటుఇటుగా లాంగ్‌మార్చ్ అంతటి ఉద్యమ పోరాట చరిత్ర కలిగిందే 10 మార్చి 2011 నాటి మిలియన్ మార్చ్. సీమాంధ్ర నాయకుల బానిస సంకెళ్ల నుండి తెలంగాణ నాలుగున్నర కోట్ల ప్రజల విముక్తి కొరకు, తెలంగాణ ప్రజలు పోగొట్టుకున్న భూములను, నీళ్ళను, ఉద్యోగాలను, అధికారాలను సాధించుకోవడానికి సాగించిన మహత్తరమైన మహోధ్యమమే "మిలియన్ మార్చ్".

ఆరోజు 10 మార్చి, 2011 రోజున గ్రీష్మతాపం భీష్మించుకొని కూర్చుంది. బండలు సైతము పగిలి నెర్రలు పెట్టే విధంగా ఎండలు దహించుతున్నయి. కండ్లు సెగలు గక్కి, కాల్లుకాలి శరీరంలోని అణువణువు మండిపోతున్న సమయమది. తెలంగాణలోని పది జిల్లాల నుండి తమంతకు తాము ఎవరికి తోచిక దారిలో వారు హుస్సేన్ సాగర్ చెరువు కట్టను గీటురాయిగ పెట్టుకొని అక్కడికి చేరుకొని మిలియన్ మార్చ్‌లో పాల్గొన్నారు. చైనా విప్లవ పోరాటంలో లాంగ్ మార్చ్ సందర్భముగ మావో చెప్పిన పరిస్థితులను తలపించే విధంగా సీమాంధ్ర ప్రభుత్వం వేలాదిమంది పోలీసు బలగాలతో హైదరాబాద్ నగరాన్ని నింపింది. హైదరాబాద్ సివారు ప్రాంతాలనుండి హుస్సేన్ సాగర్ ట్యాంకుబండ్ వరకు అడుగడుగునా ఇనుప ముళ్ళ తీగల కంచెను వేసింద్రు. ప్రజా సమూహాలను

నిరోధించడానికి బారికేడ్లను నిర్మించిండ్రు. లాఠీలతో, తుపాకులతో నగర వీధుల నిండ పోలీసులు కవాతు చేస్తుండ్రు. తెగువతో, స్ఫూర్తితో సీమాంధ్ర ప్రభుత్వ పోలీసు మందను లెక్క చేయకుండా సాహసోపేతమైన పోరాట స్ఫూర్తితో తెలంగాణ ప్రజలు ట్యాంకుబండ్‌వైపు నడిసిండ్రు. వారి కాలిదుమ్ముతో పోలీసులు నిర్మించిన బారికేడ్లు తునాతునకలైనయి.

మిలియన్ మార్చ్‌కు వేదిక హుస్సేన్ సాగర్ చెర్వుకట్ట. హుస్సేన్ సాగర్‌లో తలతలమెరిసే శాంతిదూత గౌతమ బుద్ధుడు నిలువెత్తు నిలబడి మిలియన్ మార్చ్‌ని వీక్షించి తనయొక్క దమ్మ సూత్రములలో నిక్షిప్తికరించుచున్నాడు. అట్లాగే ట్యాంకు బండ్‌పైకి వస్తున్న ఉద్యమకారులకు తూర్పు ప్రధాన ద్వారం దగ్గర భారతదేశ మహోన్నత నాయకుడు చిన్న రాష్ట్రాల సిద్ధాంతకర్త హక్కులను పోరాటం ద్వారానే సాధించుకోవాలని సూత్రీకరించిన డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉద్య మకారులందరిని ఉత్తేజపర్చి కట్టపైకి పంపుతుండు. ఆ అంచుననే ఆనుకొని ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఆఫీసు చుట్టువేసిన ఇనుపముండ్ల కంచెను చేధించడమెట్లా? చుట్టూ పహారా కాచే పోలీసుల కళ్ళుగప్పడం ఎట్లా? అని మున్సిపల్ జెఎసి నాయకత్వం మల్లగుల్లాలు పడి ఏదిఏమైన ట్యాంక్‌బండ్‌పైకి వెళ్ళి మిలియన్ మార్చిలో పాల్గొనాలని నిర్ణయించింది. నగరమంతా యుద్ధ వాతావరణం ఉన్నది. బుద్ధిజీవులు కొంతమంది ఎప్పుడు ఏమి జరుగుతుందో అని తెల్సుకోవాలనే ఉత్సుకతతో టీవీలకు అతుక్కుపోయినరు. అప్పటికే తెలంగాణ జె.ఎ.సి. నాయకులను పోలీసులు అరెస్టు చేసిన్రు. మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేస్తామని ప్రకటించిన ఉద్యోగ సంఘాల జెఎసి 50 మంది నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చర్చల నిమిత్తం డిల్లీ వెల్లిండ్రు. ఒక రోజు ముందుగనే మున్సిపల్ కూడ అనుకున్న విధంగా ఎవరి పద్ధతిలోవారు హెడ్ ఆఫీస్ చేరుకోవాలని అనుకున్నాము. ముందు ముఖ్యులము పదిహేనుమందిమి ర్యాలిగా ట్యాంకుబండు ఎక్కాలని నిర్ణయించుకొని బయలుదేరినాము. మా ర్యాలీ డప్పులతో ప్రధాన కార్యాలయము తూర్పు గేటు ద్వారం దగ్గరకు వచ్చి అక్కడ అడ్డంగా పోలీసులు వేసిన ఇనుప ముండ్ల కంచెను తొలగించే ప్రయత్నం చేస్తుండగానే పోలీసులు నివారించడం జరిగింది. అదే సమయంలో హిమాయత్ నగర్ నుండి పి.పి.ఐ. నాయకుల నాయకత్వంలో బయలుదేరిన ఎర్రరంగు చొక్కాల ర్యాలీ లిబర్టీ సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పోలీసులు వేసిన బారీకేడ్లను గుంజిపడేసి కార్యాలయము తూర్పు గేటు ముందు వేసిన బారీకేడ్లను సైతము వారు తొలగిస్తున్న సందర్భములో మా వద్దనున్న పోలీసులు వారిని అదుపు చేయడానికి వెల్లిండ్రు. దాని వలన మాపని సులువైంది ఇదేమోఖా అని అప్పుడు మేమంతా ట్యాంక్

బండ్ చేరుకున్నాము. రకరకాల దారుల గుండా ఎంతో ధైర్య సాహసాలతో భారతీయ జనతా పార్టీవారు, తెలంగాణ రాష్ట్ర సమితి వారు, సిపిఐ యంఎల్, న్యూడెమొక్రసీ వారు, సిపిఐ వారు, ఉద్యోగులు ఒకరి తర్వాత ఒకరు వేలాదిమంది తెలంగాణ ఉద్యమకారులు ట్యాంక్ బండ్పైకి వచ్చినారు. మేము అక్కడికి చేరుకొన్నాక ఎర్రమంజిల్ నుండి ఇంజనీర్స్ జెఎసి ఆధ్వర్యంలో బయలుదేరిన వారు ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని సెక్రెటేరియట్ దగ్గరకు రాగానే టి. వెంకటేశం, బాలనర్సయ్య, శ్రీధర్ రావు దేశ్పాండే నాయకత్వంలో ఉన్న వారందరిని అరెస్టు చేసి గోషామహల్ స్టేడియంకు తరలించినట్లు సమాచారమందింది. మేము సరిగ్గా ఒంటిగంటకు ట్యాంకుబండ్పైకి చేరుకున్నాము. అప్పటికే అక్కడి వేలాదిమంది ఉద్యమకారులు చేరుకున్నారు. మహిళలు బతుకమ్మ వేసింద్రు. తెలంగాణ ధూంధాం కన్వీనర్ రసమయి బాలకిషన్ మరియు సిపిఐ ప్రజానాట్యమండలి వారు అంతా కలిసి అస్సోయిదులా హారతి కాళ్ళగజ్జల గమ్మతి, గజ్జెలు గజ్జెలు రెండు రాజిగో రాజన్నా మొదలగు పాటలతో మమ్ములను ఉత్తేజ పరచడమే కాకుండా డ్యాన్సు చేపించింద్రు. తెలంగాణ సాధనకు పోరాడాలని జనజీవన స్రవంతిలో కలిసి ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు మా జెండాలను, మా గుంపును చూపి మా మధ్యకు వచ్చిండు.

తెలంగాణ జె.ఎ.సి. మిలియన్ మార్చ్ను ప్రకటించిన నాటినుండి పెద్ద కసరత్తె జరిగింది. దీనికంటె ముందు ఫిబ్రవరి 17, 2011రోజునుండి సమస్త ఉద్యోగులు సహాయనిరాకరణ ఉద్యమాన్ని మహత్తరంగా విజయవంతము చేసిన్రు. ఇది ఉద్యోగ సంఘాల జె.ఎ.సి. తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం. దానిని విజయవంతము చేయడానికి మరియు మున్సిపల్ ఉద్యోగ కార్మికులను కార్యోన్ముఖులను చేయడానికి ఫిబ్రవరి 7వ తేదీ నుండి రిలేనిరాహారదీక్షలు చేపట్టడం జరిగింది. రిలే నిరాహార దీక్షల ముగింపు పేరుతో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విజయవంతం చేయుటకు వేలాది మంది(పదివేల మంది హాజరైనారని ఒక అంచనా) మున్సిపల్ ఉద్యోగ కార్మికులతో చరిత్రలో కనివిని ఎరుగని విధంగా భారి బహిరంగసభ జరిపినము.

ఉద్యోగుల జెఎసి ప్రభుత్వంతో ఒప్పందము చేసుకున్న ప్రకారము డిల్లికి 7 మార్చి 2011 రోజున వెల్లినారు. వాస్తవంగా ఆ కార్యక్రమాన్ని మిలియన్ మార్చ్ అయిన పిదప పెట్టుకొంటే బాగుండేదని చాలామంది ఉద్యోగులు మేధావులు అభిప్రాయపడినారు. అప్పటి వరకు మిలియన్ మార్చ్ను విజయవంతము చేయాలని చెప్పిన ఉద్యోగుల జెఏసి నాయకత్వం డిల్లీలో ఉన్నారు. పొలిటికల్ జెఎసి నాయకత్వం మిలియన్ మార్చ్ రోజున అనగా 10మార్చి 2011రోజున అరెస్టు

కాబడినారు. అందువలన మిలియన్ మార్చ్‌లో పాల్గొను ఉద్యోగులకు ప్రజలకు, విద్యార్థులకు, యువకులకు, మహిళలకు దశ దిశ నిర్దేశించవల్సిన నాయకత్వం లేకున్నప్పటికి క్రమశిక్షణ కల్గిన తెలంగాణ ఉద్యమ సైనికులు మిలియన్ మార్చ్‌ను విజయవంతము చేసి తెలంగాణ పోరాట చరిత్రలో ఒక మైలురాయిని నిలిపినారు. దీని ద్వారా నాయకత్వం లేకుండ కూడా తెలంగాణ ప్రజలు ప్రత్యక్ష ఉద్యమము నడుపుతారని ఋజువైంది. ఇక్కడ ప్రజలే ఉద్యమానికి నాయకత్వం వహించింద్రు.

మిలియన్ మార్చ్‌లో పాల్గొనడానికి అదే రోజు సాయంత్రము ట్యాంకు బండ్ మీదికి వచ్చిన కాంగ్రెసు యం.పిలు కె. కేశవరావు, మధుయాష్కి తదితర నాయకులమీద ఉద్యమములో మమేకమైన ప్రజలు రాళ్లు, చెప్పులు విసిరింద్రు.

ఉద్యమకారులను నిరోధించడానికి లాంగ్‌మార్చ్‌ను విఫలం చేయడానికి పోలీసులు నిర్మించిన బారికేడ్ల యొక్క ఇనుపగొట్టాలు, ఇనుపరాడ్లు, ఆయుధాలుగ మారి విగ్రహాల విధ్వంసము జరిగింది. (ప్రభుత్వమే ఈ నిర్వహణ జరిపి తెలంగాణ ఉద్యమకారులమీద నెట్టిందని కూడా ప్రచారం జరిగింది.)

తెలంగాణ రైతాంగ సాయుధపోరాట కాలములో కూడ పోలీసులు, రజాకారులు తుపాకులతో ప్రజలమీద ఆనాటి ఉద్యమకారులమీద దాడులు జరిపితే ఆయుధాలు లేని ప్రజలు, రైతులు, జీతగాండ్లు,మహిళలు గుత్పలతో (కర్రలు), వడిసెలతో, కారంపొడితో ఎదురు తిరిగి పోరాటం చేసింద్రు. తెలంగాణ ప్రజలకు దొరికిన ప్రతి వస్తువును ఆయుధంగా ఉపయోగించిన చరిత్ర ఉన్నది.

విగ్రహాల విధ్వంసములో సంబంధము లేక పోయినప్పటికి సీమాంధ్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల మీద ప్రజలమీద అక్రమ కేసులు బనాయించి జైల్లల్లో పెట్టింది. ఈ కేసులకు వారు జడవలేదు. ఎన్ని కేసులైన పెట్టుకొండ్రి తెలంగాణను ప్రకటించండి అని ఉద్యమించిన్రు.

మిలియన్ మార్చ్‌లో పాల్గొనడానికి కూకట్‌పల్లి మున్సిపల్ సర్కిల్ నుండి సి.హెచ్. కృష్ణ, కె.బలరాం నాయక్ నాయకత్వంలో బయలుదేరి ట్యాంక్‌బండ్ కింద ఇందిరా పార్కు దగ్గర మోటారు బైకులు ఉంచి ట్యాంక్‌బండ్ ఎక్కి అనంతరము సాయంత్రము 6గం॥లకు బండ్‌పై నడుచుకుంటు సైకిల్ మోటర్లు ఉంచిన స్థలానికి బయలు దేరి వెల్తుంటే తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకుడు కె. బలరాం నాయక్‌ను అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేసింద్రు. అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్ నుండి ఫలక్‌నుమ పోలీసు స్టేషన్‌కు తరలించినారు. ఒక స్టేషన్ వెళితే ఇక్కడ లేరు. వేరొక స్టేషన్‌లో ఉండొచ్చు అని పోలీస్ అధికారుల సమాదానంతో అన్ని స్టేషన్లు తిరగడం వలన తెల్లవారెంది. 11వ తేదీ ఉదయం ఫలక్‌నుమా నుండి కంచన్‌బాగ్ స్టేషన్‌కు అక్కడి నుండి మద్యాహ్నం బర్కత్ పుర

స్టేషన్‌కు సాయంత్రం 5గం॥లకు  నాంపల్లికి తీసుకెళ్లి రాత్రి 2గం॥లకు చిలకలగూడలో నివాసముండె జడ్జిదగ్గర ప్రవేశపెట్టి చంచల్‌గూడకు రిమాండు చేసిన్రు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో పొడవాటి రబ్బర్లతో చేతివేళ్ళ కీళ్ళమీద, లాఠీలతో శరీరం మీద కొట్టి చిత్రహింసలు పెట్టింన్రు. మీ నాయకులు ఎవరైన వచ్చినపుడు పోలీసులు ఏమి కొట్టలేదని చెప్పాలని  లేకపోతే థార్డ్ డిగ్రీ ఉపయోగిస్తామని పోలీసులు బెదిరించినారట.  ఉద్యమ నాయకులు ఈటెల రాజెందర్, హరీష్ రావు గారలు వచ్చి పోలీసులు కొట్టింన్రా అని అడిగితే వాళ్లు పోయినాక మరల కొడ్తరేమొ అనే భయంతో ఏమి కొట్టలేదని చెప్పింన్రట.

"తెలంగాణ తల్లి వొడినింద త్యాగాలే
పల్లెలు, పట్నాలు, నగరాల  బతుకంతా ఉద్యమాలే
గాయాలనే గుండెనిండ నింపుకున్నా ...
అలుపన్నది ఎరుగకుండ కదిలితేనే గదా తెలంగాణ
తెలంగాణ వచ్చేదాకా తెగించి కొట్లాడుడే

**(తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘాల జెఏసి ఛైర్మన్)**

# మిలియన్ మార్చ్ నాలో కసి పెంచింది

**-ఎ. విజయ కుమార్**

తెలంగాణ రాష్ట్ర సాధనే తన జీవిత లక్ష్యంగా అన్ని పక్షాలతో జెఎసిలు ఏర్పాటు చేసి నాలుగున్న కోట్ల తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తెచ్చి ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న ఆచార్య కోదండరాం గారి పిలుపునందుకొని ఆదిలాబాద్ జిల్లా నుండి తెలంగాణ విద్యావంతుల వేదిక పక్షాన 23 మందిమి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జరుగు మిలియన్ మార్చ్‌లో పాల్గొనుటకై నిశ్చయించుకుంటిమి. కాని జిల్లా నుండి కదల కుండా పోలీసుల అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. మాపై పోలీసు నిఘా కూడా మొదలైంది. నిర్మల్‌లోని నా ఇంటి వద్ద సివిల్ డ్రెస్‌లో పోలీసుల కాపలా. ఫోన్ ద్వారా మిత్రులందరితో సంప్రదించి గ్రూపుగా కాకుండా ఒక్కొక్కరిగానే బస్సుల ద్వారా హైదరాబాద్ చేరుకోవాలని నిర్ణయించుకుంటిమి. భైంసా మిత్రులు నిజామాబాద్ గుండా, భోథ్ మిత్రులు ఒక రోజు ముందుగానే, నిర్మల్, ఖానాపూర్ మిత్రులు మెట్‌పల్లి గుండా హైదరాబాద్‌కు బయలుదేరినాము. అందరం బోయినిపల్లి వద్ద కలుసుకుందామని అనుకున్నాము.

నేను ఒకరోజు ముందు రాత్రి బయలుదేరాలనుకున్నాను. కాని పోలీసులు, అరెస్ట్‌కు సిద్దంగా ఉన్నట్లు సమాచారంతో ఇంట్లోనే రాత్రి గడిపాను. ఉదయం మా ఇంటి వెనుక గేట్ గుండా నడుచుకుంటూ బయలు దేరాను. బస్టాండు వెళ్ళినా, బస్‌డిపో వరకు వెళ్ళినా అరెస్ట్ ఖాయమని భావించి మెల్లగా మట్టిరోడ్డుపైననే బస్సును ఆపుకొని ఉదయం 4.30 గంటలకు హైదరాబాద్ బస్సు ఎక్కినాను. 20 కి.మీ. దూరం పోగానే పోచంపాడ్ చౌరస్తాలో పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేసారు. నేను ఆర్మూర్ వరకే టికెట్ తీసుకున్నందున నిజామాబాద్ జిల్లా పోలీసులు వదిలేసారు. మళ్లీ బాల్కొండ వద్ద, పెర్కిట్ వద్ద కూడా పోలీసులు బస్సును ఆపి తనిఖీలు చేసారు. అదే బస్సులో ఆర్మూర్ నుండి హైదరాబాద్ టికెట్ తీసుకున్నాను. బస్సును పోలీసులు డిచ్‌పల్లి వద్ద, కామారెడ్డి వద్ద, రామాయంపేట వద్ద, బిక్‌నూర్, చేగుంట, తూప్రాన్ ఇలా పోలీసు స్టేషన్ ఉన్న ప్రతిచోట తనిఖీలు చేసారు. ఇక ఆటంకం లేకుండా చేరుకుంటాననే నమ్మకం కల్గింది. కొంపల్లి దగ్గరకు రాగానే ఫోన్ వచ్చింది. సార్ నేను ఎక్కడ దిగాలి అని. మా కార్యకర్త అనుకొని వెంటనే బోయినిపల్లి వద్ద ఆగమంటిని. ఎందుకో ఆ ఫోన్ వాయిస్‌పై అనుమానం వచ్చి

ఆరా తీస్తే అది మా నిర్మల్ ఇంటిలిజెన్స్ పోలీసులది తెలిసింది. ఇంతకు ముందు విన్న వాయిసే ఐనందున నన్ను వెంబడిస్తున్నారని అనుమానం కల్గింది. వెంటనే కొంపల్లి వద్ద బస్సుదిగి, వెనుకే వస్తున్న సిటి బస్సు ఎక్కాను. బోయినిపల్లి వద్దకు చేరుకోగానే నా అనుమానం నిజమైంది. ఆ బస్సును బోయినిపల్లి బస్‌స్టాఫ్ వద్ద పోలీసులు ఆపి చెక్ చేస్తున్నారు. అందులో ఇద్దరు నిర్మల్ పోలీసులు ఉన్నారు. అప్పుడు తెలిసింది సిటి బస్సు ఎక్కడమే మంచిదైదనుకున్నాను. ప్యారడైజ్ వద్ద దిగి ట్యాంక్‌బండ్ వెళ్ళుటకు ప్యారడైజ్ బస్టాపు చేరుకున్నాను. కాని బస్సులు లేవు. ఆటోలు రామంటున్నారు. కేవలం విద్యార్థులకు మాత్రమే ఒకటి రెండు బస్సులు నడుస్తున్నాయి. బస్సుల్లేక చాలా మంది చిరు ఉద్యోగులు ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారు. నేను ఒక ఆటోవాలాను బ్రతిమిలాడి నూటయాభై రూపాయలిస్తానని ఎలాగొలాగా సరేననిపించి ట్యాంక్ బండ్ దగ్గర దాకా తీసుకపొమ్మన్నాను. సార్ నీవు తెలంగాణ వాదివా అని అడిగిన ఆటో డ్రైవర్, వీలైనంత దగ్గరికి తీసుకపోతానన్నాడు. చివరికి ఎలానైతేనేమి సందులు, గొందులు తిరిగి అతి కష్టంమీద లోయర్‌ట్యాంక్‌బండ్ దోమల్‌గూడా చౌరస్తాలో దింపిన ఆటోడ్రైవర్ పైసలొద్దుసార్ అంటూ జై తెలంగాణ అన్నాడు. కాని ఆయన కష్టానికి ఎంత ఇచ్చిన తక్కువేననుకుంటూ వందరూపాయలు అతికష్టంమీద అతని జేబులో పెట్టాను. అక్కడ ఎటుచూసిన పోలీసు పహారానే వుంది. ట్యాంక్‌బండ్‌పైకి ఎక్కాలనే కసి నాలో క్రమేపి పెరుగుతూ వచ్చింది. నా మిత్రుడు వినయ్‌పాల్ ఫోన్ చేసి అన్నా నేను తార్నాక నుండి నడుచుకుంటూ వస్తున్నాని, అంతలోనే ధర్మారావు ఫోన్ అన్నా మేము ట్యాంక్‌బండ్ క్రింద ఉన్నామని. రావుల శంకర్, దేవేందర్‌ల నుండి ఫోన్ వచ్చినావాఅని? ఎలాగైతేనేమి అందరం ట్యాంక్ బండ్‌పై కలుసుకున్నాము. అప్పుడు మా ఆనందానికి అవధుల్లేవు. ఒక్కొక్కరు ఎన్నో అవస్థలు అనుభవిస్తూ మొత్తానికి అంతిమ లక్ష్యమైన ట్యాంకు బండ్ చేరుకున్నామనే భావన అందరి హృదయాల్లో తొనికిసలాడింది. ట్యాంక్‌బండ్ అంతటా ఎటుచూసిన జై తెలంగాణ నినాదాలతో ఉద్యమకారులు ఉరకలేస్తున్నారు. మా ఆదిలాబాద్ జిల్లా నుండి వచ్చిన సుమారు 100 మందిమి జై తెలంగాణ నినాదాలతో ట్యాంక్‌బండ్‌పై 'మార్చ్' నిర్వహించాము. అప్పుడే కోదండరాం సార్‌ను అరెస్టు చేసారనే వార్తలు అక్కడి వాతావరణాన్ని ఎంతో ఉద్విగ్నతకు గురిచేసింది. మాలో రక్తం కుతకుత లాడింది. ఏదో చేయాలన్న కసి మొదలైంది. తెలంగాణ సాధించాలంటే సీమాంధ్ర పెట్టుబడిదారులను తెలంగాణ నుండి తరిమేయాలని ఆ క్షణాన నిర్ణయించుకున్నాము. తెలంగాణకు అడ్డంకిగా వున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను భూస్థాపితం చేస్తే తప్ప తెలంగాణ రాదనిపించింది. అసలు ఈ రాజకీయ పార్టీల కతీతంగా ప్రజలందరిని మమేకం చేస్తూ ఆచార్య కోదండరాం గారు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళితే తెలంగాణ తప్పకుండా సాధిస్తామని అనుకున్నాను అందుకు ఈ "మిలియన్ మార్చే" నిదర్శమనుకున్నాను.

**(తెలంగాణ విద్యావంతుల వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు)**

# అది ఒక చారిత్రిక దినం

**–తేజావత్ శేషురాం నాయక్**

తెలంగాణ జెఏసీ పిలుపుమేరకు ఎన్నో నిర్భంధాలను, పోలీసు వలయాలను ఛేదించుకొని నంగారాభేరి లంబాడ హక్కుల పోరాట సమితి నేతృత్వంలోని ఒక బృందం మధ్యాహ్నం 12.30 గం॥లకు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్నాము. మొదటగా దళితుల ఆరాధ్యుడు, పరిపాలనసౌలభ్యానికి చిన్న రాష్ట్రాలే మేలని చెప్పిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ట్యాంక్‌బండ్‌పైకి ఎక్కాము. ట్యాంక్‌బండ్ ప్రదేశాన్ని చూడగానే మేడారంలోని సమక్క–సారలమ్మ జాతర గుర్తుకు వచ్చింది. అంతటి జనసంద్రంగా మారింది ట్యాంక్ బండ్ ప్రదేశం. మేము అక్కడికి చేరుకోగానే తెలంగాణ రాష్ట్రం తీసుకొని వస్తున్నట్లుగా ఎం.పిలు కె.కె. మధుయాష్కి తమ వాహనాలను ఊరేగింపుగా వస్తున్న సమయంలో ఓ తెలంగాణ వాది వారిపై చెప్పు విసిరి తన నిరసనను తెలిపాడు. అదే అదునుగా అక్కడున్న తెలంగాణ వాదులంతా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

తెలంగాణాలోని లాంబాడ, ఆదివాసి గిరిజనులందరికి పాతినిధ్యం వహిస్తున్న మా బృందం ప్రతిజ్ఞ చేసాము. తెలంగాణ వచ్చేంతవరకు పోరాటం కొనసాగిస్తామని ప్రమాణం చేసాము. జై తెలంగాణ నినాదాలతో ట్యాంక్‌బండ్ అంతటా కలియతిరిగాము.

గతంలో మానుకోట ఘటనలో తెలంగాణలోని లంబాడి విద్యార్థులు ప్రదర్శించిన తిరుగుబాటు స్ఫూర్తి 'మిలియన్ మార్చ్' లో కూడా కొనసాగింది. మిలియన్ మార్చ్‌లో లంబాడా, గిరిజన విద్యార్థుల పాత్ర చాలా అభినందనీయం.

**(లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు)**

# మాగడ్డపై మా జ్ఞాపకాలు ఉండాలి...

**- బోనకుర్తి సోమేశ్వర్**

మూడు తరల పోరటం, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ఎంతో మంది అమరత్వం, ఆమరణ దీక్షలు, పోరాటలు, లాఠీ దెబ్బలు, తూపాకి తూటలు, బూట్ల చప్పళ్లు, ముళ్ళ కంచెలు బారీకేడ్లు, బెదిరింపులు, డైడ్‌లైన్‌లు, బలిదానాలు ఇలా ... ఒకటా .... రెండా ... వందలు ... వేలు ... ఎన్నో చూసింది. తెలంగాణ మట్టి కొత్త తరానికి అక్షరీకరణ చేసింది. ఉద్యమ పాఠాలు నేర్పింది. గుణపాఠాలుగా మలుచుకొని పోరాడమంది.

ఎందుకి పోరాటం, ఎవరి అస్తినీ అడగలేనిదీ పోరాటం, ప్రక్కరాజ్యంపై దండయాత్ర కాదు ఈ పోరాటం. తెలంగాణ ప్రజలు అడుగుతున్నది అభివృద్ధి మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలు తమ ఆత్మగౌరం, తమ చరిత్రను తాము చదువుకోవాలని, తమ గురించి, తమ బ్రతుకు గురించి పోరాడిన వాళ్ళ స్మృతులను చూడలనుకుంటుంది తెలంగాణ పౌర సమాజం. తమ భూమి, తమ బ్రతుకు, తమ ఉద్యోగాలు తమకే కావాలని నినాదిస్తున్నది. ఆ నినాదములో భాగమే మిలియన్ మార్చ్.

ఎవరిపైనా దాడికిపూనుకోవాలనే లక్ష్యం లేదు. అలా అనుకోనూలేదు. ఏ సెక్రటేరియట్, అసెంబ్లీ సౌధాలను కూల్చడానికి కదలలేదు. మిలియన్ మార్చ్ రోజు ప్రజలు తమ బాధలు పంచుకోని కొద్దిసేపు అందరము కలిసి నడుద్దాం అనీ, ఎవరికి ఇబ్బంది కలకుండా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం అది. విద్యార్థుల పరీక్షల దృష్ట్యా మధ్యాహ్నం సమయం నుంచైనా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు తెలంగాణ ప్రజలు పాలకులను కోరారు. అయినా ప్రభుత్వ అధినేతలు తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రపూరితంగా వ్యహరిస్తూనే వస్తున్నారు. దీనిలో భాగంగానే ఆ రోజు జరగాల్సిన కార్యక్రమాన్ని జరగకుండా చేసేందుకు రెండు మూడు రోజుల ముందు నుంచే తెలంగాణ ప్రాంత నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్టులు చేశారు. బారీకేడ్లు పెట్టారు. జిల్లాల నుండి విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, ప్రజలు స్వచ్ఛందంగా బయలు

దేరినవారిని ఎక్కడికక్కడ కట్టడి చేసారు పోలీసులు. అయిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజలు తమ భుజస్కంధాలపై వేసుకుని ముందుకు నడిచిన ఉద్యమ రూపమది.

కాని ఎదో యుద్ధానికి వెళ్తున్నట్లు, ఎదో విధ్యంసానికి వెళ్ళినట్లు, ముదస్తు అరెస్టులు. పోలీసుల పహారాలు, అడుగడుగున పోలీసులతో రోడ్డు దిగ్బంధనం (అసలు మిలియన్ మార్చ్ పోలీసులు పిలుపు ఇచ్చినట్లు అనిపించింది) అడుగు తీసి అడుగు పెట్టకుండ ముళ్ల కంచెలు, అయిన ప్రజలు వెనకడుగు వేయలేదు. ఒక్క అడుగుతో మొదలయితేనే సాధ్యం. అదే స్ఫూర్తి. అమరులు, ప్రాణాలు, బలిదానాలు ఆ రోజు ఇంట్లో కూర్చునవాళ్ళను ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది. అందుకే తెలంగాణ ఉద్యమంలోని కర్యకర్తలంతా అరెస్టులై స్టేషన్‌లలో ఉంటే, సామన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ముఖ్యంగా మహిళలు రోడ్లపై కవాతు చేశారు. ఎన్ని ఇబ్బందులను అయినా ఎదుర్కొని నడిచారు. కాని నిర్బంధాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. ఉస్మానియా లాఠీ చార్జీలనుంచి, రబ్బరు బులెట్ల నుంచి, బాష్ప వాయువు ప్రయోగాలు, నిర్బంధాలను ఎదుర్కొని వచ్చానవారు. గ్రామల నుంచి బస్సులను చెక్ చేసి దింపితే 50, 60 కి.లో నడిచినవారు, పరీక్షలకు వెళ్ళకుండా విద్యార్థిలు హాల్ టికెట్లు చింపి పరీక్ష కేందాల నుంచి పరిగెత్తుకొచారు. అంత ఒక్కరొక్కరుగా ముందుకొస్తూనే వున్నారు. ఎన్ని అడ్డంకులు వేసిన మేం ముందుకెళ్తాం అనే స్ఫూర్తి. ఇలాగే తెలంగాణ తెచ్చుకోగలమని ప్రగాఢ వాంఛ. ఒక్క సారిగా భారీకేడ్లను బద్ధలు చేసి, ఆ యాత్ర కదులుతుంది.

మా నేలపై మేం నడవాలంటే మా ట్యాంక్ బండ్ మేం ఎక్కలంటే, ఇదేం నిర్బందం? అనే అవేశం, ఎవరిని బాధ్యుడిని చేయ్యాలి? ఎవరిని కొట్టాలి? ఎవరిని ప్రశ్నించాలి? ఇదే ఆక్రోశం అక్కడికి చేరిన ప్రతి మనిషిలోను ఉన్నది. అదే మూడు తరాల ఆవేదన, ఆక్రందన, గోస, బాధ ... అన్నింటి మంత్రమే ఆ యాత్ర. అయితే ట్యాంక్ బండ్ మీద గుమిగూడిన జనం, ఆవేశం చాల్లరలేదు.

తెలంగాణ తెస్తాం అన్నవాడ్ని, ఇచ్చేది తేచ్చేది మేమే అన్నవాడ్ని, అది కేశవరావు కావచ్చు మాధుయాష్కి కావచ్చు కేసిఆర్ కావచ్చు అందర్ని ప్రశ్నించింది. కొందరిని తరిమికొట్టింది. మరికొందరిని మందిలించింది. అందరు వచ్చారు. ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమాలు ముగిస్తున్న సమయంలో ఇంకా మిగిలిన అవేశం ... మరింత పెరిగింది.

ట్యాంకుబండ్‌పై ఎటు చూసినా సీమాంధ్ర ప్రతిబింబలే. వాళ్ళ ప్రతిరూపలే, మా చరిత్ర ఏది? అని ఎవరికివారే ప్రశ్నించుకున్నారు. నా నగరం, నా గడ్డ, నా ట్యాంక్‌బండ్ ... ఇక్కడ నేను లేను అని ప్రతివారు ఎవరికి వారుగా

ప్రశ్నించుకున్నారు. దారి పొడుగు ఎటు చూసినా మా బందగీలేడు ... మా చాకలి ఐలమ్మ లేదు ... మా కోమరం భీం ... తుర్రెబాజ్‌ఖాన్, షోమాబుల్లాఖాన్, దేవులపల్లి రామానుజరావు మా ముట్నూరి సోమన, వట్టికోట, దాశరధి, భాగ్యరెడ్డి వర్మ, కాళోజీ, 1969 అమరవీరలు ఎవ్వరూ కన్పించలేదు, అందుకే నా భూమిపై నేను లేను అని అనుకున్న ప్రతివాడు, అటువైపు కదలిండు, ఎవరు తమ సహనాన్ని ఆపుకోలేకపోయారు. సీమాంధ్రుల దురాక్రమణ ఆగడాలు పెరిగి పెట్రేగి పోవడాన్ని వారు అంగీకరించలేకపోయారు. దానితో వారి ఆందోళన పతాక స్థాయికి చేరుకుంది. నీళ్ళు, ఉద్యోగాలు, భూములు కాజేసి దోపిడీ దారులుగా తమ వలసాధిపత్యాన్ని తెలంగాణ ప్రజలపై కొనసాగించడాన్ని సహించలేకపోయారు. అంతే... అక్కడ తెలంగాణ ప్రజల మనోవేదన వెల్లడైంది, నిగ్రహం తప్పింది, విగ్రహం కూలింది. రోడ్డుపై పడింది. ఇంకా కోపం చల్లారలేదు. హుస్సేన్‌సాగర్‌లో పడేసేదాక కాని ఆ ఆవేశం జాషువ పైన, శ్రీశ్రీ పైన, వేమన పైన లేదా అల్లూరి పైన కాదు. మాకు కావల్సింది. మా చరిత్ర. మా సంస్కృతి, మా గడ్డపైన మా స్మృతులు ఉండాలనే ఆకాంక్ష. శ్రీశ్రీ కవితలు మా నాలుకలపై నాట్యమాడుతాయి. కావున మేం శ్రీశ్రీని అవమానించాలని తలచలేదు. ఆ ఆలోచన లేదనేది స్పష్టం. కాని మా కోసం పుటకో మాట మాట్లాడే వాళ్ళపైన, రెండు కండ్ల సిద్ధాంతపైన .... మళ్ళొచ్చే దసరా ..... దీపావళి .... బతుకమ్మ, .... ఉగాధి..... మన తెలంగాణ రాష్ట్రంలోనే అని సంవత్సరాలు గడుపుతున్న వాళ్ళపైనా ... ఇప్పుడు తెలంగాణ ప్రజలకు విశ్వాసం లేదు. కూలీంది విగ్రహాలే మళ్ళీ వాటిని పునర్నిర్మించడానికి ఈ మధ్యే ప్రకటనలు మొదలయినాయి. ఎన్ని జీవోలు తేచ్చిన, తెలంగాణ స్మృతులు (నేటి జయశంకర్ నుంచి, నాటి బందగి వరకు) ప్రతి స్మృతి మా గడ్డ మీద కన్పించాలి ... సహనానికి కూడా సహనం కోల్పోయిన రోజు ఆకాంక్ష ఎంత బలమైందో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. తెగించి పోరాడే మా తెలంగాణ బిడ్డలు మునుముందుకే సాగుతున్నరు. వలసాంధ్రులను, వారి దోపిడీ పెట్టుబడులను తరమికొట్టేంత వరకు నిద్రపోరు. అందుకే మా మాట, మా బాట, మా బతుకు, మా పని అన్ని జై తెలంగాణ! జై జై తెలంగాణ !!

**(ఉస్మానియా యూనివర్సిట సోషియాలజి లెక్చరర్)**

# బుద్ధుని సాక్షిగా తెలంగాణ చైతన్యం

**- అద్దంకి దయాకర్**

ప్రపంచంలో శాంతి, మానవత్వాలకు ప్రతీకగా నిలిచిన బుద్ధుడి సాక్షిగా అమానవీయంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలకు దీటైన సమాధాన మిచ్చింది తెలంగాణ జెఎసి నిర్వహించిన 'మిలియన్ మార్చ్'. విప్లవాల పురిటిగడ్డ తెలంగాణ తన స్వాతంత్రం కోసం చేస్తున్న పోరాట క్రమంలో "మార్చ్" ఒక మైలురాయి అని చెప్పక తప్పదు.

చైనా లాంగ్ మార్చ్ స్ఫూర్తితో తలపెట్టిన మిలియన్ మార్చ్ స్టీరింగ్ కమిటీలో సుదీర్ఘ చర్చ తర్వాత అన్ని భాగస్వామ్య పక్షాల సంపూర్ణ మద్దతుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అనుకున్నాము. మరో వైపు ప్రభుత్వమూ అదే పట్టుదలతో మిలియన్ మార్చ్ జరగనీయకుండా ఉద్యమాన్ని అణిచివేయాలని చేయని కుట్రలేదు. జెఎసికి ప్రధాన బలమైన ఉద్యోగ సంఘాల నాయకులను ఢిల్లీ చర్చలకు తీసుకు వెళ్ళింది ప్రభుత్వం. మిలియన్ మార్చపై భయానక ప్రకటనలు చేస్తూ ఒకవైపు డిజిపి మరోవైపు నగర కమిషనర్‌లు నిప్పులు చిమ్ముతున్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రజలు ఉద్యమంలో కలిసిరావడానికి వారి ప్రటనలు దోహదం చేశాయని చెప్పక తప్పదు. మరో వైపు జిల్లాలలో ఎలాగైనా ట్యాంక్‌బండ్ చేరాలని ఉత్సాహంతో యువకులు, విద్యార్థులు మార్చ్‌లో పాల్గొనాలని బస్తీలలో తిరుగుతున్న సమయంలో... "మన సిటీల మన ట్యాంక్‌బండ్‌పై పోనీకి ఆంధ్రోళ్ళు అడ్డుకుంటుడ్రాట బై సెలవు బెట్టైనా మిలియన్ మార్చన ఆడ ఉండాల్రా మనోళ్ళకు జెప్పు" అని బస్తీలలో ప్రజలు మాట్లాడుకోవడం విన్నాం. రోజు రోజుకు ఉత్కంఠ పెరుగుతుంది మిలియన్ మార్చ ఎలా జరగబోతుందని, గమ్యానికి చేరుకోవడానికి కూడా అదే సమయంలో జనం పథకాలు రచించుకోవడం గమనార్హం.

తెలంగాణ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రజా చైతన్యాన్ని, ప్రజల మనోభావాల తీవ్రతను చాటి చెప్పింది మిలియన్ మార్చ్. దాదాపు 2 కిలోమీటర్లు ఉన్న చెరువుకట్టకు చేరుకునేందుకు ప్రజలు చూపించిన తెగుల ప్రత్యక్ష సాక్షులుగా మేవు పొందిన ఆనందం ఈ జీవితంలో మరచి పోలేనిది. మిలియన్ మార్చ్

రోజున తెలంగాణ జెఎసి కార్యాలయంలో చైర్మెన్ కోదండరాం గారితో పాటు ఈటెల రాజేందర్, ఎండల లక్ష్మీనారాయణ, ఉద్యోగ సంఘాల నేత శ్రీనివాస్‌గౌడ్, సమన్వయకర్త పిట్టల రవీందర్, రసమయి బాలకిషన్, రోషంబాలు, నేను మా సంఘ నాయకులు భైరి రమేష్, సృజన్‌కుమార్, ఎన్.ఎన్. రవికాంత్‌లతో పాటు మరికొందరున్నారు. మార్చ్ సమయం 12 గంటల నుండి 5 గంటల వరకు అని ప్రకటించడం వల్ల పోలీసులు ఆదనపు బలగాలు ఉదయం 6 గంటల నుండే కర్ఫ్యూ తరహా బందోబస్తు ఏర్పాటు చేశారు. జెఎసి నాయకులు సైతం ఆఫీసు చేరుకునేందుకు కూడా భయపడేంత ట్యాంక్‌బండ్‌కు 6 కిలోమీటర్ల పరిధిలో పోలీసు వలయం ఏర్పాటు చేశారు. జిల్లాల నుండి బయలు దేరిన వారిని వెంటనే అరెస్టు చేయడం వల్ల మార్చ్ ఎలా జరుగుతోందని కలవరం మొదలయ్యింది. కోదండరాం గారు ఆ సమయంలో ఒక మాటాన్నారు. “మార్చ్‌ను ప్రజాస్వామికంగా జరుగనీయకుండా అడ్డుకోవడమే మన విజయమని. అయితే మార్చ్ తప్పకుండా విజయవంతమవుతుంది చూడు” అనే మాట మానసిక బలాన్నిచ్చింది. కాని ప్రజలెవరూ ఎక్కడా కనిపించకపోవడం ఆందోళనకు కారణమయ్యింది.

అందరికీ కోదండరాం, రవీందర్‌లు ఫోన్ చేస్తూ అందరం బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహం దగ్గరకు రావాలని అక్కడినుండి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్ళి అక్కడి నుండి ట్యాంక్‌బండ్‌కు వెళదామని చెపుతున్నారు. కనీసం ప్రతీ నాయకుడు 500 మందిని అక్కడికి తరలించాలని అట్లయితే 5000 మందితో ర్యాలీ తీయ్యొచ్చని అటు తర్వాత ప్రజలే స్వచ్ఛందంగా పాల్గొంటారనేది అంచనా. ఇది పసిగట్టిన పోలీసులు జగ్జీవన్‌రామ్ విగ్రహం దగ్గరకు చేరుకున్న ప్రతీ వారిని అరెస్టు చేయడం మొదలు పెట్టారు.

మరోవైపు మల్లెపల్లి లక్ష్మయ్య, న్యూడెమోక్రసీ నాయకులు సూర్యం, గోవర్ధన్, సంధ్యక్కల ఆధ్వర్యంలో వినూత్న తరహాలో కార్యక్రమం జరిగింది. ఎలాగైనా ట్యాంక్‌బండ్ చేరుకుంటాం అనుకున్నాం గాని వారి “పెళ్ళి తంతు” పోలీసులను వెర్రి వెంగళప్పలను చేసి ఉద్యమకారులకు హాయి నిచ్చింది.

11 గంటలకు మీడియా బ్రీఫ్ అనంతరం మిలియన్ మార్చ్ కోసం వస్తున్న ప్రజలను అడ్డుకోవద్దని, శాంతియుతంగా జరగబోతున్న మార్చ్‌ను అడ్డుకోవద్దని పోలీసులకు ప్రభుత్వాన్ని కోరి 12 గంటలకు ట్యాంక్‌బండ్ వద్దకు వెళతామని ప్రకటించి ఆఫీసులో కూర్చున్న సమయంలో అందరి అరెస్టుకు రంగం చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఇంటలిజెన్స్ వర్గాలు ప్రతీ కదలికను సమాచారాన్ని వెంట వెంటనే పై అధికారులకు చేరుతుండడం వల్ల పరిణామాలు త్వరత్వరగా మారుతున్నాయి. అంతే వేగంతో ఎత్తుగడగా ఒక్కరొక్కరుగా బయటికి వెళ్ళాలని

నిర్ణయించుకున్నాము. ముందుగా నేను రసమయి బాలకిషన్, రోషం బాలు, భైరి రమేష్ బయటి పరిస్థితులను తెలుసుకోవడానికి ఆఫీసు నుండి బయటికి వచ్చి టీ తాగుతున్నాం. అదే సమయంలో భాజాపా నేత ఎండల లక్ష్మీనారాయణ వాహనంలో వెనుక కొంత భాగం మూసేసి అక్కడ కోదండరాం గారిని కూర్చొపెట్టి లక్ష్మీనారాయణ ముందు సీట్లో కూర్చొని గేటు దగ్గరకు వచ్చారు. పోలీసు అధికారి అంజయ్య ఆధ్వర్యంలో ఉన్న టీం కారును ఆపి కార్ చెక్ చేయాలని పట్టుబట్టారు. కారణం అందులో కోదండరాం ఉన్నాడని ఇంటలిజెన్స్ మిత్రుల సమాచారం ఉండడం. ఎండల గట్టిగా స్పందిస్తూ ఎమ్మెల్యే కారును చెక్ చేసేది ఏంది. దేని కోసం మీరు నన్ను ఆపారో చెప్పాలని సీరియస్ వాగ్వివాదం జరుగుతున్న క్రమంరలో వెనుక ఉన్న డోర్ నుండి చైర్మన్ గారిని చేసి క్రిందికి దిగాల్సిందిగా పోలీసులు కోరారు. అదే సమయంలో మేము పోలీసులతో వాగ్వివాదానికి దిగి కనీసం ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తూ కోదండరాం గారికి అడ్డంగా ఉండి పోలీసులతో వాదిస్తున్నాం. అంజయ్య సైగలతో మమ్మల్ని అరెస్టు చేయాలని సూచించాడు అంతే ఉన్న పళంగా నాతోపాటు, రసమయి, భైరి రమేష్, రోషంబాలు మరో కొంత మందిని ఈడ్చుకెళ్లి పోలీసు వ్యానులో ఎక్కించారు. ఆవేశం తన్నుకొచ్చి పోలీసు వ్యానును అతలాకుతలం చేస్తున్నారు. వ్యాను కదిలి బి.ఆర్.కె. భవన్ చేరిందో లేదో రమేష్ పోలీస్ డ్రైవర్ కుతిక బట్టి అతని సీటును ఒక్క తన్ను తన్నాడు. బయటపడిన డ్రైవర్ వెంటనే పక్కకు తీసి నేను తెలంగాణ వాడినే అన్నా అంటూ ఆపాడు. అరెస్ట్ అయిన వంద గజాల దూరంలోనే విడుదలయ్యి మళ్ళీ కోదండరాం గారి పైపు వచ్చాం. అప్పటికే అతన్ని అరెస్ట్ చేసి తీసుకువెళ్లారు.

అరెస్టు సమయంలో గుమికూడిన దాదాపు 50 మంది గ్రూపు ట్యాంక్‌బండ్ వైపు వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. బి.ఆర్.కె. భవన్ దగ్గర దాదపు 500 మంది పోలీసు సహారా ఉంది. రోడ్డు దారిన్నైనా ట్యాంక్‌బండ్ చేరాలనే ఉద్దేశంతో లిబర్టీ, దోమల్ గూడాలోని పి.జె.ఆర్. ఇంటి మీదుగా వెళుతున్నాం. దారి పొడువునా పోలీసు వాహనాల్లో వందలాది మంది కార్యకర్తలను కనపడితే అరెస్ట్ ప్రాతిపదికన అరెస్టులు మొదలు పెట్టారు. అయితే ఎంతమందిని అరెస్టు చేస్తారు. ఉన్న 20 వాహనాల్లో 1000 మందిని తరలించే వచ్చే వరకు దాదాపు 20 నిమిషాలు పడుతుంది. జన ప్రభంజన మొదలయ్యింది. పోలీసులు పరిపోలేదు. వారి వాహనాలు సరిపోలేదు. ప్రతీ బస్తీ, గల్లీ దారి గమ్యం ట్యాంక్‌బండ్ అయ్యింది. మార్చ్ కోసం ముందుగా ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన కార్యకర్తలందరు నడక 12 గంటలనుండి ట్యాంక్‌బండ్ వైపే సాగుతుంది. అన్ని గల్లీల నుండి వేలాది మంది కార్యకర్తలు ర్యాలీగా వెళుతుంటే ఆ గల్లీల్లో అక్కడక్కడ

ఉన్న పోలీసులు ముఖం తేలేసారు. చేసేదేమి లేక చూస్తుండిపోయారు. పి.జె.ఆర్. ఇంటి మీదుగా వెళ్ళిన మేము ఫ్లైఓవర్ క్రిందనుండి ట్యాంక్‌బండ్‌కు ప్రజలు ఏర్పాటు చేసుకున్న నిచ్చెన ద్వారా చేరుకొని అమ్మ ఎలాగోలా గమ్యం చేరాం అనుకున్నాం. అయితే అక్కడి మేము ముందుగా చేరుకుంటామని భావించాం కాని అప్పటికే వేలాది మంది కార్యకర్తలను ట్యాంక్‌బండ్‌పై చూసి ఆశ్చర్యానికి గురయ్యాం. 12 గంటల కంటే ముందే ప్రజలందరూ తమ తమ వ్యూహాలతోని మార్చ్ ప్రదేశానికి చేరుకోవడం తెలంగాణ ఉద్యమ చైతన్యానికి నిదర్శనం. ఏ పార్టీనో తెలియదు, ఏ జిల్లానో తెలియదు. వారి నినాదం ఒక్కటే 'జై తెలంగాణ' అంటూ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి వైస్రాయ్ హోటల్ వరకూ తిరుగుతున్నారు. ముసలోళ్లు సైతం తెలంగాణ వచ్చినంత సంతోషంతో ట్యాంక్‌బండ్ మీద నృత్యాలు చేశారు. అతి కొద్ది సమయంలో జన ప్రవాహం మొదలై ట్యాంక్‌బండ్ మాదకు చేరింది. అయితే శాంతియుతంగా జరుగుతున్న కార్యక్రమాన్ని అవాంతరాలు సృష్టించేందుకు అన్నట్లుగా పోలీసు వాహనమొకటి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చింది. అది చూసి ఆగ్రహించిన ప్రజలు దాన్ని తగుల బెట్టారు. ఒకవైపు అరెస్టులు చేస్తూ మరోవైపు వచ్చిన ప్రజలను ఇబ్బందులు పెడుతున్న తీరును సహించలేక యువత తిరుగుబాటు చేసింది. నిర్బంధానికి నిరసనగా... ట్యాంక్‌బండ్‌పై నున్న సీమాంధ్రుల విగ్రహాలను ధ్వంసం చేశారు. ఎవరో పనిగట్టుకొని చేసిన చర్య కాదది. కేవలం ప్రజల అప్పటి భావోద్వేగానికి గుర్తై, ప్రజాస్వామిక ఉద్యమానికి ప్రభుత్వం, పోలీసులు సహకరించడం లేదనే కోపానికి రూపమది. వద్దని వారించినా వినే పరిస్థితుల్లో ప్రజలు లేరు. వద్దని చెప్పే ధైర్యమూ చేయలేదు. అప్పటికే ఆ దృశ్యాలను చిత్రీకరించేందుకే వచ్చినట్లుగా వచ్చిన పోలీసు రిపోర్టర్లను ప్రజలు గమనించారు. మఫ్టీల్లో చిత్రీకరించినా ప్రజలు గుర్తు పడుతున్నారని పోలీసులు వివిధ మీడియా సంస్థల పేరుతో మెడలో బిల్లతో దర్శనమిచ్చారు. అది తెలుసుకున్న విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు వారి కెమెరాలను ధ్వంసం చేశారు. గద్దర్ తన బృందంతో ట్యాంక్‌బండ్‌పై యాత్ర చేశాడు. హరీష్‌రావు హుస్సేన్‌సాగర్ నుండి పడవలో చేరుకున్నాడు. బి.జె.పి. శ్రేణులు గుంపులు గుంపులుగా పాటలు పాడుతూ తిరుగుతున్నారు. తె.రా.స. నాయకులందరూ తమ తమ బృందాలతో వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తె.రా.స. అదినేత కె.సి.ఆర్ గారు వస్తున్నారనే వార్త ప్రజలను కేరింతలు పెట్టింది. అతని కోసం ఎదురుచూపులు... విజయం సాధించామనే సంతోషంలో అన్ని పార్టీల, సంగాల నాయకులు కె.సి.ఆర్. గారికి స్వాగతం చెప్పేందుకు అంబేద్కర్ విగ్రహం పైపు వెళ్లాము. వేలాది మంది కార్యకర్తలు ఎదురెళ్ళి ఉద్యమకేంద్రానికి ర్యాలీగా తీసుకెళ్ళారు.

మొత్తానికి ప్రభుత్వ లెక్కలెలా ఉన్నా లక్షలాది మంది కార్యకర్తలు ప్రభుత్వ కుట్రలను ఛేదించి మిలియన్ మార్చ్‌లో పాల్గొనడమే తెలంగాణ ప్రజా విజయం. పార్టీలకతీతంగా ప్రజలు ఉద్యమించిన తీరు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఒక్క విగ్రహాల ధ్వంసం, మీడియా కెమెరాల ధ్వంసం తప్ప ఈ మధ్య కాలంలో భారత దేశంలో అంత పెద్ద ఎత్తున జరిగిన ఉద్యమం తెలంగాణ ఉద్యమమొక్కటే... దానితో మిలియన్ మార్చ్ ఒక చారిత్రిక ఘట్టం. దీనిపై వ్యతిరేకులు చేస్తునన వాదంలో పసలేదు. విగ్రహాలు కూల్చివేతకే గగ్గోలు మంటున్న వారికి 700 మంది ఆత్మాబలిదానాలు ఎందుకు గుర్తుకురావు. విగ్రహాలపై చూపిస్తున్న మానవత్వం మనుషులపై ఎందుకు లేదు. అందుకే తెలంగాణ బలపడుతుంది. తెలంగాణ ఉద్యమంలో పాల్పంచుకుంటున్నందుకు అప్పుడప్పుడు గర్వపడే వాడిని. కాని "మిలియన్ మార్చ్" లో పాల్గొన్నప్పుడు మాత్రం వీరత్వానికి ప్రతీకలైన ఉద్యకారుల ఆవేశాన్ని ప్రజా ఉద్యమ ఉధృతిని చూసి పులకరించిపోయాను. నా జీవితంలో గుర్తుండిపోయే అతి కొన్ని విషయాల్లో గర్వంగా చెప్పుకునేది తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన "మిలియన్ మార్చ్". ఎంతో మంది ఎన్నో కారణాల వల్ల పాల్గొనలేకపోయామనే బాధపడ్డారు. నా అదృష్టం కొద్ది మార్చ్‌లో పాల్గొన్నాను. పోలీసులు అరెస్టు చేసినా వారిని వదిలించుకొని మార్చ్‌లో పాల్గొన్నాం. కోదండరాం గారిని సాయంత్రం 5 గంటలకు వదిలేశారు. ఆయన కోసం కె.సి.ఆర్. గారితో పాటు ఎంతో మంది జెఎసి నాయకులు ఎదిరిచూశాం. ఒక వేళ మేము పోలీస్‌స్టేషన్‌లో ఉంటే మిలియన్ మార్చ్‌లాంటి చారిత్రిక ఘట్టంలో మా పాత్ర అరెస్ట్‌గా మిగిలిపోయేది. ఒక సామాన్య మానవునిగా ఆరోజు అక్కడ పాల్గొనడమే ఆనాటికి గొప్ప. మార్చ్‌లో పాల్గొన్న ప్రతివాడు వీరుల్లా కనిపించారు. అయితే మీరు మాత్రం నాయకులు కాదు కేవలం ప్రజలే ప్రజలే ఉద్యమానికి నాయకులని అందుకే తెలంగాణ సజీవంగా ఉంటుందని అనిపించింది. మిలియన్ మార్చ్ తర్వాత సీమాంధ్ర ప్రజల్లో గుణాత్మక మార్పు కనిపించింది. అప్పటి వరకూ తెలంగాణాని వ్యతిరేకిస్తూన్న వారు సైతం తీవ్రతను గమనించి విడిపోయి కలిసుంటే మంచిదనే భావనకు మద్దతునిచ్చారు.

"2-3-2012న ఆంధ్రా యూనివర్శిటీలో విద్యార్థుల సమావేశంలో పాల్గొన్నపుడు "మిలియన్ మార్చ్" లాంటి కార్యక్రమాలు చేయడం వల్ల తెలంగాణ జెఎసి ఇంకా నిలబడగలిగింది. అప్పటినుండే మేము సమైఖ్యాంధ్ర జెఎసికి సహకరించడం లేదని సుబ్బారావు అనే పరిశోధక విద్యార్థి నాతో అన్నాడు"

అటు ఆంధ్ర ప్రజల మనసులను ఇటు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచిన తెలంగాణ మిలియన్ మార్చ్ తెలంగాణ ఉద్యమ చరిత్రలో మహోన్నత కార్యక్రమం. అదే స్ఫూర్తితోనే ఈ దశ ఉద్యమం కొనసాగాలని కోరుకుంటున్నాను.

**(తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు)**

# మిలియన్ మార్చ్‌లో తాండూరు

**–ఆర్. విజయ కుమార్**

తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఒక అపూర్వ ఘట్టం. తెలంగాణ ప్రజల ఆకాంక్ష పెల్లుబికిన రోజు. తెలంగాణ గుండెకాయ హైదరాబాదులో, హైదరాబాదుకు మణిహారంగా ఉన్న ట్యాంక్ బండ్‌పై తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రదర్శిస్తూ మిలియన్ మార్చ్‌ను నిర్వహించాలని జె.ఎ.సి. తలపెట్టింది. ఇది తెలంగాణ ప్రజల ఆకాంక్షను, సంఘటిత శక్తిని పాలకులకు చూపేందుకు నిర్వహించబడినది. మిలియన్ మార్చ్‌కు ప్రభుత్వ అనుమతి నిరాకరించడంతో తెలంగాణ వాదులు ఎలాగైన మిలియన్ మార్చ్‌ను జరిపి తీరుతామని ప్రతిజ్ఞ పూనారు. సీమాంధ్ర పాలకులు పోలీసుల నిర్బంధంతో మార్చ్‌ను ఆపాలని కుట్ర పన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోను తెలంగాణ వాదులను ముందస్తు అరెస్టు చేశారు.

రంగారెడ్డి జిల్లా తాండూరు నియోజక వర్గం నుండి జె.ఎ.సి., భాగస్వామ్య రాజకీయ పార్టీలు, తెలంగాణ విద్యావంతుల వేదిక, లెక్చరర్స్ ఫోరం మొదలగు ప్రజాసంఘాల నాయకులు ఎలాగైనా జె.ఎ.సి. పిలుపు మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని నిర్ణయించాయి. పోలీసులు ముందస్తు అరెస్టులు మొదలు పెట్టడంతో రహస్య సమావేశాలు నిర్వహించి ఉద్యమ కారులు మిలియన్ మార్చ్‌లో పాల్గనేందుకు రెండు రోజులు ముందుగానే హైదరాబాదుకు చేరుకోవడం జరిగింది.

అది మార్చి 10, మిలియన్ మార్చ్‌రోజు. తెలంగాణ ప్రజలందరూ ఉద్విజ్ఞంగా ఏంజరుగుతుందో అని ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్‌లో అనేక రోడ్లు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ట్యాంక్‌బండ్ వైపు వెళ్ళే మార్గాలన్నీ ముళ్ళకంచెలు, బారికేడ్లతో మూసివేయబడ్డాయి.

రెండురోజుల ముందుగానే హైదరాబాద్‌కు చేరుకున్నమేము ఆ రోజు ఎస్.ఆర్.నగర్‌లో, నాంపల్లి వైపు వెళ్ళే బస్సు ఎక్కినాము. బస్సు పంజాగుట్టదగ్గరకు చేరుకోగానే రూటు మార్చింది. ఖైరతాబాదువైపు వెళ్ళే రోడ్డును మూసివేసి, పంజాగుట్ట చౌరస్తా వద్ద వందలాది మంది పోలీసులు పహారా కాస్తున్నారు. మేము ఎక్కిన

బస్సు మాసబ్‌ట్యాంక్ విజయనగర్ కాలనీ మల్లేపల్లిల గుండా నాంపల్లి స్టేషన్ వెనుక వైపు వరకు వెల్లగలిగింది. అది ఆఖరు స్టేజి. మేమంతా నాంపల్లి స్టేషన్ ముందుకు చేరుకున్నాము. హోటల్స్, షాపులు, అన్నీ మూతబడి ఉన్నాయి. ప్రయానికులతో ఎప్పుడూ రద్దీగా కనిపించే నాంపల్లి స్టేషన్ ముందు కర్ఫ్యూను తలపించే వాతావరణం కనిపించింది. హైదరాబాద్ రోడ్లపై ఎప్పుడూ చూడని దృష్యాన్ని మేము చూసాము. అది నాంపల్లి ఎదురుగా రోడ్డుపై ఇద్దరు పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. బహుషా అది వారి జీవితంలోనే అరుదైన సంఘటనగా నిలిచిపోతుందేమో?. నాంపల్లి స్టేషన్ దగ్గర నుండి ట్యాంక్‌బండ్ చేరడానికి పోలీసులకు అనుమానం రాకుండా మేమంతా ఒకరొకరుగా విడిపోయి ముందుకు సాగాము. నాంపల్లి పబ్లిక్ గార్డెన్ దెగ్గర పోలీసుల కళ్ళు కప్పి బ్యాంక్ స్ట్రీట్ మీదుగా ఎల్.బి. స్టేడియం చేరుకున్నాము. అక్కడ నిజాం కళాశాల ముందు గుమిగూడిన విద్యార్థులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. రాష్ట్ర జె.ఎ.సి. కో-ఆర్డినేటర్ శ్రీ పిట్టల రవీందర్ గారికి ఫోన్ చేసి పరిస్థితిని తెలుసుకున్నాము. అప్పటికే ఉద్యమనాయకుల్ని అనేకమందిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పొలిటికల్ జె.ఎ.సి. ఛైర్మన్ ప్రొఫెసర్. కోదండరామ్ గారిని కూడా అరెస్ట్ చేయడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. అక్రమ అరెస్టులకు నిరసనగా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం దెగ్గర ప్రదర్శన చేయాల్సి ఉన్నందున శ్రీ పిట్టల రవీందర్ గారు మమల్ని పోలీసుల కంటపడకుండా జాగ్రత్తగా ఉండమన్నారు. సరేనని మేము చాలా సేపు అక్కడే ఎదురుచూసాం. సమయం మ॥ 12:30 ని॥లు. సార్ వాళ్ళు ఇంకా అక్కడికి రాకపోయే సరికి మళ్ళీ ఫోన్ చేశాము. అప్పటికే ప్రొఫెసర్ కోదండరామ్ తో పాటు జె.ఎ.సి. ఆఫీసులో ఉన్న ఉద్యమ నాయకులందరినీ పోలీసులు అరెస్టుచేసి తీసుకుపోయారని తెలిసింది.

ఇక మేము ఎలాగైనా ట్యాంక్ బండ్ చేరుకోవాలని, మిలియన్ మార్చ్‌లో పాల్గనాలని పోలీసుల కళ్ళుకప్పి బషీర్‌బాగ్ చౌరస్తానుండి వీధుల సందుల్లోంచి ట్యాంక్‌బండ్ క్రింది వరకు చేరుకున్నాము. అప్పటికే ఖమ్మంలోని వచ్చిన కళాకారులు ట్యాంక్‌బండ్ పైకి ఎక్కే ప్రయత్నం చేస్తున్నారు. మేమూ వారిని అనుసరించాం. ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్నాము. అప్పటికే వేళ్ళపై మాత్రమే లెక్కపెట్టే సంఖ్యలో తెలంగాణ వాదులు ట్యాంక్‌బండ్ పై ఉన్నారు. కొద్దిక్షణాల్లోనే పుట్టని తొలుసుకొని వచ్చిన చీమల్లా తెలంగాణ వాదులు ఒక్కసారిగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకున్నారు. అది ఎలా సాధ్యమైందో అక్కడ మేము కలసిన తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మల్లేపల్లి లక్ష్మయ్యగారు వివరించారు. సికింద్రాబాదు నుండి ట్యాంక్‌బండ్ వెళ్ళే దారిలో ఒక పెళ్ళి జరిపించారు. ఆ పెళ్ళికి వారితో పాటు

వందలాది మంది తెలంగాణ కళాకారులు, తెలంగాణ వాదులు హాజరు అయినారు. ఇందంతా కూడా పోలీసుల కళ్ళుకప్పడానికి జరిగిన ఉదంతము. వారంతా కూడా ఒక్కసారిగి ట్యాంక్‌బండ్ వైపు దూసుకువచ్చారు. ఊహించని ఈ పరిణామానికి పోలీసులు బిత్తరపోయారు. వారు తేరుకునే లోపలే బారికేడ్లను తొలగించుకొని వందలాది ఉద్యమకారులు ట్యాంక్‌బండ్ పైకి చేరుకున్నారు. ఇక ఇందిరాపార్క్ మరియు సెక్రెటేరియట్ వైపు నుండి ఉన్న దారుల్లో ఇదే అదనుగా అనేక మంది ఉద్యమకారులు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకోవడం మొదలైంది. నిమిషాల్లోనే ట్యాంక్‌బండ్ జనసంద్రమైంది. కవులు, కళాకారులు, ఉద్యమ నినాదాలు, గానాలతో ట్యాంక్‌బండ్ హోరెత్తడం మొదలైంది. ఖమ్మం కళాకారుల ఎర్ర దండు ప్రత్యేక ఆకర్శనగా నిలిచింది.

మేము మొదట ట్యాంక్‌బండ్‌పై నేలతల్లిని ముద్దాడినాము. తెలంగాణ నడిబడ్డున ఉన్న ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ బిడ్డలు గుమిగూడి తమ ఆకాంక్షను తెలుపుదామంటే ఎన్ని నిర్భందాలో? మన ప్రాంతంలో మనం పరాయివారమైన బాధ ఒకవైపు, ఈ పరిస్థితికి కారణమైనవారిపై ఆగ్రహం మరోవైపు. సీమాంధ్రుల పాలననుండి తెలంగాణ విముక్తికై మిలియన్ మార్చ్ సాక్షిగా ప్రమాణం చేసాం.

అనేక నిర్భందాల మధ్య వేలాదిగా అడ్వకేట్లు, విద్యార్థి సంఘాలు, కళాకారులు, కవులు, టి.ఆర్.ఎస్., బి.జె.పి. నాయకులు ట్యాంక్‌బండ్‌పై చేరుకోవడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం. మిలియన్ మార్చ్‌లో పాల్గన్నవారంతా తెగించిన వారే. తెలంగాణ విముక్తికోసం కంకణం బద్దులైనవారే. ట్యాంక్‌బండ్‌పై ఒక చివరి నుండి మరో చివరివైపు మార్చ్ జరుగుతున్నది. ఒక్కసారిగా పోలీసుల కవ్వింపు చర్యలు మొదలయ్యాయి. అది సర్దిచెప్పడంతో ఆగలేదు. క్రమంగా వాతావరణం ఉద్విజ్ఞంగా మారసాగింది. *పోలీస్ గో బ్యాక్* నినాదాలు మొదలై వారిని ట్యాంక్‌బండ్ దించేంత వరకు కొనసాగాయి. వారిచేతిలోని ఆయుధాలన్నీ కూడా ఉద్యమకారుల ఆగ్రహజ్వాలల ముందు నిర్వీర్యమయ్యాయి. ఇంత నిర్భందాల మధ్య మన గడ్డపై మనం గుమి గూడడం తట్టుకోలేని కొంతమంది ఉద్యమకారుల ఆగ్రహానికి పోలీసు వాహనం తగలబడిపోయింది. అది అంతటితో ఆగలేదు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ పోరాట వారసత్వానికి, సంస్కృతిక ప్రతీకలకు తావివ్వకుండా సీమాంధ్ర ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నిలబడ్డ వగ్రహాలవైపు ఉద్యమకారుల దృష్టి పడింది. అక్కడ ఒక కొమరం భీం, చాకలి ఐలమ్మ, షోయబుల్లాఖాన్, కాళోజీ లాంటి తెలంగాణ వైతాళికుల వారి విగ్రాహాలు లేకపోవడం వెలితిగా కనిపించింది. అక్కడ ప్రతిష్ఠించబడిన సీమాంధ్రుల విగ్రహాలు తెంలంగాణ ప్రజల చేతగాని తనాన్ని వెక్కిరిస్తుంన్నట్టుగా అగుపించాయి. అంతే కొంత మంది ఉద్యమకారులు విగ్రహాల విధ్వంసానికి

పాల్పడ్డారు. జరుగుతున్న దృష్యాలు చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సీమాంధ్ర మీడియా ఛానెళ్ళ వాహనాలు ఉద్యమకారుల ఆగ్రహానికి గురై విధ్వంసమయ్యాయి. వారి కెమెరాలు హుసేన్ సాగర్‌లో పడ్డాయి. అప్పటికే జె.ఎ.సి. ఛైర్మెన్, ప్రొ॥ కోదండరామ్‌గారిని మరికొంత ఉద్యమ అగ్రనాయకులను పోలీసులు అక్రమంగా నిర్భందించారని తెలుసుక్ను ఉద్యమకారులు ఆగ్రహ కట్టలు తెంచుకుంది. అక్రమంగా నిర్భందించిన ఉద్యమకారులను వెంటనే విడుదల చేసి ట్యాంక్‌బండ్‌పైకి తీసుకురావాలని పట్టుబట్టారు. కొంత మంది కాంగ్రేస్ నాయకులు ట్యాంక్‌బండ్‌పైకి చేరేందుకు ప్రయత్నించగా ఉద్యమకారులు వారిని అడ్డుకుని కొట్టినంత పని చేసారు. ఉద్యమకారుల ఆగ్రహానికి భయపడ్డ కాంగ్రెస్ నాయకులు వెనుతిరిగారు. ప్రభుత్వం ఉద్యమ కారుల డిమాండ్‌కు తల వంచింది. ప్రొ॥ కోదండరామ్‌తో పాటు అరెస్టైన నాయకులను విడుదల చేసింది. ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్న ప్రొ॥ కోదండరామ్ గారు జె.ఎ.సి. నాయకులతో కలిసి ఉద్యమ సభ నిర్వహించారు. ఈ మిలియన్ మార్చ్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టడంతో పాటు ఉద్యమకారుల ఐక్యత తెగువకు నిదర్శనమన్నారు.

మిలియన్ మార్చ్‌లో ప్రజల ఆగ్రహానికి గురై విధ్వంసమైన విగ్రహాలపై సీమాంధ్ర నాయకత్వం, సీమాంధ్ర మీడియా ఛానెళ్ళు గగ్గోలు పెట్టాయి. 700లకు పైగా ఉద్యమకారులు తెలంగాణ కోసం బలిదానం అవుతే ఏనాడు ప్రాధాన్యత ఇవ్వని సీమాంధ్ర మీడియా ఛానెళ్ళు చిలువలు పలువలు చేసి వక్రీకరణలు జోడించి విష ప్రచారం చేసింది. అనేక మంది మిలియన్ మార్చ్‌లో పాల్గన్న ఉద్యమకారులపై ప్రభుత్వం అక్రమ కేసులను పెట్టింది. మిలియన్ మార్చ్ ఉద్దేశం ప్రజల ఆకాంక్ష వ్యక్తీకరించడమే కానీ పోలీసుల నిర్భందం కారణంగానే సీమాంధ్ర పాలకుల వివక్షకు చిహ్నాలుగా నిలిచిన విగ్రహాలపైకి ప్రజల ఆగ్రహం మళ్ళింది. ఈ ప్రాంత ప్రజల జీవితం, సాంస్కృతితో సంబంధం లేని పరాయి, ఆధిపత్య చిహ్నాలను మాత్రమే ధ్వంసం చేసారు. అయితే ఇది తెలంగాణ వాదులు కాని, విద్యార్థి యువకులు కాని ప్రయత్న పూర్వకంగా చేసిన పని కాదు.

మిలియన్ మార్చ్‌లో వీరసైనికుల్లా పాల్గన్న తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ప్రజలకు స్పూర్ఫిధాతలు. నిర్భందాలను లెక్క చేయకుండా తెలంగాణ ప్రాంత విముక్తి కోసం పోరాటం చేస్తున్న ఉద్యమకారులను చూసి తెలంగాణ తల్లి గర్వపడింది. తన విముక్తి మరెంతోదూరంలో లేదని సంతోషపడింది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన మిలియన్ మార్చ్‌లో నేను సైతం పాల్గనడం గర్వంగాను, ఉద్యమంలో మరచిపోలేని ఒక గొప్ప అనుభవంగానూ భావిస్తున్నాను.

**(తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి)**

# మిలియన్ మార్చ్‌లో గ్రామీణ వైద్యులు

**-డా॥ చొప్పరి శంకర్ ముదిరాజ్**

తెలంగాణ జెఎసి నిర్ణయం మేరకు మార్చి 10న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై మిలియన్ మార్చ్ నిర్వహించ తలపెట్టినారు. ఆ సమయంలో నేను కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో ఉన్నాను. హైదరాబాద్ మొత్తంగా పోలీసు దిగ్బంధంలో వుందని, జిల్లాల నుండి వచ్చేవారిని అరెస్టులు చేస్తున్నారని టివి, పత్రికల్లో చూసాను. తెలంగాణ జెఎసి పిలుపు మేరకు డాక్టర్ల జెఎసి హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ నుండి ఊరేగింపుగా ట్యాంకుబండ్ పైకివెళ్ళాలని నిర్ణయించాము. గోదావరిఖనిలో వున్న నేను హైదరాబాద్ వెళ్ళాలంటే ఎన్నో అడ్డంకులు ఎదుర్కోవలసి వుంటుందని గ్రహించాను. అప్పటికే అన్ని జిల్లాల నుండి మిత్రుల నుంచి ఫోన్లు ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారని. ఇంతలో తెలంగాణ జెఎసి నుండి కోఆర్డినేటర్ పిట్టల రవీందర్ ఫోన్ చేసి ఎట్టి పరిస్థితిలోను డాక్టర్లకు కేటాయించిన చోటి నుండి తప్పకుండా ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌పైకి చేరాలని ఆదేశం నన్ను ఎంతో కలవరానికి గురిచేసింది. ఎలాగైనా హైదరాబాద్ చేరుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పటికే పది జిల్లాల నుండి ఆర్ఎంపి జెఎసి నాయకులు హైదరాబాద్‌కు బయలు దేరారని ఫోన్ల ద్వారా తెలుసుకున్నాను. ఒక డాక్టర్‌గా, సింగరేణి కార్మికునిగా ఈ సింగరేణి ప్రాంతంలో గతంలో పోలీసుల నిర్బంధం, అరెస్టులు చవిచూసిన నాకు ఇదేమి కొత్తకాదనిపించింది. అయినప్పటికి 230 కిలోమీటర్ల దూరమున్న హైదరాబాద్‌కు చేరాలంటే కొన్ని ఇబ్బందులు ఏదుర్కొనక తప్పదని గ్రహించాను. అంతలో నా మదిలో ఒక చిన్న ఆలోచన తట్టింది. హైదరాబాద్‌లో పెండ్లివుందని తొందరగా రడీ కమ్మని నా బార్యకు చెప్పి వెంటనే తయారై గోదావరిఖని బస్‌స్టేషన్‌కు చేరుకోవడం జరిగింది. సుపరిచితుడైన నన్ను బస్‌స్టాండులో చూడగానే పోలీసులు నన్ను అరెస్టు చేయడానికి సి.ఐ. ఎస్.ఐ. లు సిద్దపడ్డారు. అది గమనించిన నేను హైదరాబాద్‌లోని నా మిత్రుని కూతురు పెండ్లి వుందని చెప్పి ముందుజాగ్రత్తగా నెను వెంటతెచ్చుకున్న వెడ్డింగ్ కార్డు వారికి చూయించాను. అది నమ్మిన వారు నన్ను వదిలేసారు. నేను

బయలు దేరింది 9వ మార్చి రాత్రి 11 గంటలకు. మార్గమధ్యలో ఎన్నో పోలీసు తనిఖీల ఎదుర్కొని ఎట్టకేలకు ఉదయం 5 గంటలకు హైదరాబాద్‌కు చేరుకున్నాము. నేను హైదరాబాద్‌లో వుంటున్న నా ఇంటిలో మా బార్యను వదిలి తయారై ఆర్ఎంపి డాక్టర్ల జెఏసికి కేటాయించిన స్థలమైన బషీర్‌భాగ్ ప్రెస్‌క్లబ్ చేరుకున్నాను. అప్పటికే వివిధ జిల్లాల నుండి వచ్చిన ఆర్ఎంపి జెఏసి బృందం అక్కడి చేరుకుంది. బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద డాక్టర్లమందరం బ్యానర్ తీసిపట్టుకొని జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించాము. అప్పటికే మాజీ కేంద్ర మంత్రి సి. హెచ్. విద్యాసాగర్‌రావు, డా॥ రాజేందర్‌రావు, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా ట్యాంక్‌బండ్‌వైపు కదిలి వెళ్లారు. అక్కడే వున్న డిసిపి శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మమ్ముల్ని అరెస్టు చేసి గోషమహల్ స్టేడియంకు తరలించారు. అక్కడ అప్పటికే నాగం జనార్థన్‌రెడ్డితోపాటు బిజెపి, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్టేడియంలో అరెస్టు చేసి వుంచారు. కాని నాకు మాత్రం ఎట్టి పరిస్థితిలోను ట్యాంకుబండ్ చేరుకోవాలనే ఆలోచన, పట్టుదల నన్ను నిలువరించడం లేదు. ఎట్టి పరిస్థితిలోనూ ఇక్కడినుంచి తప్పించుకోవాలని ఆలోచన వచ్చింది. మఫ్రల్ స్టైతస్కోప్‌తో వున్న నేను, నేను డాక్టరును నాగం జనార్థన్‌రెడ్డికి ట్యాబ్‌లెట్లు తీసుకరావాలనే నెపంతో పోలీసుల కళ్లుకప్పి అక్కడినుండి తప్పించుకున్నాను. అక్కడి నుండి ఆటోలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మైసమ్మ దేవాలయం చేరుకున్నాను. అప్పటికే యుద్ధ సైనికుల్లా యువకులు, అడ్వకేట్స్ నిచ్చెన సహాయంతో ట్యాంక్‌బండ్‌పైకి ఎగబ్రాకుతున్నారు. ఆ నిచ్చెన సహాయంతో నేను ఎట్టకేలకు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్నాను. 20 నిమిషాల సమయంలోనే ఇసుకేస్తే రాలని విధంగా జన సంద్రంలా తయారైంది ట్యాంక్‌బండ్. తెలంగాణ పౌరుషాన్ని చాటిచెప్పి యుద్ధంలో గెలిచినట్లు గుర్తుగా నేలను ముద్దాడినాను. విజయగర్వంతో జై తెలంగాణ అంటూ నినదించాను. ఒక సింగరేణి కార్మికునిగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన నాకు ఇంతటి మహెూద్యం నా జీవితంలో ఇంతవరకు ఎన్నడు చూడలేదు. ఇంతటి మహెూజ్వల మైన 'మిలియన్ మార్చ్' ఉద్యమాన్ని విజయవంతం చేసిన తెలంగాణ ఉద్యమ కారులకు చేతులెత్తి మొక్కి ఇదే స్ఫూర్తి కొనసాగితే తెలంగాణ తప్పకుండా సాధిం చుకుంటామని ఆలోచిస్తూ...ఆ దిశగా సాగాలని కోరుకుంటూ వెనుదిరిగాను.

చివరగా నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష ముందు ప్రభుత్వ, పోలీసు నిర్బంధాలు, కుట్రలు ఏవి పనిచేయలేదు. తెలంగాణాలోనే వుంటూ తెలంగాణకు ద్రోహం చేస్తున్న వారికి 'మిలియన్‌మార్చ్' ఒక చెంపదెబ్బ.

**(తెలంగాణ ఆర్ఎంపి వైద్యుల సంఘం అధ్యక్షుడు)**

# తెలంగాణ ఆకాంక్షకు అద్దంపట్టిన రోజు

-ఆవునూరి సమ్మయ్య

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా తెలంగాణ ప్రజా చైతన్య స్రవంతి కట్టలు తెంచుకున్న రోజు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన స్వయం ప్రతిపత్తిని పొందాలన్న ప్రజాస్వామ్య బద్దమైన ఆకాంక్షను తెలంగాణ గుండె కాయ హైదరాబాద్ నగరం నడిబొడ్డున యావత్ తెలంగాణ ప్రజలు ప్రళయమై గర్జించిన రోజు, పాలక వర్గాలు కిరాయి పోలీసు బలగాలతో ప్రజా చైతన్యాన్ని ఆడ్డుకోలేవన్న చారిత్రిక వాస్తవాల్ని గుర్తు చేసిన రోజు - ప్రజల ఆకాంక్షలకు ఆమడదూరంలో ఉండే రాజకీయ పార్టీల నేతల నోళ్ళకు తాళం పడిన రోజు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ చరిత్రలో ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షకు, ఆవేదనకు, ఆందోళనకు దర్పణంగా నిలిచిన రోజు.... అది ....... మిలియన్ మార్చ్.

10-03-2011 రోజున ఉదయం 07.00 గం॥కు హైదరాబాద్‌లో ఉన్న నాకు హుజురాబాద్ డాక్టర్స్ జె.ఎ.సి. కన్వీనర్ డా॥ రామంచ మధుసూదన్ రెడ్డి ఫోన్ చేసి మిలియన్ మార్చ్‌లో పాల్గొనేందుకు కరీంనగర్ నుండి బస్సులో బయలు దేరి 11.30 గంటలకు సికింద్రాబాద్ జూబ్లి బస్సు స్టేషన్‌కు చేరుకుంటానని, అక్కడ మనం కలుసుకొని ట్యాంక్ బండ్ వైపు వెళ్దామని చెప్పారు. ఫోన్ సారాంశం.

అల్వాల్‌లోని మా బంధువుల ఇంటి నుండి బస్ స్టేజి వద్దకు వచ్చే సరికి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పోలీసులు భారీ సంఖ్యలో మోహరించి, మిలియన్ మార్చ్ వెళ్లేవారిని ప్రశ్నించి అదుపులోకి తీసుకుంటున్నారు. ఇంతలోనే సిటి బస్ రావడంతో జూబ్లి బస్ స్టేషన్‌కు బయలు దేరాను. జూబ్లీ బస్సు స్టేషన్ మొత్తాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్న దృశ్యం కన్పించించి. అడుగడుగునా వందలాది మంది తెలంగాణ వాదులు జై తెలంగాణ నినాదంతో ముందుకు సాగేందు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకొని, వారిని వాహనాల్లో ఎక్కించి తరలిస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఉరుకులు, పరుగులతో చెమటలు కక్కుతున్నారు. అక్కడక్కడ పోలీసులకు తెలంగాణ వాదులకు మధ్య

వాగ్వివాదం జరిగిన సంఘటనలు కలిసించాయి. బస్ స్టేషన్‌లో ఆటోలు అగే స్థలం వద్ద నుండి ఇవన్ని గమనిస్తున్న నాకు కరీంనగర్ నుండి వచ్చిన బస్సు నుండి దిగుతున్న డా॥ మధుసూదన్ రెడ్డి కనిపించారు. అప్పటికి సమయం ఉదయం 11.30 గంటలు. ఒక ఆటో అతనిని పిలిచి మీ ఊరు ఎక్కడ ? అన్ని ప్రశ్నించడం జరిగింది. మాది నల్గొండ జిల్లా సార్, నా పేరు వహిద్ అని చెప్పి, ఎక్కడికెళ్లాలి అని ప్రశ్నించాడు. ఎలాగైన సరే మమ్మల్ని ట్యాంక్ బండ్ సమీపంగా తీసుకెళ్లాలని చెప్పాం. సరే అని చెప్పి మా ఆటోను ముందుకు నడిపిండు. మార్గ మధ్యంలో పలుచోట్ల ఆటోను ఆపి పోలీసులు ప్రశ్నించి పింపివేసారు. రకరకాల మార్గాల ద్వారా దోమల్ గూడకు చేరుకొని బషీర్ బాగ్ వెళ్లే ప్రధాన రూటుకు 150 గజాల దూరంలో ఆటో ఆపి వహిద్ వెళ్లిపోయాడు. బషీర్ బాగ్ రూటులో అటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయము వైపు ఇటు దోమల్ గూడ వైపు బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు వందల సంఖ్యలో కన్పించారు. అప్పటికి సమయం 12.40 కావస్తున్నది. బారికేడ్ల వద్దకు చేరుకున్న మమ్మల్ని పోలీసులు అడ్డంగించి ప్రశ్నించారు. మాకు జి.హెచ్.యం.సి.లో ముఖ్యమైన పనులున్నాయని, మమ్మల్ని వదిలిపెట్టండని పోలీసులను ప్రాధేయపడ్డాం. మమ్మల్ని నిశితంగా పరిశీలించిన పోలీసులు బారికేడ్లను జరిపి, త్వరగా వెళ్లిపోండని చెప్పడంతో మేము ఆశ్చర్యానికి గురైనాము. జి.హెచ్.యం.సి. వైపు నాలుగు అడుగులు వేసి ముందుకు నడిచామో లేదో దాదాపు 50 మంది తెలంగాణ వాదులు జి.హెచ్.యం.సి. కార్యాలయము వైపు నుండి అంబేద్కర్ విగ్రహం వైపు జై తెలంగాణ నినాదాలు చేస్తూ పరుగులు పెట్టారు. మేము కూడ వారి వెంట పరుగులు పెట్టి ట్యాంక్ బండ్‌పైకి చేరుకున్నాం. అప్పటికే అక్కడ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు భారీ సంఖ్యలో వీడియో కెమరాలతో సిద్ధంగా ఉన్నారు. మా వెనకనే వందల సంఖ్యలలో గ్రూపులు, గ్రూపులుగా "ప్రాణాలైనా ఆర్పిస్తాం – తెలంగాణ సాదిద్ధాం " అంటు పరుగు పరుగున రావడం కన్పించింది. ఎట్టకేలకు ట్యాంక్ బండ్‌పైకి చేరుకున్నామన్న సంతృప్తితో ఉన్న మాకు నిమిష నిమిషానికి వేల సంఖ్యలో హైదరాబాద్ – సికిందరాబాద్ వైపుల నుండి ప్రజలు తరలివచ్చే దృశ్యాలు ఆనందాన్ని కలిగించాయి. ట్యాంక్ బండ్‌పైకి చేరుకుంటున్న ప్రతి ఒక్కరిలో ఎదో సాధించామన్న తృప్తి కనిపించింది. అప్పటికే జె.ఎ.సి. చైర్మెన్ కోదండరామ్‌ను, కో–ఆర్డినేటర్ పిట్టల రవిందర్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లుగా టి.వి.లో వార్తలు చూసిన మిత్రులు హుజురాబాద్ నుండి ఫోన్ చేశారు. పత్రికా ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎక్కడ ఏమి జరుగుతుందోనని హడావిడిగా చేసిన ఉరుకులు పరుగు అడుగడుగున కనిపించాయి. ట్యాంక్ బండ్ ఇరువైపుల ఇటు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి అటు వివేకానంద

విగ్రహం వరకు ప్రజలతో కిక్కిరిసి పోయింది. ఊరేగింపులు, జై తెలంగాన నినాదాలు, నృత్యాలు, పాటలతో ట్యాంక్ బండ్ దద్దరిల్లింది. ఎర్రటి ఎండలో అప్పుడప్పుడు కారు మేఘాలు కూడ అవరించి ఉద్యమకారులకు ఉరట కల్పించాయి. లోయర్ ట్యాంక్ బండ్ నుండి ట్యాంక్ బండ్ పైకి వెళ్లే రహాదారుల గుండా ప్రజలకు పులిహోర పోట్లాలను, నీళ్ల ప్యాకెట్లను తెలంగాణ వాదులు అందించారు. విద్యార్థి జె.ఎ.సి.ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు దిక్కులు పిక్కటిళ్లేలా నినాదాలు చేశారు. జె.ఎ.సి.లో భాగస్వామ్య పక్షమైన సి.పి.ఐ.(యం.యల్.) న్యూడెమోక్రసీ పార్టీ కళాకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రారంభం నుండి మిలియన్ మార్చ్ ముగిసే వరకు అలుపు లేకుండా చేసిన నృత్యాలు, పాడిన పాటలు ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. ప్రజా గాయకుడు గద్దర్, గాయకురాలు విమలక్క వారి వారి అనుచర గణంతో ఊరేగింపుగా రావడం జరిగింది. న్యాయవాదుల జె.ఎ.సి., డాక్టర్స్ జె.ఎ.సి. టి.యన్.జి.వో. సంఘం, ఉపాధ్యాయులుసంఘాలు, ప్రజా సంఘాలతో పాటు భారతీయ జనతా పార్టి, టి.ఆర్.యస్. పార్టి, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రాడవడం జరిగింది. టి.ఆర్.ఎస్. యం.యల్.లు, వచ్చారు. తెలంగాణ ముసిం లిబరేషన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనను నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన తెలంగాణ వాదులు సంపత్ రావు, కానిపర్తి మొగిలి, మాట్ల రమేష్, మోటం సంపతులు కలిసి మాట్లాడారు. డాక్టర్స్ జె.ఎ.సి. నాయకులు డాక్టర్ నర్సయ్య, డాక్టర్ మంచికట్ల రాములు, డాక్టర్ హన్మంత్ రావులతో డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడడం జరిగింది. హైదరాబాద్‌లోని నీటి పారుదల శాఖలో పని చేస్తున్న మిత్రుడు రణవీర్ కలిసి కూల్ డ్రింక్ షాపుకు తీసుకెళ్లారు. మేము కూల్ డ్రింక్స్ త్రాగుతున్న సమయంలో రణగొన ధ్వనులు, ఉరుకులు పరుగులు వినిపించాయి. బయటకు వచ్చి చూసే సరికి ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి కనిపించింది. ట్యాంక్ బండ్‌పై ఉన్న విగ్రహాలను కూల్చివేస్తూ వేలాది మంది నినాదాలు చేస్తున్నారు. సీమాంధ్ర పాలకులు తెలంగాణ ప్రజలపై నిరంతరం కొనసాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ వేలాది మంది అగ్రహావేశాలతో విగ్రహాలను కూల్చివేస్తున్నారు. అక్కడ ఉన్న పోలీసులు ఎంతో సంయమనం పాటించి వారి వైపు వెళ్లలేదు. మేము విగ్రహాల కూల్చివేతను చుస్తూ అంబేద్కర్ విగ్రహం వైపు నడుస్తుండగా ఒక పోలీసు పెట్రోలింగ్ వ్యాన్‌కు ఉద్యమకారులు నిప్పంటించారు. ఆ ప్రక్కనే సెల్ ఫోన్ మాట్లాడుతూ డి.సి.పి. అకుల్ సభర్వాల్ కనిపించారు. బహుశ ఫైరింజన్ కొరకు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు కావచ్చు అనుకున్నాము. విగ్రహాల కూల్చివేతను వీడియో కెమెరాలలో బంధించేందుకు ప్రయత్నించిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల

వద్దనుండి కెమెరాలను లాక్కొని హుస్సేన్ సాగర్‌లో పడేసేందుకు ఉద్యమకారులు ప్రయత్నించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య ఉద్యమకారులకు నచ్చచెప్పడంతో ఉద్రిక్తత తగింది. ఈ సమయంలోనే సచివాలయం వైపు నుండి ట్యాంక్ బండ్ పైకి వచ్చేందుకు యత్నించిన కాంగ్రేస్ నేత కె.కేశవరావును ఉద్యమకారులు అంబేద్కర్ విగ్రహం వద్దకు రాకుండనే వెనక్కి పరిగెత్తించారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు, ట్యాంక్ బండ్‌పైకి రావటంతో వాహనంలో ఉన్నది కే.సి.ఆర్. అని తెలియక ఉద్యమకారులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకున్న వెంటనే కే.సి.ఆర్. వాహనం నుండి దిగి అనుచర గణంతో ట్యాంక్ బండ్‌పైకి వెళ్లాడు. ఈలోగా ఉద్యమకారులు కే.సి.ఆర్. వాహనం వెనుక వచ్చిన పోలీసు ఎస్కార్ట్ వాహనాన్ని పైకి లేపి క్రిందికి ఎత్తివేశారు. ఆ తరువాత కొంత సేపటికి ఉదయం పూట అరెస్టు అయిన జె.ఎ.సి. చైర్మెన్ కోదండరామ్, అలాగే టి.ఆర్.ఎస్. శాసన సభ పక్ష నాయకులు ఈటల రాజేందర్‌తో పాటు పలువురు టి.ఆర్.ఎస్. యం.యల్.ఏ.లు నాయకులు, అక్కడికి చేరుకున్నారు. మిలియన్ మార్చ్‌లో పాల్గొన్నవారిని ఉద్దేశించి వారు ప్రసంగిచారు. అప్పటికి సాయంత్రం 5.45 కావస్తున్నది. విగ్రహాల కూల్చివేత ఒకవైపు సాగుతుండగానే మరొవైపు వేలాది మంది ప్రజలు, ఉద్యమకారులు ట్యాంక్ బండ్‌పైకి తరలిరావడంతో పోలీసు రంగ ప్రవేశం చేసి పలుమార్లు లాఠీ చార్జ్ చేసి ప్రజలను తరిమి కొట్టారు. ఏది ఏమైనప్పటికి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కల్పించిన అడ్డంకుల్ని అధిగమించి మిలియన్ మార్చ్ విజయవంతమైందన్న విజయగర్వంతో ప్రజలు తిరుగు ముఖం పట్టారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ అత్యంత కీలకమైన ఘట్టం.1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా పాల్గొని మూడు సార్లు జైలుకెళ్లి వచ్చిన సంఘటనల కన్నా, సీమాంధ్ర పెట్టుబడిదారుల అంహకారన్ని ఎదురించిన మానుకోట పోరాటం, అలాగే ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్ తెలంగాణ ప్రజాచైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్న సంతృప్తి నాకు కల్గింది.

విప్లవ రచయిత వరవర రావు గారు చెప్పినట్టు "జై తెలంగాణ నినాదం నిప్పుల గుండంలో దూకే ఒక హశ్శరభ నినాదం. తెలంగాణ ఆత్మగౌరవం నిలుపుకోవడానికి మనం రాజనీతి చతురులం కానక్కర్లేదు. సమ్మక్క, సారలక్క, రామ్‌జీ గొండు, కొమురం భీం, బత్తిని మొగిలయ్య, బందగీ, పాలకుర్తి ఐలమ్మ, మొంద్రాయి లంబాడాలు, బైరాన్‌పల్లి ప్రజలు, గొల్ల ఎలమంద, దొడ్డి కొమురయ్య వంటి స్వాభిమానం కలిగిన సామాన్యులమైతే చాలు."

**(తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి)**

# మార్చి 10న మిలియన్ మార్చ్‌కు ఛలో హైదరాబాద్ ... బోలో జై తెలంగాణ

600 మంది విద్యార్థులు, యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బహుశా తమ చావుతో తెలంగాణలో కదలిక వస్తుందని భావించి, అలాగైనా తెలంగాణకు స్వేచ్ఛ, నాయం, మానవగౌరవం దక్కుతాయని భావించి, ఆత్మగౌరవం దక్కుతుందని భావించి...

నిన్నటిదాకా లక్షల మంది ఉద్యోగులు, లాయర్లు సహాయ నిరాకరణ ఉద్యమం చేశారు. విద్యార్థులు తమ చదువుల కన్నా తెలంగాణ రాష్ట్ర సాధనే ముఖ్యమనుకుంటున్నారు. కవులు, రచయితలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు ఇలా అన్ని వర్గాల ప్రజలూ ఉద్యమిస్తున్నారు. అయినా సమైక్యవాదులది ఎంత సిగ్గుమాలినతనమో చూడండి. ఇంకా తెలంగాణ ప్రజల ఆకాంక్షను వ్యతిరేకిస్తున్నారు. ఇక ఇలా లాభం లేదు. మిలియన్ మార్చ్‌నాడు లక్షలాదిగా హైదరాబాద్ తరలుదాం. ప్రపంచమంతా హైదరాబాద్ దిక్కు తెలంగాణ దిక్కు చూసేలా చేద్దాం. ఏరియల్ వ్యూలో – హుసేన్ సాగర్ కేంద్రంగా నెక్లస్ రోడ్, ట్యాంక్‌బండ్‌తో మొదలై హైదరాబాద్ రోడ్లన్నింటా పరుచుకున్న లక్షలాది తెలంగాణ ప్రజలతో ప్రపంచానికి ఒక కొత్త ముఖ చిత్రాన్ని అందిద్దాం... పోరాటమంటే తెలంగాణలా ఉండాలని పిలుపునిచ్చేలా చేద్దాం. రండి సోదరులారా! హైదరాబాద్‌కి కదులుదాం... ఛలో హైదరాబాద్! బోలో జై తెలంగాణ!!

నేను... ట్యాంక్‌బండ్ మీదికి వెళ్ళి ప్లకార్డు పట్టుకుని నిలబడతాను. నాలాగే మీరు ఒక్కొక్కరు పదిమందిగా, వందమందిగా, వేలమందిగా, లక్షల మందిగా కదిలిరండి... మార్చి 10న అందరం హైదరాబాద్‌కి కదులుదాం. మనం ఆత్మాభిమానం గల వాళ్లమైతే, ఈ గడ్డ మీద గౌరవంగా బతతకాలనుకుంటున్న వాళ్ళమైతే, ఈ తల్లి రుణం తీర్చుకోదలుచుకుంటే – ఆ రోజున అక్కడ కలుసుకుందాం. వెళ్లి మన తెలంగాణ కోసం, మన న్యాయమైన హక్కు కోసం డిమాండ్ చేద్దాం. మనం మరి దేని గురించి మాట్లాడడం లేదు... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయమని మాత్రమే అడుగుతున్నాం.

అధికారంలో ఉన్న వాళ్లు అవకాశవాదులు, తమ పదవులు వదులుకోవడానికి వాళ్లు సిద్ధంగా లేరు. ఉంటే పోరాటంలో ముందెందుకు నివడం లేదు?

ఆత్మాహుతికి పాల్పడినవారు చావుకు భయపడలేదు. తాము చనిపోయినా భవిష్యత్ తరాలు తమ లాంటి ఇబ్బందులు పడకూడదని అనుకున్నారు. కాని మనమెవరమూ చావనక్కరలేదు. పోరాటంలో మన వంతు పాత్ర నిర్వర్తిస్తే చాలు...

నేను మార్చి 10న అక్కడికి వెళతాను. ఇప్పట్నించి అప్పటిదాకా రోడ్డులో కరపత్రాలు పంచి పెడతాను. మిమ్మల్ని మీరు మనుషులనుకుంటుంటే కనక మార్చి 10న హైదరాబాద్‌కు రండి. ఇబ్బందులు పడతారన్న కారణంగా ఆడవాళ్లు

హైదరాబాద్‌కు వెళ్లకూడదనే మగవాళ్లు ఎవరు ఉన్నారో వాళ్లు తమ పౌరుషం చూపి రండి అక్కడికి. మీ వంతుగా ఎంత మందిని తీసుకురాగలిగితే అంత మందిని తీసుకురండి. మన తెలంగాణ విముక్తి కోసం!

చాలా మంది వస్తారు. మనమెందుకులే అనుకునేవాళ్లకి నేనొకటే చెపుతున్నాను. ఒకవేళ జనం తక్కువగా వస్తే అందుకు కారణం మీరే. అవకాశవాద నాయకుల్లా, పోలీసుల్లా మీరూ ద్రోహులే. మీరు వచ్చి చూడండి – అప్పుడు ఎంత తేడా వస్తుందో. మీ ఇరుగు పొరుగుతో, సహోద్యోగులతో, స్నేహితులతో, కుటుంబసభ్యులతో మాట్లాడి అందర్నీ తీసుకురండి. ఎక్కడిదాకా రాగలిగితే అక్కడే గుమిగూడి 'వి వాంట్ తెలంగాణ' అని నినదించండి. 'జై తెలంగాణ' అని నినదించండి. మీ నినాదం ప్రపంచం నలుమూలలా మార్మోగాలి! అవకాశవాద రాజకీయ నాయకుల గుండెలు అదరాలి! తెలంగాణ కల సాకారం చేయాలి!

ఇంట్లో కూర్చుని టీవీలోనో, ఫేస్ బుక్‌లోనో మమ్మల్ని చూడడం మీకు, మాకు మనందరికీ అవమానం. తెలంగాణవాదిగా నీ గౌరవాన్ని నువ్వు నిలుపుకోవాలంటే అక్కడికి వచ్చి ఈ నిరసనలో పాల్గొనాలి. ఇంట్లోనే ఉండ దలచుకుంటే మనకు జరుగుతున్న అన్యాయాలకు నువ్వు బాధ్యుడివే అనుకోవాల్సి వస్తుంది. అప్పుడు తెలంగాణ ప్రజల ముందు నువ్వు అపరాధిలా నిలబడాల్సి వస్తుంది. తెలంగాణ రాకపోతే దానికి ఇంట్లో కూర్చున్న నువ్వే బాధ్యుడవవుతావు. వీధిలో తిరిగి అందరికీ చెప్పు. ఎస్సెమ్మెస్‌లు పంపు. నెట్‌లో పెట్టు. ఐదుగుర్నో, పదిమందినో ఒప్పించి తీసుకురా. మనల్ని మనం కాల్చుకునే బదులు నిర్మాణాత్మకంగా ఏమైనా చేద్దాం. అది మార్పును... చాలా పెద్ద మార్పును తీసుకొస్తుంది. ఆశ లేదని ఎప్పుడూ అనకు. ఆశలేదని నువ్వు ప్రభుత్వానికి భయపడకు. ప్రజలు తమ స్వశక్తితో చేయగలిగింది చేసుకోనంత వరకు దేవుడు ప్రజల స్థితిని మార్చడు. (ఖురాన్ 13:11) అని గుర్తుపెట్టుకో. నువ్వొక్కడివే క్షమంగా ఉండగలవని అనుకోకు. ఎవరూ అలా ఉండలేం. అక్కడికొచ్చి నీ హక్కుల కోసం, నా హక్కుల కోసం, నీ కుటుంబ హక్కుల కోసం, తెలంగాణ హక్కు కోసం అడుగు.

నేను మార్చి 10న అక్కడుంటాను... తెలంగాణ కోసం నినదిస్తూ... సమైక్య వాదుల్ని వ్యతిరేకిస్తూ...

(ఫేస్‌బుక్‌లో–ఈజిప్టు ఉద్యమానికి కారణమైన అస్మా మహఫౌజ్ ఉపన్యాసాన్ని తెలంగాణకు అన్వయిస్తూ... స్కైబాబ, సింగిడి తెలంగాణ రచయితల సంఘం)

# తెలంగాణ ఉద్యోగుల సంఘం
## TELANGANA UDYOGULA SANGHAM

ఈ కరపత్రాన్ని జిరాక్స్ తీసి పదిమందికి పంచండి

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయడానికి మీ సహకారం అందించండి

**తేది: మార్చి 8, 2011**

**ప్రచురణకర్త: శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సహాధ్యక్షుడు, తె.ఉ.సం., సెల్: 9491060585**



# Telangana
# MILLION MARCH




Published by

Telangana Vidyavanthula Vedika
Telangana Journalist Forum